# టిపు సుల్తాన్



యార్లగడ్డ నిర్మల

# టిపు సుల్తాన్

## ఆంగ్లేయులకు తలవంచని వీరుడు

యార్లగడ్డ నిర్మల

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 150/– |
| మొదటి ముద్రణ | : | 2019 |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006.<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,<br>హైదరాబాద్ – 28 ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# విషయ సూచిక


పరిచయం ........ 4

ముందు మాట ........ 8

క్రమపట్టిక........ 17

అధ్యాయం-1 18వ శతాబ్దంలో భారతదేశం ........ 18

అధ్యాయం-2 మైసూర్ రాజ్యం-హైదర్ అలీ........ 21

అధ్యాయం-3 టిపు సుల్తాన్ - జననం - బాల్యం - పట్టాభిషేకం........ 33

అధ్యాయం-4 నవాబ్ టిపు సుల్తాన్ - రెండవ ఆంగ్లో - మైసూరు యుద్ధం - మంగుళూరు సంధి - 1784........ 41

అధ్యాయం-5 యూరోపియన్ ముసల్మాన్ - ఆంగ్లేయుల దుష్ప్రచారాలు మూడవ ఆంగ్లో - మైసూరు యుద్ధం - 1790-92........ 53

అధ్యాయం-6 నాల్గవ ఆంగ్లో - మైసూరు యుద్ధం టిపు - ఫ్రెంచ్ స్నేహం (ఫిబ్రవరి3, మే 4,1799)........ 60

అధ్యాయం-7 టిపు - ఫ్రెంచ్ సంబంధాలే టిపు పతనానికి కారణమా?........ 73

అధ్యాయం-8 టిపు పై బ్రిటిష్ సాహిత్యం, కళలు, వార్తా పత్రికలు - పార్లమెంటు లో చర్చలు........ 84

అధ్యాయం-9 టిపు - ఇస్లాం మతోన్మాదా?........ 97

అధ్యాయం-10 టిపు పరిపాలన - ఆధునికత వైపు........ 109

అధ్యాయం-11 మలబారు కూర్గు తిరుగుబాట్లు........ 123

అధ్యాయం-12 టిపు - మరాఠాలు -హైదరాబాద్ నిజామ్........ 134

అధ్యాయం-13 టిపు విదేశీ రాయబారాలు ........ 142

అధ్యాయం-14 టిపు సుల్తాన్ ........ 148

అనుబంధం........ 155

# పరిచయం

మరణించిన 220 సంవత్సరాల తర్వాత కూడా ఇప్పటికీ తాజాగా వార్తల్లో ఉంటున్న వ్యక్తి టిపు సుల్తాన్. టిపు చరిత్ర 18వ శతాబ్దం ఉత్తరార్థపు భారతదేశ చరిత్ర. 1750లో జన్మించిన టిపు మే 4, 1799, అంటే 18వ శతాబ్దం ఇంకా ఎనిమిది నెలల్లో ముగుస్తుందనగా మరణించాడు. టిపు మరణంతో 19వ శతాబ్దం మొదటి దశకంలో భారత దేశంలో 'బ్రిటిష్ రాజ్' నిరాఘాటంగా స్థాపించబడింది. 1799లో టిపు మరణంతో మైసూర్ రాజ్యం తన స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి బ్రిటిష్ సామంత రాజ్యం అయ్యింది. తర్వాత, ఒకే ఒక స్వతంత్ర రాజ్యంగా మిగిలిన మరాఠా రాజ్యం కూడా 1803లో అంటే టిపు మరణించిన నాలుగు సంవత్సరాలకు తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి బ్రిటిష్ సామంత రాజ్యం అయ్యింది. 1818లో మరాఠాలు తమ స్వాతంత్రాన్ని తిరిగి పొందే ప్రయత్నం చేశారు. కానీ ఆ సంవత్సరం బ్రిటిష్ వారితో జరిగిన కోరేగావ్ యుద్ధంలో ఘోర పరాజయం పాలై తమ అస్తిత్వాన్నే కోల్పోయారు. మరాఠా రాజ్యం బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ సామ్రాజ్యంలో భాగమయ్యింది. పేష్వా బ్రిటిష్ వారి పింఛనుదారుడయ్యాడు.

టిపు మరణవార్త తెలుసుకొని టిపుకు వ్యతిరేకంగా తరచూ ఆంగ్లేయులతో సహకరించిన ,అప్పుడు మరాఠా రాజ్యాన్ని నడిపిస్తున్న మరాఠా రాజకీయ దురంధరుడు నానా ఫడ్నవీస్ చెప్పిన భవిష్య వాణిని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. "టిపు మరణించాడు. ఆంగ్లేయుల బలం పెరుగుతుంది. ఇప్పటికే తూర్పు భారతమంతా వారి ఆధీనంలో ఉంది. తర్వాత పూనాయే వారి గురి. ముందు ముందు చెడ్డ రోజులు రాబోతున్నాయి. తలరాతను ఎవరూ తప్పించలేరు"

తన మైసూర్ రాజ్యానికే కాకుండా భారతదేశానికే ముందు ముందు ఆంగ్లేయుల ఆధిపత్యం రాకూడదని పోరాడి ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి టిపు సుల్తాన్. భారత దేశంలో తమ సామ్రాజ్య విస్తరణకు అడ్డంకిగా ఉన్న టిపును అంతమొందించి తాము అనుకున్నది సాధించినా, బ్రిటిష్ వారికి తాము టిపుపై చేసింది దౌర్జన్యం, అన్యాయం అని తెలుసు. తమ దుర్మార్గాన్ని, దురాక్రమణను సమర్థించుకోవడానికి ఆంగ్లేయులు టిపు పై క్రూర నియంత, ఇస్లాం మతోన్మాది అనే ముద్రలు వేశారు. తమ ఆరోపణలు నిజం అని రుజువు చేసుకోవడానికి 19వ శతాబ్దమంతా పుంఖాను పుంఖాలుగా చరిత్ర రచన,ఇతర రచనలను పనిగట్టుకొని అదేపనిగా ఉత్పత్తి చేశారు. 18,19 వ శతాబ్దాలలో టిపుపై వచ్చిన ఆంగ్లేయుల రచనల లిస్ట్ చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఆంగ్లేయుల చేతిలో ఓడిపోయి మరణించిన ఒక సంస్థానాధీశుడి గురించి ఆంగ్లేయులు ఇన్ని పుస్తకాలు ఎందుకు వ్రాసుకున్నారు? టిపు బ్రతికి ఉన్నప్పుడు ఆంగ్లేయులను ఎంత భయపెట్టాడో మరణించిన తర్వాత కూడ అంతగానూ వెంటాడేడు అనిపిస్తుంది.

కాని 1916లో అప్పటి మైసూరు రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులద్వారా శృంగేరి మఠంలో టిపు అప్పట్లో ఆ మఠ పీఠాధిపతికి వ్రాసిన లేఖలు వెలుగులోకి రావడంతో బ్రిటిష్ వారు చెప్పిన, వ్రాసిన,ప్రచారం చేసిన టిపు చరిత్రపై పునః పరిశీలనలు, పరిశోధనలు ప్రారంభం అయ్యాయి.

కాశ్మీర్ విశ్వవిద్యాలయంలో హిస్టరి ప్రొఫెసర్‌గా పనిచేసిన మోహిబ్బుల్ హసన్ 1951లో 'హిస్టరి ఆఫ్ టిపు సుల్తాన్' అనే పుస్తకాన్ని వ్రాసారు. ఈయన దేశ విదేశాల్లో టిపు, ఇంగ్లీష్ తూర్పు ఇండియా కంపెనీ, ఫ్రెంచ్ తూర్పు ఇండియా కంపెనీ, గోవాలోని పోర్చుగీస్ వారికి చెందిన, ఇంగ్లిష్, ఫ్రెంచ్, పోర్చుగీస్, కన్నడ, మరాఠీ, పర్షియన్, రచనలను అనేక, ప్రభుత్వ పత్రాలను క్షుణ్ణంగా పరిశోధించి టిపు చరిత్రను గురించిన వాస్తవాలను తన పుస్తకంలో పొందుపరిచారు. 1967లో సుబ్బరాయ గుప్తా రచించిన 'న్యూ లైట్ ఆన్ టిపు సుల్తాన్', 1970లో డెనిస్ ఫారెస్ట్ రచన 'టైగర్ ఆఫ్ మైసూర్ అండ్ ది లైఫ్ అండ్ డెత్ ఆఫ్ టిపు' వంటి పుస్తకాలు టిపు చరిత్రను వాస్తవిక దృక్పథంతో పరిశీలించాయి. మోహిబ్బుల్ హాసన్ టిపును క్రూర నియంత, ఇస్లాం మతోన్మాది అనడం ఎంత అసమంజసమో, టిపును భారత జాతీయవాది, భారతదేశ మొదటి స్వతంత్ర సమరయోధుడు అనడం కూడా అంతే అసమంజసం అని తేల్చి చెప్పారు. టిపు బలాన్ని, బలహీనతలను, గెలుపు ఓటములను బేరీజు వేశారు. 1951లో మొదట ప్రచురించబడిన ఈ పుస్తకం 2013 లో కూడా పునర్ముద్రణ కావడం విశేషం. అలహాబాద్ విశ్వవిద్యాలయం హిస్టరి ప్రొఫెసర్, తర్వాత ఒరిస్సా గవర్నర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ బి.ఎన్.పాండె పుస్తకం Aurangzeb and Tipu - an Assessment of their Religious Policies టిపు ఇస్లాం మతోన్మాది అనే ఆంగ్లేయుల ప్రచారాన్ని నిష్పక్షపాతంగా ఆధారాలతో సహా చర్చిస్తుంది.

కాని 20వ శతాబ్దపు, 80వ దశకంలో స్వతంత్ర భారత దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు టిపు పట్ల సరిగ్గా బ్రిటిష్ సామ్రాజ్య వాదులు తీసుకున్న ధోరణినే అనుసరిస్తూ టిపును క్రూర నియంత, ఇస్లాం మతోన్మాది అని ప్రచారం చెయ్యడం గమనార్హం. దీనితో టిపు మళ్లీ వివాదాస్పదుడిగా తెర మీదికి వచ్చి, సదా వార్తల్లోని వ్యక్తి అయిపోయాడు.

21వ శతాబ్దంలో మళ్లీ టిపు పై దేశ విదేశాల్లో పరిశోధనల పరంపర ప్రారంభమయ్యింది. 2013 లో అమెరికాకు చెందిన మైఖేల్ సొరాకో పరిశోధన గ్రంథం 'Tyrant: Tipu Sultan and the Reconception of British Imperial Identity, 1780-1800', ఆస్ట్రేలియాకు చెందిన కేట్ బ్రిట్లే బాంక్ 2016లో ప్రచురించిన Tiger- The Life of Tipu Sultan పుస్తకాలు విశేషాదరణ పొందాయి.

సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధి చెందిన ట్విట్టర్, ఫేస్ బుక్, బ్లాగ్స్, వెబ్సైట్స్ లో కూడా టిపు గురించిన వార్తా విశేషాలు లభిస్తున్నాయి. వీడియో గేమ్స్‌లో టిపు

ఉన్నాడు. కలకత్తాలో ఉన్న టిపు ఏడోతరం వారసులను తెచ్చి 2018లో కొన్ని చానల్స్ ఇంటర్వ్యూ చేసాయి. టిపు మరణం తర్వాత ఆంగ్లేయులు శ్రీరంగపట్టణాన్ని, ప్రస్తుతం బిలియన్ పౌండ్ల విలువచేసే టిపు సంపదను దోచుకుని దొంగిలించి ఇంగ్లాండ్‌కు తరలించారు. (ఈ దోపిడీకి సంబంధించిన వివరాలు ఈ పుస్తకంలోని ఆరో అధ్యాయంలో ఉన్నాయి.) ఇంగ్లాండ్ లో టిపు కళాకృతుల వేలంపాటల సమాచారం మనకు నెట్లో తరచూ కనిపిస్తుంది, ఇంగ్లాండ్ లోని బెర్క్ షైర్ లోని ఒక ఇంటి అటక మీద టిపుకు చెందిన ఒక పిస్తోలు, బంగారు పిడి కలిగిన ఒక కత్తి, ఇంకో ఆరు కళాకృతులను కనుగొన్నారని, మార్చ్ 7, 2019 NDTV వెబ్ న్యూస్ లో వార్త వచ్చింది. తమ పూర్వీకుడు మేజర్ థామస్ హార్ట్ తూర్పు ఇండియా కంపెనీ సైన్యంలో పనిచేసాడని నాల్గవ ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో పాల్గొన్నాడని ఆ ఇంటి కుటుంబం తెలిపింది. తర్వాత అవి వేలంపాటలో 60,000 పౌండ్లు పలికాయని దేశి బ్లిట్జ్ అనే వెబ్ పత్రిక తన ఏప్రిల్, 2019 సంచికలో సమాచారమిచ్చింది. 2005-2015 మధ్య సోతాబే, బోన్ హాస్ వంటి ప్రసిద్ధ వేలంపాట కంపెనీలు టిపుకు చెందిన 30 కళాకృతులను 6 మిలియన్ పౌండ్లకు అమ్మాయి. ఏప్రిల్, 2004లో విజయ మాల్యా టిపు కత్తిని ఇంగ్లాండ్ లోని కల్నల్ బ్రెయిడ్ వారసుల నుండి కొని భారతదేశానికి తీసుకొచ్చి తన దేశభక్తిని చాటుకున్నాడు. ఈ కత్తి 10 సంవత్సరాలు టిపు ఖైదులో ఉండి విడుదలై, ఆ పగతో నాల్గవ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో చురుకుగా పాల్గొని టిపు మరణానికి కారకుడైన కల్నల్ డేవిడ్ బ్రెయిడ్‌కు బహుమతిగా లభించింది. ఇలా టిపు 2019 లో కూడా latest news గా ఉంటున్నాడు. టిపును వివాదాస్పదుడిని చెయ్యడంతో అతని చరిత్ర పై ఆసక్తి కూడా పెరిగిందని పైన పేర్కొన్న సమాచారం తెలియ జేస్తుంది.

భారతదేశ చరిత్రలో టిపు ఎవరు? 18వ శతాబ్దంలో ఎందరో రాజులు పాలించారు కానీ టిపునే వివాదాస్పదుడు ఎందుకయ్యాడు, ఆ వివాదాల చారిత్రక నేపథ్యం ఏమిటి, మొదలైన అంశాలపై ఈ పుస్తకంలో విశ్లేషించడం జరిగింది. టిపు భారత దేశంలో ప్రథమ స్వాతంత్ర సమరయోధుడా, ఇస్లాం మతోన్మాదా, హీరోనా, విలనా అనే తీర్పులు (judgments) కాకుండా చారిత్రక, సమకాలీన ఆధారాల (sources) ద్వారా లభించిన సమాచారాన్ని ఉపయోగించి ఈ పుస్తకంలో విశ్లేషణ చెయ్యడం జరిగింది. చరిత్రపై తీర్పులివ్వడం కంటే చరిత్రను ఆకాల పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవాలి. 18వ శతాబ్దంలో భారత్ లో చోటుచేసుకున్న నూతన రాజకీయ పరిణామాల నేపథ్యంలోనే టిపు ఆంగ్ల వ్యతిరేకతను, యుద్ధాలలో గెలుపు ఓటములను, అర్థం చేసుకోవాలి. ఈ నేపథ్యంలో టిపు ప్రత్యేకత ఏమిటంటే తన సమకాలీనులకంటే చాలముందే టిపు ఈ దేశానికి ఆంగ్లేయుల ప్రమాదాన్ని గ్రహించాడు, ఆ ప్రమాదాన్ని తప్పించడానికి ఒంటరిగా పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు కానీ, తన సమకాలీకుల వలె బ్రిటిష్ బానిసత్వాన్ని

అంగీకరించలేదు. ఈ ప్రత్యేకమైన వ్యక్తి చరిత్ర తెలుగు పాఠకుల కోసం తెలుగులో మీ ముందుకు వచ్చింది. టిపు తెలుగువారికి దగ్గరివాడే, టిపు తల్లి ఫాతిమా ఫఖ్రున్నీసా స్వస్థలం కడప.

తారీఖులు, దస్తావేజులే చరిత్ర కాకపోయినా చరిత్ర సమగ్ర అవగాహన కోసం తారీఖులు అవసరం. టిపు చరిత్రను, జీవితాన్ని నిర్దేశించిన నాలుగు ఆంగ్లో–మైసూర్ యుద్ధాల, ఇతర ముఖ్య సంఘటనల తారీఖులు పాఠకుల సౌలభ్యం కొరకు Time-lineలో ఇవ్వడం జరిగింది. యుద్ధాలకు సంబంధించిన సమాచారం, సంఘటనలు కొన్ని అధ్యాయాలలో పునరావృతం కావడం అనివార్యం. ఆయా అధ్యాయాలలోని విషయ సమగ్రతకు ఆ పునరుక్తి అవసరం. పుస్తకంలోని కొన్ని ప్రదేశాల పేర్లలో అప్పటికి ఇప్పటికి కొన్ని మార్పులు ఉన్నాయి. అప్పటి ఆంగ్లేయులు 'టిప్పూ' సాహెబ్ (Tippoo Saheb) అనేవారు. ఇప్పుడు కూడా సాధారాణ ప్రజలు 'టిప్పూ' అనే పలుకుతారు. సరైనపదం టిపునే. కర్నాటక ప్రాంతం మైసూర్ గానే పిలువబడేది. ఆంగ్లేయులు కనరాను, కెనరా అన్నారు, ప్రస్తుత తమిళనాడు పశ్చిమ ప్రాంతాన్ని కర్నాటక అనేవారు. ప్రస్తుత తమిళనాడులోని ఆర్కాట్‌ను పాలించే నవాబ్ ను కర్నాటక నవాబ్ అనేవారు. ఆంగ్ల, ఫ్రెంచ్, మరాఠీ, మళయాళీ పేర్లు, పరిపాలన, సైన్యానికి సంబంధించి కొన్ని పార్సీ పదాలు తప్పనిసరి. వాటికి వీలైనంత స్పష్టతను ఇచ్చే ప్రయత్నం జరిగింది. ఇక చరిత్రను ఆస్వాదించండి.

–యార్లగడ్డ నిర్మల

# ముందు మాట

ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ పాఠశాలల్లో పాఠ్యాంశంగా చరిత్ర బోధనను నిషేధించాడు. చరిత్ర పఠనంతో, విద్యార్థులు తిరుగుబాట్లు, విప్లవాల గురించి తెలుసుకుంటే అది పాలకులకు అంత మంచిది కాదని ఆయన అభిప్రాయం. నెపోలియన్ ఫ్రెంచ్ విప్లవకారుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఆ ఫ్రెంచ్ విప్లవ భావాలైన స్వతంత్రం, సమానత్వం,సౌభ్రాతృత్వాలకు తిలోదకాలిచ్చి ఫ్రాన్సుకు ఒక నిరంకుశ చక్రవర్తిగా అవతారమెత్తాడు. అధికార దాహంతో అలమటించి పోయేవారి హిపోక్రసికి నెపోలియన్ ఒక ఉదాహరణ మాత్రమే.

నెపోలియన్ కంటే హిట్లర్ ఒక అడుగు ముందుకువేసి చరిత్రను నిషేధించే కంటే చరిత్రను తన రాజకీయ అవసరాలకు అనుగుణంగా వక్రీకరిస్తే ఎక్కువ లాభం ఉంటుందని గ్రహించాడు. జర్మన్లు ఆర్యులనే ఉన్నత జాతికి చెందినవారని, కావున తమకంటే తక్కువైన ప్రపంచంలోని ఇతర జాతులను హింసించి పాలించే హక్కు సహజంగానే జర్మన్లకు ఉంటుందనే అబద్ధాలతోకూడిన ఒక క్రొత్త చారిత్రక వక్రీకరణను ప్రచారంలోకి తెచ్చాడు. కానీ హిట్లర్ కంటే ముందే 18 వ శతాబ్దంలో ఆంగ్లేయులు భారత దేశంలో తమ సామ్రాజ్యవాదాన్ని, వలసవాదాన్ని సమర్థించుకోవడానికి తమ తెల్లజాతి ఆధిపత్యాన్ని ఒక చారిత్రక అంశంగా ప్రచారం చేసుకున్నారు.

అధికారంకోసం, ఆధిపత్యంకోసం జరిగే రాజకీయ వ్యూహాల్లో చరిత్ర మరియు చరిత్ర రచనలది యెప్పుడూ బాధిత (victim) పాత్రే. ఈ రాజకీయాలు తమ రాజకీయ అవసరాలకనుగుణంగా చరిత్రలో కొన్ని సమూహాలను, పాలకులను, వ్యక్తులను హీరోలుగానో, విలన్లుగానో చిత్రీకరిస్తూంటాయి. హిట్లర్ యూదులను, నెపోలియన్ ఆంగ్లేయులను, ఆంగ్లేయులు ముస్లింలను చరిత్రలో ఘోరమైన నేరాలు చేసిన వారుగా చిత్రీకరించారు. ప్రస్తుత భారత రాజకీయాల్లో కూడా మెజారిటీ సమూహం ఓట్ల కొరకు ఆంగ్లేయుల ధోరణిలోనే చరిత్రలో ముస్లింలు ఈ దేశ ప్రజలపై దుర్మార్గాలు చేశారని ప్రచారం జరుగుతున్నది.

జేమ్స్ మిల్ అనే బ్రిటిష్ చరిత్రకారుడు రచించిన The History of British India పుస్తకంలో భారతదేశ చరిత్రను హిందూయుగం, ముస్లింయుగం,బ్రిటిష్ యుగం (క్రైస్తవ యుగం కాదు) గా విభజించాడు. ముస్లిం పాలనలో భారతీయ హిందువులు ఎంతగానో నష్టపోయారని, బ్రిటిష్ పాలన భారతీయులకెంతో మేలు చేస్తుందని చెప్పాడు. ఈ పెద్దమనిషి భారతదేశంలో ఎన్నడూ అడుగు పెట్టకుండానే భారతీయులు పరమ అనాగరికులని, ముస్లింలు పరామకిరాతకులని, ఈ దేశానికి బ్రిటిష్ పాలన ఎంతో

అవసరమని మూడు సంపుటాలుగా వెలువరించిన తన పుస్తకంలో వ్రాశాడు. 19వ శతాబ్దంలో వ్రాసిన ఈ చరిత్ర పుస్తకంలోని మతపరమైన ఈ యుగ విభజనతో మిల్ భారతదేశంలోని ప్రజలను విభజించి పాలించే బ్రిటిష్ రాజకీయానికి నాంది పలికాడు. మెజారిటీ ప్రజలు హిందువులై వారిని గుప్పెడుమంది ముస్లింలు పాలిస్తే అది ముస్లిం యుగం ఎలా అవుతుంది. అదేవిధంగా కోట్లమంది భారతీయులను ఇంకో గుప్పెడు మంది బ్రిటిష్ వారు పాలిస్తే అది బ్రిటిష్ యుగం ఎలా అవుతుందనే విషయం మిల్సుకు తెలియదని కాదు, అతను ఒక రాజకీయ దురుద్దేశంతోనే ఈ విభజన చేశాడు. ఈ విభజన బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని సమర్థించుకోవడానికి ఎంతో అవసరం. స్వతంత్ర ప్రజాస్వామ్య ఆధునిక భారతదేశంలో కూడా ఆంగ్లేయులు చేసిన ఆ విభజనను వోటుబ్యాంక్ రాజకీయాలకోసం వాడుకోవడం జరుగుతున్నది.

18,19 శతాబ్దాల్లో భారతీయులకు చరిత్ర రచన పట్ల అంత అవగాహన, ఆసక్తి లేని కాలంలో బ్రిటిష్ రచయితలు, చరిత్రకారులు ఆధునికతపై, చరిత్ర రచనపై తమకున్న పట్టును సద్వినియోగం చేశారు అనేకంటే, దుర్వినియోగం చేశారు అంటే బాగుంటుంది. వీరు భారతదేశ చరిత్రపై పుంఖాను పుంఖాలుగా రచనలు వెలువరించారు. వీరిలో ఎక్కువమంది తూర్పు ఇండియా కంపెనీ సైన్యాధికారులు, పాలనాధికారులు కావడం విశేషం. సహజంగానే ఈ రచనలలో కొన్నింటిని మినహాయిస్తే, అధికశాతం భారతదేశంలో ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని సమర్థించేవిగానే ఉంటాయి.

టిపు చరిత్ర విషయానికి వస్తే టిపుతో యుద్ధాల్లో పాల్గొని టిపు ఆంగ్ల వ్యతిరేకతను దగ్గరగా చూసిన మార్క్ విల్క్స్, కల్నల్ కిర్క్ పాట్రిక్స్, కల్నల్ మెకంజీ, జాన్ కేంప్ బెల్, అలెక్సాండర్ బీత్సోన్, టిపు జైల్లో బందీగా ఉన్న విలియం స్కార్రి రచనలు, తూర్పు ఇండియా కంపెనీ అధికారుల మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు వంటివే ఆధారాలుగా తీసుకోబడ్డాయి. అప్పటికే అభివృద్ధి చెందిన బ్రిటిష్ ప్రింట్ మీడియా కూడా టిపు పై ఒక పద్ధతి ప్రకారం దుష్ప్రచారం ప్రారంభించింది.

కొన్ని మినహాయింపులున్నా పై ఆధారాలన్నీ టిపును ఒక క్రూర నిరంకుశ మతోన్మాదిగా ప్రపంచం ముందు నిలిపాయి. టిపును విలన్ గా చూపించడం ఆంగ్లేయులకు అప్పటి రాజకీయ అవసరం. అప్పట్లో ఏ భారతీయ సంస్థానాధీశుడి మీద జరగనంత ప్రచారం, దుష్ప్రచారం టిపు మీద జరిగాయి. టిపు ఆంగ్లేయులకు ఒక అబ్సెషన్ (obsession) అయిపోయాడు. ఎందుకంటే 18వ శతాబ్దంలో భారతదేశంలో కర్నాటక నవాబ్, అవధ్ నవాబ్, బెంగాల్ నవాబ్, హైదరాబాద్ నిజామ్ వంటి ముస్లిం సంస్థానాధీశులైనా, మరాఠాలు, రాజపుత్రులు, ట్రావెన్కూర్ రాజు వంటి హిందూ రాజులైనా బ్రిటిష్ సైనిక, సామ్రాజ్యశక్తి ముందు దాసోహమన్నారు. బ్రిటిష్ వారు తమపై విధించిన అవమానకరమైన సైనిక ఒప్పందాలకు తలవంచారు. బ్రిటిష్ రెసిడెంట్ (తూర్పు ఇండియా

కంపెనీ ప్రతినిధి) తమ రాజధానిలో తమపై పెత్తందారుగా ఉండడానికి అంగీకరించి తమ స్వతంత్రాన్ని, సార్వభౌమత్వాన్ని వదులుకోవడానికి ఒప్పుకున్నారు. వీరికి భిన్నంగా టిపు ఆంగ్లేయులకు సామంతుడుగా ఉండడానికి అంగీకరించలేదు. టిపు మైసూరు రాజ్యంలో ఆంగ్ల వర్తకాన్నీ నిషేధించాడు. ఆంగ్లేయులు అనుమతిలేకుండా తన రాజ్యంలో ప్రవేశించకూడదని ఆంక్షలు విధించాడు. భారతదేశంలో ఎదురులేకుండా సాగుతున్న బ్రిటిష్ వర్తక వ్యాపారాలకు, రాజ్యవ్యాప్తికి ఒక్క టిపు సుల్తానే అడ్డంకి. టిపును తొలగించాలి. అప్పట్లో బ్రిటిష్ ప్రభుత్వం, తూర్పు ఇండియా కంపెనీ అధికార్లు, కంపెని స్థానిక రాజకీయాల్లో జోక్యం చేసుకోవడాన్ని ప్రారంభంలో అంతగా సమర్థించలేదు. వారిని ఒప్పించడానికి, టిపు ఆంగ్లేయుల విలువలైన స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను వ్యతిరేకించే నిరంకుశుడు, ఇస్లాం మతోన్మాది అని ముద్రవేసి తొలగిస్తే అది దురాక్రమణలా కాకుండా బ్రిటిష్ విలువలను కాపాడే చర్యగా చెప్పుకోవచ్చు.

ఇక్కడ కొన్ని విషయాలను గమనించాలి. 18వ శతాబ్దం మధ్యవరకు అంటే 1750 వరకు తూర్పు ఇండియా కంపెనీ ఒక వ్యాపార సంస్థగానే కొనసాగింది. కానీ వారికి అవకాశాలు కలిసివచ్చి, ముఖ్యంగా భారతీయ పాలకుల్లోని అనైక్యత కారణంగా, 1757లో ప్లాసీ,1764లో బక్సార్ యుద్ధాల్లో విజేతలవ్వడంతో తూర్పు ఇండియా కంపెనీలోని కొందరు అధికారుల్లో రాజ్యకాంక్ష ప్రారంభం అయ్యింది. కానీ ఈ ధోరణిని బ్రిటన్‌లోని కొన్నివర్గాలు వ్యతిరేకించాయి. వీరిలో ప్రముఖుడు పార్లమెంట్ సభ్యుడు అయిన ఎడ్మండ్ బర్క్. కంపెనీ చర్యలను దౌర్జన్యమని ఆయన అభివర్ణించాడు. ప్లాసీ, బక్సార్ యుద్ధాలకు కారకులైన రాబర్ట్ క్లయివ్, వారెన్ హేస్టింగ్స్ పై అవినీతి ఆరోపణలతో విచారణ జరిగింది. ఈ ఆరోపణలను ఎదుర్కోలేని క్లయివ్ 1774లో తన 49వ ఏట ఆత్మహత్య చేసుకున్నాడు. హేస్టింగ్స్ కొందరు అధికారుల సాయంతో నిర్దోషిగా బయటపడ్డాడు. వీరిద్దరే కాదు, తూర్పు ఇండియా కంపెని అధికారులనేకులు భారతదేశంలో అక్రమంగా ఆర్జించిన ధనంతో స్వదేశానికి వెళ్ళి అక్కడ ఎస్టేట్లు కొని విలాసవంతమైన జీవితాన్ని జీవించడమే కాకుండా ఆ డబ్బు ఖర్చుపెట్టి పార్లమెంట్ సీట్లు కొనుక్కునే వారు. ఇదంతా బ్రిటన్లోని కొన్ని వర్గాలకు అభ్యంతరకరంగా వుండేది. వారు వీరిని నబోబ్స్ (నవాబులు) అని హేళన చేసేవారు.

కానీ 1780 దశకంలో బ్రిటిష్ రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. 1783లో అమెరికా స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారు ఓడిపోయి అమెరికన్ వలసలను వదులుకోవలసి వచ్చింది. క్రొత్త వలసలకోసం చూసినప్పుడు భారతదేశం చాలా అనుకూలంగా కనిపించింది. 1783 లో 24 ఏళ్ళకే బ్రిటన్ ప్రధానమంత్రి అయిన విలియం పిట్ 1784లో చేసిన ఇండియా చట్టం బ్రిటిష్ ప్రభుత్వానికి తూర్పు ఇండియా

కంపెని వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అవకాశం కల్పించింది. బ్రిటన్లో ప్రభువర్గానికి చెందిన కార్న్వాలిస్, వెల్లస్లీ, హెన్రి డుండాస్ వంటివారు తూర్పు ఇండియా కంపెనీలో ప్రముఖ పదవుల్లోకి వచ్చారు. వీరు తెల్ల జాతి ఔన్నత్యంలో నమ్మకమున్నవారు. తూర్పు దేశపు అనాగరిక ప్రజలను తామే ఉద్ధరించగలమని బావించే జాత్యహంకారులు. మొదటి, రెండవ ఆంగ్లో-మైసూర్ యుద్ధాల్లో హైదర్ అలీ, టిపు చేతుల్లో ఆంగ్లేయుల ఓటమిని వీరు సహించలేకపోయారు. నల్లజాతి టిపు సుల్తాన్ చేతిలో తెల్లజాతి వారు యుద్ధఖైదీలుగా ఉండడం బ్రిటిష్ జాతికి అవమానం అని వీరు బ్రిటిష్ ప్రజల జాత్యహంకారాన్ని రెచ్చగొట్టారు. మూడవ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో టిపు పై దాడికి కార్న్వాలిస్ ఈ తెల్లజాతి యుద్ధ ఖైదీలనే సాకుగా చూపాడు. 1784 మంగుళూరు సంధిననుసరించి టిపు వేలమంది ఆంగ్లసైనికులను విడుదలచేశాడు. 100-150 మంది మాత్రం స్వచ్ఛందంగా ఇస్లాంలోకి మారి మైసూరు సైన్యంలో ఉన్నత పదవులను పొందారు. వీరు యుద్ధఖైదీలు కారని స్వతంత్రులని టిపు వాదన. కానీ భారత దేశంలో బ్రిటిష్ రాజ్యవిస్తరణకు అడ్డంకిగా ఉన్న టిపును తొలగించాలని పూర్తి ప్రణాళికతో వచ్చిన కార్న్వాలిస్కు టిపు వాదనలను వినవలసిన అవసరంలేదు. నాల్గవ ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో టిపు పై దాడికి వెల్లస్లీ చూపిన కారణం టిపు-ఫ్రెంచ్ స్నేహం. ఒక స్వతంత్ర పాలకుడిగా తన స్నేహితులను ఎంచుకునే టిపు హక్కును గుర్తించడానికి లార్డ్ వెల్లస్లీ నిరాకరించాడు. బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు వలసవాదానికి టిపు బలి అయ్యాడనేది సుస్పష్టం. ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే 1783 తర్వాత బ్రిటన్లో రాబర్ట్ క్లైవ్ను అనాగరిక భారతదేశంలో బ్రిటిష్ రాజ్య స్థాపకుడిగా కీర్తించబడడం మొదలైంది. రాజకీయ అవసరాలకనుగుణంగా చరిత్రలో విలన్లు హీరోలుగా ఎలా తయారు చెయ్యబడతారో దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం భారతదేశంలోని తాజా రాజకీయాలకనుగుణంగా జాతిపిత మహాత్మా గాంధీ విలన్గా, గాడ్సే హీరోగా రూపాంతరం చెందుతున్న దృశ్యాన్ని మనం చూస్తున్నాము.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు టిపును cruel tyrant (క్రూర నియంత), religious bigot (మతోన్మాది) అని నిందిస్తూ ప్రచారం చేశారు. 19వ శతాబ్దం వరకు యీ ప్రచారం విజయవంతంగా కొనసాగింది. కానీ 20వ శతాబ్దంలో కొత్త చారిత్రక ఆధారాలు వెలుగు చూడడంతో యీ బ్రిటిష్ ప్రచారంపై విమర్శలు విశ్లేషణలు, పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా 1791లో మూడవ ఆంగ్లో-మైసూర్ యుద్ధ సమయంలో ఆంగ్లేయులతో కలిసి టిపుతో యుద్ధం చేస్తున్న మరాఠాలు టిపు రాజ్యంలోని శృంగేరి మఠంపై జరిపిన దాడికి, అక్కడ వారు చేసిన విధ్వంసానికి, ఆ సంఘటనపై టిపు వ్యక్తం

చేసిన ఆవేదన, మఠ పునరుద్ధరణకు సంబంధించి టిపుకు శృంగేరి మఠాధిపతికి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు 1916లో వెలుగులోకి రావడంతో టిపు మత విధానంపై బ్రిటిష్ అబద్ధ ప్రచారాలకు అడ్డుకట్టపడింది. ఈ పరిశోధనలు 21వ శతాబ్దంలో కూడా కొనసాగుతూనే ఉన్నాయి. 21వ శతాబ్దపు ఈ రెండు దశాబ్దాల్లో కేట్ బ్రిటిల్ బ్యాంక్, మైకేల్ సొరకో వంటి విదేశీయులు టిపుపై ఆసక్తికరమైన పరిశోధన గ్రంథాలు రచించారు. దేశవిదేశాల్లో టిపు పై పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.

టిపు నిరంకుశుడు అనే ఆరోపణలో వాస్తవాన్ని పరిశీలిస్తే, ఆ కాలంలో ప్రజాస్వామ్యం లేదు. రాజులందరు నిరంకుశులే. బ్రిటిష్ వారు టిపు ప్రజాకంటకుడు, మైసూరు ప్రజలు టిపు పాలన నుండి విముక్తి కోరుకుంటున్నారు అని ప్రచారం చేశారు. నాల్గవ ఆంగ్లో–మైసూర్ యుద్ధంలో మైసూరు ప్రజలు ఆంగ్లేయులను నిలువరించటానికి చేసిన పోరాటం, టిపు మరణం గురించి తెలుసుకున్న వారి రోదనలు, శ్రీరంగపట్టణంలోకి ప్రవేశించిన ఆంగ్ల సైనికులను ఆశ్చర్యపరిచాయి. ఎందుకంటే వారు అంతవరకు తమ పై అధికారులు ప్రచారం చేసినట్టు టిపు ఒక నిరంకుశ ప్రజాకంటకుడు అని నమ్మారు. టిపు దర్బారులోని కొందరు మంత్రులు, సైనికాధికారులు ఆంగ్లేయులతో చేరి చేసిన నమ్మక ద్రోహానికి బలి అయ్యాడు అనే సంగతి తర్వాత వెలుగులోనికి వచ్చింది. వారిలో ప్రముఖుడు టిపు రెవెన్యూ మంత్రిగాఉన్న మీర్ సాదిక్. టిపు తర్వాత మైసూరు నవాబును చేస్తామని ఆంగ్లేయులు ఇతనికి ఆశపెట్టారు. కానీ యుద్ధంలో ఒక మైసూర్సైనికుడు ఇతన్ని చంపేసాడు. టిపు మరణం తర్వాత 15 రోజులకు సామాన్య ప్రజలకు, టిపుకు జరిగిన నమ్మకద్రోహం గురించి తెలిసింది. ప్రజలు శ్రీరంగపట్టణంలోని మీర్ సాదిక్ సమాధిని తవ్వి అతని శవాన్ని బయిటికి తీసి తిడుతూ కాళ్లతో తన్నుతూ తమ ప్రియతమ రాజుకు అతడు చేసిన ద్రోహానికి కసి తీర్చుకున్నారు. వారిని ఆపడం అప్పుడు శ్రీరంగపట్టణాన్ని ఆక్రమించుకుని ఉన్న ఆంగ్ల సైనికులకు చాలా కష్టమయ్యింది. ఇప్పటికీ శ్రీరంగపట్టణంలో టిపు సమాధిని సందర్శించడానికి వచ్చే సందర్శకులు మీర్ సాదిక్ సమాధిపై, రాళ్ళు రువ్వుతారు. ఇప్పటికీ కన్నడ జానపద పాటలైన లావణీల్లో టిపు తాను నమ్మినవారి చేతిలో ఎలా నమ్మకద్రోహానికి గురై మరణించాడో చెపుతూ పాటలు పాడుతారు. టిపుది ప్రజాకంటక పాలనా లేక ఆంగ్లేయులది ప్రజాకంటకపాలనా అనే సంగతిని అప్పటి ఆంగ్లరచనల ద్వారానే తెలుసుకోవచ్చు. తూర్పు ఇండియా కంపెనీలో సైనికుడిగా పనిచేసిన ఎడ్వర్డ్ మూర్ (యితను హిందూ దేవీ దేవతల గురించి Hindu pantheon అనే ఒక పుస్తకాన్ని వ్రాసి, అప్పుడు కొందరు బ్రిటిష్ వారు ప్రచారం చేస్తున్నట్టు హిందూ మతం ఒక అనాగరిక మతం కాదని, ఒక దార్శనికత కలిగిన మతమని వివరించాడు.)

మైసూర్ రాజ్యంలో ప్రయాణం చేస్తుంటే పచ్చని పొలాలతో, వ్యాపారాలతో, కష్టించి పనిచేసే ప్రజలతో  కళకళలాడుతూ ఉల్లాసంగా ఉంటుందని వ్రాశాడు. తూర్పు ఇండియా కంపెనీలో పెద్ద సైనికాధికారిగా పనిచేసి రెండవ, మూడవ ఆంగ్లో మైసూర్ యుద్ధాల్లో పాల్గొని భారత ప్రజల మేలు కొరకు భారతదేశంలో బ్రిటిష్ రాజ్యం రావాలని బలంగా నమ్మిన సర్ థామస్ మన్రో, బ్రిటన్‌లోని తన తండ్రికి వ్రాసిన ఉత్తరంలో మైసూరు పరిపాలన గురించి వ్రాస్తూ, ఇది నిరంకుశ రాచరిక పాలనే, కానీ ఇక్కడ ప్రతి శాఖ పాలకునితో సమన్వయం కలిగి ఉంటాయి, ఇంత క్రమశిక్షణ కలిగిన సైన్యం బహుశా ప్రపంచంలోనే ఉండదేమో, ఇక్కడ పుట్టుకని బట్టి కాకుండా కేవలం ప్రతిభనుబట్టే పదవులలో నియామకాలు జరుగుతాయి అని వ్రాశాడు.  ఇక బెంగాల్లో తూర్పు ఇండియా కంపెనీ పాలన గురించి బ్రిటిష్ సైనికాధికారి అలెక్సాండర్ డౌ 1792లో వ్రాసిన తన పుస్తకం History of Hindustan లో,  "ఆశబోతుతనంతో నిండిపోయిన తూర్పు ఇండియా కంపెనీలో ప్రతి ఉద్యోగి ఒక నియంతే. పన్ను వసూలు పేరుతో అక్కడ రోజూ జరిగేది దోపిడి దౌర్జన్యమే. పన్ను చెల్లించలేని పేద రైతుపైకి సైన్యాన్ని పంపుతున్నారు. ఇది ఒక సైనిక నియంతృత్వం" అని వ్రాశాడు. పన్ను కట్టలేని రైతు ప్రభుత్వానికి అప్పీలు చేసుకుంటే అతని ఆర్థిక పరిస్థితిని గురించి విచారణ చేసి ఆ రైతుకు పన్ను మాఫీ చేసే పద్ధతిని అమలుచేసిన టిపుది నిరంకుశ, ప్రజాకంటక పాలన అని ఆంగ్లేయులు ప్రచారం చేయడం రాజకీయ దురుద్దేశంతో కూడిన చారిత్రక వక్రీకరణ అనే సంగతి సుస్పష్టం.

టిపును ఒక ఇస్లాం మతోన్మాదిగా చిత్రిస్తూ బ్రిటిష్‌వారు చేసిన వక్రీకరణలు ఇప్పటికీ ఈ ఆధునిక ప్రజాస్వామ్యంలో కూడా భారత రాజకీయాలను ప్రభావితం చేయడం దురదృష్టకరం. వ్యక్తిగతంగా టిపు ఒక నిబద్ధుడైన ముస్లిం. కానీ ఒక పాలకుడిగా మతవిషయాల్లో ఎంతో లౌక్యాన్ని, పరిణితిని ప్రదర్శించాడు. తాను ఒక హిందూ మెజారిటీ ప్రజలు ఉన్న రాజ్యానికి పాలకుడిని అనే సంగతిని టిపు ఎన్నడూ విస్మరించలేదు. టిపు హిందూమతాన్ని ఎంతగానో గౌరవించి హిందూ దేవాలయాలకు, మఠాలకు, బ్రాహ్మణులకు సర్వమాన్యాలు (పన్ను మినహాయింపుతో యిచ్చే భూదానం), వెండి, బంగారు, వజ్రాలతో కూడిన ఆభరణాలు, పాత్రసామగ్రి యిచ్చినట్టు శాసనాలు, ఫర్మాన్లు, ఉత్తరాలు, రికార్డులు లభించడమే కాకుండా, ఆ ఆభరణాలు, పాత్రసామగ్రి, టిపు అవలంబించిన మత సామరస్య విధానానికి ప్రత్యక్ష సాక్షులుగా ఆయా దేవాలయాల్లో ఇప్పటికీ వాడకంలో ఉన్నాయి. మైసూరులో మొదటి చర్చి నిర్మాణానికి టిపు అనుమతినిచ్చాడని, తన అధీనంలో బందీలుగా ఉన్న బ్రిటిష్ క్రైస్తవ సైనికులు  ప్రార్థనలు, ఇతర మతపరమైన కార్యక్రమాలు

నిర్వహించుకోవడానికి ఒక క్రైస్తవ ఫాదర్‌ని పంపించవలసిందిగా గోవా చర్చి అధికారులకు టిపు లేఖ వ్రాసాడు అనే విషయాన్ని ఇక్కడ గమనించాలి.

టిపు మత సామరస్యానికి సంబంధించి ఎంతో సమాచారం లభిస్తుండగా, టిపు తనపై తిరుగుబాటు చేసిన మలబార్ నాయర్లకు కొడవలకు(కూర్గ్), భారతదేశాన్ని కబళించాలని చూస్తున్న బ్రిటిష్ వారికి, వారికి సహకరించిన కెనరా క్రైస్తవులకు, వారి విద్రోహ చర్యలకు ఒక రాజుగా వారికి మత మార్పిడి, దేశబహిష్కరణ శిక్షలను విధిస్తే బ్రిటిష్ చరిత్రకారులు టిపుపై ఒక మతోన్మాది ముద్రవేశారు. రాజద్రోహనికి ఆ కాలంలో మరణ శిక్ష విధించే వారు. కానీ టిపు తీవ్రమైన ఆరోపణలున్నవారికి మాత్రమే మరణదండన విధించాడు. మిగతావారికి మతమార్పిడి ఒక ప్రత్యామ్నాయంగా (choice) ఉండేది. టిపు స్వయంగా ఒక ఫ్రెంచ్ అధికారికి వ్రాసిన ఉత్తరంలో నేను నాయర్ల ఆరు తిరుగుబాట్లను క్షమించాను, ఏడవ తిరుగుబాటును అణచి వేసి వారికి మత మార్పిడి అనే శిక్ష వేశాను అని వ్రాశాడు. కెనరా క్రైస్తవులకు శ్రీరంగపట్టణం నుంచి బహిష్కరణ శిక్ష మాత్రమే విధించాడు, మంగుళూరు ముట్టడిలో ఆంగ్లేయులకు వీరు ఎంతగానో సహకరించారు. మైసూరు సైన్యంలో ఉన్న కొందరు కెనరా క్రైస్తవ సైనికులు యుద్ధం మధ్యలో మైసూరు సైన్యాన్ని వదలి ఆంగ్లేయులతో కలిసిపోయారు. టిపు వారిలో తీవ్రమైన ఆరోపణలు ఉన్న ఒకరికి మాత్రమే మరణశిక్ష విధించాడు. యుద్ధం మధ్యలో సైన్యాన్ని వదిలేవారిని తూర్పు ఇండియా కంపెనీ అధికారులు వెంటనే కాల్చి చంపేవారు. 1857 సిపాయి తిరుగుబాటులో ఆంగ్లేయులు తిరుగుబాటుదార్లను కాల్చి చంపి ఇంక ఎవ్వరూ తిరుగుబాట్లు చేయకుండా ప్రజల్ని భయభ్రాంతుల్ని చెయ్యడానికి శవాలను రోజుల తరబడి చెట్లకు వేలాడదీసి ఉంచారనే చారిత్రక వాస్తవాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి. టిపు తన పై తిరుగుబాటు చేసినవారిని మతమార్పిడులు, దేశ బహిష్కరణలు మాత్రమే వేసి శిక్షించాడు. మతోన్మాదిగా మతమార్పిడులు చేస్తే తాను పాలించే మైసూరు రాజ్యంలో కూడా మతమార్పిడులు చెయ్యవచ్చు. కానీ హైదర్, టిపు కాలంలో మైసూర్ రాజ్యంలో బలవంతపు మత మార్పిడులు జరిగిన ఆధారాలు లేవు. టిపుపాలన, సైనిక వ్యవస్థల్లో హిందువులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. టిపు ఎంతగానో నమ్మిన అతని ముఖ్య సలహాదారుడు పూర్ణయ్య, బ్రాహ్మణ జ్యోతిష్యులు టిపు వెంట ఎప్పుడూ ఉండేవారు. వారి సలహా తీసుకునే టిపు ఏ పనైనా చేపట్టేవాడు. మరణించే రోజు కూడా యుద్ధానికి వెళ్ళేముందు వారి సలహా మేరకు బ్రాహ్మణులకు దాన ధర్మాలు చేసి యుద్ధానికి వెళ్ళి మరణించాడు.

టిపు మతమార్పిడులను తన శత్రువులపై ఒక రాజకీయ అస్త్రంగానే వాడాడు తప్ప ఒక మతోన్మాదిగా కాదు. నాయర్లతో కలిసి తనపై తిరుగుబాటు చేసిన మలబార్

ముస్లింలైన మొప్లాలను, బ్రిటిష్ వారితో కుమ్మక్కు అవుతున్నారనే అనుమానంతో తన సైన్యంలోని మహదవిలనే ఒక ముస్లిం తెగవారిని టిపు కఠినంగా శిక్షించాడు. మతమార్పిడితో తిరుగుబాటుదార్లైన నాయర్లను శిక్షించిన మలబార్‌లోనే గురువాయూర్ దేవాలయానికి 669 ఎకరాల భూమిని, ఇతర దేవాలయాలకు, మలబార్‌లోని నంబూద్రి బ్రాహ్మణులకు భూదానాలు చేసిన టిపు ఫర్మాను పత్రాలు సంగ్రహాలయాల్లో ఇప్పటికీ పదిలంగా ఉన్నాయి.

బ్రిటిష్ వారు విలన్‌గా చిత్రించిన టిపు, భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత విదేశీ పాలకులను ఎదిరించి వీర మరణం పొందిన ఒక హీరోగా గుర్తించబడ్డాడు. 1970 దశకంలో ఆర్.ఎస్.ఎస్. సంస్థ కర్నాటక రాష్ట్రంలోని మహనీయుల జీవిత చరిత్రలను భారత భారతి అనే సిరీస్‌లో కన్నడంలో ప్రచురించింది. వాటిలో టిపు జీవిత చరిత్ర కూడా ఉంది. ఇందులో టిపు ఒక దేశభక్తుడిగా, వీరమరణం పొందిన ఒక వీరుడిగా కీర్తించబడ్డాడు. పిల్లల కోసం ప్రచురించబడే అమర్ చిత్ర కథ అనే కామిక్ సిరీస్‌లో కూడా టిపును బ్రిటిష్ వారితో పోరాడి అమరుడైన ఒక సాహసికుడిగా చిత్రీకరించారు.

బ్రిటిష్ వారు వదిలివెళ్లిన 'టిపు విలన్' చర్చ భారతదేశంలో 20వ శతాబ్దం 80వ దశకంలో తిరిగి తెరపైకి వచ్చింది. 1976లో ఎమర్జెన్సీ తర్వాత భారత దేశ రాజకీయాల్లో వచ్చిన క్రొత్త రాజకీయ సమీకరణలు, వాటి క్రొత్త అజెండాలే అందుకు కారణం. 1980లలో బి.జె.పి. రథయాత్రతో జేమ్స్ మిల్ భారత దేశ చరిత్ర విభజన మళ్ళీ తెరపైకి వచ్చింది. భారత దేశాన్ని మధ్య యుగాల్లో పాలించిన ముస్లిం పాలకులపై బ్రిటిష్ వారు చేసిన నిరంకుశ, మతోన్మాది నేరారోపణలు పునరావృతమవడం ప్రారంభమయ్యాయి. బ్రిటిష్ వారు భారతదేశంలో తమ రాజ్య విస్తరణను, సామ్రాజ్యవాదాన్ని సమర్థించుకోవడానికి భారత దేశంలో విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తే ఆధునిక భారత దేశ రాజకీయాల్లో ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం భారతీయులను విభజించే ప్రక్రియ జరుగుతోంది. చరిత్రలోని సంఘటనలను, వ్యక్తులను తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా ఎలా ఉపయోగించుకుంటున్నారో అనే సంగతిని తెలియజేసే ఒక సంఘటన ఈ మధ్యనే మన కళ్ళముందు జరిగింది. కర్నాటకలో భారతీయ జనతా పార్టీ బ్రిటిష్ వారి పంథాలోనే టిపును వ్యతిరేకిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ పార్టీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి యెడ్యూరప్ప పార్టీ తనను ముఖ్యమంత్రి పదవినుండి తొలగించినప్పుడు బి.జె.పి. నుండి బయటకు వచ్చి 2012లో కొత్త పార్టీ పెట్టాడు.

బి.జె.పి.లో ఉన్నప్పుడు టిపును విమర్శించిన యెడ్యూరప్ప కొత్త పార్టీ పెట్టిన తర్వాత టిపు తలపాగా వంటి తలపాగాను ధరించి ఒక కత్తిని పట్టుకొని టిపు గొప్ప దేశభక్తుడని పొగిడాడు. తిరిగి ఆయన బి.జె.పి.పార్టీలో చేరి, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న టిపు జయంతి ఉత్సవాలను వ్యతిరేకిస్తున్నాడు. టిపును పొగిడే రాజకీయ పార్టీలు కూడా రాజకీయ అవసరాల కోసమే అలా చేస్తున్నాయి అనే విషయం గ్రహించాలి.

చరిత్ర, లభించే ఆధారాలపై మాత్రమే విశ్లేషించబడాలి. కొత్త ఆధారాలు వెలుగులోనికి వచ్చినప్పుడు వాటి ఆధారంగానే కొత్త విశ్లేషణలు జరగాలి. అందుకే చరిత్ర పరిశోధన నిరంతర ప్రక్రియ. అంతే కాని ఎవరి రాజకీయ, ఓటు బ్యాంక్ అవసరాలకు అనుగుణంగా వారు చరిత్రపై, చారిత్రక వ్యక్తులపై తీర్పులు (judgments) ఇవ్వడం కంటే చరిత్రను అప్పటి నేపథ్యంలో అర్థం చేసుకుని మంచి చెడులను బేరీజు వెయ్యాలి.

**– యార్లగడ్డ నిర్మల**

# చారిత్రక క్రమ పట్టిక

1721 టిపు తండ్రి హైదర్ అలీ జననం; నవంబర్ 20,1750 టిపు జననం

1761 మైసూరు నవాబ్ గా హైదర్ అలీ అధికారం లోకి వచ్చాడు.

1766 బాలసైనికుడి గా టిపు మొదటిసారి మలబార్ యుద్ధంలో పాల్గొన్నాడు.

1767 మొదటి ఆంగ్లో- మైసూర్ యుద్ధం ప్రారంభం. టిపు సైనికాధికారిగా మొదటిసారి సైన్యాలను నడిపి మద్రాసుపై దాడి చేశాడు.

1769 మైసూరు విజయంతో మొదటి ఆంగ్లో - మైసూర్ యుద్ధం ముగింపు

1780 రెండవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం ప్రారంభం.

1782 హైదర్ అలీ మరణం. మైసూరు నవాబ్ గా టిపు పట్టాభిషేకం.

1784 మైసూర్ విజయంతో రెండవ ఆంగ్లో-మైసూర్ యుద్ధం ముగింపు.

1786 ఇండియా లో బ్రిటిష్ గవర్నర్ జనరల్‌గా లార్డ్ కార్న్‌వాలిస్ నియామకం టర్కీలోని ఒట్టోమన్ చక్రవర్తి వద్దకు టిపు రాయబారం.

1787 ఫ్రాన్స్ చక్రవర్తి 16వ లూయీ వద్దకు టిపు రాయబారం.

1789 టర్కీ, ఫ్రాన్స్ వెళ్ళిన రాయబారులు తిరిగి మైసూరు చేరుకున్నారు.

1790 మూడవ ఆంగ్లో- మైసూర్ యుద్ధం ప్రారంభం.

1792 టిపు ఓటమితో మూడవ ఆంగ్లో మైసూర్ యుద్దం ముగింపు. పసివారైన టిపు ఇద్దరు కుమారులను కార్న్ వాలిస్ యుద్ధ నష్ట పరిహారంగా 6 కోట్ల సొమ్ము చెల్లించేవరకు హామీగా తీసుకెళ్ళాడు.

1794 కార్న్‌వాలిస్ స్థానంలో గవర్నర్ జనరల్‌గా వచ్చిన జాన్ షోర్‌కు 6 కోట్ల సొమ్ము చెల్లించి టిపు తన కుమారులను తిరిగి తెచ్చుకున్నాడు.

1797 మారిషస్‌లోని ఫ్రెంచ్ వారి వద్దకు సైనిక సహాయం కొరకు టిపు రాయబారం.

1798 టర్కీకి, ఫ్రాన్స్‌కు రెండవసారి టిపు రాయబారులను పంపించాడు. పర్షియాకు (ఇరాన్) రాయబారాలు పంపించాడు. ఈ మూడు రాయబారాలు టిపు మరణించిన తర్వాత తిరిగి మైసూర్ చేరాయి. మారిషస్ వెళ్ళిన రాయబారం ఏప్రిల్ లో మంగుళూర్ చేరింది.

1798 ఇండియాలో బ్రిటిష్ గవర్నర్ జనరల్‌గా రిచర్డ్ వెల్లస్లీ ఆగమనం.

1799 నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం ప్రారంభం.

1799 టిపు మరణం, ఆంగ్లేయుల విజయంతో నాల్గవ మైసూర్ యుద్ధం ముగింపు.

1799 టిపు అంతిమ యాత్ర, సైనిక లాంఛనాలతో శ్రీరంగపట్టణంలోని హైదర్ అలీ సమాధి ప్రక్కనే టిపు పార్థివ శరీరం ఖననం చెయ్యబడింది.

## అధ్యాయం - 1

# 18వ శతాబ్దంలో భారతదేశం

భారతదేశ చరిత్రలో క్రీ.శ 18వ శతాబ్దానికి ఒక ప్రత్యేకత ఉంది. 1707లో ఔరంగజేబు మరణం తర్వాత అసమర్థులైన పాలకులు అధికారంలోకి రావడంతో మొగలు సామ్రాజ్యం నెమ్మదిగా బలహీనపడి విచ్ఛిన్నం కావడం ప్రారంభించింది. అంతకుముందు మొగలులకు సామంతులుగా, సుబేదార్లుగా ఉన్నవారు స్వాతంత్ర్యం ప్రకటించుకోసాగారు. 1724లో మొగలు సుబేదారైన ఖమ్రుద్దీన్ ఖాన్ దక్కనులో నిజామ్ ఉల్ ముల్క్ అసఫ్‌జా పేరుతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. తర్వాత ఇది హైదరాబాద్ రాజ్యంగా ప్రసిద్ధి చెందింది. బెంగాల్ నవాబు, అవద్ నవాబు వీరందరూ మొగలు సామ్రాజ్యం నుండి విడిపోయి స్వతంత్రంగా రాజ్యాలు స్థాపించుకున్నవారే. ఈ పరిస్థితుల్లో 1730లో భారతదేశంపై ఇరాన్ రాజు నాదిర్షా దండయాత్ర మొగలు సామ్రాజ్యాన్ని మరింత బలహీన పరిచింది. రాజ్యం వీరభోజ్యం అన్నట్టు కొంత సైన్యం, ఆయుధ బలం, ధనం ఉన్న సాహసికుడు (adventurer) ఎవరైనా కొత్త స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరుచుకోవచ్చు. ఆ రోజుల్లో అసమర్థులైన రాజులను తొలగించి సైనికాధికారులు, ఫౌజ్‌దార్లు, సుబేదార్లు తామే పాలకులయ్యారు. దక్షిణ భారతదేశంలోని మైసూరు రాజ్యంలో హైదర్ అలీ ఆ విధంగానే మైసూరు పాలకుడయ్యాడు. ఇలా కొత్తగా ఏర్పడిన రాజులు, రాజ్యవిస్తరణ, ఆధిపత్యమే లక్ష్యాలుగా నిరంతర యుద్ధాలలో మునిగి తేలుతూ ఉండేవారు. మొగలులకు ప్రత్యామ్నాయంగా భారతదేశంలో గొప్ప రాజ్యాన్ని స్థాపించగలరనుకున్న మరాఠాలు కూడా 1761లో జరిగిన మూడవ పానిపట్టు యుద్ధంలో ఆఫ్ఘన్ రాజు అహమద్‌షా అబ్దాలి చేతిలో చిత్తుగా ఓడిపోయారు. అప్పటి వరకు పూనాలోని పేష్వా ఆధిపత్యంలో ఉన్న మరాఠా సుబేదారులు నాగపూర్ (భోంస్లే వంశం) బరోడా (గైక్వాడ్ వంశం) ఇండోర్ (హోల్కార్ వంశం) గ్వాలియర్ (సింధియా వంశం) స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయి స్వీయ రాజ్య విస్తరణలో, విభేదాలలో మునిగిపోయారు.

పదిహేనవ శతాబ్దం నుండి వర్తకం కోసం భారతదేశం రావడం మొదలు పెట్టిన పోర్చుగీసు, డచ్, ఇంగ్లీష్, ఫ్రెంచి వారి మధ్య ముందు వ్యాపార ఆధిపత్యం కోసం, తర్వాత రాజకీయ ఆధిపత్యం కోసం పోటీ, పోరు ప్రారంభమయ్యాయి. వీరందరిలో ఇంగ్లీషువారు కర్నాటక యుద్ధాలతో దక్షిణ భారతదేశంలో, 1757లో జరిగిన పలాసీ (ప్లాసీ) యుద్ధంతో బెంగాల్‌లో తిరుగులేని విజయాలు సాధించి భారతదేశపు భవిష్యత్ పాలకులుగా పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగారు. 1764లో జరిగిన బక్సార్

యుద్ధంలో ఇంగ్లీషు వారు మొగలు చక్రవర్తి సైన్యాలపై విజయం సాధించడంలో భారతదేశంలో ఇంగ్లీషు వారి ఆధిపత్యం రూఢి అయ్యింది. రాజ్యవిస్తరణ కోసం, పరస్పర ఆధిపత్యం కోసం యుద్ధాలలో, కలహాలలో మునిగి ఉన్న భారతీయ పాలకులలో, భారతదేశాన్ని క్రమంగా కబళించడానికి బ్రిటిష్ వారు పన్నుతున్న వ్యూహాలను తెలుసుకునే తెలివి లోపించింది. పైగా ప్రక్కవాడిని జయించి ఆ రాజ్యాన్ని ఆక్రమించుకోవడానికి ఆంగ్లేయుల నుండి, ఫ్రెంచ్‌వారి నుండి ఆయుధ, సైనిక సహాయాన్ని పొందడం గొప్పగా భావించే దుస్థితిలో వీరుండే వారు. అందుకోసం వీరి రాజ్యాలను, అధికారాన్ని మింగేసి వీరిని ఒట్టి దద్దమ్మలుగా చేయడానికి బ్రిటిష్ వారు ప్రతిపాదించే షరతులను వీరు అంగీకరించేవారు. టిపు సుల్తాన్‌ను ఓడించడానికి బ్రిటిష్ వారితో చేతులు కలిపిన మరాఠాలు, హైదరాబాద్ నిజామ్, జయించిన టిపు రాజ్యాన్ని ఆంగ్లేయులతో పంచుకోవడానికి, యుద్ధ ఖర్చుల నిమిత్తం ఆంగ్లేయులకు కొంత ధనాన్ని ఇవ్వడానికి అంగీకరించారు. ఆంగ్లేయుల ముందు తలవంచినా ఫరవాలేదు కాని తన శత్రువైన పొరుగు రాజును జయించాలి, ఇదీ 18వ శతాబ్దంలో భారతీయ సంస్థానాధీశుల దౌర్భాగ్యపు రాజనీతి. దక్షిణ భారతదేశంలో తరచూ కలహించుకొంటూ బ్రిటిష్ ఫ్రెంచి వారి సహకారాన్ని పొందిన కొందరు సంస్థానాధీశులు: ఉత్తరాంధ్రంలో విజయనగర సంస్థానం బొబ్బిలి సంస్థానం మధ్య, మరాఠాలు (పేష్వా) హైదరాబాద్ నిజాము మధ్య, హైదరాబాద్ నిజామ్, మైసూరు మధ్య, మరాఠాలు, మైసూరు మధ్య, కేరళలో కొచిన్ సంస్థానం, కాలికట్ మధ్య (జామొరిన్), ట్రావెన్కూరు (తిరువాన్కూరు), కొచ్చిన్ మధ్య, ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీరి వైరాలకు మతానికి ఏమీ సంబంధం లేదు. బ్రాహ్మణ పేష్వాలు మైసూరు రాజ్యం హిందూ ఒడయార్‌ల ఆధీనంలో ఉన్నప్పుడు తరచూ వారిపై దండయాత్రలు చేసేవారు. తరువాతి కాలంలో మైసూరు నవాబైన హైదర్ అలీ కర్నాటక (తమిళనాడులోని ఆర్కాట్) ముస్లిం నవాబుపై రాజ్య విస్తరణ కొరకు తరచూ యుద్ధాలు చేసేవాడు.

అప్పటి సమకాలీన భారతదేశంలోని ఇతర సాహసికులలాగానే హైదర్ అలీ సామాన్య సైనికుడి స్థాయి నుండి ఫౌజ్‌దార్‌గా, దిండిగల్ సుబేదారుగా ఎదిగి మైసూరు పాలకుడైన కృష్ణరాజ ఒడయార్‌ను తొలగించి తానే మైసూరు నవాబయ్యాడు. విస్తృతంగా రాజ్య విస్తరణ చేసాడు. ఈ విస్తరణలో బాధితులు మరాఠాలు, హైదరాబాద్ నిజామ్, ఆర్కాటు నవాబు, జామెరిన్ (కాలికట్) అనేది నిర్వివాదాంశం. ముందుగానే పేర్కొన్నట్టు రాజ్యం వీరభోజ్యం. కాని 18వ శతాబ్దం చివరి కొచ్చేసరికి ఆ రాజ్యాల్ని భుజించే ఆ వీరులు ఆంగ్లేయులు కావడం విశేషం.

ఈ పద్దెనిమిదవ శతాబ్దంలో భారతదేశ రాజకీయాలు, వ్యవస్థలు మధ్యయుగాల నుండి ఆధునిక యుగంలోకి అడుగుపెడుతున్నాయి. విదేశీ ఆంగ్లేయుల పాలన భారత

దేశంలో వేళ్ళూనుకుంటున్నది. ఈ నేపథ్యంలో భారతదేశ చరిత్రలో టిపు పాత్రను విశ్లేషించవలసి ఉంది.

ప్రపంచంలో చాలా సందర్భాలలో సమకాలీన రాజకీయాలకు చరిత్ర రచన బాధితురాలే (victim). బ్రిటిష్ పాలకులు భారతదేశంపై తమ వలస వాదాన్ని, సామ్రాజ్య వాదాన్ని సమర్థించుకునేందుకు తమను వ్యతిరేకించిన వారి చరిత్రను, వ్యక్తిత్వాన్ని తమ చరిత్ర రచనలలో శక్తి వంచన లేకుండా అపఖ్యాతి పాలుచేసారు. వారిలో ప్రథమ బాధితుడు టిపు సుల్తాన్. వారు టిపును ఇస్లాం మతోన్మాదిగా, నిరంకుశుడిగా చిత్రించారు. ఎందుకంటే టిపు, అతని తండ్రి హైదర్ అలీ ఈ దేశంలో ఆంగ్లేయుల ప్రమాదాన్ని ఏ ఇతర సమకాలీన భారతీయ రాజుల కంటె కూడా ఎక్కువగా గుర్తించారు. ఇతర సంస్థానాధీశులు ఆంగ్లేయుల సహాయాన్ని అర్థిస్తూ ఎటువంటి ఎదిరింపు (resistance) లేకుండా వారికి లొంగిపోతుంటే, హైదర్ అలీ, టిపు వారిని ఎదుర్కొని ఆంగ్లేయుల రాజ్యవ్యాప్తిని, ఆధిపత్యాన్ని నిలువరించే ప్రయత్నం చేసారు. భారత దేశ చరిత్రను నిష్పాక్షికంగా విశ్లేషించేవారికి, ఆంగ్లేయులను నిలవరించడంలో నిజామ్, మరాఠాలు టిపుకు సహాయం చేసి ఉంటే దక్షిణ భారతదేశ చరిత్ర భిన్నంగా ఉండేదని అనిపించడం సహజం. ఈ నేపథ్యంలో టిపు చరిత్ర, వ్యక్తిత్వం ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

### అధ్యాయం - 2

# మైసూర్ రాజ్యం-హైదర్ అలీ

టిపు తన తండ్రి అయిన హైదర్ అలీ నుండి వారసత్వంగా పొందిన విస్తృతమైన మైసూర్ రాజ్యం గురించి, ఒక సాధారణ సైనికుడి స్థాయి నుండి మైసూర్ నవాబ్‌గా హైదర్ అలీ ఎదిగిన పరిస్థితుల గురించి ఇక్కడ కొంత తెలుసుకోవాలి. హైదర్ అలీ, టిపు సుల్తాన్ వ్యక్తిత్వాల్లో కొన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికీ టిపుపై తన తండ్రి ప్రభావం ఎంతగానో ఉంది. 1782లో హైదర్ అలీ మరణించే నాటికి టిపు వయసు 32 సంవత్సరాలు. ఈ 32 సంవత్సరాలు టిపు తన తండ్రి నీడలో, అడుగుజాడల్లో, కేవలం హైదర్ వారసుడిగానే కాకుండా యుద్ధాల్లో, పరిపాలనలో తండ్రికి సహచరుడిగా మెలిగాడు.

## మైసూర్ రాజ్యం

దక్షిణ భారతదేశంలో పశ్చిమ దక్షిణ భాగంలో ఉన్న మైసూర్ రాజ్యాన్ని 1399లో యదురాయ, కృష్ణరాయ అనే ఇద్దరు సోదరులు స్థాపించారు. వీరి పూర్వాపరాల విషయంలో కొంత వివాదం ఉంది. కొందరు వీరు ఉత్తర భారత దేశంలోని ద్వారక నుండి వలస వచ్చారని, ఇంకొందరు వీరు ప్రస్తుత కర్నాటక రాష్ట్ర వాసులేనని అభిప్రాయ పడతారు. యదురాయ స్థానికంగా ఉన్న చిక్కదేవరసి అనే రాజకుమార్తెను వివాహం చేసుకొని ఒడయారు (ప్రభువు) అనే బిరుదు ధరించాడు. అప్పటినుండి వీరి వంశం ఒడయారు వంశంగా ప్రాచుర్యంలోనికి వచ్చింది. అప్పుడు దక్షిణ భారత దేశంలో విస్తరించి ఉన్న విజయనగర సామ్రాజ్యానికి ఈ ఒడయారులు సామంతులుగా వ్యవహరించారు. 1565లో తళ్ళికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్య విచ్ఛిన్నం తర్వాత ఒడయారులు స్వతంత్రులై చుట్టుపక్కల ఉన్న చిన్న రాజ్యాలను జయించి తమ రాజ్య విస్తరణ ప్రారంభించారు. 1610లో మొదటి రాజా ఒడయారు మైసూర్ ప్రక్కనే ఉన్న చెన్న పట్టణం, శ్రీరంగ పట్టణాలను జయించి, అదే సంవత్సరం తన రాజధానిని మైసూర్ నుండి కావేరి నది ఒడ్డున ఉన్న శ్రీరంగపట్టణానికి మార్చాడు.

చిక్కదేవరాజ ఒడయార్ (1672–1704) కాలంలో మైసూర్ రాజ్యం కర్నాటకలోని బెంగళూరు, చిక్మగళూరు, హాసన్ ప్రాంతాలకు, తమిళనాడులోని సేలం, కోయంబత్తూర్, ఈరోడ్ వరకు విస్తరించింది. తర్వాత వచ్చిన రెండవ కంఠీరవ నరసరాజ ఒడయార్ కాలంలో దక్షిణం వైపు విస్తరించడానికి ప్రయత్నిస్తున్న మరాఠాలను, మొగలులను

నిలువరించి మైసూర్ తన ప్రభావాన్ని నిలుపుకొంది. కానీ తర్వాత వచ్చిన అసమర్థ, బలహీన రాజుల కారణంగా మైసూర్ తన ప్రభావాన్ని కోల్పోవడం ప్రారంభించింది. ఏడవ చామరాజ్ ఒడయార్ కాలంలో కలెల సోదరులుగా ప్రసిద్ధి చెందిన నంజరాజ్ (దళవాయి లేక సైన్యాధ్యక్షుడు), అతని సోదరుడైన దేవరాజ్ (సర్వాధికారి లేక ముఖ్యమంత్రి) చేతుల్లోనికి అధికారం వెళ్లిపోయింది. తర్వాత వచ్చిన రెండవ కృష్ణరాజ ఒడయార్ ఈ సోదరుల చేతిలో కీలుబొమ్మగా మారాడు. యీ పరిస్థితులనే తనకు అనుకూలంగా మార్చుకుని హైదర్ అలీ మైసూర్ నవాబ్ కాగలిగాడు.

## ఎవరీ హైదర్ అలీ

మధ్య యుగాల్లో భారతదేశంలో ముస్లిం రాజ్య స్థాపన జరిగిన తర్వాత అరేబియా, ఇరాన్, టర్కి, ఇరాక్, మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ వంటి అనేక ముస్లిం దేశాల నుండి భారతీయ ముస్లిం దర్బార్లలో, సైన్యంలో తమ అదృష్టం పరీక్షించుకోవడం కోసం, యితరత్రా జీవనోపాధి కోసం ఎందరో వలస వచ్చారు. అలా వలస వచ్చినవారిలో హైదర్ అలీ, టిపు సుల్తాన్ పూర్వీకులు కూడా ఉన్నారు. వీరిలో టిపు కు నాలుగు తరాల ముందు ఉన్న హైదర్ అలీ ముత్తాత వలి మహమ్మద్ నుంచే టిపు, హైదర్ అలీ పూర్వీకుల సమాచారం మనకు తెలుస్తుంది. వలి మహమ్మద్ అరేబియా నుండి ఢిల్లీ వచ్చి అక్కడ నుండి దక్షిణ భారత దేశంలోని ముస్లిం రాజ్యమైన బీజాపూర్‌లోని గుల్బర్గాకు వచ్చాడు. టిపు పూర్వీకులు అరేబియాలోని నవాయత్ తెగకు చెందిన వారు కావడంతో వీరు మత సేవకులుగా పనిచేసేవారు. వలీ మహమ్మద్ గూల్బర్గాలోని సుప్రసిద్ధ బంద నవాజ్‌గెసు దరాజ్ దర్గాలో జీవనోపాధికి సేవకుడుగా చేరాడు. కానీ ఇతని కుమారుడు మహమ్మద్ అలీ మతపరమైన వృత్తిని వదలి మొదట బీజాపూర్ సైన్యంలో పనిచేసి తర్వాత ప్రస్తుత కర్నాటక రాష్ట్రంలోని కోలార్ ప్రాంతంలో వ్యవసాయదారుడిగా స్థిరపడ్డాడు. ఇతని నలుగురు కుమారులలో ఒకడైన ఫతే మహమ్మద్ మొదట ఆర్కాట్ నవాబ్ సైన్యంలో తర్వాత మైసూర్ ఒడయార్ సైన్యంలో, తరవాత ఒడయార్ల సామంతుడైన సిరా నవాబ్ సైన్యంలో వివిధ హెూదాల్లో పనిచేశాడు. సిరా నవాబ్ దర్గా అలీ ఖాన్, ఫతే మహమ్మద్ ను 400 పదాతి దళాలకు, 200 అశ్విక దళాలకు అధిపతిని చెయ్యడమే కాకుండా దొడ్డ బళ్లాపూర్ జాగీర్‌ను ఇచ్చాడు. ఇక్కడే ఫతే మహమ్మద్‌కు 1718లో షాబాజ్,1721లో హైదర్ అలీ అనే కుమారులు జన్మించారు. కానీ సిరా నవాబ్ మరణం తర్వాత సిరా రాజ్యంలోని అంతః కలహాలలో ఫతే మహమ్మద్ హత్యకు గురయ్యాడు. ప్రత్యర్థులు ఫతే మహమ్మద్ కుటుంబాన్ని నిర్బంధించి హింసించారు. అప్పుడు హైదర్ అలీ వయసు 5 ఏళ్ళు. మైసూర్ దళవాయి జోక్యంతో వారికి విడుదల లభించింది. తర్వాత తన ఇద్దరు కుమారులను తీసుకుని ఫతే మహమ్మద్ భార్య మొదట బెంగుళూర్ వచ్చింది. తర్వాత మైసూర్ రాజ్యంలో ఉన్నత

పదవిలో ఉన్న తమ బంధువైన హైదర్ సాహెబ్ సాయంతో కావేరి నది ఒడ్డున ఉన్న శ్రీరంగ పట్టణంలో స్థిరపడింది.

## హైదర్ అలీ ఎదుగుదల

శ్రీరంగ పట్టణంలో స్థిర పడిన ఫతే మహమ్మద్ కుటుంబానికి వారి బంధువైన హైదర్ సాహెబ్ అండగా నిలిచాడు, హైదర్ సాహెబ్ మైసూర్ సైన్యాధిపతి నంజరాజ్‌కు సన్నిహితుడు కావడంతో యుక్త వయసు వచ్చిన షాబాజ్, హైదర్ అలీలకు మైసూర్ సైన్యంలో ఉద్యోగాలిప్పించాడు. 1749లో మరాఠాలకు మైసూరుకు జరిగిన దేవనహళ్లి యుద్ధంలో హైదర్ అలీ చూపిన ధైర్య సాహసాలకు ముగ్ధుడైన నంజరాజ్ హైదర్‌కు 'ఖాన్' అనే బిరుదునివ్వడమే కాకుండా 200 కాల్బలానికి, 50 అశ్విక దళానికి అధిపతిని చేశాడు. మైసూర్ రాజ్యంలో హైదర్ అలీ ఎదుగుదలకు ఇది ఆరంభం.

ఇదే సంవత్సరంలో హైదర్ అలీ జీవితాన్ని మలుపు తిప్పే సంఘటనలు జరిగాయి. 1748 లో హైదరాబాద్ నవాబ్ నిజాం–ఉల్–ముల్క్ అసఫ్ జా మరణంతో అతని కుమారుడు నాసిర్ జంగ్, మనమడు ముజాఫర్ జంగ్‌ల మధ్య వారసత్వ యుద్ధం ప్రారంభమయ్యింది. మైసూర్ రాజు నాసిర్ జంగ్‌ను సమర్థిస్తూ అతనికి సాయంగా హైదర్ అలీ నేతృత్వంలో కొంత సైన్యాన్ని పంపించాడు. ఈ యుద్ధంలో జరిగిన గందరగోళంలో నాసిర్ జంగ్ ధనాగారం ముజఫర్ జంగ్ తరఫున యుద్ధం చేస్తున్న ఫ్రెంచ్ వారి చేతిలో కొంత, హైదర్ అలీ చేతుల్లో కొంత పడింది. తర్వాతి కాలంలో హైదర్ తన స్వంత సైన్యాన్ని నిర్మించుకోడానికి ఈ ధనం ఉపయోగ పడింది.

1752లో మళ్ళీ మైసూర్ కర్నాటక (తమిళనాడు లోని ఆర్కాట్) నవాబుల వారసత్వ యుద్ధంలో తలదూర్చింది. వారసత్వ యుద్ధంలో తనకు సాయం చేస్తే తిరుచునాపల్లి, దాని చుట్టుప్రక్కల ప్రాంతాలను మైసూర్‌కు ఇస్తానని కర్నాటక సింహాసనానికి పోటీదారుల్లో ఒకరైన మహమ్మద్ అలీ మైసూర్ సేనాధిపతి నంజరాజ్‌కు ఆశ చూపాడు. నంజరాజ్ హైదర్ అలీని వెంట తీసుకొని పెద్ద సైన్యంతో కర్నాటక వెళ్ళి వారసత్వ పోరులో మహమ్మద్ అలీకి సహాయం చేశాడు. ఈ పోరులో మహమ్మద్ అలీ గెలిచి కర్నాటక నవాబ్ అయినప్పటికీ నంజరాజ్‌కు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. ఈ యుద్ధంలో మైసూర్ ఏమి పొందలేకపోయినా, హైదర్ అలీ మాత్రం ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాడు. ఈ యుద్ధంలో మహమ్మద్ అలీకి ఆంగ్లేయులు, అతని విరోధి చందా సాహెబ్‌కు ఫ్రెంచ్ వారు సైన్య సహకారమందించారు. హైదర్ అలీ యూరోపియన్ సైన్యాల యుద్ధ నైపుణ్యాన్ని దగ్గరగా పరిశీలించి, ఎంతో ప్రభావితుడయ్యాడు. భవిష్యత్తులో తన సైన్యాన్ని ఆ పంథాలో నడిపించి ఎన్నో విజయాలను పొందాడు.

## ఫౌజ్ దార్ హైదర్ అలీ

కర్నాటక వారసత్వ యుద్ధంలో మైసూర్ తిరుచునాపల్లిని పొందలేకపోయిన నంజరాజ్ ఇంకొకసారి హైదర్ అలీ యుద్ధ నైపుణ్యాన్ని గుర్తించి 1755లో హైదర్ అలీని దిండిగల్ (తమిళనాడు) ఫౌజ్ దార్‌గా నియమించాడు. దిండిగల్ చుట్టు ప్రక్కల ఉన్న పాలెగార్లు మైసూర్ రాజ్యంపై తిరుగుబాట్లు ప్రారంభించారు. వారిని అదుపులో పెట్టే సామర్థ్యం హైదర్ అలీకి ఉందని నంజరాజ్ గుర్తించాడు. మైసూర్ రాజ్యంలో హైదర్ అలీ ఎదుగుదలకు ఇది ఇంకొక మెట్టు. సాధారణ సైనికుడి స్థాయి నుంచి ఫౌజ్ దార్‌గా ఎదిగిన హైదర్ అలీ మైసూర్ రాజ్యంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోసాగాడు. ఫ్రెంచ్ వారి సహాయంతో తన సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించుకున్నాడు. ఫిరంగి దళాన్ని బలోపేతం చేసుకున్నాడు.

## హైదర్ నవాబ్

తర్వాతి కాలంలో మైసూర్ రాజ్యంలో ఏర్పడిన పరిస్థితులు హైదర్ అలీకి క్రొత్త అవకాశాలను కల్పించాయి. మైసూరుకు కర్నాటక వారసత్వ యుద్ధంలో పాల్గొనడం ద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగింది. ఆశించినట్టు తిరుచునాపల్లి దక్కకపోగా యుద్ధ ఖర్చులు మైసూర్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసాయి. ఇంకొక ప్రక్క మైసూర్ రాజ్యాన్ని తమ సామంత రాజ్యంగా భావించే మరాఠాలు తమకు కట్టవలసిన కప్పం బకాయిలను చెల్లించ వలసిందిగా మైసూరు పై ఒత్తిడి చేయసాగారు. తరచూ మైసూర్ ఉత్తర ప్రాంతాలలో దాడులు చేసేవారు. ఖజానా ఖాళీ అయ్యి సైనికులకు వేతనాలు చెల్లించ లేని పరిస్థితి యేర్పడింది. తమకు చెల్లించవలసిన జీతపు బకాయిలను కోరుతూ సైన్యంలో తిరుగుబాటు ప్రారంభమయ్యింది. ఈ పరిస్థితులను ఆధారం చేసుకుని నంజరాజ్ అసమర్థ రాజుని తొలగించి తానే సింహాసనాన్ని ఆక్రమించే ఆలోచన చేశాడు. శ్రీరంగపట్టణంలో నెలకొన్న ఈ విపత్కర పరిస్థితులను రాణి లక్ష్మీ అమ్మణి దిండిగల్‌లో ఉన్న హైదర్ అలీకి తెలిపి సహాయాన్ని కోరింది. 1757లో దిండిగల్ నుండి శ్రీరంగపట్టణం చేరుకున్న హైదర్ అలీ తనకు ఎంతో ఆప్తుడైన నంజరాజ్‌నే కట్టడి చేసి. రాజుకు అండగా నిలిచాడు. సైన్యంలో తిరుగుబాటును అణచివేశాడు. సైనికుల జీతాలను కొంత చెల్లించి వారిని శాంతింప చేశాడు. మైసూర్ రాజ్యాన్ని కాపాడగలవాడు ఒక్క హైదర్ అలీనే అని అందరూ భావించారు. రాజుకు ప్రీతి పాత్రుడయ్యాడు.

శ్రీరంగపట్టణంలో జరుగుతున్న గందరగోళ పరిణామాలను గమనిస్తున్న మరాఠాలు ఇదే అదనుకొని 1758లో మైసూర్ పై దండయాత్ర చేశారు. నంజరాజ్

తన పదవినుండి రాజకీయాలనుండి స్వచ్ఛందంగా తొలగిపోవడంతో రాజు హైదర్ అలీని మైసూర్ సైన్యాధిపతిని చేశాడు. ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న హైదర్ అలీ మరాఠాలను ఓడించి మైసూర్‌రాజ్య రక్షకుడనిపించుకున్నాడు. రాజు హైదర్ అలీకి 'నవాబ్' బిరుదు ఇచ్చాడు. ఇప్పుడు అతడు 'నవాబ్ హైదర్ అలీ ఖాన్'. మైసూర్ రాజు రెండవ కృష్ణ రాజా ఒడయార్ హైదర్‌కు రాజ్య భారాన్ని అప్పగించి అతని చేతిలో కీలు బొమ్మగా మారాడు. తనకు ఎంతగానో సహాయం చేసి తన ఎదుగుదలకు కారణమైన నంజరాజ్‌నే వ్యూహాత్మకంగా తొలగించి తానే ఆ స్థానాన్ని ఆక్రమించడంలోనే హైదర్ రాజకీయ చతురత తెలుస్తుంది.

**అంతఃపుర కుట్రలు**

రాజుపై నంజరాజ్ ప్రభావాన్ని ఇష్టపడని రాణి లక్ష్మీ అమ్మణి నంజరాజ్‌ను తొలగించడానికి హైదర్ అలీని ప్రోత్సహించింది. రాజు హైదర్ అలీ చేతిలో కీలు బొమ్మగా మారడంతో రాణి హైదర్ అలీని తొలగించే ప్రయత్నం చేసింది. ఈ సారి ఆమె మరాఠాలతో కలిసి మైసూర్ రాజ్యంలో దీవాన్‌గా ఉన్న ఖండే రావు సహాయం తీసుకుంది. అప్పటికే హైదర్ అలీ చేతిలో రెండుసార్లు ఓడిపోయిన మరాఠాలు కూడా హైదర్ అలీ పతనం కోసం ఎదురు చూస్తున్నారు. 1760లో హైదర్ అలీపై హత్యాయత్నం జరిగింది. తృటిలో దాన్ని తప్పించుకున్న హైదర్, కుటుంబాన్ని శ్రీరంగపట్టణంలోనే వదిలి బెంగుళూరు పారిపోయాడు. ఖండేరావు హైదర్ అలీ కుటుంబాన్ని నిర్బంధించాడు. అప్పటికి టిపు వయసు 10 సంవత్సరాలు. హైదర్ అలీ బాల్యంలో సిరాలో అతనికి జరిగిన అనుభవమే తిరిగి అతని కుటుంబానికి ఎదురైంది.

1761లో జరిగిన మూడవ పానిపట్ యుద్ధం హైదర్‌కు కలిసివచ్చింది. ఈ యుద్ధంలో ఆఫ్ఘన్ రాజు చేతిలో ఘోరంగా ఓడిపోయిన మరాఠాలపై దాడిచేసి హైదర్ వారి ప్రాంతాలను కొన్నింటిని చేజిక్కించుకున్నాడు. తర్వాత నమ్మకస్తులైన కొందరు సహచరులతో సైన్యాన్ని సమకూర్చుకొని 1761లో శ్రీరంగపట్టణంపై దాడిచేసి ఖండే రావును ఓడించి బందిఖానాలో నిర్బంధించాడు. కొంత కాలం తర్వాత అతడు అక్కడే మరణించాడు. ఈసారి హైదర్ మైసూర్ రాజ్య అధికారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకున్నాడు. కానీ రాజును మాత్రం మైసూర్ సింహాసనం పైనే కూర్చో బెట్టాడు. 1766లో రెండవ కృష్ణరాజ ఒడయార్ మరణం తర్వాత కూడా హైదర్ ఒడయార్ వంశానికి చెందినవారినే సింహాసనంపై కూర్చో బెట్టేవాడు. తాను స్వయంగా ఎన్నడూ మైసూర్ సింహాసనంపై ఆసీనుడు కాలేదు. అతనిని 'హైదర్ నాయక్' 'హైదర్ నవాబ్' అని సంబోధించడం ద్వారా ప్రజలు మాత్రం హైదర్ అలీనే మైసూర్ రాజ్యాధిపతిగా గుర్తించారు.

## హైదర్ అలీ రాజ్య విస్తరణ

మైసూర్‌లో తన అధికారం సుస్థిరం కావడంతో హైదర్ మైసూర్ రాజ్య విస్తరణ ప్రారంభించాడు. ఉత్తరాన మరాఠాల వైపు, దక్షిణాన మలబార్ (కేరళ) వైపు, తూర్పున కర్నాటక (తమిళనాడు), హైదరాబాద్ నిజాంవైపు, పశ్చిమాన అరేబియా సముద్ర తీరంలోని మంగుళూర్ వంటి రేవు పట్టణాల వైపు మునుపు ఎన్నడూ లేని విధంగా మైసూర్ రాజ్య సరిహద్దులను విస్తరింపజేశాడు. కర్నాటక నవాబ్ తన రాజ్యంలో అధికారాన్ని ఆంగ్లేయులకు ధారాదత్తం చేసి పేరుకు మాత్రమే నవాబ్‌గా చలామణి అయ్యేవాడు. దక్షిణ భారత దేశంలో ఆంగ్లేయుల ప్రధాన కేంద్రమైన మద్రాస్ కర్నాటకలోని పట్టణమే. కర్నాటక వైపు విస్తరించే క్రమంలో ఆంగ్లేయులతో మొదటి ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1767-69) జరిగింది. రెండవ ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1780-84) జరుగుతుండగా 1782లో హైదర్ మరణించాడు (టిపు 1784లో యుద్ధాన్ని మైసూర్ విజయంతో ముగించాడు), ఉత్తరం వైపు విస్తరించే క్రమంలో మైసూర్ - మరాఠా యుద్ధం (1769-72) ప్రధానమైనది. మలబార్‌లో కాలికట్ జామోరిన్‌తో ఇతర చిన్న సంస్థానాధీశులతో, హైదరాబాద్ నిజాంతో ఎడతెరిపిలేని యుద్ధాలు చేశాడు.

## మలబార్ వైపు విస్తరణ

దక్షిణ భారతదేశానికి పశ్చిమాన ఉన్న అరేబియా సముద్ర తీరాన్ని మలబార్ అని, తూర్పున బంగాళా ఖాతం తీర ప్రాంతాన్ని కోరమండల్ (చోళ మండలం) అని పిలిచేవారు. మలబార్ ప్రస్తుత కేరళ రాష్ట్రంలో ఉంది. ఈ ప్రాంతం అనాదిగా విదేశాలతో సుగంధ ద్రవ్యాల వ్యాపారానికి ప్రసిద్ధి. ఒకప్పుడు అరబ్బుల చేతిలో ఉన్న ఈ వ్యాపారం 15వ శతాబ్దంలో వాస్కో డా గామా ఆగమనంతో పోర్చుగీసు వారి చేతిలోనికి, తర్వాత డచ్, ఫ్రెంచ్, ఆంగ్లేయుల చేతిలోనికి వెళ్లింది. 18వ శతాబ్దంలో ఈ వ్యాపారం పై అంగ్లేయుల ఆధిపత్యం నెలకొంది. తల్లెసేరిలో వారు పెద్ద వర్తక స్థావరాన్ని ఏర్పరచుకున్నారు. మలబార్ రేవు పట్టణాల ద్వారా సుగంధ ద్రవ్యాల ఎగుమతిని, ఆయుధాల దిగుమతిని నిరాఘాటంగా కొనసాగించేవారు.

రాజ్య అభివృద్ధికి వ్యాపార అభివృద్ధి అవసరం అని భావించే హైదర్ అలీ దృష్టి సహజంగానే మలబార్‌లోని రేవుపట్టణాలపై, వర్తక వ్యాపారాలపై పడింది. చిన్న చిన్న సంస్థానాలుగా విడిపోయి తరచూ పరస్పరం కలహించుకునే మలబార్ రాజకీయాలు కూడా హైదర్ అలీకి కలసి వచ్చాయి. ఈ చిన్న చిన్న రాజ్యాలలో కొంచెం పెద్ద రాజ్యం కాలికట్. సుగంధ ద్రవ్యాల వర్తకంతో ఐశ్వర్యవంతమైన రాజ్యం కూడా. ఇక్కడి రాజును

జామొరిన్ అంటారు. 1758లో జామొరిన్ పాలక్కాడ్ అనే చిన్న రాజ్యంపై దాడి చేశాడు. పాలక్కాడ్ పాలకుడు కొమ్ము అచ్చన్ హైదర్ అలీ సాయం కోరాడు. ఇటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్న హైదర్, (1758లో హైదర్ మైసూర్ రాజ్య సైన్యాధ్యక్షుడే,) పెద్ద సైన్యంతో కాలికట్ చేరుకుని జామొరిన్‌ను ఓడించాడు. జామొరిన్ నుండి ఎంతో బంగారాన్ని వసూలు చేసి, 12 లక్షల యుద్ధ నష్ట పరిహారాన్ని డిమాండ్ చేశాడు. జామొరిన్ ఆ సొమ్మును తర్వాత చెల్లించడానికి హైదర్‌తో ఒప్పందం చేసుకున్నాడు.

తర్వాత కన్ననూర్ (కన్నూర్), కొలతీరి, కొచ్చిన్ వంటి సంస్థానాలన్నీ తమ పరస్పర కలహాల్లో హైదర్ సహాయాన్ని కోరుతుండేవి. మైసూర్ సైన్యాలు తరచూ మలబార్‌లో యుద్ధాలు చేస్తుండేవి. కొన్ని రాజ్యాలు మైసూర్ ఆధీనంలోకి వచ్చాయి, కొన్ని మైసూర్‌కు సామంతులుగా కప్పం కట్టేవి. జామొరిన్ చెల్లిస్తానన్న 12 లక్షలు చెల్లించక పోవడంతో హైదర్ 1766లో కాలికట్ పై దాడి చేశాడు. ఓడిపోయిన జామొరిన్ తన కుటుంబాన్ని ట్రావెన్కూర్ రాజు ఆశ్రయానికి పంపించి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. కాలికట్ వంటి పెద్ద ఐశ్వర్యవంతమైన రాజ్యం హైదర్ ఆధీనంలోకి వచ్చింది.1766 నాటికి అంగ్లేయుల ఆధీనంలో ఉన్న తెల్లిసేరి, ట్రావెన్కూర్ రాజ్యం తప్ప మలబార్ ప్రాంతమంతా హైదర్ ఆధీనంలోనికి వచ్చింది.

## మొదటి ఆంగ్లో-మైసూర్ యుద్ధం (1767-69)

మైసూర్ రాజ్య విస్తరణలో భాగంగా హైదర్ తూర్పున తమిళనాడు వైపు తన దృష్టి సారించాడు. మైసూర్ రాజ్యం తమిళనాడులోని దిండిగల్, కోయంబత్తూర్ వరకే పరిమితమై ఉండేది. ఆ కాలంలో కర్నాటకగా పిలువబడే మిగతా తమిళ ప్రాంతంపై ఆర్కాట్‌ను రాజధానిగా కర్నాటక నవాబ్ పాలించేవాడు. ఇతనిని ఆర్కాట్ నవాబ్ అని కూడా పిలిచేవారు. ఈ కర్నాటక నవాబ్ ఆంగ్లేయుల మిత్రుడు. అధికారమంతా ఆంగ్లేయులకు అప్పగించి నామమాత్రపు నవాబ్‌గా మిగిలి పోయాడు. 1752లో జరిగిన కర్నాటక వారసత్వ యుద్ధంలో మైసూర్‌కు తిరుచనాపల్లి ఇస్తానని మోసం చేసిన కర్ణాటక నవాబ్ మహమ్మద్ అలీ పై హైదర్‌కు వ్యతిరేకత ఉండేది. అంతే కాకుండా మద్రాస్‌లో ఫోర్ట్ సెయింట్ జార్జ్ కోటలో తమ ముఖ్య స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని దక్షిణ భారత దేశాన్ని ఆక్రమించాలని ఆంగ్లేయులు చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలని కూడా హైదర్ వ్యూహం. ఆగష్టు, 1767లో కర్నాటక పై దాడి చేశాడు. ఇది ఆంగ్లేయుల పై దాడే. అందుకే చరిత్రకారులు దీనిని మొదట ఆంగ్లో–మైసూర్‌యుద్ధం అన్నారు. ఈ యుద్ధంలో మరాఠాలు, నిజాం హైదర్‌కు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు సాయం చెయ్యడానికి నిర్ణయించుకున్నారు. అలా చేయకుండా హైదర్ అలీ మొదట్లో వారిని నిలువరించ గలిగాడు. కానీ యుద్ధం రెండవ దశలో వారు ఆంగ్లేయులతో చేరారు.

హైదర్ అలీ ధైర్య సాహసాలకు యుద్ధ వ్యూహాలకు ఈ యుద్ధం ఒక మచ్చు తునక. 17 ఏళ్ల టిపు సుల్తాన్ ఈ యుద్ధంలో స్వయంగా సైన్యాలు నడిపి అనేక విజయాలు సాధించాడు. మద్రాసు నగరంపై దాడి చేసి ఆ నగరాన్ని అతలాకుతలం చేశాడు. ఆంగ్లేయులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. కర్నాటకలో హైదర్‌ను ఎదుర్కోలేని ఆంగ్లేయులు మలబార్‌లో మైసూర్ ప్రాంతాలపై బొంబాయి నుండి సైన్యాలను పంపించి దాడి చేశారు. మంగుళూరును ఆక్రమించారు. హైదర్ మెరుపు వేగంతో మలబార్ వచ్చి ఆంగ్లేయులను ఓడించి మంగుళూర్‌ను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. మంగుళూర్ కోటలో గాయపడిన 80 మంది యూరోపియన్ సైనికులను, 180 మంది భారతీయ సిపాయిలను వదిలి ఆంగ్లేయులు పారిపోయారు. హైదర్, టిపు వారికి వైద్యం చేయించారు. తర్వాత మైసూరు సైన్యాలు మళ్ళీ మద్రాసును ముట్టడించాయి.

## స్టాక్ మార్కెట్‌లో షేర్ల పతనం

**మద్రాస్ సంధి :** ఓటమిని అంగీకరించిన ఆంగ్లేయులు మార్చ్, 1769లో హైదర్‌తో సంధి చేసుకున్నారు. మైసూరు పై లేక ఆంగ్లేయులపై ఇతరులెవరైనా దాడి చేస్తే పరస్పరం సహకరించుకోవాలని, ఒక్క కరూర్ కోట తప్ప కర్నాటకలో హైదర్ ఆక్రమించుకున్న కోటలన్నింటిని ఆంగ్లేయులకు తిరిగి యిచ్చి వేయాలని ఈ సంధి షరతులు. ఈ యుద్ధంలో తూర్పు ఇండియా కంపెనీ పరాజయంతో, ఇంగ్లాండ్ స్టాక్ మార్కెట్‌లో ఆ కంపెనీ షేర్లు ఘోరంగా పతన మయ్యాయి.

ఈ యుద్ధంతో హైదర్ అలీ ఆంగ్లేయులకు సింహస్వప్నమయ్యాడు. ఆంగ్లేయులను యింకా అణచివేసే అవకాశమున్నా హైదర్ అలీ అలా చెయ్య లేదు. మద్రాసును పూర్తిగా ఆక్రమించుకునే అవకాశం వచ్చినా అలా చేయలేదు. మరాఠాలకు, హైదరాబాద్ నిజాంకు వ్యతిరేకంగా ఆంగ్లేయులను వాడుకోవడానికి హైదర్ వారిని పూర్తిగా అణచి వెయ్యలేదు. కానీ ఆంగ్లేయులు ఎటువంటి ఒప్పందాలకు, నీతి నియమాలకు కట్టుబడి రాజకీయాలు చేయరని హైదర్ అప్పుడు తెలుసుకోలేకపోయాడు, తర్వాత తెలుసుకున్నాడు.

**మైసూర్ పై మరాఠా దాడి- ఆంగ్లేయుల నమ్మక ద్రోహం:** మొదటి ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో ఆంగ్లేయులపై హైదర్ విజయాలను చూసిన మరాఠాలు కలత చెందారు. ఒడయారుల పాలనలో మైసూర్ మరాఠాల సామంత రాజ్యం, వారికి కప్పం చెల్లించేది. హైదర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మరాఠాలకు కప్పం కట్టడం నిలిపివేశాడు. అంతే కాకుండా మరాఠా మైసూర్ రాజ్యాల సరిహద్దుల్లో ఉన్న చిన్న చిన్న రాజ్యాలు తనకు కప్పం కట్టాలని వారిపై ఒత్తిడి తెచ్చాడు. నిరాకరించినవారిపై దాడులు చేశాడు. దీనితో హైదర్ అలిని కట్టడి చేయాలని మరాఠాలు, తమకు చెల్లించవలసిన కప్పం బకాయిలు

చెల్లించాలంటూ 1769లో మైసూర్ పై దాడి చేశారు. ఈ యుద్ధంలో మరాఠాలదే పై చెయ్యి అయ్యింది. మైసూర్‌కు ఉత్తరాన కృష్ణ– తుంగభద్ర నదుల మధ్య ఉన్న కోటలను మరాఠాలు ఆక్రమించారు. 1772లో మరాఠా సైన్యాలు శ్రీరంగపట్టణం వరకు వచ్చాయి. మరాఠా సైన్యాధికారి త్రయంబకరావు శ్రీరంగ పట్టణాన్ని ఐదు వారాలు దిగ్బంధనం చేశాడు. మద్రాస్ సంధి ననుసరించి ఆంగ్లేయులు హైదర్ కు సహాయం చెయ్యాలి. కానీ హైదర్ ఎన్నిసార్లు అడిగినా ఆంగ్లేయులు మరాఠాలతో యుద్ధం చెయ్యడానికి నిరాకరించారు. దీనితో హైదర్ మరాఠాలతో సంధి చేసుకొని 36 లక్షల పన్ను బకాయి చెల్లించి ప్రతి సంవత్సరం 14 లక్షల పన్ను కట్టడానికి అంగీకరించాడు.

## మరాఠాలపై హైదర్ విజయం

కానీ త్వరలోనే హైదర్ అలీ మరాఠాలపై తిరిగి విజయాలను పొంద గలిగాడు. 1772లో పేష్వా మాధవ రావు మరణంతో మరాఠాలలో ఏర్పడిన వారసత్వ సంక్షోభాన్ని ఆసరా చేసుకొని హైదర్ అలి మరాఠా ప్రాంతాలపై దాడి చేసి 1776 కల్లా ధార్వార్ వరకు పోగొట్టుకున్న కోటలన్నింటిని తిరిగి స్వాధీనపరుచుకున్నాడు. ఓడి గెలవడం, గెలిచి ఓడడం తరచూ హైదర్ జీవితంలో జరిగింది,ఆ పరిస్థితులను హైదర్ స్థిత ప్రజ్ఞతతో ఎదుర్కొన్నాడు.

## రెండవ ఆంగ్లో- మైసూర్ యుద్ధం (1780-84) - హైదర్ మరణం-1782

ఈ యుద్ధంపై అమెరికాలో 1776 లో ప్రారంభమైన అమెరికా స్వాతంత్ర్య యుద్ధ ప్రభావం ఉంది. అమెరికాలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్న అమెరికన్లకు ఫ్రెంచ్ వారు సహాయం చేస్తుండడంతో ఐరోపాలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్ మధ్య యుద్ధం ప్రారంభమయ్యింది. ఆ ప్రభావం భారతదేశంలో కూడా ప్రతిబింబించింది. యిక్కడ ఆంగ్లేయులు 1778, 79 లలో ఫ్రెంచ్ స్థావరాలైన పాండి చెరి, మహేలపై దాడి చేసి వాటిని ఆక్రమించారు. మహే మలబారు తీరంలో హైదర్ అలి రాజ్యంలో ఉంది. హైదర్ ఆంగ్లేయులను ఈ ఆక్రమణలకు వ్యతిరేకంగా హెచ్చరించాడు, కానీ వారు లెక్క చేయలేదు. తన మిత్రులైన ఫ్రెంచ్ వారి కొరకు, అంతేకాకుండా మద్రాస్ సంధి ననుసరించి మరాఠా దాడి సమయంలో తనకు సహాయం చెయ్యని ఆంగ్లేయులపై హైదర్ 1780 లో రెండవసారి దాడి చేశాడు.

మద్రాస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించాడు. తూర్పున బంగాళా ఖాతం తీర ప్రాంతంలో ఉన్న పోర్టొ నోవొ (ప్రస్తుత తమిళనాడులోని పరంగి పట్టణం) రేవు పట్టణాన్ని ఆక్రమించాడు. కర్నాటక రాజధాని ఆర్కాట్‌ని ముట్టడించాడు. ఆర్కాట్ ముట్టడిని నిలువరించడానికి ఆంగ్లేయులు కంజీవరంను ముట్టడించారు.

**పొల్లిలూర్ యుద్ధం–ఆంగ్లేయుల ఘోర పరాజయం:–** కంజీవరంలోని ఆంగ్ల సైన్యాలకు సహాయంగా గుంటూరు (ఆంధ్ర) నుండి కల్నల్ విలియం బైలి 3800 మంది అదనపు బలగాలతో కంజీవరం బయలు దేరాడు. టిపు ఆధ్వర్యంలో మైసూర్ సైన్యాలు కంజీవరానికి 9 మైళ్ళ దూరంలో పొల్లిలూర్ అనే ప్రదేశం వద్ద కల్నల్ బైలి సైన్యాలను సెప్టెంబర్ 10, 1780న అడ్డుకున్నారు. మైసూర్ సైన్యాల రాకెట్ దాడిలో ఆంగ్ల సైన్యాలు ఘోరంగా ఓడిపోయాయి. వేల సంఖ్యలో తూర్పు ఇండియా కంపెనీ సైనికులు మరణించారు. కల్నల్ బైలితో సహా మిగిలిన కొద్ది మంది తూర్పు ఇండియా కంపెనీ సైనికులు టిపుకు బందీలుగా పట్టుబడ్డారు. నవంబర్, 1780లో హైదర్ నిరాఘాటంగా ఆర్కాట్‌ను ఆక్రమించాడు.

**సర్ ఐర్ కూట్ :–** దక్షిణ భారతదేశంలో ఆంగ్లేయుల వరస అపజయాలకు కలత చెందిన కలకత్తాలోని తూర్పు ఇండియా కంపెనీ గవర్నర్ లార్డ్ హేస్టింగ్స్, బెంగాల్ యుద్ధాల్లో ఆంగ్లేయుల విజయాలకు కారణమైన ఉద్ధండ ఆంగ్ల సేనాపతి సర్ ఐర్ కూట్‌ను మద్రాస్ పంపించాడు. ఐర్ కూట్ ఆగమనంతో హైదర్ చాలా ఓటములను ఎదుర్కొన్నాడు. కూట్ హైదర్‌ను తరుముతూ వచ్చాడు. కూట్‌ను తప్పించుకుంటూ హైదర్ ప్రత్యక్ష యుద్ధం చేయకుండా తన అశ్విక దళంతో కర్నాటకలో పల్లెల్లో పట్టణాల్లో విధ్వంసం సృష్టించాడు. ఇలా తంజావూర్లో మైసూర్ సైన్యాలు తీవ్రమైన విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ విధ్వంసం నుండి తేరుకోవడానికి తంజావూర్ కు కొన్ని దశాబ్దాలు పట్టింది. పోర్టొ నోవా కొరకు హైదర్ అలి, ఐర్ కూట్‌ల మధ్య జరిగిన భీకర యుద్ధంలో హైదర్ అలి 10,000 సైన్యాన్ని పోగొట్టుకొని పరాజయం పాలయ్యాడు. దీనికి సంబంధించి పరంగి పట్టణంలో ఒక శిలాఫలకం ఇప్పటికీ ఉంది.

ఈ నిరాశాజనక పరిస్థితిలో మైసూర్‌కు ఊరట కలిగిస్తూ రెండు సంఘటనలు జరిగాయి.

**కల్నల్ బ్రైత్ వైట్ ఓటమి :–** ఫిబ్రవరి 18, 1782లో తంజావూర్ దగ్గర అన్నగుడి అనే ప్రదేశంలో టిపు కల్నల్ బ్రైత్ వైట్ ఆధ్వర్యంలో ఉన్న 1500 మంది తూర్పు ఇండియా కంపెనీ సైన్యాలను చుట్టుముట్టి ఫిరంగులతో, రాకెట్లతో దాడి చేశాడు. ఆ దాడి ఉధృతిని తట్టుకోలేని బ్రైత్ వైట్ తన సైన్యంతో సహా టిపుకు లొంగిపోయాడు. ఇది పొల్లిలూర్ అంత ఘన విజయం కాకపోయినా లండన్ పత్రికలు టిపును ప్రతిభావంతుడైన ఒక యుద్ధ నిపుణునిగ ప్రశంసించాయి.

**ఫ్రెంచ్ అడ్మిరల్ సుఫ్రీన్ – ఆంగ్ల యుద్ధ ఖైదీలు:–** మలబార్ తీరంలో ఫ్రెంచ్ వారికి ఆంగ్లేయులకు జరుగుతున్న నౌకా యుద్ధంలో ఫ్రెంచ్ అడ్మిరల్ సుఫ్రీన్ 1782లో అనేక బ్రిటిష్ యుద్ధ నౌకలను, వాటిలోని బ్రిటిష్ నావికులను ఖైదీలుగా పట్టుకున్నాడు. ఆ ఖైదీలను పోషించడం భారమనుకున్న సుఫ్రీన్ వారిని మద్రాస్‌లోని ఆంగ్ల ప్రభుత్వానికి

అప్పుచెప్పడానికి నిర్ణయించుకుని వారిని సంప్రదించాడు. కానీ మద్రాస్‌లోని ఆంగ్ల గవర్నర్ కూడా ఆ బ్రిటిష్ ఖైదీలను వెనక్కి తీసుకోవడానికి సుముఖత చూపించ లేదు. దీనితో సుఫ్రీన్ ఆ ఆంగ్ల ఖైదీలను ఫ్రెంచ్ మిత్ర రాజ్యమైన మైసూర్‌కు అప్పగించాడు. హైదర్ ఆ ఆంగ్ల ఖైదీలను సంతోషంగా స్వీకరించి శ్రీరంగపట్టణంలో నిర్బంధించాడు. ఈ పరిణామాన్ని ఊహించని మద్రాస్‌లోని ఆంగ్ల అధికారులు ఖంగు తిన్నారు. భారత దేశంలో తూర్పు ఇండియా కంపెనీ అధికారులపై వారి పాలనపై ఇంటా బయటా విమర్శలు వెల్లువెత్తాయి. ఇంగ్లండ్‌లోని పత్రికలు వీరిని లంచగొండులని, తమ స్వంత దేశీయులైన ఆంగ్ల ఖైదీల విషయాలలో బేరాలాడిన అవినీతి నబోబ్స్ (నవాబ్) అని దుయ్య బట్టాయి. ఈ మొత్తం సుఫ్రీన్ ఉదంతం యుద్ధ సమయంలో ఆంగ్లేయులను కించపరిచి, ఇబ్బంది పెట్టడానికి హైదర్‌కు ఎంతగానో ఉపయోగపడింది.

సర్ ఐర్ కూట్ ఎంత ప్రయత్నించినప్పటికీ కర్నాటకలో హైదర్ పై పూర్తి విజయాన్ని సాధించలేకపోయాడు. జయాపజయాలు ఇద్దరి మధ్య దాగుడుమూతలాడుతుండేవి. విసిగి పోయిన ఐర్ కూట్, హైదర్ లాంటి వాడితో యుద్ధానికి ఎందుకు దిగారని మద్రాస్ గవర్నర్‌ను మందలించాడు.

**మలబార్‌లో యుద్ధం:-** కర్నాటక నుండి హైదర్ దృష్టిని మళ్లించడానికి బొంబాయిలోని ఆంగ్ల సైన్యాలు పశ్చిమాన ఉన్న మలబార్ పై 1780 నుండి దాడులు చేస్తున్నాయి. మలబార్ నాయర్లను, స్థానిక కేరళ సంస్థానాధీశులను మైసూర్‌కు వ్యతిరేకంగా తిరుగుబాట్లకు ప్రోత్సహించారు. తిరుగుబాటుదార్లకు తెల్లిసేరిలోని తమ స్థావరంలో ఆశ్రయమిచ్చేవారు. మైసూర్‌తో యుద్ధాల్లో ఆంగ్లేయులు ఈ కిటుకును ప్రయోగించేవారు. హైదర్ అలి, తర్వాత టిపు అటు తూర్పు ఇటు పశ్చిమం వైపు ఒకేసారి యుద్ధాన్ని ఎదుర్కోవలసి వచ్చేది. ఆంగ్లేయులకు తూర్పున మద్రాస్, పశ్చిమాన బొంబాయి నుండి సరఫరాలు అందేవి.

1780 నుండి మలబార్‌లో ఆంగ్లేయులకు మైసూర్ సైన్యాలకు హోరాహోరీగా రెండు సంవత్సరాలు జరిగిన యుద్ధంలో ఫిబ్రవరి, 1782 న మైసూరు ఓడిపోయింది. ఓడిపోయిన మైసూరు సేనాధిపతి సర్దార్ ఖాన్ 1200 మంది మైసూరు సైనికులతో ఆంగ్లేయులకు లొంగిపోవలసి వచ్చింది. అవమానంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్క పాలక్కాడ్ మినహా మలబార్ అంతా ఆంగ్లేయుల ఆధీనంలోనికి వచ్చింది. కర్నాటకలో వ్యస్థుడై ఉన్న హైదర్, మఖ్దూం అలీ అనే సైనికాధికారిని మలబార్ పంపించాడు. ఏప్రిల్ 1782లో ఇతను కూడా ఆంగ్లేయులతో జరిగిన యుద్ధంలో మరణించాడు. తప్పనిసరి పరిస్థితుల్లో హైదర్ నవంబర్, 1782లో టిపు ను మలబార్ పంపించాడు. టిపు నవంబర్ 16, 1782 న మలబార్ చేరుకున్నాడు. టిపు మలబార్‌లో ఆంగ్లేయులతో యుద్ధం చేస్తూ మలబార్ ను తిరిగి స్వాధీన పరచుకుంటుండగా డిసెంబర్ 7, 1782 న హైదర్ అలి

వీపు మీద పుండు (కాన్సర్)తో చిత్తూర్ (ఆంధ్ర) కు కొద్ది దూరంలో నరసింగరాయని పేటలో ఉన్న యుద్ధ శిబిరంలో మరణించాడు.

ఒక సామాన్య సైనికుడి స్థాయి నుండి మైసూరు సంస్థానానికి నవాబ్ అవ్వడమే కాకుండా, ముందు ఎన్నడూ లేని విధంగా హైదర్ మైసూర్ రాజ్యాన్ని విస్తరించాడు. ఒడయారుల కాలంలో ఒక చిన్న సంస్థానంగా ఉన్న మైసూర్‌ను హైదర్ ఉత్తరాన కృష్ణా నది వరకు అంటే మరాఠా రాజ్య సరిహద్దుల వరకు, దక్షిణాన కేరళలో ట్రావెన్కూర్ రాజ్య సరిహద్దుల వరకు, తూర్పున తమిళనాడులోని తిరునల్వేలి వరకు, పశ్చిమాన అరేబియా సముద్రం వరకు ఒక పెద్ద రాజ్యంగా విస్తరించాడు. ఒడయారు రాజులు ఎంత ప్రయత్నించినా సముద్రం వరకు విస్తరించలేకపోయారు. హైదర్ మలబార్ ఆక్రమణ ద్వారా మంగుళూర్ వంటి నౌకా స్థావరాలను మైసూరు ఆధీనంలోనికి తెచ్చాడు. మొదటిసారి మైసూర్‌కు నౌకా దళాన్ని ఏర్పాటు చేశాడు. మలబార్‌లోని సుగంధ ద్రవ్యాలు, కలప, మైసూరు గంధపు చెక్కలతో విదేశీ వ్యాపారం చేశాడు. మస్కట్, టర్కివంటి దేశాలతో వ్యాపారం చెయ్యడమే కాకుండా రాయబారులను పంపి వారితో దౌత్య సంబంధాలు నెలకొల్పాడు.

హైదర్ సైనిక వ్యూహాలు అమోఘమైనవని ఆంగ్లేయులే అంగీకరించారు. సర్ ఐర్ కూట్ వంటి నిష్ణాతుడైన ఆంగ్ల సేనాని హైదర్ యుద్ధ వ్యూహాలను అంచనా వెయ్యలేకపోయాడు. ఓడినప్పుడు వెనక్కి తగ్గి, అదను చూసి తిరిగి వేటు వెయ్యడం హైదర్ యుద్ధ నీతి. హైదర్ మరణ వార్త విన్న సర్ ఐర్ కూట్ ఇక భారత దేశంలో ఆంగ్ల సైన్యానికి ఎదురు ఉండదని వ్యాఖ్యానించాడంటే హైదర్ యుద్ధ కుశలతను మనం తెలుసుకోవచ్చు. హైదర్ మరణించే సమయానికి ఆధునీకరించిన 88 వేలమంది సైన్యంతో, 1200 మండి రాకెట్ ప్రయోగ నిపుణులతో, మైసూరు దక్షిణ భారత దేశంలోని సంస్థానాలలో ప్రథమ స్థానంలో ఉండేది.

హైదర్ నిరక్షరాస్యుడు. చదవడం, వ్రాయడం తెలియదు. కానీ క్రొత్త విషయాలను తెలుసుకోవడానికి, నేర్చుకోవడానికి ఎంతో ఉత్సాహాన్ని కనపరిచేవాడు. ఫ్రెంచ్ వారి సాయంతో తన సైన్యాన్ని ఆధునీకరించుకున్నాడు, ఆంగ్లేయులను చూసి వర్తక వ్యాపారాలలో ముఖ్యంగా విదేశీ వర్తకంలో మెళుకువలు తెలుసుకున్నాడు. ఆంగ్లేయుల అస్థిత్వం ఈ దేశానికి ఎంత ప్రమాదకరమో గ్రహించాడు. తండ్రిని ఎంతో ప్రేమించి, గౌరవించి అతని యుద్ధ కుశలతను పరిపాలన దక్షతను అనుసరించి, తండ్రికంటే ఎంతో విద్యావంతుడైనప్పటికీ టిపు తన తండ్రి అంత సఫలతను పొందలేదు. హైదర్ 20 సంవత్సరాలు కృషి చేసి సంపాదించిన రాజ్యాన్ని, చివరకు తన జీవితాన్ని టిపు 17 సంవత్సరాలలో పోగొట్టుకున్నాడు. అందుకుగల కారణాలను తెలుసుకుందాం.

## అధ్యాయం - 3

# టిపు సుల్తాన్ - జననం - బాల్యం - పట్టాభిషేకం

హైదర్ అలి 1749లో మరాఠాల మీద విజయం సాధించి, నంజరాజ్ ప్రశంసలు పొంది, 200 కాల్బలానికి, 50 అశ్విక దళానికి అధిపతి అయి ఎదుగుతున్న రోజులలో 1750, నవంబరు 20వ తేదీన, హైదర్ రెండవ భార్య ఫాతిమా ఫక్రున్నీసాకు వారిపెద్ద కుమారుడైన టిపు జన్మించాడు. హైదర్ మరాఠాల నుంచి జయించిన దేవనహళ్ళి కోటలోనే టిపు జన్మించాడు. దేవనహళ్ళి బెంగుళూరు పట్టణానికి 33 కిలోమీటర్ల దూరంలో ఉంది.

టిపు తల్లి ఫాతిమా ఫక్రున్నిసా కడప నవాబు కొలువులో కడప కోటకు అధిపతిగా ఉన్న మీర్ మొయినుద్దీన్ కుమార్తె. తమిళనాడులోని ఆర్కాట్ పట్టణంలో ఉన్న టిపు మస్తాన్ అవులియా దర్గాకు చెందిన సూఫీగురువు  టిపు పేరు మీద టిపు సుల్తాన్ అని, హైదర్ అలీ తండ్రి ఫతే మొహమ్మద్, తాత మొహమ్మద్ అలీ పేర్లను కలిపి టిపు సుల్తాన్ ఫతే అలి అని హైదర్ దంపతులు తమ కుమారునికి నామకరణం చేసారు. అరేబియాలోని టిపు పూర్వీకులలో ఒకరు మక్కా నగరాధిపతిగా పని చేసాడనీ అతని పేరు సయ్యద్ వాల్ షరీఫ్ వాసన్‌బిక్ యాహ్యా అని, అతని పేరును కూడా తగిలించి టిపుకు సయ్యద్ వాల్ షరీఫ్ ఫతే అలీఖాన్ టిపు అనేపేరు ఉందని కొంత సమాచారం ఉంది. కాని చరిత్రలో టిపు సుల్తాన్ పేరే ఎక్కువగా వాడబడింది. సుల్తాన్ అనేది బిరుదు కాదు. అది పేరులో భాగమే. ఆంగ్లేయులు తమ రికార్డుల్లో టిప్పు సాహెబ్ (Tippoo Saheb) అని పేర్కొన్నారు. ఆంగ్లేయులు 'టిప్పు' అని ఉచ్ఛరించేవారు. అసలు పేరు మాత్రం 'టిపు'.

నిరక్షరాస్యుడైన హైదర్ అలీ తన కుమారునికి ఒక రాజకుమారునికి అవసరమయ్యే విద్యలను నేర్పించడంలో శ్రద్ధ వహించి కృతకృత్యుడయ్యాడు. తర్వాత మైసూరు పాలకుడిగా వివిధ విషయాలలో, భాషలలో టిపు ప్రదర్శించిన పరిజ్ఞానం ఇందుకు నిదర్శనం. టిపుకు ఉర్దూ, ఫార్సీ, కన్నడ, అరబిక్, మరాఠీ భాషలను బోధించడానికి హైదర్ ఆయా భాషల పండితులను నియమించాడు. ఖురాన్, ఇస్లామ్ న్యాయ శాస్త్రాలు బోధించడానికి ముస్లిం పండితులను నియమించాడు. నిష్ణాతులైన సైనికాధికారులు ఘాజీఖాన్, మొహమ్మద్ బిన్ అలీ అల్ ఖుబాయదాన్‌లను టిపు సైనిక శిక్షణకు నియమించాడు. వీరి పర్యవేక్షణలో టిపు అత్యుత్తమమైన సైనిక శిక్షణ పొందాడు. తర్వాతి కాలంలో ఆంగ్లేయులే యుద్ధరంగంలో టిపు నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. కొందరు ప్రశంసించారు కూడా.

టిపు వయసులో ఎదుగుతూ ఉంటే హైదర్ తన రాజకీయ జీవితంలో ఎదగసాగాడు. 1755లో టిపుకు అయిదు సంవత్సరాల వయసులో హైదర్ అలీ దిండిగల్ ఫౌజ్‌దార్‌గా పదోన్నతి పొందాడు. 1760లో ఖాండేరావ్ హైదర్ కుటుంబాన్ని బంధించినప్పుడు టిపు వయసు పది సంవత్సరాలు. బాలుడైన టిపుకు ఆ అనుభవం రాజకీయాల పట్ల కొంత అవగాహనను కల్పించింది. 1761లో హైదర్ అలీ మైసూరు రాజ్యాధికారాన్ని తన చేతిలోకి తీసుకున్నప్పుడు పదకొండేళ్ల టిపు మైసూరు భవిష్యత్ పాలకుడిగా రాజకుమారుడి స్థానం పొందాడు.

## బాలసైనికుడు

1766లో తన పదిహేనవ ఏట టిపు మొదటి సారి తన తండ్రితో మలబారు యుద్ధాల్లో పాల్గొని తన సుదీర్ఘ సైనిక జీవితాన్ని ప్రారంభించాడు. మలబారు ప్రాంత అడవుల్లో బాలమ్ అనే చిన్న సంస్థానం ఉంది. ఆ సంస్థానాన్ని హైదర్ జయించినప్పటికీ అక్కడి పాలెగార్ హైదర్‌కు లొంగిపోవడానికి ఇష్టపడక, తనసైన్యం, కుటుంబంతో అడవిలో స్థావరం ఏర్పరచుకున్నాడు. పదిహేనేళ్ళ టిపు కొంత సైన్యంతో అడవిలో ఆ స్థావరాన్ని వెదికి పట్టుకుని ఆ పాలెగార్‌పై దాడి చేసాడు. పాలెగార్ ఎదిరించినప్పటికీ టిపు అతని సైన్యంలో చాలా మందిని చంపి, మిగతావారిని బందీలుగా పట్టుకున్నాడు. ఓడిపోయిన పాలెగార్ హైదర్‌కు సామంతుడిగా ఉండటానికి అంగీకరించాడు. అతనే కాదు, చుట్టు ప్రక్కల ఉన్న చిన్నచిన్న పాలెగార్లందరూ హైదర్ ఆధిపత్యాన్ని అంగీకరించారు. తన కుమారుడి సాహసానికి ముగ్ధుడైన హైదర్ టిపును మాలవల్లి, కొన్ననూరు, ధర్మపురి, పెన్నాగరం, టెంకరాయ్, కొట్టం ప్రాంతాలకు జాగీర్దార్‌ను చెయ్యడమే కాకుండా 500 అశ్విక దళానికి అధిపతిని చేసాడు. తన వారసుడిగా, మైసూర్‌రాజ్య భవిష్యత్ పాలకుడిగా టిపుపై హైదర్‌కు నిశ్చింత ఏర్పడింది.

## మొదటి ఆంగ్లో మైసూరు యుద్ధం - టిపు సుల్తాన్

మొదటి ఆంగ్లో మైసూరు యుద్ధంలో మరాఠాలు, హైదరాబాద్ నిజాము ఆంగ్లేయులను సమర్థించడానికి నిశ్చయించుకున్నారు. హైదర్ మరాఠాలను ఆ ప్రయత్నం నుండి విరమింప చేయగలిగాడు, కాని హైదరాబాద్ నిజామ్ అలీఖాన్ ఆంగ్లేయులకు సహాయం చెయ్యడానికి నిర్ణయించుకున్నాడు. నిజామ్ అలీఖాన్ ఆంగ్లేయులకు సహాయం చెయ్యకుండా ఒప్పించడానికి పదిహేడేళ్ళ టిపు ఆధ్వర్యంలో మహఫూజ్‌ఖాన్, మీర్ రజా అలీఖాన్ లతో కలిసిన ఒక దౌత్య బృందం 1767లో హైదరాబాద్ నిజామ్‌ను కలిసింది. అప్పుడు నిజామ్ బెంగుళూరుకు 31 కిలో మీటర్ల దూరంలో ఉన్న చెన్న పట్నంలో సైనిక స్థావరాన్ని ఏర్పరచుకుని ఉన్నాడు. టిపు నిజామ్‌కు బహుమానంగా అయిదు ఏనుగులను,

పది అందమైన గుర్రాలను, బంగారు ఆభరణాలను బహుమతిగా ఇచ్చాడు. టిపు జరిపిన చర్చలతో సంతుష్టుడైన హైదరాబాద్ నిజామ్ ఆంగ్లేయులకు సహాయం చెయ్యనని టిపుకు వాగ్దానం చేసాడు. బాలుడైన టిపు చాతుర్యాన్ని చూసి ముగ్ధుడైన నిజామ్ టిపుకు దుస్తులు, ఆభరణాలు బహుమానంగా ఇచ్చాడు. పదిహేడేళ్ళ వయసులోనే టిపు దౌత్యం నెరపడంలో ఎంతో తెలివిని ప్రదర్శించాడు.

నిజామ్ వద్ద నుండి తిరిగి వచ్చిన తర్వాత తన సైనిక గురువు ఘాజీఖాన్ పర్యవేక్షణలో మొదటి సారి సైనికాధికారిగా ఆంగ్లేయుల స్థావరం మద్రాసుపై దాడి చేసాడు. మద్రాసు చుట్టు ప్రక్కల ప్రాంతాలను దోచుకున్నాడు. టిపు ఇక్కడ మొదటిసారి యూరోపియన్ల జీవన విధానాన్ని వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకున్నాడు. అది టిపును జీవితాంతం ప్రభావితం చేసింది. ఇక్కడ ఒక ఫ్రెంచ్ వర్తకుని ఇంట్లో టిపు మొదటి సారి సూక్ష్మదర్శినిని (మైక్రోస్కోపు) చూడడం జరిగింది. తన పాలనలో యుద్ధాలలోనే కాక, అనేక పరిపాలన విషయాలలో కూడా టిపు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసాడు.

టిపు ఈ సమయంలో మద్రాసును ఆంగ్లేయుల వద్దనుండి ఆక్రమించుకునేవాడే, కాని తిరువన్నామలై యుద్ధంలో ఆంగ్లేయుల చేతిలో ఓడిపోయిన హైదర్ టిపు సహాయం కొరకు కబురు పంపించడంతో టిపు మద్రాసు ముట్టడిని మధ్యలోనే వదలి తిరువన్నామలై వెళ్ళాడు.

టిపు తిరువన్నామలై చేరకుండా ఆంగ్లేయ సైనికాధికారులు మేజర్ ఫిట్జ్‌గెరాల్డ్, కల్నల్ టాడ్ మధ్యలోనే ఆపే ప్రయత్నం చేసారు. కాని టిపు వారిని తప్పించుకొని వన్నియంబడి సైనిక స్థావరంలో ఉన్న హైదర్‌ను కలుసుకున్నాడు. తండ్రి కొడుకులిద్దరూ కలిసి తిరుప్పత్తూరు, వన్నీయంబడి కోటలను పట్టుకున్నారు. అంబూరు కోటపై దాడి చేసారు. అంబూరు కోట రక్షకుడిగా ఉన్న కెప్టెన్ కాల్వర్ట్ తీవ్రంగా ప్రతిఘటించాడు. అంతేకాకుండా కాల్వర్ట్‌కు సహాయంగా కల్నల్ స్మిత్ ఆధ్వర్యంలో ఆంగ్లేయ సైన్యాలు రావడంతో టిపు, హైదర్ వెనక్కు తగ్గవలసి వచ్చింది. ఈ యుద్ధంలో టిపు మైసూరు అశ్విక దళానికి ఆధిపత్యం వహించాడు. ఓటమిని గ్రహించిన టిపు మైసూరు సైన్యాన్ని కావేరి పట్టణానికి మళ్ళించాడు.

కర్నాటకలో అపజయాల్ని పొందుతున్న ఆంగ్లేయులు మైసూరు ఆధిపత్యంలో ఉన్న మలబారుపై యుద్ధం ప్రకటించి, మలబారువైపు హైదర్ దృష్టి మళ్ళించే ప్రయత్నం చేసారు. డిసెంబరు 14, 1767న హైదర్ టిపును మలబారుకు పంపించాడు. టిపు బెద్నూరు చేరుకునేటప్పటికే ఆంగ్ల సైనికాధికారులు మేజర్ గ్రావిక్, కెప్టెన్ వాట్సన్ ఆధ్వర్యంలో ఆంగ్ల సైన్యం మార్చ్ 1, 1768న మంగుళూరు కోటను ఆక్రమించినట్టు

టిపుకు సమాచారం అందింది. మార్చ్ 7, 1768న టిపు 1000 మంది అశ్విక దళం, 3000 కాల్బలంతో మంగుళూరు చేరుకున్నాడు. రెండు నెలల పోరాటం తర్వాత టిపు మంగుళూరు పట్టణాన్ని స్వాధీనం చేసుకోగలిగాడు. కాని, మంగుళూరు కోట ఆంగ్లేయుల ఆధీనంలోనే ఉంది. టిపు ఎన్ని ప్రయత్నాలు చేసినా దానిని స్వాధీన పరుచుకోలేక పోయాడు. కాని కోటలో ఆహార పదార్థాలు, నీళ్ళు, మందులు అయిపోతుండడంతో ఆంగ్లేయులు కోటలో ఎక్కువ కాలం ఉండలేని పరిస్థితి వచ్చింది. అదే సమయంలో హైదర్ అదనపు సైన్యాలతో మంగుళూరు వస్తున్నాడనే వార్త వారిని భయభ్రాంతుల్ని చేసింది. దీనితో ఆంగ్ల సైనికాధికారులు గాయపడి అనారోగ్యంతో ఉన్న 80 మంది ఆంగ్ల, 180 మంది భారతీయ సైనికులను, మందు గుండు సామగ్రి, తుపాకులను వదిలి మంగుళూరు కోట నుండి రహస్యంగా వెళ్ళిపోయారు. టిపు మంగుళూరు కోటను తిరిగి స్వాధీన పరచుకున్నాడు. తర్వాత టిపు హైదర్ కలిసి ఆంగ్లేయులను ఓడించి మలబారులో వారు ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీనపరుచుకున్నారు. మార్చ్,1769లో మైసూరుకు ఆంగ్లేయులకు మధ్య సంధి కుదరడంతో మొదటి ఆంగ్లో మైసూరు యుద్ధం ముగిసింది. ఈ యుద్ధంలో టిపు పాత్ర చాలా ముఖ్యమైనది. ఈ యుద్ధం ప్రారంభించేటప్పటికి 1767లో టిపు వయసు పదిహేడు సంవత్సరాలు. 1769లో యుద్ధం ముగిసే సమయానికి టిపు వయసు పందొమ్మిది సంవత్సరాలు అంటే టిపు ఇంకా కౌమారదశ (టీనేజ్) లోనే ఉన్నాడు.

## మరాఠా మైసూరు యుద్ధం - టిపు సుల్తాన్

నవంబరు, 1769లో మరాఠాలు మైసూరుపై దాడి చేసారు. ఈ యుద్ధంలో మైసూరు సైన్యాలు చాలా అపజయాలను పొందాయి. మైసూరు ఉత్తర సరిహద్దు పట్టణమైన బెద్నూరులో యుద్ధం ప్రారంభమయ్యింది. అక్కడి మైసూరు సైన్యాలను తరుముతూ మరాఠా సైన్యాలు మైసూరు రాజధాని శ్రీరంగపట్టణం వరకూ వచ్చాయి. మధ్యలో ఉన్న కోటలు, పట్టణాలు, పల్లెలను మరాఠాలు స్వాధీనం చేసుకున్నారు. మైసూరు సైన్యాలు మరాఠాల సరఫరాలను దొంగ దెబ్బతో నాశనం చెయ్యడం, మరాఠాలకు ఆహారం, ఇతర అవసరాలు అందకుండా పల్లెలను నాశనం చెయ్యడం వంటివి తప్ప మరాఠా సైన్యాలకు ఎదురొడ్డి గెలవలేక పోయాయి. 1771లో మరాఠాలతో యుద్ధం కొనసాగుతున్న రోజులలో ఒక రోజు మైసూరు సైన్యం కదులుతూ ఉంటే టిపు, సైన్యం వెనుకభాగాన ఉన్నాడు. హైదర్ ముందు భాగాన ఉన్నాడు. టిపును ముందుకు రమ్మని హైదర్ ఎన్నో సార్లు కబురు పంపించాడు. కాని గందరగోళం నెలకొని ఉండడంతో టిపుకు ఆ కబురు అందలేదు. దీనితో కోపగించి మద్యం మత్తులో ఉన్న హైదర్ ఇరవయిఒక్క సంవత్సరాల టిపును నిర్దాక్షిణ్యంగా కొట్టాడని, కోపంతో టిపు తన తలపాగాను విసిరికొట్టి కత్తిని క్రిందపడేసి

వెళ్ళిపోయాడని బ్రిటిష్ చరిత్ర కారుడు మార్క్ విల్క్స్ తన హిస్టారికల్ స్కెచెస్ ఆఫ్ సౌత్ ఇండియాలో పేర్కొన్నాడు.

మరాఠాల చేతుల్లో అపజయాలు పొందుతూ మైసూరు సైన్యం శ్రీరంగపట్టణం చేరుకుంది. తన తప్పు తెలుసుకున్న హైదర్ తన కొడుకు టిపు క్షేమం కోసం శ్రీరంగ పట్టణంలోని ఖాదర్‌వలీ దర్గాలో ప్రార్థించాడని విల్క్స్ వ్రాసాడు. అప్పుడు నెలకొని ఉన్న మరాఠా దాడుల గందరగోళంలో హైదర్ సైన్యాధిపతులు ఎందరో మరణించడం జరిగింది. ఇది హైదర్‌ను ఇంకా తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. కాని టిపు ఒక సన్యాసి వేషంలో మరాఠా సైన్యాన్ని తప్పించుకుంటూ శ్రీరంగపట్టణం చేరుకున్నాడు.

మైసూరు సైన్యాలను వెన్నంటి వచ్చిన మరాఠాసైన్యాలు శ్రీరంగపట్టణాన్ని 33 రోజులు దిగ్బంధం చేసాయి. కాని మరాఠా సేనాధిపతి త్రయంబకరావు శ్రీరంగపట్టణ ముట్టడిని మధ్యలోనే వదిలివేసి కర్నాటక (తమిళనాడు)లోని హైదర్ ఆధీనంలో ఉన్న తంజావూరు, బారామహల్, కోయంబత్తూరు పట్టణాలను ముట్టడించి వాటిని కొల్ల గొట్టాడు. టిపు 6000 మంది సైన్యంతో వెళ్లి మరాఠాలను అడ్డుకునే ప్రయత్నం చేసాడు. కాని 35,000 మంది మరాఠా సైన్యాన్ని ఎదుర్కోలేక పోయాడు.

హైదర్ టిపును తిరిగి ఉత్తర ప్రాంతంలో ఉన్న బెద్నూరుకు 4000 సైన్యంతో పంపించాడు. పూనా నుంచి వస్తున్న మరాఠా సైన్యాన్ని వారి సరఫరాలను దొంగ దెబ్బలతో విసిగించడం తప్ప టిపు ఏమీ చెయ్యలేకపోయాడు. ఓటమిని అంగీకరించిన హైదర్ జూన్, 1772లో మరాఠాలతో సంధి చేసుకున్నాడు. కాని ఈ ఓటమిని విజయంగా మార్చడానికి టిపు, హైదర్ ఇద్దరూ వేచి ఉన్నారు.

ఆ అవకాశం అయిదు నెలల్లోనే వచ్చింది. నవంబరు, 1772లో పేష్వా మాధవరావు మరణించాడు. వారసత్వం కోసం మరాఠాలలో అంతఃకలహాలు మొదలయ్యాయి. ఈ పరిస్థితిని హైదర్, టిపు చక్కగా వినియోగించుకున్నారు. టిపు మొదట మూడు నెలల్లో ముట్టడి తర్వాత సిరా కోటను పట్టుకున్నాడు. తర్వాత మద్దగిరి కోటను నాలుగు నెలల్లో ఆక్రమించాడు. తర్వాత గుర్రం కొండ, చన్నరాయ పట్టణ దుర్గాలను స్వాధీనం చేసుకున్నాడు. హోస్పెటెను ఆక్రమించడంలో హైదర్ సాయం చేసాడు. తర్వాత బళ్ళారి, ధార్వార్, హుబ్లిలను మైసూరు సైన్యాలు స్వాధీనం చేసుకున్నాయి. 1779లో చితల్ దుర్గను స్వాధీనం చేసుకున్నారు. ఈ చితల్ దుర్గ అనే చిన్న సంస్థానం మరాఠాలకు సహాయం చేసిందని టిపు, హైదర్ ఆ సంస్థానంపై పగతో చాలా అత్యాచారాలు చేసారని 20,000 మందిని ఖైదీలుగా శ్రీరంగపట్టణం తీసుకువెళ్ళి ఇస్లాంలోకి మత మార్పిడి చేసారని బ్రిటిష్ రచయిత లెవిన్ బౌరింగ్ తన 'హైదర్ అలీ టిపు సుల్తాన్' పుస్తకంలో వ్రాసారు. మొత్తానికి 1774-1779 మధ్య కాలంలో టిపు హైదర్ మరాఠాలు ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీన పరచుకున్నారు.

1774లోనే హైదర్ టిపు వివాహం చేసాడు. తండ్రి ఇష్టం మేరకు ఒకరిని, తన ఇష్టం మేరకు హైదర్ సేనాధిపతుల్లో ఒకరైన బుర్హానుద్దీన్ ఖాన్ సోదరి రుఖయ్యా భానును, ఒకేసారి టిపు వివాహం చేసుకున్నాడు.

## టిపు రెండవ ఆంగ్లో - మైసూరు యుద్ధం

టిపు రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధం మొదటి భాగంలో టిపు రాజకుమారుడిగా యుద్ధం చేసాడు. రెండవ భాగంలో, 1782లో హైదర్ మరణంతో మైసూరు నవాబుగా యుద్ధం చేసాడు.

మొదటి ఆంగ్లో మైసూరు యుద్ధంలో ఆంగ్లేయుల పరాజయం తర్వాత మైసూరుకు ఆంగ్లేయులకు మధ్య జరిగిన సంధి నిబంధనలను ఆంగ్లేయులు పాటించ లేదని హైదర్ జూలై 1780లో ఆంగ్లేయులపై యుద్ధం ప్రకటించడంతో రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం ప్రారంభమయ్యింది.

## పొల్లిలూరు యుద్ధం

కర్నాటకలో ఆంగ్ల సైన్యాల అధిపతిగా కల్నల్‌హెక్టర్ మన్రోను తూర్పు ఇండియా కంపెనీ నియమించింది. యుద్ధం ప్రారంభం కాగానే మన్రో హైదర్ ఆధీనంలో ఉన్న కంజీవరం (కంచి) లో సైనిక స్థావరాన్ని ఏర్పరచాడు. మన్రో సహాయం కొరకు గుంటూరు నుండి కల్నల్ బైయిలీ ఆధ్వర్యంలో అదనపు సైన్యాలు బయలుదేరాయి. కల్నల్ బైయిలీ కంజీవరం చేరకుండా నిలువరించడానికి హైదర్ టిపును 10,000 సైన్యంతో పంపించాడు.

బైలీ సెప్టెంబరు 3,1780న కంజీవరం పదిహేను కిలోమీటర్ల దూరంలోని పెరబక్కంకు చేరుకున్నాడు. అదే రోజు టిపు బైలీని ఎదుర్కొన్నాడు. ఏడు రోజుల భీకర యుద్ధం తర్వాత సెప్టెంబరు 10, 1780న కంజీవరానికి తొమ్మిదిమైళ్ళ దూరంలో ఉన్న పొల్లిలూరులో జరిగిన యుద్ధంలో కల్నల్ బైలీ టిపు చేతిలో ఘోర పరాజయాన్ని పొందాడు. 200 మంది యూరోపియన్ సైన్యం, 50 మంది బ్రిటిష్ అధికారులు మైసూరు సైన్యానికి లొంగిపోయారు. కల్నల్ బైలీ గుంటూరు నుంచి తెచ్చుకున్న 3,853 మంది సైన్యంలో మిగిలినవారు వీరు మాత్రమే. ఈ యుద్ధ ఖైదీలను బైలీతో సహా శ్రీరంగపట్టణం పంపించారు. పొల్లిలూరు యుద్ధంలో హైదర్, టిపు స్వయంగా రూపొందించుకున్న యుద్ధ రాకెట్లు మైసూరు సైన్య విజయానికి కారణమయ్యాయి. అవి బైలీ మందుగుండు సామగ్రినంతా ధ్వంసం చేశాయి. ఫ్రెంచ్ సేనాని లాలీ కూడా మైసూరుకు సహాయంగా ఈ యుద్ధంలో పాల్గొన్నాడు.

తర్వాత టిపు హెక్టర్ మన్రోను చెంగల్పట్టు వరకు తరిమాడు. అక్కడ మన్రోకు ఆంగ్ల సైన్యం సాయం రావడంతో మన్రో మద్రాసు చేరుకోగలిగాడు.

టిపు తర్వాత ఆర్కాట్ ముట్టడిలో ఉన్న హైదర్‌కు సాయం వెళ్ళాడు. ఆర్కాట్ కోట మైసూరు స్వాధీనంలోకి వచ్చింది. తర్వాత టిపు కర్నాటకలో ఆంగ్లేయుల ఆధీనంలో ఉన్న కోటలపై వరుస దాడులు చేసాడు. సత్ఘూరు కోట అధిపతిగా ఉన్న వలీ మొహమ్మద్‌ఖాన్ జనవరి 13, 1781 న మైసూరు సైన్యాలకు లొంగిపోయి కోటను వారికి స్వాధీనపరిచాడు. అంబూరు కోట అధిపతి కెప్టెన్ కీటింగ్ ముందు వ్యతిరేకించినా జనవరి 15, 1781న మైసూరు సైన్యాలకు లొంగిపోయాడు. టియాఘర్ కోట అధిపతి కెప్టెన్ రాబర్ట్స్ మైసూరు సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు. ఆరు నెలల ముట్టడి, యుద్ధం తర్వాత జూన్, 1781లో టిపు టియాఘర్ కోటను ఆక్రమించుకోగలిగాడు. ఈ యుద్ధాల తర్వాత టిపు ఆర్కాట్‌లో ఉన్న తండ్రి వద్దకు వెళ్ళాడు. కుమారుడి విజయాలతో ఆనందభరితుడైన హైదర్ టిపును బహుమానాలతో ఘనంగా సత్కరించాడు.

తర్వాత హైదర్ టిపును వందవాసి కోట ఆక్రమణకు పంపాడు. జూన్ 22, 1781న బయలు దేరిన టిపు వందవాసి పట్టణాన్ని ఆక్రమించగలిగాడు కాని కోటను పట్టుకోవడంలో విఫలమయ్యాడు. కోట అధిపతి కెప్టెన్ ఫ్లింట్ మైసూరు సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు. అంతేకాకుండా పోర్టోనోవో (తమిళనాడులోని ఫిరంగి పేట) యుద్ధంలో సర్ ఐర్‌కూట్ చేతిలో హైదర్ ఓటమి కూడా మైసూరు సైన్యాలను నిరాశలోకి నెట్టివేసింది. ఈ లోపల బెంగాల్ నుండి కల్నల్ పియర్స్ ఆధ్వర్యంలో అదనపు ఆంగ్లేయ బలగాలు వందవాసి చేరుకుంటున్నాయనే సమాచారం టిపుకు అందింది. టిపు వందవాసి కోట ముట్టడిని మధ్యలోనే ఆపి కల్నల్ పియర్స్‌ను ఆపేందుకు బయలు దేరాడు. పొల్లిలూరు యుద్ధ ఓటమి అనుభవంతో ఈ సారి కల్నల్ పియర్స్ ఆంగ్ల సైన్యాలు మామూలు దారిని తప్పించి, నెల్లూరు మీదుగా పులికాట్ చేరుకున్నాయి. పులికాట్ వద్ద సర్ ఐర్‌కూట్ సైన్యాలు కల్నల్ పియర్స్ సైన్యాలు చేరాయి. ఇక వందవాసి కోట ముట్టడి సాధ్యం కాదని గ్రహించిన టిపు వెనక్కు ఆర్కాట్‌లో ఉన్న హైదర్ వద్దకు చేరుకున్నాడు.

హైదర్ టిపును మళ్ళీ తంజావూరు ముట్టడికి పంపాడు. కుంభకోణం వద్ద టిపు ఆంగ్ల సేనాని కల్నల్ బ్రెయిత్ వెయిట్‌ను ఫిబ్రవరి 18, 1782న ఓడించి తంజావూరు ప్రాంతాన్నంతటినీ ఆక్రమించాడు. ఈ యుద్ధంలో ఎంతో మంది ఆంగ్ల సైనికులు బందీలుగా పట్టుబడ్డారు.

కర్నాటకను (తమిళనాడు) హైదర్ నుంచి విముక్తి చేయాలని తాపత్రయపడుతున్న ఆంగ్ల సేనాని సర్ ఐర్‌కూట్‌కు కల్నల్ బ్రెయిత్ వెయిట్ అపజయం ఎంతో నిరాశను కలిగించింది. హైదర్‌ను ఎలాగైనా ఓడించాలని సర్ ఐర్‌కూట్ మైసూరు సైన్యాలను వెంబడించాడు. టిపు ఆధీనంలోని ఆర్నీ కోటను ముట్టడించాడు కాని అక్కడ హైదర్ దాచిన ఖజాన, ఆయుధాగారం ఐర్ కూట్ ఆర్నీ కోటను ముట్టడించక ముందే వేరే చోటికి తరలించబడ్డాయి.

కర్నాటకలో ఓడిపోయిన ఆంగ్లేయులు మలబారులో మైసూరు ఆధీనంలోని ప్రాంతాలలో దాడులు ప్రారంభించారు. అక్కడ హైదర్ నియమించిన గవర్నర్లు, సేనాధిపతులు వరుస అపజయాలను పొందారు. దీనిలో హైదర్ టిపును మలబారులోని ఆంగ్లేయులను ఎదుర్కోవడానికి నవంబరు, 1782లో టిపు మలబారు చేరుకున్నాడు. ఆంగ్ల సైనికాధికారులు హంబర్‌స్టోన్, మెక్లాయిడ్ టిపుకు అందకుండా యుద్ధం చేయడంతో టిపు వారిపై విజయాన్ని సాధించలేకపోయాడు. నవంబరు, 29 న టిపు పొన్నాని వద్ద ఆంగ్ల సైన్యాలను ఎదుర్కొని విజయం కోసం పట్టుదలగా పోరాడుతున్న సమయంలో డిసెంబర్ 7, 1782 న చిత్తూరు వద్ద నరసింగరాయని పేట సైనిక స్థావరంలో హైదర్ మరణించాడు. డిసెంబర్ 11, 1782 న టిపుకు తన తండ్రి మరణ వార్త తెలిసింది. డిసెంబర్ 12, 1782న టిపు చిత్తూరు బయలుదేరాడు. మలబారు రక్షణ కొరకు అర్షద్‌బేగ్ ఖాన్‌ను నియమించాడు. రాజధాని శ్రీరంగపట్టణం వెళ్ళి అక్కడ కొన్ని పరిపాలనా పరమైన ఏర్పాట్లు చేసాడు. మొదట్లో టిపు చిత్తూరు చేరుకోవడానికి చాలా వేగంగా ప్రయాణించాడు. కాని మైసూరు పాలనా అధికారులు, సైనికాధికారులు, సైన్యం తనకు అనుకూలంగా, విశ్వాసపాత్రంగా ఉన్నారని తెలుసుకుని ప్రయాణంలో వేగం తగ్గించాడు. డిసెంబర్ 28, 1728 న నరసింగరాయని పేటకు రెండు మైళ్ల దూరంలో తన కోసం ప్రత్యేకంగా నిర్మించిన సైనిక స్థావరం చేరుకున్నాడు. అప్పటికే హైదర్ పార్థివ శరీరాన్ని రహస్యంగా శ్రీరంగపట్టణం తరలించడం జరిగింది. టిపు డిసెంబర్ 28, న సైనిక స్థావరం చేరుకున్న తర్వాత తన తమ్ముళ్లతో సైనికాధికారులు ఇతర అధికారులతో చర్చలు జరిపాడు. రెండవ రోజు డిసెంబర్ 29,1782 రాత్రి 9 గం॥కు తన తండ్రి హైదర్ సింహాసనంపై కూర్చొని నవాబు టిపు సుల్తాన్ బహదూర్‌గా పట్టాభిషిక్తుడయ్యాడు. మైసూరు సైన్యం 121 తుపాకులతో, ఫ్రెంచ్ సైన్యం 21 తుపాకులతో టిపుకు సైనిక వందనం చేసాయి.

ఉత్తరాన కృష్ణానది, దక్షిణాన కేరళలోని ట్రావెన్కూరు, తూర్పున తమిళనాడులోని తిరునల్వేలి, పశ్చిమాన అరేబియా సముద్రం సరిహద్దులుగా ఉన్న మైసూరు రాజ్యాన్ని టిపు వారసత్వంగా పొందాడు. ప్రస్తుత భారతదేశంలోని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో టిపు రాజ్యం విస్తరించి ఉండేది. ఇంత విస్తృత రాజ్యాన్ని సంపాదించడంలో హైదర్‌తో పాటు టిపు తన పదిహేనవ సంవత్సరం నుండీ పాలు పంచుకున్నాడు. రాజ్యమే కాకుండా శ్రీరంగపట్టణం ఖజానాలో మూడు కోట్ల రూపాయలు, బంగారం, విలువైన ఆభరణాలు, ఇంకా ఇతర సంపద టిపుకు వారసత్వంగా లభించాయి. మైసూరులో 88,000 సైనిక బలగాలు, అదనంగా ప్రాంతీయ సైనిక దళాలు, ఫిరంగిదళం ఉన్నాయి. అప్పటి భారతదేశంలోని అనేక సంస్థానాలలోని సైన్యంతో పోలిస్తే మైసూరు సైనిక బలం నిశ్చయంగా చాలా బలమైనది.

## అధ్యాయం - 4

# నవాబ్ టిపు సుల్తాన్ - రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం - మంగళూరు సంధి - 1784

హైదర్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆంగ్లేయులు మైసూరు రాజ్య ప్రాంతాలపై దాడి ప్రారంభించి ఉంటే వారికి ఎంతో లాభించి ఉండేది. ఎందుకంటే అప్పుడు టిపు మలబారులో ఉన్నాడు. టిపు వచ్చి హైదర్ వారసునిగా రాజ్యాధికారాన్ని చేపట్టే వరకు, మైసూరు అధికారులు, సేనాధిపతులు హైదర్ మరణాన్ని రాజకీయ అవసరాల దృష్ట్యా బయటకు పొక్కనివ్వలేదు. హైదర్ మరణం గురించి కొన్ని ఉహాగానాలు జరిగినా, చాలా మంది సందిగ్ధంలో ఉండిపోయారు. రెండవ ఆంగ్లో–మైసూరు యుద్ధంలో ఆంగ్ల సేనానిగా ఉన్న కల్నల్ స్టూవర్ట్ మొదట హైదర్ మరణ వార్తను నమ్మలేదు. తర్వాత అది నిజమని తెలిసినప్పటికీ, అప్పటికే ఆంగ్ల సేనల పరిస్థితి తిండిలేక రోగాలతో చాలా దయనీయంగా ఉండడంతో మైసూరుతో యుద్ధం కొనసాగించలేని పరిస్థితిని మద్రాసు గవర్నరుకు వివరించాడు.

హైదర్ మరణించిన రెండు నెలలకు ఫిబ్రవరి, 1783లో కల్నల్ స్టూవర్ట్ వందవాసిపై దాడి చేసాడు. అప్పటికే మైసూరు నవాబుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న టిపు ఆంగ్ల సైన్యాలను విజయవంతంగా ఎదుర్కొన్నాడు. అయితే వందవాసి కోటను స్వాధీన పరచుకోలేకపోయాడు. దీనికి కారణం బొంబాయిలోని కంపెనీ ప్రభుత్వం పరమ కిరాతకుడైన ఆంగ్ల సేనాని మాథ్యూస్ ఆధ్వర్యంలో ఆంగ్ల సైన్యాలను మలబారుపై దాడికి పంపించింది. ఆంగ్ల సైన్యాలు జనవరి, 1783లో మలబారులోని బెద్నూరును ఆక్రమించాయి.

### కిరాతక జనరల్ మాథ్యూస్

జనరల్ మాథ్యూస్ బొంబాయి నుంచి బెద్నూరు ఆక్రమణ వరకు సాగించిన దండయాత్రలో మధ్యలో అనేక పల్లెల్లో పట్టణాల్లో ఎన్నో అకృత్యాలు దోపిడీలు చేసాడు. ముఖ్యంగా షిమోగా జిల్లాలోని అనన్‌పూర్ గ్రామంలోని ప్రజలు ఆంగ్ల సైన్యాలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాని విజయం ఆంగ్లేయులనే వరించింది. దీనితో ఆంగ్లేయులు అనన్‌పూర్ ప్రజలపై అతి క్రూరంగా అత్యాచారాలు చేసారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఆయుధం పట్టిన ప్రతి పురుషుడి రక్తాన్ని చిందించాలని మాథ్యూస్ ఆజ్ఞ జారీ చేసాడు. ప్రజలను మూకుమ్మడిగా హత్యలు చేసి శవాలను చెరువుల్లో పడేసారు. స్త్రీల నగలను దోచుకుని

మాన భంగాలు చేసారు. అవమానాన్ని భరించలేక కొందరు, అత్యాచారాలను తప్పించుకోవడానికి కొందరు, ఇంచుమించు పల్లెలోని స్త్రీలందరూ చెరువుల్లో పడి మరణించారు.

తర్వాత జనరల్ మాథ్యూస్ మైసూరు రాజ్యంలో కీలకమైన పట్టణం బెద్నూరుపై దాడి చేసాడు. కోట గవర్నరైన అయ్యాజ్ నమ్మకద్రోహం చేసి ఆంగ్లేయులతో కుమ్మక్కై కోటను ఆంగ్లేయుల స్వాధీనం చేసాడు. ఈ అయ్యాజ్ గురించి భిన్నమైన కథనాలు ప్రచారంలో ఉన్నాయి. తన మలబారు దండయాత్రలో హైదర్ అలీ కేరళ నాయరు కులస్థులను ఎంతో మందిని బందీలుగా పట్టుకున్నాడు. వారిలో అయ్యాజ్ ఒకడు. అతడు ఇస్లాంకు మతం మార్చుకొని హైదర్‌కు ప్రీతి పాత్రుడయ్యాడు. హైదర్ అయ్యాజ్‌ను తన దత్తపుత్రునిగా చేసుకొని అతనికి అనేక పదవులు కట్టబెట్టాడని అంటారు. అయ్యాజ్ హైదర్‌కు నమ్మకస్తుడై, మొదట చితల్ దుర్గం, తర్వాత బెద్నూర్‌కు గవర్నరుగా నియమించబడ్డాడని కొందరి కథనం. అయ్యాజ్ పట్ల టిపుకు అంత మంచి అభిప్రాయం ఉండేదికాదు. అయ్యాజ్ పట్ల తన తండ్రి చూపే ఆదరణను చూసి టిపు అసూయపడేవాడని బ్రిటిష్ చరిత్రకారులు వ్రాసారు. టిపు మైసూరు నవాబు కావడంతో తన గవర్నరు పదవికి భంగం కలుగుతుందనే భయంతో అయ్యాజ్ తన గవర్నరు పదవిని నిలుపుకోవడానికి ఆంగ్లేయులతో ఒప్పందం చేసుకొని వారితో చేరిపోయాడు. మైసూరు తర్వాత పెద్ద ఖజానా, ఎక్కువ రాబడి ఉన్న సంస్థానం బెద్నూరు. ఫిబ్రవరి 14, 1783న బెద్నూరు కోట ఆంగ్లేయుల స్వాధీనమయ్యింది.

కాని మాథ్యూస్ విజయోత్సాహం ఎంతో కాలం నిలవలేదు. 7, ఏప్రిల్, 1783న ఫ్రెంచ్ సైన్యాలతో కలిసి మైసూరు నుంచి పెద్ద సైన్యం బెద్నూరు పై దాడి చేసింది. బెద్నూరు కోటపై దాడికి ముందు టిపు కోటలోని ఆంగ్ల సైన్యాలకు ఎటువంటి సరఫరాలు లేకుండా అన్ని దారులను దిగ్బంధించాడు. 18 రోజుల ముట్టడి తర్వాత మాథ్యూస్ కొన్ని షరతులతో లొంగిపోవడానికి అంగీకరించాడు. ఆంగ్ల సైనికులు అవమానించబడకుండా గౌరవప్రదంగా కోటనుండి బయటకు వెళ్ళడానికి అనుమతించాలి, మైసూరు అధికారులు ఇద్దరు ఆంగ్ల సైనికుల రక్షణకు హామీగా ఉండాలి, ఆంగ్ల సైనికుల తిండికి టిపు సరఫరాలు చెయ్యాలి, ఇవీ ఆ షరతులు. టిపు కొన్ని సవరణలు చేసి షరతులను అంగీకరించాడు. లొంగుబాటు షరతుల ప్రకారం ఆంగ్ల సైనికులు బెద్నూరు కోటలోని ఖజానాను టిపుకు అప్పజెప్పాలి. మాథ్యూస్ అందుకు అంగీకరిస్తున్నట్టు ప్రకటించి, ప్రతి ఆంగ్ల సైనికాధికారి, సైనికుడు వీలయినంత డబ్బును, బంగారాన్ని కోట బయటకు తీసుకెళ్ళేలా ప్రణాళిక వేసాడు. వారి వెంట వెళ్ళే కుక్కలు, మేకలు వంటి జంతువుల గొంతుకల్లో నాణాలు కుక్కారు. ఆంగ్ల అధికారులు, సైనికులు

తమ దుస్తుల్లో శరీరాల్లో నాణాలను, బంగారాన్ని దాచుకున్నారు. ఆ విధంగా వారు బెద్నూరు ఖజానాను ఖాళీచేసారు. ఇది గమనించిన టిపు వారిని తనిఖీ చేయించి నలభై అయిదు వేల నాణాలను స్వాధీనపరచుకున్నాడు. కాని అప్పటికే చాలా ధనం కోట దాటి పోయింది. అయ్యాజ్ తప్పించుకుని ఆంగ్లేయుల రక్షణలో మలబారులో వారి స్థావరమైన తెల్లిసెరి చేరుకున్నాడు.

కోట బయటకు వచ్చిన ఆంగ్ల సైనికులు బెద్నూరు పట్టణాన్ని లూటీ చేసి ప్రభుత్వ కార్యాలయాలను, రికార్డులను తగులబెట్టారు. దీనితో ఆగ్రహించిన టిపు ఆంగ్ల సైనికులను సంకెళ్ళతో బంధించి చితల్ దుర్గం వరకూ నడిపించాడు.

## మంగుళూరు ముట్టడి

మార్చి 9, 1783న బొంబాయి నుండి వచ్చిన ఆంగ్ల సైన్యాలు మైసూరు రాజ్యంలో ప్రముఖ రేవు పట్టణమైన మంగుళూరును ఆక్రమించాయి. ఈ రేవును హైదర్ అలీ ఎంతగానో అభివృద్ధి చేసాడు. ఈ రేవు ద్వారా మొదటిసారి మైసూరు రాజ్యం విదేశాలతో వాణిజ్యం ప్రారంభించింది.

టిపు బెద్నూరు ముట్టడిలో ఉండడంతో తన సైనికాధికారి హుసేన్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో 4000 సైన్యాన్ని మే 7, 1783న మంగుళూరు ముట్టడికి పంపించాడు. మంగుళూరును ఆక్రమించిన ఆంగ్ల సైనికాధికారి జాన్ కాంప్‌బెల్ ఈ మైసూరు సైన్యాన్ని చాలా సులువుగానే ఓడించాడు. హుసేన్ అలీ ఖాన్ ఇంకొకసారి ఆంగ్లేయులతో తలపడి మంగుళూరు పట్టణాన్ని స్వాధీన పరచుకున్నాడు. మంగుళూరు కోట మాత్రం ఆంగ్లేయుల ఆధీనంలోనే ఉండి పోయింది.

మే 20, 1783న టిపు మంగుళూరు చేరుకున్నాడు. అప్పటి నుండి జూలై 22, 1783 వరకు రెండు నెలల పాటు టిపుకు కాంప్‌బెల్‌కు మధ్య మంగుళూరు కోట కొరకు భీకరపోరు సాగింది. మైసూరు సైన్యాల ఫిరంగుల దాడితో కోట గోడలు బీటలు వారాయి. కోటలోనికి ఆహారం, మందుల సరఫరాలు ఆగిపోవడంతో ఆకలితో, అనారోగ్యంతో ఆంగ్ల సైనికుల మరణాలు ఎక్కువయ్యాయి. ఆంగ్లేయులు లొంగిపోవడానికి సిద్ధపడ్డారు. జూలై నెలాఖరుకు మైసూరు సైన్యాలు కోటలో ప్రవేశించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. కాని ఐరోపాలో ఫ్రెంచ్ వారికి, ఆంగ్లేయులకు మధ్య జరుగుతున్న యుద్ధం ముగిసింది. వారి మధ్య సయోధ్య కుదిరింది. దీనితో మైసూరు సైన్యాలకు సహాయంగా ఉన్న ఫ్రెంచ్ సైన్యాలు ఆంగ్లేయులతో యుద్ధం చేయరాదని పై నుంచి ఆజ్ఞలు జారీ అయ్యాయి. ఇది టిపుకు అనుకోని దెబ్బ. చివరకు ఫ్రెంచ్ సైనికాధికారి డిమోర్లా జోక్యంతో టిపు, ఆంగ్లేయుల మధ్య ఆగష్టు 2, 1783న సంధి కుదిరింది.

ఈ సంధి ప్రకారం మంగుళూరు కోట ఆంగ్లేయుల ఆధీనంలోనే ఉంటుంది. కోట చుట్టూ మైసూరు సైన్యాలు ఏర్పరచిన, కందకాలు, ఫిరంగులు మైసూరు సైన్యాల ఆధీనంలోనే ఉంటాయి. ఇరువర్గాలు వారివారి హద్దులను దాటి ముందుకు రాకూడదు. ఆంగ్లేయులు కోటలోపల ఎటువంటి మరమ్మతులు, క్రొత్త కట్టడాల నిర్మాణం చేయరాదు. అదే విధంగా మైసూరు సైన్యాలు కోట చుట్టూ క్రొత్త కందకాలను, ఫిరంగులను ఏర్పాటు చెయ్యరాదు. ఈ నిబంధనలు అమలు కావడానికి 3000 మంది మైసూరు సైన్యాలు వెయ్యి ఆంగ్ల సైన్యాలు కోట చుట్టూ కాపలా ఉంటాయి. 100 మంది మైసూరు సైనికులు కోటలోపల ఉంటారు. కోట క్రింద మైసూరు వారు బజారు ఏర్పాటు చేస్తారు. ఆంగ్లేయులు ఒకసారి పది లేక పన్నెండు రోజులకు సరిపోయేంత సరకులను మాత్రమే కొనుగోలు చేయాలి. ఆ బజారులో లభించని గోమాంసం, మద్యం వంటి సరుకులను ఒక నెలకు సరిపోయేంత మేరకు బయటి నుండి కొనుగోలు చేసుకోవచ్చు. టిపు వద్ద ఇద్దరు ఆంగ్ల సైనికాధికారులు, కాంప్‌బెల్ వద్ద ఇద్దరు మైసూరు సైనికాధికారులు హామీ (జమానత్)గా ఉంటారు.

## నకిలీ కడప నవాబు

టిపు మంగుళూరు యుద్ధంలో ఉండగా ఆంగ్లేయులు కడప జాగీరును పరోక్షంగా ఆక్రమించే ప్రయత్నం చేసారు. సయ్యద్ మొహమ్మద్ అనే ఒక అమాయకుడిని కడప నవాబుగా ప్రకటించి అతని తరఫున యుద్ధం ప్రారంభించారు. కడప, టిపు కొలువులో అధికారిగా ఉన్న మీర్ ఖమ్రొద్దీన్‌కు చెందిన జాగీరు. టిపు ఖమ్రొద్దీన్ సైన్యంతో కడప పంపించాడు. ఖమ్రొద్దీన్ నకిలీ నవాబు సయ్యద్ మొహమ్మద్‌నే కాకుండా అతనికి సహాయంగా వచ్చిన ఆంగ్లేయాధికారి మాంట్‌గోమరీని కూడా ఓడించాడు. మంగుళూరు ముట్టడి నుండి టిపు దృష్టిని మళ్ళించడానికి మద్రాసులోని కంపెనీ అధికారులు వేసిన ఎత్తుగడ ఇది.

ఆంగ్ల ఈస్ట్ ఇండియా కంపెనీకి తూర్పున మద్రాసు, ఉత్తరాన కలకత్తా, పశ్చిమాన బొంబాయి ముఖ్య స్థావరాలుగా ఉండేవి. టిపు పశ్చిమాన మలబారులో ఆంగ్లేయులతో యుద్ధం చేస్తుంటే వారు తూర్పున కర్నాటకలో మైసూరు కోటలపై దాడి చేసేవారు. టిపు తూర్పున ఆంగ్లేయులతో తలపడుతుంటే పశ్చిమాన మలబారును బొంబాయి నుంచి వచ్చిన ఆంగ్ల సైన్యాలు ముట్టడించేవి. హైదర్‌ను, టిపును తికమక పెట్టడానికి ఇది ఆంగ్లేయుల యుద్ధ వ్యూహంలో భాగమే. కాని హైదర్ టిపు ఆంగ్లేయుల ఈ కుట్రపూరితమైన వ్యూహాలను మొదటి, రెండవ ఆంగ్లో- మైసూరు యుద్ధాల్లో విజయవంతంగానే ఎదుర్కొన్నారు.

## తిరుమల రావు - ఆంగ్లేయుల కుట్ర

హైదర్ మరణానికి కొన్ని నెలల ముందు తంజావూరులోని ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి జాన్‌సల్లివాన్ మైసూరు రాజ్యంపై తమిళనాడు దక్షిణ ప్రాంతం నుండి దాడి చెయ్యడానికి ప్రణాళిక రచించాడు. ఈ ప్రణాళికను మద్రాసులోని గవర్నర్ అంగీకరించినప్పటికీ, రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో ఆంగ్ల సైన్యాలకు నాయకత్వం వహిస్తున్న సర్ ఐర్‌కూట్, బొంబాయి గవర్నర్ నిరాకరించారు. అప్పటి పరిస్థితుల్లో కంపెనీ సైన్యాలు మైసూరు సైన్యాలను ఎదుర్కొనే పరిస్థితిలో లేవని వారి అభిప్రాయం.

ఎలాగైనా మైసూరు రాజ్యానికి, హైదర్‌కు ఇబ్బంది కలిగించాలని ఉత్సాహంగా ఉన్న సల్లివాన్ ఇంకొక ప్రణాళిక రచించాడు. హైదర్ వలన పదవీచ్యుతులైన ఒడయారు వంశానికి చెందిన మహారాణి లక్ష్మీ అమ్మణి మైసూరు రాజ్యాన్ని తిరిగి ఒడయారు వంశస్థుల ఆధీనంలోనికి తేవాలని తీవ్ర ప్రయత్నం చేసింది. ఆంగ్లేయులు మరియు ఇతర హైదర్ శత్రువులతో మంతనాలు జరిపింది. ఆమె ప్రతినిధి అయిన తిరుమలరావుతో సల్లివాన్ ఒక ఒప్పందానికి వచ్చాడు. ఆంగ్లేయులు హైదర్‌ను ఓడించి ఒడయారు వంశస్థులను మైసూరు రాజ్యాధిపతులను చేస్తే, తిరుమలరావుకు మైసూరు రెవెన్యూలో పదిశాతం లభించేటట్టు, అతనికి అతని కుటుంబానికి శాశ్వతంగా ప్రధానమంత్రి పదవి హక్కు భుక్తం అయ్యేటట్టు అక్టోబరు 28, 1782న ఈ ఒప్పందం జరిగింది.

## ఆంగ్లేయుల దొంగదాడి

డిసెంబర్ 1782లో హైదర్ మరణాన్ని, నవాబు అయిన వెంటనే టిపు మంగుళూరు యుద్ధంలో వ్యస్తుడై ఉండడాన్ని అవకాశంగా తీసుకుని సల్లివాన్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యాధికారి కల్నల్ లేంగ్‌ను మైసూరు రాజ్య ఆక్రమణకు పంపించాడు. తిరుమలరావు కల్నల్ లేంగ్‌కు సహాయంగా ఉన్నాడు. వారు ఏప్రిల్ 2, 1783న కరూర్ కోటను, ఏప్రిల్ 16, 1783న అరవకురుచి కోటను, మే 4, 1783న దిండిగల్ కోటను చకచకా ఆక్రమించారు. లేంగ్ రాజీనామా చేయడంతో అతని స్థానంలో వచ్చిన పుల్లర్టన్ జూన్ 2, 1783న ధారాపురం కోటను ఆక్రమించాడు. ఈ చిన్న చిన్న కోటల ఆక్రమణ ద్వారా ఆంగ్లేయులు సాధించిందేమీ లేదు. శ్రీరంగపట్టణంపై దాడిచేసే సైనిక బలం పుల్లర్టన్‌కు లేదు. అప్పటికిక ఆంగ్ల సైన్యాలు సరైన వనరులు లేక నిస్తేజంగా మారాయి. మంగుళూరులో ఆంగ్లేయులకు టిపు సుల్తాన్‌కు సంధి జరగడంలో సల్లివాన్ తన ప్రణాళికను ప్రక్కన పెట్టవలసి వచ్చింది. అయినప్పటికీ మద్రాసులోని కంపెనీ అధికారులు టిపుతో యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పుల్లర్టన్‌కు సందేశం పంపించారు. ఆగష్టు 2, 1783న ఆంగ్లేయులు టిపుతో మంగుళూరులో యుద్ధ విరమణ ఒప్పందం చేసుకున్నప్పటికీ

ఆంగ్లేయులు టిపుతో యుద్ధ పునరుద్ధరణకు ఎదురు చూస్తున్నారు. పశ్చిమ తీరంలో ప్రముఖమైన రేవు పట్టణం మంగుళూరును వదులుకోవడానికి వారు సిద్ధంగాలేరు. మంగుళూరు రేవును, పట్టణాన్ని, కోటను ఎలాగైనా వారి స్వాధీనంలోకి తీసుకోవాలని వారి ఉద్దేశం. వారి ఈ ప్రణాళికను అమలు జరపడానికి వారు మొదట టిపు యుద్ధ విరమణ ఒప్పందం నిబంధనలను ఉల్లంఘించాడని పుకార్లు పుట్టించారు. ఈ పుకార్లను ఆసరాచేసుకొని పుల్లర్టన్ యుద్ధాన్ని తిరిగి కొనసాగిస్తూ కర్నాటక (తమిళనాడు) మలబారుకు మధ్య ఉన్న కీలక ప్రదేశమైన పాల్ఘాట్ కోటపై దాడిచేసి నవంబర్ 5, 1783న దానిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత నవంబరు 28, 1783న కోయంబత్తూర్ కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఈ రెండు ప్రముఖ కోటలు ఆంగ్లేయులకు అంత సులువుగా లొంగిపోవడానికి కారణం, మంగుళూరు యుద్ధ విరమణ సంధి తర్వాత ఈ కోటల అధిపతులు ఆంగ్లేయుల దాడిని ఊహించలేదు. వారు దాడికి సన్నద్ధులుగా లేరు. ఈ చర్య ఆంగ్లేయుల వైపు నుంచి ఒక దొంగదాడి. మద్రాసులోని ఆంగ్ల గవర్నర్ మెకార్టినీ సంధి ఒప్పందానికి అనుగుణంగా ఈ కోటలపై దాడి చేయవద్దని పుల్లర్టన్‌కు ఒక బహిరంగ లేఖ, దాడి చెయ్యడానికి అనుమతిస్తూ రహస్యంగా ఒక లేఖ వ్రాసినట్టు తెలుస్తుంది. భవిష్యత్తులో మంగుళూరు పై జరిగే చర్చల్లో ఈ రెండు కోటలను తురుపు ముక్కలుగా వాడుకోవాలని మెకార్టినీ ఆలోచన, కాని ఈ దొంగ దెబ్బ టిపుకు ఆగ్రహాన్ని తెప్పించి తిరిగి తీవ్ర యుద్ధ వాతావరణానికి దారితీస్తుందనే భావనతో మెకార్టినీ వెనక్కి తగ్గి పాల్ఘాట్, కోయంబత్తూర్ కోటలను ఖాళీ చెయ్యమని పుల్లర్టన్‌ను ఆజ్ఞాపించాడు. పుల్లర్టన్ ఆ రెండు కోటలను ఖాళీ చేసే ముందు కోటల్లోని ఖజానాను, ఆయుధ సామగ్రిని, ధాన్యాన్ని తరలించుకు పోవడమే కాకుండా పాల్ఘాట్ పట్టణ ప్రజలను కూడా దోచుకున్నాడు. పాల్ఘాట్‌ను మైసూరు సైన్యాలకు అప్పగించకుండా టిపు చేతిలో ఓడిపోయిన పాల్ఘాట్ రాజుకు అప్పగించాడు. టిపు యుద్ధ విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాడనే ఒక అబద్ధాన్ని ప్రచారం చేసి ఆంగ్లేయులు ఈ విధ్వంసాన్ని సృష్టించారు.

## ఆంగ్లేయుల సంధి షరతుల ఉల్లంఘన

వాస్తవానికి టిపు మంగుళూరు కోటలోని ఆంగ్ల సైన్యానికి కావలసిన సరకులను ఎప్పటికప్పుడు సరఫరా చేయిస్తుండేవాడు. మంగుళూరును స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఆంగ్లేయులే ఒప్పందాన్ని ఉల్లంఘించేవారు. బొంబాయి నుండి సైన్యంతో మంగుళూరు వచ్చిన జనరల్ మెక్లాయిడ్ ఒప్పందానికి విరుద్ధంగా 4000 బస్తాల ఆహార పదార్థాలను కోటలోనికి పంపించాలని డిమాండ్ చేసాడు. ఈ డిమాండ్ ఒప్పందం షరతులకు విరుద్ధం. దీనితో టిపు మెక్లాయిడ్ డిమాండ్‌ను నిరాకరించాడు. ఆంగ్లేయులకు టిపుకు మధ్య తిరిగి యుద్ధ పరిస్థితులు తలెత్తాయి. గతంలో వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చిన ఫ్రెంచ్

సైనికాధికారి డిమోర్లా రంగంలోకి దిగి 4000 బస్తాలను 1000 బస్తాలుగా నిర్ణయించాడు. అవి అయిపోయిన తర్వాత ఇంకో వెయ్యి బస్తాలు కోటలోనికి పంపడానికి టిపును ఒప్పించాడు. ఉప్పు, గోమాంసం, మద్యం సరఫరా కూడా ఒకనెలకు సరిపోయేంతగా మాత్రమే సరఫరా చేయబడాలని ఒప్పందంలో నిర్ణయించబడింది. టిపు కోటలోని ఆంగ్ల సైనికులకు సరఫరా చేయవలసిన సరకుల విషయంలో కొంత సడలింపునిచ్చినా, మెక్లాయిడ్ సంధి షరతులను ఉల్లంఘించి మైసూరు సైన్యాలు ఏర్పరచిన మంగుళూరు బజారు నుంచి కాకుండా బయట నుండి పెద్ద ఎత్తున సరుకు తెప్పించి కోటలోనికి సరఫరా చెయ్యసాగాడు. మంగుళూరు కోట వీలయినంత ఎక్కువ కాలం ఆంగ్లేయుల ఆధీనంలో ఉండాలని మెక్లాయిడ్ ఉద్దేశం. ఒప్పందం షరతులను ఉల్లఘించి మెక్లాయిడ్ మంగుళూరు కోట చుట్టూ ఆంగ్ల సైన్యాలను మోహరించడం ప్రారంభించాడు. ఇది కూడా ఒప్పందానికి విరుద్ధం.

## మంగుళూరు కోటలోని ఆంగ్లేయుల లొంగుబాటు

కాని ఎనిమిది నెలలుగా కోటలో బందీలుగా ఉన్న ఆంగ్ల సైనికులలో అసహనం పెరిగిపోయింది. చాలా మంది అనారోగ్యం పాలయ్యారు. ఆస్పత్రులు రోగులతో నిండిపోయాయి. మరణాలు ఎక్కువయ్యాయి. ఆంగ్ల సైనికాధికారులపై సైన్యంలో తిరుగుబాటు ప్రారంభమయ్యింది. ఆంగ్ల సైన్యంలో పని చేస్తున్న భారతీయ సిపాయిలు రహస్యంగా మైసూరు సైన్యంతో చేరిపోసాగారు. కోటలోని ఆంగ్ల సైన్యాధిపతి కాంప్‌బెల్ స్వయంగా క్షయపీడితుడయ్యాడు. ఇటువంటి పరిస్థితులలో మెక్లాయిడ్ ప్రణాళికలను నీరుగారుస్తూ జనవరి 26, 1784న కాంప్ బెల్ కొన్ని షరతులతో మైసూరు సైన్యానికి లొంగిపోయి, టిపుకు మంగుళూరు కోటను స్వాధీనం చేసాడు. షరతుల ప్రకారం ఆంగ్ల సైన్యాన్ని కోట నుండి గౌరవ ప్రదంగా వెళ్ళిపోనివ్వాలి. వారు పడవల్లో వెళ్లడానికి టిపు పడవలను ఏర్పాటు చెయ్యాలి. కాలి బాటను వెళితే మైసూరు రాజ్యంలో ఉన్నంతవరకు టిపు వారికి ఆహారం సరఫరా చెయ్యాలి.

ఎనిమిది నెలల పాటు మంగుళూరు కోటలో ఉన్న ఆంగ్లసైన్యాల పరిస్థితికి టిపును నిందించవలసిన పనిలేదు. టిపు ఒప్పందం షరతుల ప్రకారం మంగుళూరు బజారు నుండి ఆహార పదార్థాల సరఫరా కోటలోనికి సజావుగా జరిగేలా చూసేవాడు. బొంబాయి నుండి వచ్చిన ఆంగ్ల సైనికాధికారి మెక్లాయిడ్ అత్యుత్సాహమే కోటలోని ఆంగ్ల సైన్యాలకు ఇబ్బందులను కలగజేసింది. బయట నుండి, బహుశా బొంబాయి నుండి తెచ్చిన ఆహార పదార్థాలు కుళ్ళిపోయి, ముగిగిపోయినవని ఆంగ్ల సైనికాధికారులే ఫిర్యాదు చేసారు. ఈ ఆహార పదార్థాలను సరఫరా చేసిన నౌకాదళ ఏజెంటు అవినీతికి పాల్పడినట్టు వారు ఆరోపించారు. సైనికుల తిండి విషయంలో ఇప్పుడే కాదు, అప్పుడు కూడా అవినీతి

జరిగేదని తెలుస్తుంది. బి.ఎస్.ఎఫ్ జవాను తేజ్ బహదూర్ యాదవ్ నీళ్ళపప్పు, మాడిన రొట్టె వీడియోనుగుర్తు చేసుకుందాము.

## కన్నూర్ యుద్ధం

మంగుళూరు కోట ఆంగ్లేయుల ఆధీనంలో ఉండాలని అత్యుత్సాహం చూపిన మెక్లాయిడ్ కేరళలోని పశ్చిమతీర నౌకాశ్రయం కన్ననూర్ (కన్నూర్)పై దాడి చేసి స్వాధీనపరచుకున్నాడు. ఈ ప్రాంతం ముస్లిం మోప్లా తెగల ప్రాంతం. బీ బీ ఇక్కడి రాణి. మిరియాల వ్యాపారం ఎక్కు లాభదాయకమని భావించిన మెక్లాయిడ్ మంగుళూరు కంటే కన్ననూర్ పై ఎక్కువ ఆసక్తి కనపరిచాడు. ఇక్కడి మోప్లాలు మెక్లాయిడ్ సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించి పోరాడారు. అయినా ఓడిపోయారు. మెక్లాయిడ్ సైన్యం బీ బీని ఆమె కుటుంబాన్ని బందీలుగా చేసారు. 1783 డిసెంబరు 9-14 తారీఖుల మధ్య జరిగిన ఈ యుద్ధంలో మోప్లాలు, బీ బీ సైన్యాలు తీవ్రంగా నష్టపోయాయి. కన్ననూర్ రాజ్యం క్రింద ఉన్న 42 కోటలు ఆంగ్లేయుల స్వాధీనం అయ్యాయి. నాలుగు లక్షల నగదు ఇంకా కొంత వస్తు సంపద ఆంగ్లేయుల వశమయ్యింది. తప్పనిసరి పరిస్థితులలో బీ బీ ఆంగ్లేయులతో సంధికి అంగీకరించింది. సంధి షరతుల ప్రకారం కన్ననూర్ బీ బీకి తిరిగి ఇవ్వబడింది. కాని ఆమె ఆంగ్లేయుల సామంతురాలిగా వారికి ప్రతిఏటా మూడు లక్షల కప్పం చెల్లించాలి. కన్ననూర్‌లోని మిరియాల వ్యాపారం మీద ఆంగ్లేయుల గుత్తాధిపత్యం ఏర్పడింది. మెక్లాయిడ్ ఈ దుందుడుకు చర్యను మద్రాసు గవర్నర్ అంగీకరించినప్పటికీ బొంబాయి గవర్నర్ తీవ్రంగా వ్యతిరేకించాడు. బీ బీ టిపుకు బంధువు కావడంతో ఈ విషయంలో టిపుతో వైరం వారికి ఇష్టం లేదు. రెండవ ఆంగ్లో- మైసూరు యుద్ధం ముగిసి ఆంగ్లేయులకు టిపుకు మధ్య కుదిరిన మంగుళూరు సంధిలో కన్ననూర్ రాణి బీ బీ ఆంగ్లేయుల ఆధిపత్యం నుంచి స్వతంత్రురాలిగా ప్రకటించబడింది.

## మంగుళూరు సంధి మార్చి 11, 1784

రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం ప్రారంభమయిన రెండు సంవత్సరాలకే 1782లో హైదర్ అలీ బ్రతికి ఉన్నప్పుడే మైసూరు, ఆంగ్లేయులకు మధ్య యుద్ధ విరమణకు సంబంధించిన చర్చలు జరిగాయి. తమ యుద్ధ ఖైదీలను విడుదల చేయాలని కర్నాటక (తమిళనాడు) నుంచి వైదొలగాలని, హైదర్ ఫ్రెంచ్ వారితో తన సంబంధాలను నిలిపివేయాలని ఆంగ్లేయులు సంధి షరతులను విధించారు. కర్నాటకలోని తిరుచునాపల్లిని తనకు స్వాధీనం చేస్తే పై షరతులను అంగీకరించడానికి హైదర్ సిద్ధపడ్డాడు. అప్పుడు ఆంగ్ల సైన్యాధిపతియైన సర్ ఐర్ కూట్ హైదర్ షరతును అంగీకరించడానికి సిద్ధపడినా ఈస్ట్ ఇండియా కంపెనీ కౌన్సిలర్లు అందుకు అంగీకరించలేదు. దానితో సంధి ప్రయత్నాలు విఫలమైయుద్ధం కొనసాగింది.

హైదర్ మరణం తర్వాత ఫిబ్రవరి, 1783లో ఆంగ్లేయులు తిరిగి సంధి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ సారి టిపు తిరుచునాపల్లిని డిమాండ్ చేయకపోయినా, మైసూరు రాజ్య సరిహద్దులలో పుదుకొట్టయ్ దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలను డిమాండ్ చేసాడు. ఇకముందు ఫ్రెంచ్ సైన్యాలను చేర్చుకోనని, అయితే అప్పటికే తన ఆధీనంలో ఉన్న ఫ్రెంచ్ సైన్యాలను మాత్రం ఆంగ్లేయులకు అప్పగించబోనని, ఎందుకంటే వారిని రక్షించడం తన గౌరవం, ధర్మం అని ఖచ్చితంగా చెప్పాడు.

మద్రాసు గవర్నరుగా ఉన్న మెకార్ట్నీ టిపు షరతులను అంగీకరించడానికి సిద్ధపడ్డాడు. ఎందుకంటే ఈ యుద్ధం మద్రాసు అధికారులకు, సైన్యానికి తలకు మించిన భారంగా తయారయ్యింది. వారికి సరైన సరఫరాలు, ఆర్థిక వనరులు అందడం లేదు. కలకత్తా నుంచి వచ్చే సైన్యాలను, సరఫరాలను ఫ్రెంచ్ వారు అడ్డుకుంటున్నారు. సైనికులకు జీతభత్యాల బకాయిలు చెల్లించే పరిస్థితి లేదు. అప్పటి కలకత్తా గవర్నరు జనరల్ హేస్టింగ్స్ ఈ సంధి ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. సంధి షరతులు శత్రువును బలోపేతం చేసేవిగా ఉన్నాయని, ఎట్టి పరిస్థితులలోనూ ఆంగ్లేయులు యుద్ధం కొనసాగించాలని ఆదేశించాడు.

కాని ఆగష్టు 2, 1783న కేవలం మంగుళూరు కోటకు సంబంధించి, యుద్ధ విరమణ ఒప్పందం జరిగిన తర్వాత, మొత్తం యుద్ధ విరమణకై మళ్ళీ చర్చలు ప్రారంభమయ్యాయి. టిపు వకీళ్ళు (ప్రతినిధులు) అప్పాజిరామ్, శ్రీనివాసరావు మద్రాసు చేరుకొని చర్చలు ప్రారంభించారు. కర్నాటకలోని టియగర్, నెల్లూరు కోటలను టిపుకు జాగీరుగా ఇవ్వాలని, బెద్నూరు గవర్నర్‌గా ఉండి టిపుకు ద్రోహం చేసి ఆంగ్లేయుల పంచన చేరిన అయ్యాజ్‌ను ఇంకా ఇతర విద్రోహులను టిపుకు అప్పగించాలని, మైసూరు, ఆంగ్లేయులపై శత్రుదాడుల సమయంలో పరస్పరం సహాయం చేసుకునేలా పరస్పర సహకార సంధి చేసుకోవాలని కోరారు. దీనికి బదులుగా మైసూరు సైన్యాలు కర్నాటకను ఖాళీ చేస్తాయని, టిపు ఆంగ్ల యుద్ధ ఖైదీలను విడుదల చేస్తాడని తెలిపారు. మద్రాసులోని కంపెనీ అధికారులు పై షరతులను అంగీకరించలేదు. అయ్యాజ్‌ను మైసూరుకు అప్పగించలేమని టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు సహాయం చేసిన ట్రావెన్కూర్, తంజావూర్, ఆర్కాట్ రాజులపై టిపు దాడి చేస్తే వారికి సాయం చేస్తామని, పరస్పర సహకార సంధిని అంగీకరించమని స్పష్టం చేసారు. ఆంగ్లేయుల షరతులు టిపు వకీళ్ళకు ఆమోదయోగ్యం కాకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. యుద్ధం కొనసాగింది.

ఉత్తర భారతదేశంలో కరువు పరిస్థితులు ఏర్పడడంతో మద్రాసులోని కంపెనీ ప్రభుత్వం పరిస్థితి ఇంకా దుర్భరంగా తయారయ్యింది. కలకత్తా నుంచి ఎటువంటి

సహాయం లేదు. ఈ యుద్ధంలో మరాఠాల సహాయాన్ని ఆశించిన వారెన్ హేస్టింగ్స్‌కు నిరాశే మిగిలింది. ఈ పరిస్థితులలో వారెన్ హేస్టింగ్సే స్వయంగా మద్రాసు గవర్నర్ మెకార్టినీకి టిపుతో స్వతంత్రంగా సంధి చేసుకోవడానికి అనుమతినిచ్చాడు.

నవంబరు5, 1783న తిరిగి చర్చలు ప్రారంభమయ్యాయి. మద్రాసులో తూర్పు ఇండియా కంపెనీ కమిషనర్లు ప్రతినిధులుగా ఉన్న ఆంటోనీ సాడ్లర్, జార్జ్ లియోనార్డ్ స్టాంటన్ మైసూరు ప్రతినిధులైన అప్పాజిరామ్, శ్రీనివాసరావులతో ఆర్ని కోటను చేరుకున్నారు. ఇక్కడ మైసూరు గవర్నరుగా ఉన్న సయ్యద్ సాహెబ్‌తో వారు చర్చలు జరిపారు.

మొదట టిపు కర్నాటకను ఖాళీ చెయ్యాలి, తర్వాత ఆంగ్లేయులు తాము ఆక్రమించుకున్న మైసూరు రాజ్య ప్రాంతాలను ఖాళీ చేస్తారు. కాని టిపు ఆంగ్ల యుద్ధ ఖైదీలనందరినీ విడుదల చేసిన తర్వాత ఆంగ్లేయులు మంగుళూరు, మలబారులను ఖాళీ చేస్తారు. ఆంగ్లేయుల ఈ ప్రతిపాదనలను సయ్యద్ సాహెబ్ నిరాకరించాడు. మంగుళూరు నుంచి ఆంగ్ల సైన్యాలు పూర్తిగా వైదొలగిన తర్వాతే, మైసూరు ఆంగ్ల యుద్ధ ఖైదీలను విడుదల చేస్తుందని ఖచ్చితంగా చెప్పాడు. బొంబాయిలోని ఆంగ్ల ప్రభుత్వం మంగుళూరు ఆంగ్లేయుల ఆధీనంలోనే ఉండాలని అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఆంగ్ల యుద్ధ ఖైదీల విడుదల, మంగుళూరు నుండి ఆంగ్లేయులు వైదొలగడం వంటి అంశాలు సంధి ప్రయత్నాలలో ప్రతిష్టంభనను కలిగించాయి. తమ యుద్ధ ఖైదీలను మైసూరు విడుదల చేస్తే మంగుళూరును వదిలివేస్తామని ఆంగ్లేయులు, మంగుళూరు నుండి ఆంగ్లేయులు వైదొలగితేనే వారి యుద్ధ ఖైదీలను విడుదల చేస్తామని మైసూరియన్లు పట్టుబట్టడంతో చర్చలు మళ్ళీ విఫలమయ్యాయి.

ఆంగ్ల కమిషనర్లు మంగుళూరులో ఉన్న టిపుతోనే చర్చలు జరపడానికి బయలు దేరారు. ఆర్ని నుండి బెంగుళూరు, శ్రీరంగపట్టణం వెళ్ళి అక్కడ బందీలుగా ఉన్న ఆంగ్ల యుద్ధ ఖైదీలను కలుసుకోవాలనుకున్నారు. ఇంతవరకు ఎటువంటి సంధి కుదరక పోవడంతో, ఆంగ్ల కమిషనర్లు యుద్ధ ఖైదీలను కలుసుకోవడం సముచితం కాదని మైసూరు వకీళ్ళు అందుకు అభ్యంతరం తెలిపారు. చేసేదేమీ లేక ఆంగ్ల కమీషనర్లు ఖైదీలకు ఆహార పదార్థాలు, బహుమతులు పంపించారు. వాటిని మైసూరు ప్రభుత్వం ఖైదీలకు అందజేసింది. మైసూరు ప్రభుత్వం ఆంగ్ల కమిషనర్లను శ్రీరంగపట్టణం, బెంగుళూరు మార్గంలో కాకుండా వేరే మార్గంలో వారు మంగుళూరు వెళ్ళే ఏర్పాట్లు చేసింది.

ఫిబ్రవరి 22, 1784న ఆంగ్ల కమిషనర్లు 29 నిబంధనలతో కూడిన సంధి ఒప్పందాన్ని టిపు ముందుంచారు. వీటిలో యుద్ధ ఖైదీలు, మంగుళూరుకు చెందిన పాత ప్రతిపాదనలతో పాటు టిపుకు బందీలుగా ఉన్న కర్నాటక నవాబు, వెంకటగిరి రాజాను సంధి కుదిరిన నెల రోజులలో విడుదల చెయ్యాలని, టిపు మైసూరు రాజ్యంలో ఆంగ్ల

ప్రతినిధుల నియామకానికి అంగీకరించాలని, కర్నాటక (ఆంగ్లేయుల ప్రాంతం) నుండి కేరళలోని ఆంగ్లేయుల స్థావరమైన తెల్లిసెరికి మధ్య జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు, రాకపోకలు, ఇతర రవాణా వ్యవహారాలు మైసూరు రాజ్యం నుండి జరిగే విధంగా టిపు అంగీకరించాలని, ఈ యుద్ధంలో ఆంగ్లేయులకు సహాయం చేసినందుకు తొలగించిన చిరకాల్, కొట్టాయం, కడతనాడు రాజులకు టిపు వారి రాజ్యాలను తిరిగి వారికి అప్పగించాలని, వారిపై భవిష్యత్తులో టిపు ఎటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ కూడదనే కొత్త ప్రతిపాదనలను కూడా చేసారు.

టిపు పై ప్రతిపాదనలన్నింటినీ నిరాకరించి యుద్ధాన్ని కొనసాగించడానికి నిర్ణయించు కున్నట్టు కమిషనర్లకు తెలిపాడు. దీనితో కలవరం చెందిన ఆంగ్ల కమిషనర్లు క్రొత్త ప్రతి పాదనలన్నింటినీ విరమించుకుని పాత అంశాలకు పరిమితమయ్యారు. టిపు కూడా కొంత తగ్గి పరస్పర సహకారనిబంధనను విరమించుకుని, ఆంగ్లేయులు టిపు శత్రువులకు ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని సహాయం చేయరాదనే నిబంధనను విధించాడు. మరాఠాలను దృష్టిలో ఉంచుకుని టిపు ఈ నిబంధనపై పట్టు బట్టాడు. 1782 లో ఆంగ్లేయులకు మరాఠాలకు మధ్య జరిగిన సాల్బైసంధి ననుసరించి మరాఠాలు అవసరమైనప్పుడు ఆంగ్లేయులకు సహాయం చెయ్యాలి. చాలా తర్జన భర్జన తర్వాత ఆంగ్ల కమిషనర్లు టిపు నిబంధనకు అంగీకరించారు.

యుద్ధంలో ఇరువర్గాలు గెలిచిన ప్రాంతాలను తిరిగి వెనక్కు ఇవ్వడం, ఆంగ్లయుద్ధ ఖైదీల విడుదల అంశాల వద్ద మళ్ళీ చర్చలు ఆగిపోయాయి. ఇరువర్గాలు ఒకరినొకరు నమ్మడం లేదు. కర్నాటకను ఖాళీచేసి, ఖైదీలను విడుదల చేస్తేనే మలబారు, మంగుళూరును వదిలేస్తామని ఆంగ్లేయులు అంటుంటే, ఖైదీల విడుదల తర్వాత ఆంగ్లేయులు మలబారు, మంగుళూరును అప్పగించరేమోనని టిపు సందేహం. ఇరువర్గాలు ఆక్రమిత ప్రాంతాలను ఒకేసారి ఖాళీ చెయ్యాలని, ఖైదీల విడుదలకు హామీగా దిండిగల్, కన్ననూర్ ప్రాంతాలను తమ ఆధీనంలో ఉంచుకొని ఖైదీల విడుదల తర్వాత ఆ ప్రాంతాలను టిపుకు ఇస్తామని ఆంగ్ల కమిషనర్లు ప్రతిపాదించారు. ఈ రెండు ప్రాంతాలను తిరిగి తనకు అప్పగించేవరకు కర్నాటకలోని టియాగర్, నెల్లూరు లేక అంబూరు సద్గురు కోటలలో మైసూరు సైన్యం ఉంటుందని టిపు ప్రతిపాదించాడు. దీనికి అంగీకరించకపోతే టిపు యుద్ధ పునరుద్ధరణ చేస్తాడని గ్రహించిన ఆంగ్ల కమిషనర్లు అంబూరు, సద్గురు కోటల్లో మైసూరు సైన్యం ఉండడానికి అంగీకరించారు. ఖైదీల విడుదల పూర్తయిన వెంటనే దిండిగల్, కన్ననూర్‌లను టిపుకు స్వాధీన పరచాలని, టిపు అంబూరు సద్గురుకోటలను ఆంగ్లేయులకు స్వాధీన పరచాలని అంగీకరించబడి మార్చి 11, 1784 న రెండవ ఆంగ్లో- మైసూరు యుద్ధాన్ని ముగిస్తూ ఇరువర్గాలు మంగుళూరులో సంధి పత్రాలపై సంతకాలు చేసారు.

## మంగుళూరు సంధి విశ్లేషణ

మంగుళూరు సంధి టిపుకు ఒక దౌత్య విజయంగా చెప్పవచ్చు. 1782లో మైసూరుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులు, మరాఠాల ఆర్థిక మంత్రి నానా ఫడ్నవీస్ చేసుకున్న సాల్బై సంధిని టిపు మంగుళూరు సంధి ద్వారా నిష్క్రియం చేసాడు. మరాఠాలు తనపై దాడి చేస్తే ఆంగ్లేయులు తనకు సహాయం చేసేలా ఆంగ్లేయులను ఒప్పించాడు. నాలుగు సంవత్సరాల యుద్ధం తర్వాత మైసూరు కొత్త ప్రాంతాలను పొందలేకపోయినా కోల్పోయిన మంగుళూరు, మలబారు ప్రాంతాలను తిరిగి పొందింది. ఈ యుద్ధంలో ఎక్కువ విజయాలు టిపుకే దక్కాయి. ఇక యుద్ధం కొనసాగించలేని నిస్సహాయస్థితిలోనే ఆంగ్లేయులు సంధి కోసం తాపత్రయపడ్డారు. మైసూరు రాజ్యంలో తమ వర్తకం, తమ రక్షణలోని రాజులను టిపు శిక్షించకూడదనే వంటి షరతులను టిపు నిర్ద్వందంగా నిరాకరించినా ఆంగ్లేయులు ఏమీ చేయలేక పోయారు.

ఈ సంధిని త్వరితంగా కోరుకున్నది మద్రాసు కంపెనీ ప్రభుత్వం. బొంబాయి, కలకత్తా కంపెనీ ప్రభుత్వాలు ఈ సంధితో అసంతృప్తి చెందాయి. సంధి చర్చల కోసం మంగుళూరు వెళ్ళిన కంపెనీ కమిషనర్లను చంపేస్తానని బెదిరించి టిపు వారితో బలవంతంగా సంధిపై సంతకాలు చేయించాడని ఆంగ్లేయులు ప్రచారం చేసారు. మైసూరు రాజ్యంలో ఉన్నంత వరకు తమకు ఎంతో గౌరవ మర్యాదలు దక్కాయని, టిపు తమకు ఎన్నో బహుమతులు ఇచ్చాడని స్వయంగా ఆంగ్ల కమిషనర్లే మద్రాసు గవర్నరు మెకార్టినీకే వ్రాసిన లేఖలో తెలిపారు.

ఈ సంధిలో ఆంగ్లేయుల విజయం ఆంగ్ల యుద్ధ ఖైదీల విడుదల మాత్రమే. వారు క్రొత్తగా ఎటువంటి ప్రాంతాలను పొందలేదు. కాని వారికి ఈ యుద్ధంలో టిపు సైనిక శక్తిని గురించిన అవగాహన ఏర్పడింది. భారతదేశంలో తమ రాజ్య వ్యాప్తికి టిపు ఒక్కడే అవరోధమని ఆంగ్లేయులు గ్రహించారు. ఈ సంధిని అమలు చెయ్యడం తాత్కాలికమేనని టిపును జయించే ప్రణాళికకు ఇది ఆరంభమని ఆంగ్లేయులు బాహాటంగానే చెప్పారు. ఆ ప్రణాళికే మూడో ఆంగ్లో–మైసూరు యుద్ధం. మంగుళూరు సంధి ఆంగ్లేయులతో చివరి వరకు పోరాడిన టిపుకు వారిపై లభించిన చివరి విజయం. తర్వాత విజయాలన్నీ ఆంగ్లేయులే పొందారు.

### అధ్యాయం - 5

# యూరోపియన్ ముసల్మాన్ - ఆంగ్లేయుల దుష్ప్రచారాలు మూడవ ఆంగ్లో - మైసూరు యుద్ధం - 1790-92

1784లో రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం ముగిసింది. ఈ యుద్ధంలో టిపు భారీ సంఖ్యలో ఆంగ్లసైనికులను యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నాడు. యుద్ధం తర్వాత ఆంగ్లేయులకు టిపుకు మధ్య జరిగిన మంగుళూరు సంధిననుసరించి టిపు 1100 మంది బ్రిటిష్ సైనికులను, తూర్పు-ఇండియా కంపెనీకి చెందిన 3000 మంది భారతీయ సైనికులను విడుదల చేసాడు. కాని 300 మంది తెల్లవారైన బ్రిటిష్ సైనికులు టిపు వద్దనే ఉండిపోయారు. వీరు ఇస్లామ్ మతంలోనికి మారి టిపు సైన్యంలో మంచి హెూదాలను పొందారు. వీరు బందీలు కారని, వారు తనసైన్యంలో చేరడానికి అంగీకరించినప్పుడే వారు స్వతంత్రులైనారని తిరిగి వారిని బ్రిటిష్ వారికి అప్పగించవలసిన అవసరం లేదని టిపు వాదన. వీరిని ఆంగ్లేయులు యూరోపియన్ ముసల్మాన్ అనేవారు. దీనికి సంబంధించి భారతదేశంలోని ఆంగ్లేయులలోనే కాకుండా ఇంగ్లాండులో కూడా ఆందోళన ప్రారంభమయ్యింది. ఇంగ్లాండులోని ప్రజానీకం ఒక తూర్పు దేశపు పరిపాలకుడు యూరోపియన్లను బందీలుగా చేసి వారిపై ఆధిపత్యం చెలాయించడం తమ జాతీయతకు అవమానంగా భావించారు. జాతిపరంగా, సామాజిక పరంగా భారతీయుల్ని తమకంటె తక్కువగా భావించే ఇంగ్లాండు ప్రజలు రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో టిపు చేతిలో ఆంగ్లేయుల ఓటమిని జీర్ణించుకోలేక పోయారు. పొల్లిలూరులో కల్నల్ బెయిలీ పరాజయం, తంజావూరులో కల్నల్ బ్రెయితే పరాజయం వీరిని ఎంతగానో బాధించింది.

రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో తమ పరాజయాన్నుండి ఆంగ్ల ప్రజానీకం దృష్టి మళ్ళించడానికి భారతదేశంలోని తూర్పు ఇండియా కంపెనీ అధికారులు కూడా టిపును పెద్ద నియంతగా మతోన్మాదిగా చిత్రించడం ప్రారంభించారు. టిపు యురోపియన్ సైనికులను నిర్దయగా క్రూరంగా చూస్తున్నాడని వారిని బలవంతంగా ఇస్లాం మతంలోకి మారుస్తున్నాడనే వార్తలు ఇంగ్లాండులో బాగా ప్రచారం పొందాయి. ఇంగ్లాండులోని పత్రికలు టిపు దుశ్చర్యలను ఖండిస్తూ రకరకాల కథనాలు ప్రచురించేవి. వీటిలో చాలా అపోహలు, వదంతులే. లండన్ నుండి ప్రచురించబడే లండన్ క్రానికల్ అనే పత్రిక టిపు వర్గ భేదాన్ని, వర్ణ భేదాన్ని పాటించకుండా భారతీయ సైనికులను, బ్రిటిష్ సైనికులను ఒకే సంకెళ్ళలో బంధించేవాడని, సైన్యంలోని అధికారులను, మామూలు సైనికులను

కూడా ఒకే సంకెళ్ళతో బంధించేవాడని వార్త ప్రచురించింది. ఖైదీల దయనీయ పరిస్థితికి సంబంధించి ఎన్నో కవితలు ప్రచురించబడ్డాయి. వీటిలో టిపును 'దబ్లాక్' (నల్లవాడు) అని జాత్యహంకారంతో సంబోధించడం జరిగింది. ఈ నేపథ్యంలో టిపుతో తిరిగి యుద్ధం ప్రారంభించి పోయిన బ్రిటిష్ పరువు ప్రతిష్టలను కాపాడాలనే ధోరణులు ఎక్కువయ్యాయి.

## చార్లెస్ కార్న్‌వాలిస్

1786లో వారెన్ హేస్టింగ్స్ తర్వాత ఛార్లెస్ కార్న్‌వాలిస్ భారతదేశంలోని తూర్పు ఇండియా కంపెనీ గవర్నర్ జనరల్‌గా నియమించబడ్డాడు. అమెరికా స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ సైన్యాలను నడిపిన కార్న్‌వాలిస్ యార్క్‌టౌన్ యుద్ధంలో అమెరికా విప్లవసైన్యాల చేతుల్లో చిత్తుగా ఓడిపోయి వారికి లొంగిపోయాడు. ఈ ఓటమి తర్వాత బ్రిటన్ అమెరికాకు స్వతంత్రం ఇవ్వక తప్పలేదు.

కార్న్‌వాలిస్ ఇంగ్లాండులో భూస్వామ్య వర్గానికి చెందినవాడు. జాత్యహంకారంతో నిండినవాడు. అమెరికాలో తన ఓటమిని మరిపించే ఒక గెలుపుకోసం చూస్తున్నవాడు. మంగుళూరు సంధితో బ్రిటిష్ పరువు పోయిందని భావించినవాడు. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవిస్తరణకు టిపు పెద్ద ఆటంకమని బలంగా నమ్మేవాడు. యార్క్‌టౌన్ యుద్ధంలో అమెరికా విప్లవ సైన్యాల చేతిలో ఓడిపోయినప్పటికీ గొప్ప యుద్ధ నైపుణ్యం కలిగినవాడు. టిపుతో యుద్ధానికి కాలు దువ్వుతూ, కారణం కొరకు వెతుకుతున్నాడు. ఆ కారణం ట్రావెన్కూరు సమస్య రూపంలో కార్న్‌వాలిస్ కు దొరికింది.

## ట్రావెన్కూరు సమస్య

రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఆంగ్లేయులకు సహకరించి తనపై తిరుగుబాటు చేస్తున్న మలబారు (కేరళ) ప్రాంతంలోని నాయర్లపై, టిపు మంగుళూరు సంధి తర్వాత దాడి చేసి వారి తిరుగుబాట్లను విజయవంతంగా అణచివేసాడు. టిపు ఈ విజయాలు కేరళ దక్షిణ ప్రాంతంలోని ట్రావెన్కూరు రాజును కలవరపరిచాయి. మలబారు తర్వాత టిపు తనమీదే దాడి చేస్తాడని అనుమానించాడు. ట్రావెన్కూరు రాజ్యానికి మలబారు ప్రాంతానికి మధ్య సముద్రతీరం నుండి కొండల వరకు సరిహద్దుల్లో కొన్ని కోటలు, బురుజులు, కందకాలు ఉండేవి. వీటిని ట్రావెన్కూరు లైన్స్ అనేవారు. ఇవి ట్రావెన్కూరుకు రక్షణగా ఉండేవి. ఈ నిర్మాణాలకు అవతల డచ్‌వారికి చెందిన జై కొట్టాయ్, క్రాంగనూర్ అనే రెండు కోటలు ఉన్నాయి. ఈ కోటలను 17వ శతాబ్దంలో డచ్‌వారు పోర్చుగీసు వారినుండి జయించారు. 1789లో ట్రావెన్కూరు రాజు ఈ కోటలను డచ్‌వారి వద్దనుండి కొని తన రాజ్యంలో కలుపుకున్నాడు. దీనితో ట్రావెన్కూరు సరిహద్దుల్లో రక్షణ వ్యవస్థ ఇంకా పటిష్టమైంది. కాని ట్రావెన్కూరు రాజు చర్య వివాదాస్పదమయ్యింది.

టిపు వాదన ప్రకారం ఆ రెండు కోటలు తన సామంతుడైన కొచిన్ రాజుకు చెందినవి. డచ్‌వారు ఆ కోటలను కొచిన్‌రాజు వద్ద నుండి లీజుకు మాత్రమే తీసుకున్నారు. వారికి వాటిని ట్రావెన్కూరు రాజుకు అమ్మే హక్కులేదు. రెండు కోటలను ట్రావెన్కూరు రాజు ఖాళీచెయ్యాలని, తనకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేస్తూ ట్రావెన్కూరులో రక్షణ పొందుతున్న మలబారు నాయర్లను వెంటనే తనకు అప్పగించాలని టిపు ట్రావెన్కూరు రాజును డిమాండ్ చేసాడు. ట్రావెన్కూరు రాజు టిపు డిమాండ్లను తిరస్కరించడంతో 1789లో టిపు ట్రావెన్కూరు సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించాడు.

ట్రావెన్కూరు రాజు చర్య అప్పుడు మద్రాసులో తూర్పు ఇండియా కంపెనీ గవర్నరుగా ఉన్న జాన్ హాలెండ్‌కు కూడా నచ్చలేదు. ఈ చర్య టిపుకు ఆగ్రహం కలిగిస్తుందని అతను ముందుగానే ఊహించాడు. ట్రావెన్కూరు తూర్పు ఇండియా కంపెనీతో సైన్య సహకార ఒప్పందం చేసుకుంది. కాబట్టి ట్రావెన్కూరు రాజుకు సహాయంగా తూర్పు ఇండియా కంపెనీ మళ్ళీ టిపుతో యుద్ధంలో పాల్గొనవలసి వస్తుంది. ఇది జాన్‌హాలెండ్‌కు ఎంత మాత్రం అంగీకారం కాదు. ఎందుకంటే అతను యుద్ధప్రియుడు కాదు.

కాని కార్న్‌వాలిస్ మాత్రం ఇటువంటి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాడు. లండన్‌లోని తూర్పు ఇండియా కంపెనీ డైరక్టర్లు భారతదేశంలో తూర్పు ఇండియా కంపెనీ స్థానిక రాజులతో యుద్ధాన్ని, రాజ్యవిస్తరణను వ్యతిరేకించారు. కాని కార్న్‌వాలిస్ టిపు నిరంకుశ చెరనుండి బ్రిటిష్ సైనికులను విడుదల చేయడానికి దీన్ని ఒక ధర్మ యుద్ధంగా అభివర్ణించాడు. అప్పటికే భారతదేశంలోని ఆంగ్లేయులు, ఇంగ్లాండులోని సామాన్య ప్రజానీకం బ్రిటిష్ జాతీయోన్మాదంతో ఆంగ్ల సైనికులను బందీలు చేసిన టిపుపై చర్యతీసుకోవాలనే డిమాండ్ చేస్తున్నారు.

**కార్న్‌వాలిస్ యుద్ధ సన్నాహాలు**

టిపుతో యుద్ధానికి వ్యతిరేకంగా ఉన్న మద్రాసు గవర్నరు జాన్‌హాలెండ్‌ను తొలగించి కార్న్‌వాలిస్ అతని స్థానంలో జనరల్ మెడోస్‌ను నియమించాడు. రెండవ ఆంగ్లో–మైసూరు యుద్ధంలో ఆంగ్లేయులతో సహకరించకుండా తటస్థంగా ఉన్న మరాఠాలను, నిజామ్‌ను మచ్చిక చేసుకున్నాడు. యుద్ధం తర్వాత మైసూరు రాజ్యాన్ని ముగ్గురం పంచుకుందామని ఆశపెట్టాడు. ముందు తటపటాయించినా కార్న్‌వాలిస్ మూడో ఆంగ్ల–మైసూరు యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత జూన్ 1, 1790న మరాఠాలు, జూలై 4, 1790న నిజామ్ టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులతో కలిసి యుద్ధం చెయ్యడానికి కార్న్‌వాలిస్‌తో ఒప్పందాలు చేసుకున్నారు. టిపు బంధువైన కన్ననూర్ పాలకురాలు బీబీతో, కూర్గురాజుతో, మలబారులోని చిరక్కాల్, కడత్తనాడ్, కొట్టాయమ్ రాజులతో కూడా ఆంగ్లేయులు టిపుకు వ్యతిరేకంగా ఒప్పందాలు చేసుకున్నారు.

కాని టిపు ఈ యుద్ధానికి సిద్ధంగాలేడు. దానికి ఒకకారణం టిపుకు ఫ్రెంచ్ సహకారం అందే అవకాశం లేదు. 1783లో ఫ్రెంచ్‌వారికి, ఆంగ్లేయులకు ఐరోపాలో జరిగిన సంధిననుసరించి ఫ్రెంచ్‌వారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా యుద్ధం చెయ్యరు. హైదర్ అలీ, టిపు స్థానిక రాజులతో జరిగిన యుద్ధాల్లో స్వతంత్రంగా వ్యవహరించినా ఆంగ్లేయులతో యుద్ధంలో వారు ఫ్రెంచ్ సహాయాన్ని తీసుకున్నారు.

టిపు మరాఠాలకు, నిజామ్‌కు ఈ యుద్ధంలో పాల్గొనవద్దని, వారితో చర్చలకు సిద్ధమని సందేశం పంపించాడు. కార్న్‌వాలిస్‌కు కూడా అటువంటి సందేశమే పంపించాడు. కార్న్‌వాలిస్ యుద్ధానికి కారణంగా చూపుతున్న ట్రావెన్కూరు లైన్స్ ఆక్రమణను విరమించాడు. అయినప్పటికీ టిపును, మైసూరు రాజ్యాన్ని అణచి వెయ్యాలని కృతనిశ్చయంతో ఉన్న కార్న్‌వాలిస్, మెడోస్ వంటి సామ్రాజ్యవాదులు టిపు విజ్ఞప్తులను బేఖాతరు చేసి మే, 1790లో మూడవ ఆంగ్లో-మైసూరు యుద్ధాన్ని ప్రారంభించారు. విశేషమేమిటంటే లండన్‌లోని బ్రిటిష్ పార్లమెంట్ టిపుతో యుద్ధాన్ని వ్యతిరేకించింది.

## మూడో ఆంగ్లో-మైసూరు యుద్ధ గమనం

మైసూరు రాజ్యానికున్న సౌలభ్యం ఏమిటంటే ఆ రాజ్యం తూర్పు, పడమర కనుమల మధ్య ఉంది. ఈ కనుమలలో అనేక బలమైన కోటలు ఉన్నాయి. ఇవి నిష్ణాతులైన మైసూరు దుర్గాధిపతుల ఆధీనంలో ఉండేవి. యుద్ధం ప్రారంభమయిన తర్వాత జనరల్ మెడోస్ సైన్యాలు ఈ కనుమలను దాటడంలోనే అనేక అపజయాలను పొందాయి. ఈ కోటలను జయిస్తేనే శ్రీరంగ పట్టణం చేరుకోగలరు. టిపు ఈ కనుమలను దాటి ఆంగ్ల ప్రాంతమైన కర్నాటకపై దాడి చేసాడు.

ఈ పరిస్థితులు గమనించిన కార్న్‌వాలిస్ కలకత్తా నుండి మద్రాసు వచ్చి 1791 ఆరంభంలో స్వయంగా యుద్ధంలో పాల్గొనడానికి నిర్ణయించుకున్నాడు. తూర్పు ఇండియా కంపెనీ గవర్నరు జనరల్ స్వయంగా యుద్ధంలో పాల్గొనడానికి సిద్ధపడడం, కార్న్‌వాలిస్ టిపును ఓడించాలని ఎంతగా ఆత్రుత పడుతున్నాడనే విషయాన్ని తెలియజేస్తుంది.

కార్న్‌వాలిస్ మైసూరు రాజ్యంలో శ్రీరంగపట్టణం తర్వాత అత్యంత కీలమైన బెంగుళూరు కోటపై నేరుగా దాడి చేసాడు. ఈ దాడిని టిపు ఊహించలేదు. బెంగుళూరు దుర్గాధిపతి ఎంతగా పోరాడినా కార్న్‌వాలిస్ సైన్యం ముందు ఓడిపోయాడు. మార్చి 1791లో బెంగుళూరు ఆక్రమణతో కార్న్‌వాలిస్ మరాఠా, నిజామ్ ఇతర సంస్థానాధీశులలో ఆంగ్లేయులు టిపును ఓడించగలరనే నమ్మకాన్ని కలిగించాడు. దీనితో వారు ఆంగ్లేయులతో కలిసి టిపు పై దాడిని ముమ్మరం చేసారు.

తర్వాత కార్న్‌వాలిస్, మే 1791లో శ్రీరంగపట్టణం ముట్టడి సన్నాహాలు ప్రారంభించాడు. ఇప్పుడు టిపుకు శ్రీరంగపట్టణాన్ని రక్షించుకోవడం అత్యవసరమయ్యింది.

టిపు శ్రీరంగపట్టణం చుట్టూ రక్షణలను పటిష్టం చేసాడు. ఆంగ్లేయుల దాడి నుండి రక్షణకు సిద్ధమయ్యాడు. టిపుకు ఆంగ్లేయుల పై ఎదురుదాడి చేసే పరిస్థితి లేదు. కాని వర్షాకాలం ప్రారంభం కావడంతో, తిండి ఇతర సరఫరాలు అందక పోవడంతో కార్న్‌వాలిస్ శ్రీరంగ పట్టణాన్ని ఆక్రమించకుండానే వెనుదిరిగాడు.

తర్వాత ఎనిమిది నెలల పాటు కార్న్‌వాలిస్ శ్రీరంగపట్టణం ముట్టడికి పకడ్బందీ వ్యూహాన్ని రచించాడు. ఇప్పుడు మరాఠా, నిజాము సైన్యాలు కూడా యుద్ధంలో పాల్గొంటున్నాయి. కార్న్‌వాలిస్‌కు అదనంగా 20,000 సైన్యం సమకూరింది. అప్పటివరకు ఆంగ్లేయులకు దుస్సాధ్యంగా ఉన్న తూర్పు కనుమలలోని కోటలను ఆంగ్లేయులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కోటలలో ఆంగ్ల యుద్ధ ఖైదీలు ఉండడం విశేషం. ఈ కోటలలో ఒకటైన ఒస్సూరు కోటలోని ఆంగ్ల యుద్ధ ఖైదీలను జూలై, 1791లో టిపు ఊచకోత కోయించాడని ఒక వార్త ప్రచారం అయ్యింది. వరస ఓటములను తట్టుకోలేని టిపు ఈ విధంగా ఉన్మాదిలా ప్రవర్తించాడని బ్రిటిష్‌వారు టిపును విమర్శించారు. టిపుపై ద్విగుణీకృతమైన కసితో దాడి చెయ్యడానికి ఒస్సూరు సంఘటన తోడ్పడింది.

ఫిబ్రవరి, 1792 వరకు శ్రీరంగపట్టణం చుట్టూ ఆంగ్ల, మరాఠా, నిజాము సైన్యాలు మోహరించాయి. ఫిబ్రవరి 6, 1792 రాత్రి శ్రీరంగపట్టణం కోటపై దాడి ప్రాంభమయ్యింది. శ్రీరంగపట్టణం కావేరినది మధ్యలోని ఒకద్వీపంలో నిర్మితమై ఉంది. కోటను ముట్టడించాలంటే నదిని దాటాలి. టిపు మైసూరు సైన్యాలు కోటరక్షణ గురించి తత్తరపడసాగాయి. వారు శత్రు సైన్యాల రాత్రి దాడిని ఊహించ లేదు. అప్పటికీ దుర్భేద్యమైన శ్రీరంగపట్టణం కోటను తమ ఫిరంగులతో ఛేదించడానికి ఆంగ్ల సైన్యాలకు రెండు వారాలు పట్టింది. శత్రుసైన్యాలు కోటలో ప్రవేశించక ముందే టిపు సంధి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఇంకో నాలుగు వారాలు జరిగిన సంప్రదింపుల తర్వాత మార్చి 17, 1792లో టిపుకు ఆంగ్లేయులకు మధ్య శ్రీరంగపట్టణం సంధి కుదిరింది.

## శ్రీరంగపట్టణం సంధి

ఈ సంధి టిపుకు చాలా అవమానకరమైన సంధి. టిపు తన రాజ్యంలో సగ భాగాన్ని కోల్పోయాడు. ఆంగ్లేయులు, మరాఠాలు, నిజామ్ తమ సరిహద్దుల్లోని మైసూరు రాజ్య భాగాలను రొట్టెను ముక్కలు చేసి పంచుకున్నట్టు పంచుకున్నారు. మరాఠాలు కృష్ణానదికి ఉత్తరాన ఉన్న మైసూరు రాజ్యాలను పొందారు. నిజామ్ మైసూరు రాజ్య తూర్పు ప్రాంతాలైన కడప, కంభం, గంజికోటలను పొందాడు. దక్షిణాన మైసూరు ప్రాంతాలైన బారామహల్, దిండిగల్, సేలంను తూర్పుఇండియా కంపెనీ పొందింది. కంపెనీ పశ్చిమాన మలబారులో సుగంధ వ్యాపార కేంద్రాలైన కాలికట్, కన్ననూర్, పాల్ఘాట్‌ను కూడా పొందింది. ఈ ప్రాంతాల రెవెన్యూ కోల్పోవడంతో మైసూరు రాజ్య ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది.

ఆంగ్లేయులకు, నిజామ్‌కు, మరాఠాలకు సరిహద్దుల్లో లేని కూర్గు రాజ్యాన్ని కూడా ఆంగ్లేయులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీరంగపట్టణం సంధితో మైసూరు రాజ్య సరిహద్దులు కుంచించుకుపోయాయి. సగం రాజ్యాన్ని, దాని వనరులను, రెవెన్యూను కోల్పోయిన టిపు నుండి కార్న్‌వాలిస్ 6 కోట్ల యుద్ధ నష్టపరిహారాన్ని డిమాండ్ చేసాడు.

## హామీగా పసివాళ్ళు - కార్న్‌వాలిస్ పైశాచికం

అన్నిటి కంటె టిపును అవమానించ డానికి కార్న్‌వాలిస్ పెట్టిన షరతుపై నష్టపరిహారం పూర్తిగా చెల్లించబడే వరకు పసి వాళ్ళయిన టిపు ఇద్దరు కుమారులను ఆంగ్లేయుల వద్ద హామీగా ఉంచడం. పై షరతులలో దేనిని అంగీకరించకపోయినా తిరిగి యుద్ధాన్ని ప్రారంభిస్తానని కార్న్‌వాలిస్ టిపును బెదిరించాడు.

సమకాలీన రాజకీయాల్లో ఒప్పందాలలోని షరతులు పూర్తిగా అమలు అయ్యేవరకు అధికారులు, మంత్రులు హామీగా ఉండడం అనే పద్ధతి ఉండేది. కాని పసిపిల్లలను హామీగాకోరడంతో కార్న్‌వాలిస్ తన పైశాచికత్వాన్ని ప్రదర్శించాడు. టిపును అవమానించి, కించపరచే ఏ అవకాశాన్నీ కార్న్‌వాలిస్ వదల్లేదు.

హామీగా 18ఏళ్ళ పెద్దకొడుకు ఫత్‌హైదర్‌ను, ఇంకొంతమంది మైసూరు అధికారులను ఇవ్వడానికి టిపు సిద్ధపడ్డాడు. ఆంగ్లేయులు అందుకు ఒప్పుకోలేదు. చాలా క్రూరంగా ఎనిమిదేళ్ళ అబ్దుల్ ఖాలిఖ్‌ను, అయిదేళ్ళ ముయిజ్ ఉద్దీన్‌ను హామీగా ఇవ్వాలని పట్టుబట్టారు. ఆంగ్లేయులు ఎనిమిదేళ్ళ ఖాలిఖ్‌ను పదేళ్ళవాడిగా, అయిదేళ్ళ ముయిజ్ ఉద్దీన్‌ను ఎనిమిదేళ్ళవాడిగా, వారి వయసులను ఎక్కువచేసి ప్రచారం చేసారు. మరీ అయిదేళ్ళ పసివాడిని హామీగా తీసుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆంగ్లేయులకు తెలుసు. ఆ దుర్మార్గపు చర్యను కప్పి పుచ్చుకోవడానికి బ్రిటిష్‌వారు ఆ పసివారి వయసును ఎక్కువ చేసి ప్రచారం చేసారు.

అంతే కాకుండా బ్రిటిష్‌వారు తమ రచనలలో నిరంకుశుడు, మతోన్మాది అయిన టిపు కంటె కార్న్‌వాలిస్ ఆ పసివారికి మంచి తండ్రికాగలడని, బ్రిటిష్ వారి చేతిలో పెరగడం వారి అదృష్టంగా భావించాలని కూడా ప్రచారం చేసారు.

ఆ పసివారిని టిపు సైనికాధికారి గులామ్ అలీఖాన్ కార్న్‌వాలిస్‌కు అప్పగించే దృశ్యాన్ని రాబర్ట్ హెమ్ అనే బ్రిటిష్ చిత్రకారుడు చిత్రించాడు. ఆ పెయింటింగ్ 'లార్డ్ కార్న్‌వాలిస్ రిసీవింగ్ టిపు సాహెబ్స్ సన్స్ యాజ్ హోస్టేజస్' శీర్షికతో ఇంగ్లాండులో చాలా ప్రసిద్ధి చెందింది. ఈ పెయింటింగ్‌లో చిత్రకారుడు రాబర్ట్‌హెమ్ కార్న్‌వాలిస్ పసివారిని హామీగా పొందడం ఒక దుర్మార్గపు చర్యగా కాకుండా, అది ఆంగ్లజాతి విజయం అనే భావన స్ఫురించేలాగున చిత్రించాడు. లండన్‌లోని నేషనల్ ఆర్మీ మ్యూజియమ్‌లో ఆ పెయింటింగ్ ఉంది.

ఆంగ్ల సైనికాధికారి మేజర్ అలెగ్జాండర్ డిరోమ్ ఈ పెయింటింగ్‌ను ఉటంకిస్తూ టిపు పిల్లలకు కార్న్‌వాలిస్ సంరక్షణ దొరకడం వారి అదృష్టంగా అభివర్ణించాడు. ఇతడే తన రచనలలో పిల్లల వయసులను ఎక్కువ చేసి ప్రచారం చేసాడు.

కాని లండన్ నుండి ప్రచురించబడే జనరల్ ఈవెనింగ్ పోస్ట్ అనే పత్రిక ఈ పెయింటింగ్‌లోని దృశ్యం గెలిచినవారికి గర్వకారణమని, ఓడినవారికి బాధాకరమైన అవమానమని వర్ణించింది.

## మూడవ ఆంగ్లో - మైసూరు యుద్ధంలో టిపు ఓటమికి కారణాలు

ఈ యుద్ధంలో టిపు ఓటమికి కారణాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. కార్న్‌వాలిస్ మరాఠా, నిజామ్‌లను తోడుతెచ్చుకుని యుద్ధాన్ని ప్రారంభించాడు. తద్వారా ఆంగ్లేయులకు ఇరవై వేల అదనపు సైన్యం చేకూరింది. టిపు మూడు వైపులనుండి ముట్టడి చేయబడ్డాడు. మొదటి, రెండవ ఆంగ్లో– మైసూరు యుద్ధాలలో బ్రిటిష్ సైన్యాలను మైసూరు సైన్యాలు విజయవంతంగా ఎదుర్కొన్నాయి. అంతకు ముందు మరాఠా, నిజామ్‌తో జరిగిన యుద్ధాలలో టిపు వారిని ఓడించాడు. కాని ఇప్పుడు ఆ మూడు సైన్యాలను మైసూరు సేనలు ఒకేసారి ఎదుర్కోవలసి వచ్చింది.

కార్న్‌వాలిస్ ప్రతిభావంతుడైన సైనికాధికారి. అతను టిపును నిలువరించాలని, లొంగదీయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. గవర్నర్ జనరల్ హోదాలో ఉన్న కార్న్‌వాలిస్ 1791లో స్వయంగా ఈ యుద్ధాన్ని నడిపించడం టిపును ఎలాగైనా ఓడించాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. కార్న్‌వాలిస్ బెంగుళూరు ముట్టడిని టిపు ఊహించలేదు. బెంగుళూరు పతనంతో మైసూరు రాజ్యపతనం నిర్ణయించబడింది.

ఆంగ్లేయులకు తమ బొంబాయి, కలకత్తా స్థావరాలనుండి, ఆహారం, సైన్యం వంటి వనరులు పుష్కలంగా లభించాయి. టిపు ఫ్రెంచ్‌వారి సహాయం కొరకు ఎదురు చూస్తూ సమయం వృథా చేసుకున్నాడు. కార్న్‌వాలిస్ శ్రీరంగపట్టణాన్ని ముట్టడించినప్పుడు కూడా టిపు వ్యూహాత్మకంగా వ్యవహరించలేదు. అయినప్పటికీ శ్రీరంగపట్టణంపై కార్న్‌వాలిస్ మొదటి ముట్టడి విఫలమైంది. తర్వాత కార్న్‌వాలిస్ సమయం తీసుకుని రెండవ ముట్టడిని ప్రణాళికాబద్ధంగా నిర్వహించి విజయవంతం అయ్యాడు.

ఆంగ్ల, నిజామ్, మరాఠా సైన్యాలను టిపు ధైర్యంగానే ఎదుర్కొన్నాడు కాని సహజంగానే టిపు ఓటమి తప్పనిసరి. ఒక సందర్భంలో కార్న్‌వాలిస్ స్వయంగా మైసూరు సైన్యాల ప్రతిభను మెచ్చుకున్నాడు. టిపు ఫ్రెంచ్‌వారి సహకారంతో తన సైన్యాలను ఎంత ఆధునీకరించినప్పటికీ ఆంగ్ల సైన్యాల ఆధునీకరణముందు అవి నిర్వీర్యం అయ్యాయి.

మరాఠా, నిజామ్ సహకారం లేకుండా కార్న్‌వాలిస్ ఈ మూడవ ఆంగ్లో–మైసూరు యుద్ధంలో టిపుపై విజయం సాధించలేకపోయేవాడనేది కూడా నిరాకరించలేని వాస్తవం.

## అధ్యాయం - 6

# నాల్గవ ఆంగ్లో - మైసూరు యుద్ధం : టిపు - ఫ్రెంచ్ స్నేహం ఫిబ్రవరి (3 - 4, మే, 1799)

1792లో మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిపును ఓడించి శ్రీరంగపట్టణం సంధితో భారతదేశంలో విజయ కేతనం ఎగురవేసిన కార్న్‌వాలిస్ 1793లో బ్రిటన్ వెళ్ళిపోయాడు. క్రూరుడైన ఒక తూర్పు దేశ నియంత అయిన టిపు సుల్తాన్‌ను ఓడించి, బ్రిటిష్ జాతి ప్రతిష్టను, విలువలను నిలిపిన ధీరోధాత్తునిగా కార్న్‌వాలిస్‌కు లండన్‌లో ఘనస్వాగతం, సన్మానం లభించాయి. కార్న్‌వాలిస్ పసివాళ్ళైన టిపు కుమారులను జమానత్‌గా తీసుకోవడంపై, అసలు వ్యాపార సంస్థ అయిన తూర్పు ఇండియా కంపెనీ భారత దేశంలో స్వదేశీ రాజులతో యుద్ధాలు చేసి, బ్రిటన్ సైనికుల రక్తాన్ని చిందించి రాజ్యవిస్తరణ చేయడంపై బ్రిటన్‌లోని కొన్ని వర్గాలు, కొందరు మేధావులు అభ్యంతరాలు తెలిపారు, విమర్శలు చేసారు. కాని ఇంగ్లాండులోని సామ్రాజ్యవాదులే కాకుండా, సామాన్య ప్రజానీకం కూడా తూర్పుదేశాలలో బ్రిటిష్ రాజ్య వ్యాప్తిని, తద్వారా బ్రిటిష్ సంస్కృతి, సంస్కారాల వ్యాప్తిని ఈ యుద్ధాల ద్వారా తూర్పు ఇండియా కంపెనీ చేస్తుందని వాదిస్తూ, దాని చర్యలను పెద్ద ఎత్తున సమర్థించారు. ఈ ఉత్సాహంలో అభ్యంతరాలు, విమర్శలు అంత లెక్కలోనికి రాలేదు.

కార్న్‌వాలిస్ తర్వాత భారతదేశంలో తూర్పు ఇండియా కంపెనీ గవర్నర్ జనరల్‌గా 1793–1798 మధ్య కాలంలో జాన్‌షోర్ నియమితుడయ్యాడు. జాన్‌షోర్ ఇంగ్లాండులో మధ్య తరగతికి చెందినవాడు. తనకు ముందు ఉన్న కార్న్‌వాలిస్, తర్వాత వచ్చిన రిచర్డ్ వెల్లస్లీ వలె ప్రభువర్గానికి చెందినవాడు కాదు. జాన్‌షోర్‌కు తూర్పు ఇండియా కంపెనీ వ్యాపార వ్యవహారాలలో తప్ప రాజ్యవిస్తరణలో ఆసక్తిలేదు. ఇతని కాలంలో జరిగిన ఒకే ఒక విశేషం ఏమిటంటే టిపు శ్రీరంగపట్టణం సంధి ననుసరించి, తూర్పు ఇండియా కంపెనీకి చెల్లించవలసిన 6 కోట్ల నష్ట పరిహారాన్ని వాయిదాల్లో చెల్లించడం పూర్తి చేసి హామీగా ఉంచిన తన కుమారులను వెనక్కి తెచ్చుకున్నాడు.

## రిచర్డ్ వెల్లస్లీ, ఒక సామ్రాజ్యవాద జాత్యహంకారి

జాన్‌షోర్ తర్వాత భారతదేశంలో తూర్పు ఇండియా కంపెనీ గవర్నర్ జనరల్‌గా వచ్చిన వ్యక్తి లార్డ్ రిచర్డ్ వెల్లస్లీ. ఇతడు బ్రిటన్‌లో ఆంగ్లో–ఐరిష్ ప్రభువర్గానికి చెందినవాడు. 1781లో 21 సంవత్సరాల వయసులోనే ఐరిష్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో స్థానం పొందాడు. అప్పటి బ్రిటిష్ ప్రధాని విలియమ్ పిట్‌కు సన్నిహితుడు, మార్క్వెస్ ఆఫ్‌వెల్లస్లీ, లార్డ్

లెఫ్టినెంట్ ఆఫ్ ఐర్లాండ్ బిరుదాంకితుడు. 1793లో లండన్‌లోని తూర్పు ఇండియా కంపెనీ బోర్డ్ ఆఫ్ కంట్రోల్‌లో సభ్యుడయ్యాడు. 1798లో గవర్నర్ జనరల్‌గా భారతదేశానికి వచ్చాడు.

వెల్లస్లీ తూర్పు ఇండియా కంపెనీని ఒక వ్యాపార సంస్థగా భావించలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఉపఖండం అంతా విస్తరింపచేసే ఒక సాధనంగా చూసాడు. తీవ్ర ఫ్రెంచ్ వ్యతిరేకి. అప్పుడు ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ విప్లవ భావాలైన స్వాతంత్ర్యం సమానత్వం, సౌభ్రాతృత్వం అంటేనే మండిపడేవాడు. జాత్యహంకారి. ఉపఖండం నుండి ఫ్రెంచ్‌వారి ఉనికిని తుడిచిపెట్టాలని గట్టిగా నిర్ణయించుకునే ఇండియా వచ్చాడు. భారతదేశంలో బ్రిటిష్ రాజ్య విస్తరణ, ఫ్రెంచ్ వారి తొలగింపు అనే రెండు ఆశయాలకు పెద్ద అడ్డంకి టిపు సుల్తాన్. అందుకే మే, 1798లో ఇండియా వచ్చిన రిచర్డ్ వెల్లస్లీ మే, 1799 కల్లా టిపును అంతమొందించాడు.

వెల్లస్లీ గవర్నర్ జనరల్‌గా భారతదేశంలో అడుగుపెట్టిన వెంటనే బలహీనంగా ఉన్న చిన్న చిన్న సంస్థానాధీశులందర్నీ బెదిరించో, బుజ్జగించో తూర్పు ఇండియా కంపెనీ ఆధీనంలోకి తీసుకున్నాడు. హైదరాబాదు నిజామ్ కూడా ఆంగ్లేయులతో సైన్యసహకార ఒప్పందాన్ని కుదుర్చుకుని వారి చేతిలో కీలుబొమ్మగా మారాడు. మైసూరు, మరాఠా రాజ్యాలు మాత్రమే తలెత్తుకొని ఇంకా స్వతంత్రంగా నిలబడి ఉన్నాయి.

1798 జూన్‌లోనే వెల్లస్లీ మద్రాసు, బొంబాయి గవర్నర్లకు టిపుపై యుద్ధానికి సన్నాహాలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసాడు. కాని తూర్పు ఇండియా కంపెనీ డైరక్టర్లు రాజ్యవిస్తరణ కాంక్షతో భారతదేశంలోని సంస్థానాధీశులపై స్వయందాడి (offensive) చేయ వద్దని, సంస్థానాధీశులే బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యుద్ధం ప్రారంభిస్తే ఆత్మరక్షణ (defensive) దాడి చెయ్యాలని వెల్లస్లీని నిర్దేశించారు. టిపుపై దాడికి రంగం సిద్ధం చేసుకొని, దానిని ఆత్మరక్షణ దాడిగా చూపడానికి వెల్లస్లీ సాకు కోసం వెదుకుతున్న సమయంలో, టిపు ఫ్రెంచ్ సంబంధాలు వెల్లస్లీకి సాకుగా దొరికాయి.

మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో అపజయం తర్వాత, తను పోగొట్టుకున్న రాజ్యాన్ని ఫ్రెంచ్ వారి సహాయంతో తిరిగి పొందాలని టిపు ప్రయత్నాలు ప్రారంభించాడు. 1794లో తూర్పు ఇండియా కంపెనీకి చెల్లించ వలసిన నష్ట పరిహారాన్ని పూర్తిగా చెల్లించి తన కుమారులను తెచ్చుకున్న తర్వాత టిపు ఈ ప్రయత్నాలను అధికంచేసాడు. 1797లో మారిషస్‌లోని ఫ్రెంచ్ ప్రభుత్వం వద్దకు సైనిక సహాయం కొరకు ఒక రహస్య దౌత్య రాయబారాన్ని పంపాడు. కాని మారిషస్ ఫ్రెంచ్ గవర్నర్ మలార్‌టిక్ చాలా తెలివి తక్కువగా టిపు రాయబారులను బహిరంగంగా ఆహ్వానించి టిపుకు సాయం చేస్తానని పత్రికా ప్రకటన ఇచ్చాడు. ఆ పత్రికాప్రకటన జూన్ 8, 1798న కలకత్తా నుండి ప్రచురితమయ్యే పత్రికలలో

వెలువడింది. అంతేకాకుండా మే,1798లో నెపోలియన్ ఫ్రాన్స్ నుండి ఈజిప్టు దండయాత్రకు బయలుదేరాడు. నెపోలియన్ తర్వాతి దాడి భారతదేశం పైనేనని గట్టి పుకార్లు బయలుదేరాయి. భారతదేశంలో ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని నిలువరించడానికి టిపు చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసిస్తూ నెపోలియన్ టిపుకు ఒక లేఖ వ్రాసాడు. కాని ఆ ఉత్తరాన్ని ఆంగ్లేయులు చేజిక్కించుకున్నారు. ఇటువంటి సమయంలో టిపు ఆంగ్లేయులకు బద్ధ శత్రువులైన ఫ్రెంచ్ వారితో సంప్రదింపులు జరపడం, రాయబారాలు పంపడం వారితో కలిసి భారతదేశంలోని ఆంగ్లేయులపై దాడి చేసే వ్యూహమేనని, కావున టిపు వైపు నుంచి ఆంగ్లేయులపై దాడి అని, ఆంగ్లేయులు ఆత్మరక్షణ యుద్ధం చెయ్యక తప్పదని వెల్లస్లీ కంపెనీ డైరక్టర్లకు విశ్లేషణ ఇచ్చాడు. ఈ సాకులతో ఒకే దెబ్బకు భారతదేశంలో ఫ్రెంచ్‌వారి పలుకుబడిని తొలగించవచ్చు, బ్రిటిష్ బద్ధశత్రువైన టిపును తుదముట్టించవచ్చు. ఈ వ్యూహాన్ని అమలు చెయ్యడానికి వెల్లస్లీ ప్రణాళికలు రచించాడు.

జూన్ 1798నుండి ఆగష్టు 1798 వరకు వెల్లస్లీ టిపుతో స్నేహ పూర్వక ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపాడు. నవంబరు7, 1798న వ్రాసిన లేఖలో ఈజిప్టులో ఆంగ్లేయుల చేతిలో నెపోలియన్ ఓడిపోయిన విషయం టిపుకు గుర్తు చేసాడు. కాని మారిషస్ ఫ్రెంచ్ గవర్నర్ మలార్‌టిక్ ప్రకటన తెలియనట్టు నటించాడు. ఫ్రెంచ్‌వారు టిపును ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రోత్సహిస్తున్నారని నిందించాడు. కాని వెల్లస్లీ భారతదేశంలోని మరాఠా, హైదరాబాదు, కూర్గు, కొలత్తిరి, ట్రావెన్కూరు సంస్థానాలను రెచ్చగొట్టి టిపుకు వ్యతిరేకంగా వారందరినీ ప్రోత్సహిస్తున్నాడనేది కూడా వాస్తవమే.

ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను నడిపిస్తూనే ఫిబ్రవరి 3, 1799ను టిపు పై దాడికి తారీఖుగా వెల్లస్లీ ముందే నిర్ణయించాడు. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ఆంగ్లేయులు తనపైదాడి చేసే ఉద్దేశంలో లేరని టిపును ప్రక్కదారి పట్టించాయి. కాని జనవరి, 1799లో వెల్లస్లీ టిపుకు వ్రాసిన ఉత్తరంలో టిపు మారిషస్‌కు సైనిక సహాయంకొరకు రాయబారాన్ని పంపిన విషయం తనకు తెలుసని, టిపు ఆ విషయమై 24 గంటల్లో తనకు వివరణ ఇవ్వకపోతే ప్రమాదకరమైన ఫలితాలు ఉంటాయని టిపును హెచ్చరించాడు.

అప్పుడు యుద్ధానికి సిద్ధంగాలేని టిపు, మారిషస్‌కు పంపిన రాయబారం విషయంలో ఆంగ్ల ప్రతినిధితో మాట్లాడడానికి తాను సిద్ధమేనని వెల్లస్లీకి లేఖ పంపాడు. కాని ఆ లేఖ వెల్లస్లీకి చేరకముందే ఫిబ్రవరి 3, 1799న వెల్లస్లీ మైసూరుపై యుద్ధాన్ని ప్రకటించాడు.

రిచర్డ్ వెల్లస్లీ జీవిత చరిత్రవ్రాసిన రాబర్ట్స్ కూడా వెల్లస్లీ టిపు వివరణలను, సంధి ప్రయత్నాలను పట్టించు కోకుండా కేవలం 24 గంటల సమయమిచ్చి టిపుపై దాడి చేసాడని వ్రాసాడు.

మద్రాసు తూర్పు ఇండియా కంపెనీకి చెందిన 21,000 సైన్యం, బొంబాయి నుండి 6,420 సైన్యం, 16,000 నిజామ్ సైన్యంతో మైసూరుపై నాల్గవ ఆంగ్లో - మైసూరు యుద్ధం ప్రారంభమయ్యింది. దక్షిణ భారతదేశంలోని సంస్థానాధీశులందరు బ్రిటిష్‌వారికి సహాయం చెయ్యాలి. లేకపోతే తటస్థంగా ఉండాలని వెల్లస్లీ వారందరికీ ఆదేశాలు జారీచేసాడు. అప్పటికి ఆంగ్లేయులను ధిక్కరించి టిపుకు సహాయంచేసే ధైర్యం ఏ సంస్థానాధీశుడికీ లేదు.

పేష్వా తరపున మరాఠా రాజ్యాన్ని నడుపుతున్న నానా ఫడ్నవీస్ తటస్థంగా ఉండడానికి నిర్ణయించాడు. కాని మరాఠాల్లోనే దౌలత్ రావు సింధియా, బాజీరావు టిపుకు సహాయంచెయ్యాలని పేష్వాను కోరినా, నానాఫడ్నవీస్ అందుకు అంగీకరించలేదు. మరాఠాలు టిపుతో కలిసి నాల్గవ మైసూరు యుద్ధంలో బ్రిటిష్‌వారితో పోరాడి ఉంటే ఫలితాలు వేరుగా ఉండేవని చరిత్రకారుల అభిప్రాయం. టిపును అంతమొందించిన నాలుగు సంవత్సరాల తర్వాత 1803లో రిచర్డ్ వెల్లస్లీ మరాఠాలపై దాడి చేసి వారిని ఓడించి, బలవంతంగా సైన్య సహకార సంధికి ఒప్పించాడు. అప్పటివరకు స్వతంత్రంగా ఉన్న మరాఠా రాజ్యం, బ్రిటిష్ సామంత రాజ్యం అయ్యింది.

మరోప్రక్క 1789లో 1,30,000 ఉన్న టిపు సైన్యం శ్రీరంగపట్టణం సంధితో సగం రాజ్యాన్ని, రెవెన్యూను కోల్పోవడంతో 50,000 తగ్గింది. నాల్గవ మైసూరు యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని టిపు ఇంకో పదివేల మంది సైన్యాన్ని సమీకరించాడు. ఇంతకు ముందు యుద్ధాలలో మైసూరు రాజ్యం, తూర్పు పశ్చిమ కనుమలతో చుట్టబడి ఉండేది. మైసూరు రాజ్యంపై దాడి చెయ్యడానికి ఈ కనుమలలోని మైసూరు కోటలను దాటుకొని రావలసి ఉండేది. కాని శ్రీరంగపట్టణం సంధితో ఈ కోటలన్నీ బ్రిటిష్ ఆధీనంలోకి వచ్చి బ్రిటిష్ సైనిక స్థావరాలుగా మారాయి. ఇప్పుడు ఆంగ్లేయులు నేరుగా ఈ స్థావరాల నుండి శ్రీరంగపట్టణంపై దాడి చేయవచ్చు.

## నాల్గవ ఆంగ్లో - మైసూరు యుద్ధం

(ఫిబ్రవరి 3, 1799 - మే 4, 1799) పరిస్థితులు ఎంతో నిరాశజనకంగా ఉన్నప్పటికీ టిపు నాల్గవ మైసూరు యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఆంగ్లేయుల వైపునుంచి జనరల్ హారిస్, కల్నల్ ఆర్థర్‌వెల్లస్లీ (ఇతడు గవర్నర్ జనరల్ రిచర్డ్ వెల్లస్లీ తమ్ముడు), ఫ్లాయిడ్ వంటి ఉద్ధండులైన సైనికాధికారులు రంగంలోకి దిగారు. టిపువైపు నుంచి మంచి సైనికాధికారులు ఉన్నా, అప్పటికే వారిలోని చాలా మందిని బ్రిటిష్‌వారు డబ్బు, జాగీర్ల ఆశ చూపి తమవైపుకు తిప్పుకున్నారు. టిపు ఎంతగానో నమ్మిన పూర్ణయ్య, సయ్యద్‌సాహెబ్, ఖమ్రెద్దీన్‌ఖాన్, మీర్‌సాదిఖ్ వంటి మైసూరు అధికారులు టిపుకు నమ్మక ద్రోహం చేసారు. మూడవ మైసూరు యుద్ధంలో టిపు ఓటమితో టిపు పతనం తథ్యమని

నమ్మిన వీరు రహస్యంగా ఆంగ్లేయుల పంచన చేరి, టిపును వంచించారు. యుద్ధ ప్రారంభంలో ఆంగ్లేయ సైన్యాలను ఎదుర్కొనే అవకాశం వచ్చినా వీరు వారితో కుమ్మక్కయి టిపు ఓటమికి కారణమయ్యారు. మైసూరు రాజ్యంలో బ్రిటిష్‌వారి గూఢచారి చర్యల గురించి బ్రిటిష్ అధికారులు తర్వాత అంగీకరించారు.

ఫిబ్రవరి 3, 1799న ప్రారంభమయిన యుద్ధం ఏప్రిల్ వరకు శ్రీరంగపట్టణం కోట బయట జరిగింది. ఏప్రిల్ 5 నాటికి ఆంగ్లసైన్యాలు జనరల్ హారిస్ ఆధ్వర్యంలో కోట ముట్టడి ప్రారంభించాయి. ఓటమిని గ్రహించిన టిపు ఏప్రిల్ 20న జనరల్ హారిస్‌కు సంధి ప్రతిపాదనలు పంపించాడు. హారిస్ ఈ క్రింది షరతులతో టిపుకు సంధి ప్రతిపాదనలు పంపించాడు.

1. టిపు తన దర్బారులో బ్రిటిష్, వారి మిత్రులైన సంస్థానాధీశుల రాయబారులను ఉంచుకోవాలి. ఇది పరోక్షంగా మైసూరు రాజ్యాన్ని ఆంగ్లేయుల సామంత రాజ్యంగా చేయడమే.
2. టిపు తన రాజ్యంలోని ఫ్రెంచ్ వారి నందరినీ పంపించేయాలి. ఫ్రెంచ్ వారితో ఎటువంటి సంబంధాలు కొనసాగించరాదు. (ఫ్రెంచ్ వారు టిపు సైన్యానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే కాకుండా, టిపు సైన్యంలో ప్రముఖ పాత్ర నిర్వహించేవారు.)
3. టిపు రెండు కోట్ల యుద్ధపరిహారాన్ని తూర్పు ఇండియా కంపెనీకి చెల్లించాలి.
4. అప్పటి మైసూరు రాజ్యంలో సగభాగాన్ని ఆంగ్లేయులకు ఇచ్చివేయాలి.
5. పై షరతులు పూర్తి అయ్యేవరకు కొంతమంది మైసూరు అధికారులను, తన నలుగురు కుమారులను (వీరిని జనరల్ హారిస్ ఎన్నుకుంటాడు) ఆంగ్లేయుల ఆధీనంలో హామీగా ఉంచాలి.

ఇటువంటి అవమానకరమైన షరతులను టిపు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించడని ఆంగ్లేయులకు తెలుసు. ఈ ప్రతిపాదనలను అందుకున్న 15 రోజుల్లోనే మే 4, 1799 లో ఆంగ్లేయులతో యుద్ధం చేస్తూ టిపు వీరమరణం పొందాడు.

## టిపు జీవితంలో చివరిరోజు

ఆంగ్లసైన్యాలు శ్రీరంగపట్టణాన్ని ముట్టడించి కోటపై ఫిరంగి దాడులను ప్రారంభించినప్పటి నుండీ టిపు కోట నలువైపులా సైన్యం మధ్య తిరుగుతూ వారికి ఆదేశాలు జారీ చేస్తూ ఉండేవాడు. మే 3, 1799 రాత్రి కోట ఉత్తరం వైపున ఉన్న ఒక సత్రంలో ఉండి యుద్ధాన్ని పర్యవేక్షించాడు. ఆ రాత్రి అక్కడే భోజనం చేసి, అక్కడే నిద్రించాడు. మే 4, 1799 తెల్లవారి బ్రిటిష్ ఫిరంగులతో కోట బీటలు వారడంతో

దానిని మరమ్మత్తు చేయవలసిందిగా సైన్యానికి ఆదేశాలిచ్చాడు. అక్కడ నుండి గుర్రంపై రాజ భవనం వెళ్ళి స్నానాదులు ముగించాడు. టిపు ఎప్పుడూ సంప్రదించే ముస్లిం, హిందూ జ్యోతిష్యులు ఆరోజు అంత శుభదినం కాదని, ప్రమాద సంకేతాలున్నాయని, టిపు దానధర్మాలు చేసి శాంతి చెయ్యాలని సలహా ఇచ్చారు.

టిపు పేదలకు బట్టలు, ధనం దానంచేసాడు. చెన్నపట్టణ (ఇది కర్నాటకలో మైసూరు దగ్గర ఉంది) పూజారికి ఒక ఏనుగు, ఒకసంచి నిండా నూనెగింజలు, రెండువందల రూపాయలు బహూకరించాడు.

కొంత మంది బ్రాహ్మణులకు నల్ల ఎద్దును, ఒక పాడి గేదెను, ఒక దున్నపోతును, ఒక నల్లగొర్రెను, నల్లని ముతక అంగీని, ఒక టోపిని, తొంభై రూపాయలను, నూనెతో నిండిన ఒక ఇనుప పాత్రను ఇచ్చాడు. ఈ పాత్రను బ్రాహ్మణులకు ఇచ్చేముందు టిపు నూనెలో తన ముఖ ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. అలా చేస్తే అశుభాలు తొలగిపోతాయనే నమ్మకం ఉండేది.

తర్వాత టిపు కోట ఉత్తరం వైపున ఉన్న సత్రానికి తిరిగివచ్చి భోజనం చెయ్యడం ప్రారంభించాడు. అప్పుడే టిపుకు అత్యంత సన్నిహితుడైన మైసూరు సైన్యాధికారి సయ్యద్ గఫూర్ యుద్ధంలో మరణించాడనే వార్త అందింది. గఫూర్ కోట పశ్చిమ వైపు రక్షణకు నియమించబడ్డాడు. బ్రిటిష్ ఫిరంగి దాడిలో మరణించాడు. ఈ వార్తతో ఖిన్నుడైన టిపు భోజనం మధ్యలోనే వదిలి చేతులు కడుక్కొని గుర్రంపై కోట పశ్చిమ వైపుకు వెళ్ళాడు. కాని టిపు అక్కడికి చేరుకునేటప్పటికే ఆంగ్లేయులు కోట బురుజుపై తమ జెండా ఎగురవేస్తున్నారు. మైసూరు సైన్యాలు చెల్లాచెదురు అవుతున్నాయి. టిపు గుర్రం దిగి తన సైన్యాలకు ధైర్యమిస్తూ సామాన్య సైనికులతో కలిసి శత్రు సైనికులపై కత్తితో తలపడ్డాడు. కాని అప్పటికే బ్రిటిష్ సైన్యం కోటలోపలికి ప్రవేశించి మైసూరు సైనికులను హతమార్చడం ప్రారంభించింది. బయట నుండి బ్రిటిష్ ఫిరంగుల దాడి, ఈ ద్విముఖ దాడికి తట్టుకోలేని మైసూరు సైన్యాలు ఓటమి తప్పదని గ్రహించి పారిపోసాగారు. టిపు గుర్రం ఎక్కి ఇంకో కోట ద్వారం వైపు దూసుకెళ్ళాడు.

తర్వాత కాలంలో కొందరు బ్రిటిష్ చరిత్రకారుల రచనల ప్రకారం టిపు తప్పించుకోవాలంటే అది మంచి అవకాశం కాని టిపు అలా చేయకుండా కోటలోపలికి వేల సంఖ్యలో ప్రవేశిస్తున్న బ్రిటిష్ సైనికులతో ఒక సామాన్య సైనికుడిలా కత్తియుద్ధం చేస్తూ తీవ్రంగా గాయపడ్డాడు. కొందరు మైసూరు సైనికులు టిపును అక్కడి నుండి పల్లకీలో తప్పించే ప్రయత్నం చేసినా టిపు అందుకు ఒప్పుకోలేదు. టిపు వ్యక్తిగత సేవకుడు రజాఖాన్ మీరు టిపు అని బ్రిటిష్ సైనికులతో చెపుతానని టిపుకు విజ్ఞప్తి చేసినా టిపు అందుకు కూడా అంగీకరించలేదు. తాను ఆంగ్లేయులకు బందీగా చిక్కడానికి

అంగీకరించలేదు. ఒక బ్రిటిష్ సైనికుడు టిపు కత్తి ఒరకు ఉన్న ఒక బంగారు గొలుసును లాక్కునే ప్రయత్నం చేసాడు. అప్పటికే గాయాలతో రక్త స్రావంతో ఒరిగిపోతూ ఉన్న టిపు ఆ సైనికుని చర్యను అవమానంగా భావించి అతనిపై కత్తితో దాడిచేసాడు. ఆ సైనికుడు తన పిస్తోలుతో టిపు కణతలపై పేల్చాడు. టిపు మరణించాడు.

## టిపు కోసం వెదుకులాట

అప్పటికే శ్రీరంగపట్టణం కోటపై ఆంగ్లేయుల విజయం నిర్ధారించబడింది. టిపు మరణ వార్త తెలియని ఆంగ్ల సైనికాధికారులు కోటలోని రాజ భవనానికి వెళ్ళి టిపు కుమారులను బంధించారు. టిపు కోసం వెదికారు. టిపు అక్కడ కనిపించకపోవడంతో టిపు పారిపోయాడని వారనుకున్నారు. రాజభవన అధికారి ఒకరు టిపు కోట ఉత్తర ద్వారం వద్ద యుద్ధం చేస్తూ గాయపడ్డాడని తెలిపాడు. కల్నల్ బెయిర్డ్, కల్నల్ అల్లెన్ అక్కడకు వెళ్ళి వెదికారు. టిపు పల్లకి ప్రక్కనే టిపు మృతదేహం ఇతర సైనికుల మృతదేహాల మధ్యపడి ఉంది. టిపు శరీరం పూర్తిగా గాయాలతోనిండి ఉంది. టిపు వ్యక్తిగత సేవకుడు రజాఖాన్ గాయాలతో స్పృహ తప్పి మరణించిన సైనికుల గుట్టల మధ్యపడి ఉన్నాడు. స్పృహలోకి వచ్చిన రజాఖాన్ చెప్పిన తర్వాతనే ఆంగ్లేయ అధికారులు టిపును గుర్తించారు. టిపు ముఖంలో ఇంకా జీవకళ ఉట్టిపడుతోంది. శరీరం ఇంకా వెచ్చగా ఉంది. ఆంగ్ల సైనికాధికారులు టిపు నాడిని పరీక్షించిన తర్వాతే టిపు మరణించాడని నిర్ధారించుకోగలిగారు. ఆ రోజు మే 4, 1799.

## బ్రిటిష్ రాజ్

టిపు మరణించిన ఎనిమిది నెలలకు 18వ శతాబ్దం ముగిసింది. 19వ శతాబ్ద ఆరంభం నుండి భారతదేశంలో ' బ్రిటిష్ రాజ్ ' స్థాపనకు టిపు ఓటమి మరణం అనివార్యం. ఈవిషయాన్ని గ్రహించిన వ్యక్తి గవర్నరు జనరల్ రిచర్డ్ వెల్లస్లీ. వేల మైళ్ళ దూరం నుండి వ్యాపారం కొరకు భారతదేశం వచ్చిన ఆంగ్లేయులు భారతదేశానికి ప్రభువులయ్యారు. ఎదురులేని పాలకులయ్యారు. 18వ శతాబ్దం చివరి సంవత్సరం (1799) లో జరిగిన నాల్గవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఆంగ్లేయులు ఓడిపోయి, టిపు గెలిచి ఉంటే 19వ శతాబ్దపు భారతదేశంలో బ్రిటిష్‌రాజ్ కాకుండా భిన్నంగా ఉండేది. పలాసి (ప్లాసీ) యుద్ధం భారతదేశంలో బ్రిటిష్ రాజ్య విస్తరణకు ప్రారంభమయితే శ్రీరంగపట్టణ పతనం ఆ రాజ్య విస్తరణకు విజయవంతమైన ముగింపు. ఒక ఆంగ్లేయుడు ఇంగ్లాండ్‌లోని తన స్నేహితుడికి వ్రాసిన ఉత్తరంలో "టిపు మరణం భారతదేశాన్ని ఆంగ్లేయుల పాదాల వద్దకు తెచ్చింది" అని వ్రాసాడు.

## శ్రీరంగపట్టణం దోపిడి

టిపు మరణం తర్వాత శ్రీరంగపట్టణన్ని దోచుకోవడానికి ఆంగ్లేయులు తమ సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు. ఈ దోపిడి యథేచ్ఛగా మే6, 1799 వరకు కొనసాగింది. దీనికి నాయకత్వం వహించింది కల్నల్ బ్రెయిడ్, ఇతను రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిపుకు యుద్ధ ఖైదీగా పట్టుబడి తర్వాత విడుదలయ్యాడు. టిపుపై పగతో రగిలిపోతున్న వ్యక్తి ఇతడు. కల్నల్ హారిస్ శ్రీరంగపట్టణ కోట ముట్టడిని ఇతనికి అప్పజెప్పాడు.

మే 4, 1799 రాత్రి శ్రీరంగపట్టణం కోటలోని ప్రతి ఇల్లు దోచుకోబడింది. పౌరులపై అన్నిరకాల అత్యాచారాలు జరిగాయి. ఖరీదైన భవనాలను, ఇళ్ళను తగులబెట్టారు. శ్రీరంగపట్టణం స్వాధీనం తర్వాత అక్కడ అధికారిగా నియమించబడ్డ కల్నల్ ఆర్థర్ వెల్లస్లీ (ఇతడు గవర్నర్ జనరల్ రిచర్డ్ వెల్లస్లీ సోదరుడు.) మే 4, 1799 రాత్రి శ్రీరంగపట్టణంలో జరిగిన అరాచకం, దోపిడీకి సమానమైనది అంతకు ముందుగాని, ఆ తర్వాతగాని ఎక్కడా జరగలేదని స్వయంగా చెప్పాడు. బ్రిటిష్ చరిత్రకారుడు అలెగ్జాండర్ బీట్సన్ లెక్క ప్రకారం 25 లక్షల పగోడాల విలువైన బంగారం, బంగారు ఆభరణాలను బ్రిటిష్ సైన్యం దోచుకుంది. బ్రిటిష్ సైనికులు శ్రీరంగపట్టణంలోని ఇళ్ళ నుండి విలువైన ఆభరణాలను, బంగారు కడ్డీలను, వెండిని, ఇతర విలువైన వస్తువులను దోచుకున్నారు. తాము దోచుకున్నదానిని మోయలేని కొందరు బ్రిటిష్ సైనికులు కొంత భాగాన్ని తమకు ఎదురొచ్చిన తమతోటి సైనికులకు ఇచ్చేసారు. సైనిక శిబిరాల్లో ఇతరులకు బంగారాన్ని అమ్మారు.

పట్టణాన్నే కాదు, టిపు రాజభవనాన్ని కూడా బ్రిటిష్ సైనికులు దోచుకున్నారు. దానిలో 45 లక్షల విలువచేసే ఒక ఆభరణాల పెట్టె ఉన్నది. వజ్రాలు పొదిగి ఉన్న టిపు ముంజేతి కంకణాన్ని ఒక సైనికుడు చేజిక్కించుకున్నాడు. అతడు దానిని తర్వాత తూర్పు ఇండియా కంపెనీకి చెందిన ఒక సర్జన్‌కు1500కు అమ్మాడు. తర్వాత ఆ సర్జన్ సంవత్సరానికి 2000 పౌండ్ల ఆదాయం వచ్చేరీతిలో దానిని అమ్ముకున్నాడు. రాజభవనం దోపిడీని ఆంగ్ల అధికారులు అతి కష్టం మీద ఆపగలిగారు.

ఇంత దోపిడి జరిగిన తర్వాత కూడా రాజభవనంలో ఇంకా ఎంతో సంపద మిగిలింది. బంగారం, వజ్రాలతో పొదిగిన ఒక సింహాసనం, ఒక వెండి అంబారి, మందమైన బంగారు, వెండి కంచాలు, పాత్ర సామగ్రి, వజ్రాలు రత్నాలతో పొదిగిన కత్తులు, పిస్తోళ్ళు, ఖరీదైన తివాసీలు, తానులకొద్దీ పట్టు, మస్లీన్, ఇరవై పెట్టెలనిండా ఆభరణాలు వీటిలో ఉన్నాయి.

ఒక వజ్రాల నక్షత్రం, కొన్ని ఆభరణాలు, టిపుకు చెందిన ఒక కత్తిని తూర్పు ఇండియా కంపెనీ ఆర్థర్ వెల్లస్లీకి బహూకరించింది. ఇంకొక కత్తిని జనరల్ హారిస్

కల్నల్ బ్రెయిడ్‌కు బహూకరించాడు. టిపు సింహాసనాన్ని అలంకరించిన వజ్రాలతో కూడిన పులితల లండన్‌లోని విండ్సర్ భవనానికి అలంకారమయ్యింది. దోపిడి సొమ్ము నుంచి జనరల్ హారిస్ 1,42,902 పౌండ్లను బహుమానంగా పొందాడు. ఇతర సైనికాధికారులు దోపిడి సొమ్ము నుంచి పంచుకున్న మొత్తం 20,000 పౌండ్లుగా తేలింది. టిపు వ్యతిరేక యుద్ధంలో ఆంగ్లేయులకు సహకరించినందుకు హైదరాబాద్ దివాన్ మీర్ ఆలమ్‌కు లక్ష పగోడాలు (పౌండ్లు కాదు) ముట్టాయి. 6000 పగోడాలను హైదరాబాద్ సైనికులకు పంచారు. కంపెనీ సైనికులు పొందిన దానికంటె ఇది చాలా తక్కువని హైదరాబాద్ నిజామ్ అసంతృప్తిని వ్యక్తపరిచాడు.

శ్రీరంగపట్టణంలోని టిపు రాజభవనంలో దొరికిన అతివిలువైన సంపద టిపు గ్రంథాలయం. ఈ గ్రంథాలయంలో అరబిక్, పర్షియన్, ఉర్దూకు చెందిన సుమారు 2000 పుస్తకాలు, తాళపత్ర గ్రంథాలు లభించాయి. ఇవి చరిత్ర, సూఫీతత్వం, వైద్యం హాదిస్ వంటి రకరకాల విషయాలపై రచించబడ్డాయి. ఈ పుస్తకాలతో పాటు ఆంగ్లేయులకు టిపు తన కలల గురించి తన స్వహస్తాలతో వ్రాసుకున్న ఖ్వాబ్‌నామా పుస్తకం కూడా లభించింది.

## బ్రిటిష్ రాజభవనాలలో, మ్యూజియంలలో, లైబ్రరీలలో, ప్రైవేటు వ్యక్తుల వద్ద శ్రీరంగపట్టణం సంపద కళాకృతులు, ఆయుధాలు

శ్రీరంగ పట్టణంలో ఆంగ్లేయులు దోచుకున్న టిపుకు చెందిన ఆభరణాలు, కళాకృతులు, పుస్తకాలు, ఆయుధాలు ఇతర విలువైన వస్తువులను బ్రిటన్‌లోని రాజభవనాలలో, అనేక మ్యూజియంలలో, లైబ్రరీలలో, అప్పుడు ఆంగ్ల సైన్యంలో పనిచేసిన సైనికుల వారసుల వద్ద ఇప్పటికీ మనం చూడవచ్చు. వీటి ప్రదర్శన ద్వారా, అమ్మకాల ద్వారా ఇప్పటికీ బ్రిటన్ ప్రభుత్వానికి ఎంతో ఆదాయం లభిస్తుంది.

'మాసీ టైగర్' గా ప్రసిద్ధిచెందిన బంగారంతో చేసి వజ్రాలు పొదిగిన పులితల, టిపు సింహాసనంపై అలంకరించబడిన పక్షి బంగారు తల, పట్టు మరియు బంగారు దారాలతో ఎంబ్రాయిడరీ చేయబడి టిపు పల్లకీని అలంకరించిన ముఖమల్ దిండ్లు, టిపు రాజ ముద్రికలు, పులి చారలు చిత్రించిన మైసూరు పట్టు జెండాలు లండన్‌లోని విండ్సర్ రాజ భవనాన్ని అలంకరిస్తున్నాయి.

## 'టిపూస్ టైగర్'

ప్రసిద్ధి చెందిన బ్రిటిష్ సైనికుడిపై పడి అతన్ని చీల్చి చెండాడుతున్న బొమ్మ లండన్ లోని విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియంలో ఉంది. ఇది సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తుంది. టిపు దీనిని 1790లో తయారు చేయించాడు. ఈ బొమ్మ టిపు ఆంగ్లేయులను

ఎంతగా వ్యతిరేకించాడో వారిని ఎలా చీల్చి చెండాడాలనుకున్నాడో తెలియజేస్తుంది. పులి ఆంగ్ల సైనికుడిని చంపుతున్నప్పుడు పులి గాండ్రింపు శబ్దం వచ్చేటట్టుగా ఏర్పాటు చేయడం టిపు సాధించిన సాంకేతిక పరిజ్ఞానానికి అద్దం పడుతుంది. ప్రస్తుతం ఆ శబ్దం ఆగిపోయింది. ఆ కాలంలో ఆంగ్లేయులు ఈ బొమ్మను చూసి ఆంగ్ల సైనికుడిపై పడి అతన్ని చీల్చి చెండాడుతున్న పులి మైసూరు పులి టిపు అని భయపడేవారు.

లండన్‌లోనే కాకుండా స్కాట్‌లాండ్‌లోని ఎడిన్‌బరో నగరంలోని నేషనల్ మ్యూజియం, వేల్స్‌లోని పోలిస్ భవనంలో కూడా ఆంగ్లేయులు భారతదేశం నుండి తరలించుకుపోయిన టిపు సంపద ప్రదర్శింపబడుతోంది.

పతనం తర్వాత శ్రీరంగపట్టణంలో జరిగిన దోపిడీలో దొంగిలించిన విలువైన టిపు సంపదను ఆంగ్ల సైనికులు తమ వెంట బ్రిటన్ తీసుకెళ్ళారు. 220 సంవత్సరాల తర్వాత వారి వారసులు ఆ కళాకృతులను అమ్ముకొని ఐశ్వర్య వంతులవుతున్న వార్తలు ఇప్పటికీ తరచూ మీడియాలో వస్తున్నాయి.

ఆంగ్లేయులు టిపు నుండి దోచుకున్న సంపదలో అమూల్యమైనటు వంటిది టిపు గ్రంథాలయం. వివిధ అంశాలపై టిపు సేకరించిన 2000 గ్రంథాలు ఇందులో ఉన్నాయి. వీటిలో అనేకం ప్రస్తుతం బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల్లోని గ్రంథాలయాల్లో మనకు లభిస్తాయి.

## టిపు అంతిమ యాత్ర

టిపు మరణించిన తర్వాతి రోజు టిపు అంతిమ యాత్ర, ఖననం జరిగాయి. మే 5, 1799 సాయంకాలం శ్రీరంగపట్టణంలోని టిపు రాజభవనం నుండి టిపు అంతిమ యాత్ర బయలు దేరింది. టిపు వ్యక్తిగత సేవకులు టిపు శవపేటికను మోసారు. టిపు కుమారుడు అబ్దుల్ ఖాలిఖ్ మరియు టిపు దర్బారుకు చెందిన ఉన్నత అధికారులు శవపేటిక వెంట నడిచారు. నాలుగు యూరోపియన్ సైనిక పటాలాలు కూడా శవపేటిక వెంట నడిచాయి.

టిపు అంతిమ యాత్ర వెళుతున్న వీధులలో ప్రజలు తండోపతండాలుగా నిలబడి నివాళులర్పించారు. శవపేటిక ముందు సాష్టాంగపడి పెద్దపెట్టున రోదించారు.

అంతిమ యాత్ర శ్రీరంగపట్టణంలోని లాల్‌బాగ్‌కు చేరుకున్న తర్వాత టిపుకు సైనిక వందనం సమర్పించబడింది. ఆ తర్వాత టిపు తండ్రి హైదర్‌అలీ సమాధి ప్రక్కన టిపును సమాధి చెయ్యడం జరిగింది. శవ యాత్రలో పాల్గొన్న ప్రజలకు 5,000 రూపాయలు పంచారు. జరిగిన విషాద సంఘటనకు ప్రకృతి కూడా స్పందించినట్టు ఆ మే నెల వేసవి సాయంకాలం ఉరుములు మెరుపులతో పెద్ద తుపాను వచ్చింది. బొంబాయి పటాలానికి చెందిన ఇద్దరు బ్రిటిష్ సైనికాధికారులు ఆ తుపానులో మరణించారు.

## టిపు పతనానికి కారణాలు

నాల్గవ మైసూరు యుద్ధంలో టిపు పరాజయం ఊహించినదే. టిపు పరాజయం బీజాలు మూడవ మైసూరు యుద్ధంలోనే ఉన్నాయి. శ్రీరంగపట్టణం సంధిలో టిపు సగం రాజ్యాన్ని, ఆర్థిక వనరులను విపరీతంగా నష్ట పోయాడు.

గవర్నర్ జనరల్‌గా రిచర్డ్ వెల్లస్లీ రాకతో, అతని రాజకీయ వ్యూహాలతో టిపు పతనం ఇంచుమించు నిర్ధారించబడింది. అయినా ధైర్యం కోల్పోని టిపు ఫ్రెంచ్‌వారి సహాయంతో ఆంగ్లేయులను ఎదుర్కొనే ప్రయత్నం చేసాడు. అప్పుడు ఫ్రాన్స్ విప్లవ పరిస్థితిలో గందర గోళంగా ఉండడంతో టిపుకు సాయం అందించే పరిస్థితి లేదు. కాని మారిషస్ గవర్నర్ మాలార్‌టిక్ వంటి కొందరు ఫ్రెంచ్ అధికారులు సాయం అందిస్తామని నమ్మించి టిపును ప్రక్కదోవ పట్టించారు. టిపుకు ఫ్రెంచ్‌వారి సహాయం అందక పోయినా, టిపు ఫ్రెంచ్ వారితో జరిపిన సంప్రదింపులు వెల్లస్లీ టిపుపై దాడి చేయడానికి ఒక కారణంగా ఉపయోగపడ్డాయి. ఫ్రెంచ్ వారిని గుడ్డిగా నమ్మి బ్రిటిష్ వారితో యుద్ధానికి దిగడం టిపు చేసిన పొరపాటు. కొందరు నమ్మకస్తులైన మైసూరు అధికారులు టిపును ఫ్రెంచ్‌వారి విషయంలో అప్రమత్తం చేస్తున్నప్పటికీ టిపు వారి మాట వినలేదు.

## ఆంగ్లేయుల గూఢచర్యం - నమ్మినవారి నమ్మక ద్రోహం

ఒకవైపు ఫ్రెంచ్‌వారి ద్రోహంతోపాటు నమ్మినవారి నమ్మకద్రోహం కూడా టిపు పతనానికి కారణమయ్యింది.

ఆంగ్లేయులు సంస్థానాధీశులను ఒకరి తర్వాత ఒకరిని ఓడించి ఈ దేశాన్ని ఆక్రమించుకోవడంలో వారి సైనిక చర్యలకంటే వారి గూఢచారి కార్యక్రమాలు ప్రముఖ పాత్ర నిర్వహించాయి. ప్రతి సంస్థానంలో అధికారికంగా కొందరు, అనధికారికంగా కొందరు వీరి ఏజెంట్లు ఉండేవారు. వీరు సంస్థానాధీశుడికి చేరువగా నమ్మకస్తులుగా ఉన్న మంత్రులు, అధికారులను డబ్బు, భవిష్యత్తులో ఉన్నత పదవులు, జాగీర్ల ఆశతో లొంగదీసుకునేవారు. పలాసి (ప్లాసీ) యుద్ధం ముందు కూడా బెంగాల్ నవాబు సిరాజుద్దౌలా సైన్యాధ్యక్షుడు మీర్ జాఫర్‌ను బెంగాల్ నవాబు పదవి ఎరచూపి లొంగదీసుకున్నారు. యుద్ధ సమయంలో బెంగాల్ సైన్యాధ్యక్షుడు మీర్ జాఫర్ యుద్ధం చెయ్యకుండా బ్రిటిష్ వారికి విజయం చేకూర్చాడు. తర్వాత బెంగాల్ నవాబయ్యాడు. బ్రిటిష్ వారి చేతిలో కీలుబొమ్మగా మారాడు.

మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఆంగ్లేయుల విజయంతో భవిష్యత్తులో భారతదేశంలో ఆంగ్లేయుల ఆధిపత్యం తథ్యం అని గ్రహించి అనేకమంది టిపు మంత్రులు, సేనాధిపతులు, అధికారులు ఆంగ్లేయులతో రహస్య మంతనాలు జరిపి ఒప్పందాలు

చేసుకుని, టిపుకు నమ్మకద్రోహం చేయసాగారు. టిపు అధికారులను ఆంగ్లేయులకు అనుకూలంగా మార్చే ప్రయత్నంలో హైదరాబాద్ నిజామ్‌కు దివాన్ అయిన మీర్ ఆలమ్ చురుకైన పాత్ర నిర్వహించాడు. మీర్ ఆలమ్ నాల్గవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో నిజామ్ సైన్యాలకు సైన్యాధిపతిగా ఆంగ్లేయులతో కలిసి టిపుకు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొన్నాడు. యుద్ధంలోని విజయం తర్వాత నిజామ్ మీర్ ఆలమ్‌కు బహుమతిగా ఎనిమిది లక్షల రూపాయలు ఇచ్చాడు. ఈ ధనంతోనే మీర్ ఆలమ్ హైదరాబాద్‌లోని మీర్ ఆలమ్ చెరువును నిర్మించాడు. మీర్ సాదిక్‌కు టిపు తర్వాత మైసూరు నవాబు పదవి ఆశ చూపారు. కాని టిపు మరణం తర్వాత మైసూరును తిరిగి ఒడయారులకు ఇవ్వడానికి బ్రిటిష్‌వారు అప్పటికే రాణి లక్ష్మీ అమ్మణితో ఒప్పందం చేసుకున్నారు. పూర్ణయ్యకు భవిష్యత్తులో ఒడయార్లకు ప్రధానమంత్రి పదవిని ఎరగా చూపారు. 1797లో ఈ కుట్రలు బహిర్గతమయ్యాయి. టిపుకు అత్యంత సన్నిహితులు, నమ్మకస్తులుగా ఉన్నత పదవులను అధిరోహించిన పూర్ణయ్య, మీర్‌సాదిక్, ఖమ్రోద్దీన్, బుద్రుదీన్ జమాఖాన్ వంటి వారు కూడా ఈ కుట్రలో ఉండడం విశేషం. టిపు కిందిస్థాయికి చెందిన కుట్రదారులకు ఉరిశిక్ష విధించి, పూర్ణయ్య, మీర్‌సాదిక్ వంటి ఉన్నత అధికారులకు కారాగార శిక్ష విధించాడు. కాని వారు పశ్చాత్తాపం ప్రకటించి టిపుకు విశ్వాసపాత్రులుగా ఉంటామని వాగ్దానం చెయ్యడంతో టిపు వారిని క్షమించడమే కాకుండా తిరిగి వారిని ఉన్నత పదవులలో పునఃప్రతిష్టించాడు. కాని వీరు తిరిగి ఆంగ్లేయులతో చేరి టిపు పతనంలో పాలుపంచుకున్నారు.

టిపు తన పాలనలో రాజద్రోహులను, తిరుగుబాటుదార్లను తరచూ క్షమించడమే కాకుండా తిరిగి వారికి పదవులు ఇవ్వడం, తిరుగుబాటు చేసే పాలెగార్లకు వారి జాగీర్లను తిరిగి ఇవ్వడం చేసేవాడు. మలబారు నాయర్ల ఆరు తిరుగుబాట్లను క్షమించి, ఏడో తిరుగుబాటుకు వారిని శిక్షించానని టిపు స్వయంగా చెప్పుకున్నాడు. టిపులోని ఈ క్షమా గుణం ద్రోహుల మనసు మార్చలేదు. ఆ క్షమాగుణం చివరకు టిపుకు చేటు తెచ్చింది.

1798లో రిచర్డ్ వెల్లస్లీ భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చిన తర్వాత మైసూరు రాజ్యంలో గూఢచర్య కార్యకలాపాలకు ఏకంగా ఒక కమిషన్ ఏర్పాటు చేసాడు. ఈ కమిషన్‌లో ఒడయారు రాణి లక్ష్మీ అమ్మణి, బ్రిటిష్‌వారు, టిపుకు ద్రోహం చెయ్యడానికి అంగీకరించిన మైసూరు అధికారులు సభ్యులుగా ఉండి టిపు వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించేవారు.

ఆంగ్ల గూఢచారులు ప్రజల మధ్య టిపుకు వ్యతిరేకంగా అనేక దుష్ప్రచారాలు చేసేవారు. ఫ్రెంచ్ విప్లవంలో ఫ్రెంచ్‌వారు దేవుడిని, మతాన్ని, వ్యతిరేకించారని అటువంటి నాస్తికులైన ఫ్రెంచ్‌వారితో టిపు స్నేహం చేస్తున్నాడనే ప్రచారం జరిగేది.

నాల్గవ మైసూరు యుద్ధం జరుగుతుండగానే రిచర్డ్ వెల్లస్లీ శ్రీరంగపట్టణంలో జరుగుతున్న గూఢచర్య కార్యకలాపాల గురించి ఆంగ్లేయ అధికారులకు ఉత్తరాలు వ్రాసాడు. ఈ చర్యల ఫలితంగానే శ్రీరంగపట్టణం కోట అధిపతి మీర్ నదీమ్ బ్రిటిష్ సైనికుల ప్రవేశానికి కోట ద్వారాలను తెరిచాడు. తనపై జరుగుతున్న కుట్రల గురించి టిపుకు మరణానికి ఒక రోజు ముందు తెలిసింది. అప్పటికే సమయం మించిపోయింది. మైసూరు రాజ్యంలో టిపు పటిష్టంగా ఏర్పరచిన గూఢచార శాఖ కూడా టిపుకు ద్రోహం చేసింది.

మద్రాసు ప్రెసిడెన్సీలో పనిచేసే విలియం పెట్రీ అనే ఒక ఆంగ్ల అధికారి ఇంగ్లాండులోని తన మిత్రునికి వ్రాసిన ఉత్తరంలో "నాల్గవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో శ్రీరంగపట్టణం పతనం కేవలం ఆంగ్ల సైనికుల వీరోచిత పోరాట ఫలితం కాదు. ఎప్పటి నుంచో మైసూరు రాజ్యంలో ఆంగ్లేయులు జరిపిన గూఢచర్యల ఫలితం. దానికి సంబంధించిన వివరాలను నేను ఇంగ్లాండు వచ్చినప్పుడు చెబుతాను" అని వ్రాసాడు.

టిపు అధికారులు టిపుకు ద్రోహంచేసినా మైసూరు ప్రజలు టిపును ఎంతగానో నమ్మారు, గౌరవించారు. టిపుకు ద్రోహం చేసిన మీర్‌సాదిక్‌ను టిపుకు విశ్వాసపాత్రులైన సైనికులు చంపారు. యుద్ధం ముగిసి, టిపు మరణించిన తర్వాత ఆ సంగతి తెలుసుకున్న ప్రజలు మీర్‌సాదిక్ శవాన్ని సమాధి నుండి బయటకు తీసి పదిహేను రోజులపాటు శవాన్ని కాళ్ళతో తన్ని, మురికి జల్లి, తిడుతూ తమ కోపాన్ని తీర్చుకున్నారు. వారిని నియంత్రించడం ఆంగ్లేయ అధికారులకు సాధ్యం కాలేదు.

ఇప్పటికీ శ్రీరంగపట్టణంలో టిపు సమాధిని సందర్శించడానికి వచ్చే ప్రజలు మీర్ సాదిక్ సమాధిపై రాళ్ళు విసురుతారు. తను నమ్మినవారి ద్రోహానికి టిపు ఎలా బలైపోయాడనే విషయాన్ని కన్నడ ప్రజలు కన్నడ జానపద పాటలైన ల్యావణీలలో ఇప్పటికీ పాడుకుంటారు.

ఇతర భారతీయ సంస్థానాధీశుల వలె బ్రిటిష్ వారితో సైన్య సహకార ఒప్పందాన్ని చేసుకొని ఆంగ్లేయుల సామంతుడిగా ఉండడానికి అంగీకరించి ఉంటే టిపు రక్షించబడి ఉండేవాడు. కాని ఓడిపోతాను, మరణిస్తానని తెలిసికూడా టిపు అందుకు అంగీకరించలేదు. తన ఆత్మగౌరవాన్ని, స్వాతంత్ర్యాన్ని బ్రిటిష్ వారికి బలి చెయ్యలేదు. తానే బలి అయ్యాడు. అదే టిపు ప్రత్యేకత.

## అధ్యాయం - 7

# టిపు - ఫ్రెంచ్ సంబంధాలే టిపు పతనానికి కారణమా?

### ఫ్రెంచ్ వారితో టిపు సంబంధాలు

టిపు ఫ్రెంచ్ సంబంధాలు 18వ శతాబ్దపు భారతదేశ చరిత్రలో ఒక ప్రముఖమైన మరియు ఆసక్తికరమైన విషయంగా నిలిచిపోయాయి. నాల్గవ మైసూరు యుద్ధంలో టిపు సుల్తాన్ పై దాడికి భారతదేశంలో అప్పటి తూర్పు ఇండియా కంపెనీ గవర్నర్ జనరల్ లార్డ్ వెల్లస్లీ చూపిన కారణం పారిస్‌లోని ఫ్రెంచ్ విప్లవ ప్రభుత్వంతో, నెపోలియన్‌తో, ఫ్రెంచ్ కాలనీ అయిన మారిషస్‌లోని ఫ్రెంచ్ గవర్నర్‌తో టిపు నెరపిన దౌత్య సంబంధాలు.

### ఆంగ్లో - ఫ్రెంచ్ వైరం

ఐరోపాలో ఇరుగు పొరుగు దేశాలైన ఫ్రాన్స్– ఇంగ్లాండులు రాజకీయంగా బద్ధ శత్రువులు. 15వ శతాబ్దంలో భౌగోళిక ఆవిష్కరణలు (కొలంబస్ ఆమెరికాను కనుక్కోవడం, వాస్కోడిగామా భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుక్కోవడం మొ॥) జరిగిన తర్వాత ఆమెరికా, ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికాలలో యూరోపియన్ల వలసలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంలో వలసదేశాల్లోని భూభాగాల ఆక్రమణ కొరకు, అక్కడ వ్యాపార ఆధిపత్యం కొరకు స్పెయిన్, పోర్చుగల్, డచ్, ఫ్రాన్స్, ఇంగ్లాండు వంటి ఐరోపా దేశాల మధ్య పోటీ ప్రారంభమయ్యింది. ఇరుగుపొరుగు దేశాలుగా సహజ శత్రువులైన ఇంగ్లాండు – ఫ్రాన్స్‌ల మధ్య కూడా ఈ పోటీ ఉధృతమై 18వ శతాబ్దంలో పరాకాష్టకు చేరింది. 1744 – 1815 (వాటర్ లూ యుద్ధంలో ఇంగ్లాండు చేతిలో నెపోలియన్ ఘోర పరాజయం వరకు) మధ్య కాలంలో ఫ్రాన్స్ ఇంగ్లాండు మధ్య అయిదు పెద్ద యుద్ధాలు జరిగాయి. యుద్ధం ముగిసి సంధి చేసుకోవడం, మళ్ళీ తిరిగి యుద్ధం ప్రారంభం కావడం జరుగుతూ ఉండేది. ఆ యుద్ధాల, ఆ సంధి ఒప్పందాల ప్రభావం భారతదేశంలో ఇంగ్లీషు తూర్పు ఇండియా కంపెనీ, ఫ్రెంచ్ తూర్పు ఇండియా కంపెనీలు స్థానిక భారతదేశ రాజులతో జరిపే రాజకీయాల మీద ఉండేది.

### ఆంగ్లో - ఫ్రెంచ్ వైరం- భారతదేశ స్థానిక రాజకీయాలపై ప్రభావం

ఆంగ్లేయులైనా, ఫ్రెంచ్ వారైనా, ఈ యూరోపియన్ల సైనిక బలం, ఆయుధ బలం భారతీయ సైన్యాలకంటె సాంకేతిక పరంగా మెరుగ్గా ఉండేది. దీనిని గ్రహించిన స్థానిక రాజులు వారి పరస్పర కలహాలలో ఈ యూరోపియన్ల సైనిక సహాయాన్ని పొందడానికి పోటీ పడేవారు.

కర్నాటక (ప్రస్తుత తమిళనాడు)లో సింహాసనం కొరకు చందా సాహెబ్‌కు మొహమ్మదాలికి జరిగిన పోరులో ఆంగ్లేయులు మొహమ్మదాలీ తరఫున, ఫ్రెంచ్‌వారు చందా సాహెబ్ తరఫున యుద్ధం చేసారు. చరిత్రలో వీటిని కర్నాటక యుద్ధాలనే కాక ఆంగ్లో – ఫ్రెంచ్ యుద్ధాలని కూడా అంటారు. 1748లో హైదరాబాద్ సింహాసనం కొరకు నాజర్ జంగ్, ముజఫర్ జంగ్‌లకు జరిగిన యుద్ధంలో ఆంగ్లేయులు నాజర్ జంగ్ తరఫున, ఫ్రెంచ్ వారు ముజఫర్ జంగ్ తరఫున యుద్ధం చేసారు. 1757లో జరిగిన బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌలాకు, ఆంగ్లేయులకు జరిగిన పలాసి యుద్ధంలో ఫ్రెంచ్ వారు సిరాజుద్దౌలాకు అండగా నిలిచారు. పైన ఉదహరించిన యుద్ధాలలో బ్రిటిష్ సాయం పొందిన పక్షం విజయం సాధించడంతో భారతదేశంలో ఫ్రెంచ్ ప్రాభవం తగ్గింది. అయినప్పటికీ టిపు వంటి సంస్థానాధీశులు ఆంగ్లేయులనెదిరించడానికి ఫ్రెంచ్‌వారి సహాయంపై ఆధారపడవలసి వచ్చేది. ఆంగ్లేయుల కంటె ఫ్రెంచ్ వారి సైనిక బలం తక్కువ కావచ్చు కాని స్థానిక సైన్యంతో పోలిస్తే అది సాంకేతికంగా ఉన్నతమైనదే.

స్థానిక రాజులు యూరోపియన్ల సైనిక సహాయాన్ని పొందేందుకు వారికి విపరీతంగా డబ్బు చెల్లించడమే కాకుండా, సైనిక పోషణ నిమిత్తం కొన్ని ప్రాంతాలను కూడా వారికి అప్పగించవలసి వచ్చేది. ఆంగ్లేయులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని స్థానిక రాజులతో సైనిక ఒప్పందాలను చేసుకుని ఎంతో ధనాన్ని, ఎన్నో ప్రాంతాలను పొంది నెమ్మదిగా భారతదేశాన్ని ఆక్రమించుకుని, ఈ దేశానికి ప్రభువులయ్యారు. ఉదాహరణకు మరాఠాలతో, టిపు సుల్తాన్‌తో నిరంతర వైరం కలిగి ఉండే హైదరాబాద్ నిజామ్ తూర్పు ఇండియా కంపెనీతో సైనిక ఒప్పందం చేసుకుని, ఆంగ్ల సైన్యం ఖర్చుల నిమిత్తం సీడెడ్, సర్కారు జిల్లాలుగా పిలువబడే ఆంధ్ర ప్రాంతాలను ఆంగ్లేయులకు ధారాదత్తం చేసాడు. ఆంగ్ల సైన్యాల కొరకు తన రాజధాని హైదరాబాద్ ప్రక్కనే సికిందరాబాద్ అనే క్రొత్త నగరాన్ని నిర్మించి ఇచ్చాడు.

## మైసూరు ఫ్రెంచ్ సంబంధాల ప్రారంభం

హైదర్ అలీ మైసూరు రాజ్యంలో ఫౌజ్‌దార్‌గా యుద్ధాల్లో పాల్గొన్నప్పటి నుండి యూరోపియన్ సైన్యాల సాంకేతిక పరిజ్ఞానం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆంగ్లేయులతో శతృత్వం దృష్ట్యా హైదర్ అలీ ఇంకొక యూరోపియన్ కంపెనీ అయిన ఫ్రెంచ్ సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే ప్రయత్నం చేసాడు. ఫ్రెంచ్ వారికి ఆంగ్లేయులకు మధ్య ఉన్న వైరంతో హైదర్ అలీ, తర్వాత టిపు ఫ్రెంచ్ వారి స్నేహం కోరుకున్నారు.

1779లో హైదర్ అలీ మొదటి సారి ఫ్రెంచ్ వారి సహాయానికి వెళ్ళి వారి స్నేహాన్ని ప్రారంభించాడు. అమెరికాలో ఫ్రెంచ్ వారికి ఆంగ్లేయులకు మధ్య జరిగిన అమెరికా స్వాతంత్ర్య యుద్ధం భారతదేశంలో కూడా ప్రతిబింబించింది. భారతదేశంలో

మలబారు తీరంలోని ఫ్రెంచ్ స్థావరమైన మాహె పై ఆంగ్లేయులు దాడిచేసి దానిని స్వాధీనం చేసుకున్నారు. హైదర్ అలీ ఫ్రెంచ్ వారి సాయానికి వచ్చి మాహేను ఆంగ్లేయుల నుండి స్వాధీనం చేసుకొని ఫ్రెంచ్ వారికి తిరిగి ఇచ్చాడు.

అప్పటి నుండి మైసూరు, ఫ్రెంచ్ కంపెనీ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సైనిక పరంగా ఒకరితో ఒకరు సహకరించుకోసాగారు.

రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఫ్రెంచ్ సహకారంతోనే మైసూరు ఆంగ్లేయుల పై ఘన విజయం సాధించగలిగింది. ఈ యుద్ధంలో పొల్లిలూరులో టిపు చేతిలో ఆంగ్ల సైనికాధికారి కల్నల్ బెయిలీ ఘోర పరాజయానికి లాలి, పిమెరోన్ అనే ఇద్దరు ఫ్రెంచ్ సైనికాధికారుల యుద్ధ వ్యూహమే కారణం, వీరి సాయంతో మైసూరు సైన్యం పెద్ద ఎత్తున యుద్ధ రాకెట్లను ఆంగ్ల సైన్యంపై ఉపయోగించింది. ఈ యుద్ధంలోనే ఫ్రెంచ్ అడ్మిరల్ సుఫ్రిన్ సముద్ర యుద్ధంలో తనకు పట్టుపడిన అనేక మంది ఆంగ్ల నావికులను యుద్ధ ఖైదీలుగా టిపుకు అప్పగించాడు.

1783లో అమెరికా స్వాతంత్ర్య యుద్ధం ముగిసి ఇంగ్లాండుకు ఫ్రాన్స్‌కు సంధి కుదరడంతో భారతదేశంలోని ఫ్రెంచ్ వారు మైసూరు తరఫున ఆంగ్లేయులతో పోరాడడానికి నిరాకరించి, రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం నుండి హఠాత్తుగా విరమించుకున్నారు. కాని అప్పటికీ మైసూరుదే పైచేయిగా యుద్ధం ముగింపు దశకు వచ్చింది. టిపుకు ఆంగ్లేయులకు మధ్య మంగుళూరు సంధి కుదిరింది.

ఫ్రెంచ్ వారు తమ జాతీయ రాజకీయాలకనుగుణంగా టిపుకు సాయం చేయాలా వద్దా అనే విషయం నిర్ణయించుకునే వారు. అంతేకాని ఆంగ్లేయులను భారతదేశం నుండి తరిమివేయాలనే టిపు ఆశలు, ఆశయాలకనుగుణంగా వారెప్పుడూ టిపుకు సహాయ సహకారాలను అందించలేదు.

అయినప్పటికీ టిపు ఫ్రెంచ్ వారితో స్నేహసంబంధాల కొరకు ఎప్పుడూ తాపత్రయ పడుతూ ఉండేవాడు. భారతదేశం నుండి ఆంగ్లేయులను వెళ్ళగొట్టాలనే తన ఆశయానికి ఫ్రెంచ్ వారి సహకారం తప్పనిసరి అని టిపు భావించాడు. అందుకే రెండవ మైసూరు యుద్ధంలో 1784లో ఆంగ్లేయులపై ఘన విజయం సాధించినప్పటికీ భవిష్యత్తులో వారితో తిరిగి యుద్ధం తప్పదని గ్రహించిన టిపు అందుకు సిద్ధపడుతూ 1787లో ఫ్రెంచ్ సైనిక సహకారం కోసం ఏకంగా అప్పటి ఫ్రెంచ్ చక్రవర్తి 16వ లూయీ వద్దకు పారిస్‌కు ఒక దౌత్య బృందాన్ని మైసూరు నుండి పంపించాడు.

## ఫ్రాన్స్‌కు మైసూరు రాయబారం

రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం ముగిసిన తర్వాత టిపు ఫ్రెంచ్ వారి పట్ల కొంత కినుకతో ఉన్నాడు. రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధం చివరిదశలో ఫ్రెంచ్‌వారు

ఆంగ్లేయులతో సంధి చేసుకుని తనకు సహాయం నిరాకరించడం ఇందుకు కారణం. కాని ఫ్రెంచ్ ప్రభుత్వంలోని కొందరు అధికారులు భారతదేశంలో ఆంగ్లేయులను ధీటుగ ఎదిరించగల సంస్థానాధీశుడు టిపు ఒక్కడే అని గుర్తించి టిపుతో సత్సంబంధాలకు ప్రయత్నాలు ప్రారంభించారు. వారిలో తూర్పు ప్రాంతాలలో ఫ్రెంచ్ వలసల వ్యవహారాలను చూసే వికామ్టె డి సౌలాక్ ఒకరు. అతను తన భారతీయ ప్రతినిధి అయిన రామారావు అనే వ్యక్తిని టిపు వద్దకు పంపి టిపు తన ప్రతిపాదలను నేరుగా పారిస్‌లోని ఫ్రెంచ్ ప్రభుత్వానికి పంపాలని ప్రతిపాదించాడు. దానికి సంబంధించిన ఏర్పాట్లు స్వయంగా తానే చేస్తానని సౌలాక్ టిపుకు సమాచార మిచ్చాడు. భారతదేశంలో అంతగా సత్తాలేని ఫ్రెంచ్ తూర్పు ఇండియా కంపెనీతో వ్యవహరించే కంటే నేరుగా ఫ్రెంచ్ ప్రభుత్వంతో సంప్రదించడం మంచిదనే నిర్ణయానికి వచ్చిన టిపు సౌలాక్ ప్రతిపాదనను అంగీకరించాడు.

తదనుగుణంగా సౌలాక్ అరోర్ అనే ఓడను మన్నెరోన్ అనే నిష్ణాతుడైన నావికాధికారి పర్యవేక్షణలో టిపుకు ఇచ్చాడు.

ఓడ మైసూరు దౌత్యబృందంతో జూలై 22, 1787లో పాండిచ్చేరి నుండి ఫ్రాన్స్‌కు బయలుదేరింది.

ఈ బృందంలో, మైసూరు దౌత్యధికారులైన మొహమ్మద్ దర్వేష్ ఖాన్, అక్బర్ అలీ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉన్నారు. వారితో పాటు సేవకులు, వంటవారు. రక్షణ సిబ్బంది మొత్తం ఎనభై మంది బయలు దేరారు. కాని ఓడ కెప్టెన్ మన్నెరోన్ ఆ సంఖ్యను నలభైకి తగ్గించాడు. ఈ ఓడ మంగుళూరు, మారిషస్, మలగారేవులలో ఆగుతూ పది నెలల తర్వాత జూన్, 1788లో ఫ్రాన్స్ తీరం చేరింది. వీరికి ఫ్రాన్స్‌లో ఘన స్వాగతం లభించింది.

భారతదేశం నుండి బయలుదేరే ముందు టిపు దౌత్య బృందానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాడు. వారు ఫ్రెంచ్ రాజుకు తనకు మధ్య నేరుగా సైనిక సంధి కోసం ఒప్పించాలి. 10,000 మంది ఫ్రెంచ్ సైనికులను పంపించాలి. టిపుతో సంప్రదించకుండా ఫ్రెంచ్ వారు భారతదేశంలో ఆంగ్లేయులతో ఎటువంటి సంధి ఒప్పందాలు చేసుకోకూడదు. ఇది చాలా ముఖ్యమైనది.

టిపు ఫ్రెంచ్ చక్రవర్తికి ఫ్రెంచ్ సాంకేతిక నిపుణులను, ఫ్రాన్స్‌లో లభించే వివిధ జాతుల మొక్కలను పంపించాలని కూడా విజ్ఞప్తి చేసాడు. చక్రవర్తికి టిపు విలువైన కానుకలు పంపించాడు.

ఈ దౌత్య బృందం ఫ్రాన్స్‌లో అయిదు నెలలు ఉంది. ఫ్రాన్స్ చక్రవర్తి పదహారవ లూయి వీరిని చాలా సాదరంగా తగు మర్యాదలతో ఒక రోజు తన దర్బారుకు ఆహ్వానించాడు.

కాని చర్చలు ఎక్కువగా నావికా (Navy) మంత్రి డిలూజరన్, విదేశీ వ్యవహారాల మంత్రి మాంటో మోరిక్‌తో జరిగాయి.

కాని ఫ్రెంచ్ ప్రభుత్వం టిపుతో సైనిక ఒప్పందానికి సిద్ధంగా లేదు. భారతదేశంలో బ్రిటిష్ ఆధిపత్యాన్ని, ఫ్రెంచ్ వైఫల్యాలను ఫ్రాన్స్ గమనించింది. ఫ్రెంచ్ తూర్పు ఇండియా కంపెనీ పాండిచ్చేరి, మాహె వంటి చిన్న స్థావరాలకు మాత్రమే పరిమితమయి ఉంది. ఇంగ్లాండ్ శరవేగంతో బెంగాల్, కర్నాటక వంటి రాజ్యాలను స్వాధీనం చేసుకుంది. అంతేకాక స్వయంగా ఫ్రాన్స్ రాజకీయ ఆర్థిక, సామాజిక పరిస్థితులు కల్లోలంగా ఉన్నాయి. ఫ్రాన్స్ చక్రవర్తి పై తిరుగుబాటుకు రంగం సిద్ధమయ్యింది. (1789లో ఫ్రెంచ్ విప్లవం ప్రారంభమయ్యింది) ఈ పరిస్థితులలో ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ ప్రభుత్వం టిపుతో సైనిక ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా లేదు. కాని ఫ్రెంచ్ మంత్రి లూజర్న్ మైసూరు ఆధీనంలో ఉన్న మలబారులోని మిరియాలు ఇతర సుగంధ ద్రవ్యాల వర్తకంపై ఫ్రెంచ్ ఆధిపత్యాన్ని టిపు ఒప్పుకోవాలని కోరాడు.

టిపు కోరినట్టుగా వృత్తికారులను (artisans) సాంకేతిక నిపుణులను ప్రస్తుతం కొందరిని పంపిస్తామని మైసూరులో పరిశ్రమల స్థాపనకు సహాయం చేయడానికి తర్వాత ఇంకొందరిని పంపిస్తామని చెప్పాడు. మైసూరు దౌత్య బృందం వెంట కొందరు నిపుణులు బయలు దేరారు కూడా. ఈ దౌత్య బృందం అక్టోబరు 9, 1788లో ఫ్రాన్స్‌లో బయలుదేరి మే 11, 1789లో పాండిచ్చేరి చేరుకుంది.

ఫ్రాన్స్ సైనిక సహకారం కొరకు టిపు పంపిన ఈ దౌత్య వైఫల్యం మరియు 1789లో ఫ్రెంచ్ విప్లవ ప్రారంభంతో, కార్న్‌వాలిస్‌కు టిపుపై 1790లో మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధం ప్రకటించడానికి ధైర్యాన్నిచ్చాయి. భారతదేశంలోని మరాఠాలు, హైదరాబాద్ నిజామ్ కార్న్‌వాలిస్‌తో చేరిపోవడం, ఫ్రెంచ్ వారి నుండి ఎటువంటి సహాయం అందకపోవడంతో మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిపు ఒంటరి పోరాటం చేసి ఆంగ్లేయుల చేతిలో ఘోరపరాజయం పాలయ్యాడు.

## మూడవ, నాల్గవ మైసూరు యుద్ధాల మధ్య కాలంలో టిపు ఫ్రెంచ్ సంబంధాలు

మూడవ మైసూరు యుద్ధంలో పరాజయం పాలయ్యి, రాజ్యాన్ని ధనాన్ని పోగొట్టుకుని తన కుమారులను ఆంగ్లేయుల వద్ద హామీగా ఉంచిన టిపు 1794లో తన కుమారులను యుద్ధ నష్టపరిహారం చెల్లించి ఆంగ్లేయుల వద్ద నుండి తెచ్చుకున్న తర్వాత తిరిగి ఆంగ్లేయులను ఓడించి తను పోగొట్టుకున్నవన్నీ తిరిగి వెనక్కి తెచ్చుకోవాలని ఆలోచనలు చేసాడు, కలలుకన్నాడు. ప్రణాళికలు తయారు చేసుకున్నాడు, పత్రాలు వ్రాసుకున్నాడు. తన కలలను సాకారం చేసుకోవడానికి టిపు మళ్ళీ ఫ్రెంచ్ వారి సాయం కొరకు ఆశించక తప్పలేదు.

ఫ్రెంచ్ వారి సహాయంతో ఆంగ్లేయులను భారతదేశం నుండి వెళ్ళగొట్టాలని టిపు ఎంతగా కలలు కన్నాడో టిపు మరణించిన తర్వాత ఆంగ్లేయులకు లభించిన కొన్ని

పత్రాల ద్వారా తెలుస్తోంది. ఆంగ్లేయులు వీటిని టిపు మరణం తర్వాత ప్రచురించారు. టిపు ఈ పత్రాలలోని ప్రణాళికలు ఎప్పటికీ కార్య రూపం దాల్చకపోయినా, రిచర్డ్ వెల్లస్లీ టిపు పై అనైతికంగా ప్రకటించిన నాల్గవ మైసూరు – యుద్ధాన్ని సమర్థించుకోవడానికి ఈ పత్రాలు పనికి వచ్చాయి.

ఆంగ్లేయులకు వ్యతిరేకంగా టిపు ఏప్రిల్, 1797లో ఫ్రెంచ్ వారితో సంధికి ఒక ఒప్పంద పత్రాన్ని తయారు చేసుకున్నాడు. ఈ పత్రాలలో టిపు 10,000 మంది ఫ్రెంచ్ సైనికుల కొరకు, 30,000 మంది భారతీయ సిపాయిల (ఫ్రెంచ్ ఆధీనంలోని భారతీయ సైనికుల) కొరకు ఫ్రెంచ్ ప్రభుత్వాన్ని అడిగాడు. వీరందరూ మైసూరు సైన్యం పర్యవేక్షణలో ఉంటారు. ఆంగ్లేయులను ఓడించిన తర్వాత ఫ్రెంచ్ వారు, టిపు ఆంగ్లేయుల నుండి జయించిన భూభాగాలను ఎలా పంచుకోవాలో కూడా టిపు ఈ పత్రాలలో సూచించాడు. బొంబాయి, మద్రాసులను ఫ్రెంచ్ వారు తీసుకుంటారు. కర్నాటక ప్రాంతం టిపు ఆధీనంలో ఉంటుంది. ఆంగ్లేయులను ఓడించిన తర్వాత వారికి సహాకరించిన స్థానిక రాజులపై టిపు, ఫ్రెంచ్ వారు యుద్ధం ప్రకటిస్తారు. ఈ పత్రాలు ఆంగ్లేయులను భారతదేశం నుండి వెళ్ళగొట్టడానికి టిపు ఎంత తహతహలాడాడో తెలియచేస్తాయి. అందుకు టిపు తన మరణం వరకూ ప్రయత్నించాడు.

## రిపాడ్ ఉదంతం

ఆశించినట్టుగా టిపుకు ఫ్రెంచ్ సహకారం అందలేదు. అంతేకాకుండా కొందరు ఫ్రెంచ్ వారి చేతిలో టిపు మోసపోయాడు కూడా, ఇందుకు ఒక ఉదాహరణ రిపాడ్ అనే ఒక ఫ్రెంచ్ మోసగాడు.

1797లో మంగుళూరు రేవులో ఒక ప్రైవేటు ఓడ ఆగింది. దాని కమాండర్ రిపాడ్ నేరుగా శ్రీరంగపట్టణం వెళ్ళి టిపును కలిసి తను ఫ్రెంచ్ నావికాదళంలో కమాండర్‌నని మారిషస్‌లోని ఫ్రెంచ్ ప్రభుత్వం తనను టిపు వద్దకు ఒక సందేశంతో పంపిందని చెప్పాడు. అదేమిటంటే భారతదేశంలో టిపు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ఫ్రాన్స్ టిపుకు సాయం చెయ్యడానికి సిద్ధంగా ఉందని, అందుకుగాను ఫ్రాన్స్ నుండి అడ్మిరల్ సెరసె, జనరల్ మగలోన్ ఆధ్వర్యంలో వచ్చిన 10,000 మంది ఫ్రెంచ్ సైన్యం మారిషస్‌లో సిద్ధంగా ఉందని చెప్పాడు. టిపు సలహాదారులు, అంతరంగికులు ఈ రిపాడ్ మోసగాడని గుర్తించి అదే విషయం టిపును హెచ్చరించారు. కాని ఆంగ్లేయులపై విజయం కోసం ఆరాటపడుతున్న టిపు వారి మాటను పెడచెవిన పెట్టి వెంటనే మారిషస్ వెళ్ళడానికి ఒక దౌత్య బృందాన్ని సిద్ధం చేసాడు.

## మారిషస్‌కు దౌత్య బృందం

ఈ బృందం అక్టోబర్, 1797లో మంగుళూరు నుండి బయలుదేరి జనవరి, 19 1798లో మారిషస్ రాజధాని సెయింట్ లూయీని చేరింది.

టిపు తన దౌత్య ప్రతినిధులకు తమ రాయబారం రహస్యంగా ఉండాలని ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చాడు. వారు వర్తకుల వలె మారిషస్ చేరాలని చెప్పాడు. మారిషస్‌లో ముఖ్య అధికారులను మాత్రమే కలిసి ఫ్రెంచ్ ప్రభుత్వానికి తన ప్రతి పాదనలు ఇవ్వాలని కూడా చెప్పాడు. ఆ ప్రతిపాదనలు ఏమిటంటే 1. భారతదేశంలోని ఆఖరి ఆంగ్ల సైనికుడిని తరిమివేసేవరకూ టిపు ఆంగ్లేయులతో యుద్ధం చేస్తాడు. 2. ఫ్రెంచ్ సైన్యం మైసూరు రాజ్యంలో అడుగుపెట్టినప్పటి నుండీ ఒక్క మద్యం తప్ప (టిపు మైసూరులో మద్య నిషేధం అమలు పరిచాడు) వారి అవసరాలాన్నింటిని మైసూరు ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. 3. ఫ్రెంచ్ సైన్యాలకు మైసూరు ప్రభుత్వం గుర్రాలను, ఎద్దులను, యుద్ధంలో గాయపడిన వారిని తీసుకెళ్ళడానికి పల్లకీలను కూడా ఏర్పాటు చేస్తుంది. 4. ఫ్రెంచ్ వారు 3,000 మంది అశ్వికదళాన్ని, 3,000 మంది కాల్బలాన్ని, 200 ఫిరంగులను మైసూరుకు పంపించాలి. 5. ఫ్రెంచ్ సైన్యాలన్నీ టిపు ఆధిపత్యంలో ఉంటాయి. 6. టిపు కూడా సైన్యాన్ని సమకూరుస్తాడు. 7. యుద్ధం ముగిసి ఆంగ్లేయులు ఓడిపోయిన తర్వాత వారి భూభాగాలను ఫ్రాన్స్, టిపు పంచుకుంటారు. మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో టిపు కోల్పోయిన మైసూరు రాజ్య ప్రాంతాలు మాత్రం తిరిగి టిపుకు మాత్రమే చెందుతాయి. 8. ఆంగ్లేయులతో ఫ్రెంచ్ వారు ఏదైనా శాంతి ఒప్పందం చేసుకోవాలంటే వారు టిపును సంప్రదించాలి, టిపు పేరును కూడా ఒప్పందంలో చేర్చాలి.

మారిషస్‌లోని ఫ్రెంచ్ గవర్నరు జనరల్ మాలార్‌టిక్ చాలా తెలివితక్కువగా ఈ దౌత్య బృందానికి బాహాటంగా ఘనస్వాగతం పలికాడు. ఊరేగింపుగా వారిని తన భవనానికి తీసుకెళ్ళాడు.

కాని టిపు ప్రతిపాదనలను చూసి మాలార్‌టిక్ ఇబ్బందిపడ్డాడు. మారిషస్‌లో అప్పుడు కేవలం 700 మంది ఫ్రెంచ్ సైనికులు మాత్రమే ఉన్నారు. వారు మారిషస్ రక్షణకు కూడా సరిగ్గా సరిపోరు. కాని టిపును సంతోష పరిచే అత్యుత్సాహంలో మాలార్‌టిక్ ఇంకొక తప్పు చేసాడు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చేసే యుద్ధంలో పాల్గొనటానికి దేశభక్తులైన ఫ్రెంచ్ యువకులు ముందుకు రావాలి అని జనవరి 30, 1798న మారిషస్ పత్రికలలో ప్రకటనలిచ్చాడు. దీనితో కొందరు నిరుద్యోగ ఫ్రెంచ్ యువకులు ముందుకు వచ్చారు. వీరి సంఖ్య ఇప్పటికీ వివాదాస్పదమే. బ్రిటిష్ వారు 100 మంది అంటే, 80 మంది యువకులు 15 మంది నౌకాదళ అధికారులని ఫ్రెంచ్ వారి ఆధారాలు చెబితే, కేవలం 50 – 60 మందని మైసూరు ఆధారాలు చెబుతున్నాయి. మొత్తానికి వీరి సంఖ్య

వందకు మించలేదని అందరూ ఒప్పుకున్నారు. తన దౌత్య సిబ్బందితో వచ్చిన వీరిని చూసి రిపాడ్ తనను మోసం చేసాడని టిపుకు అర్థమయ్యింది.

కాని అప్పటికే ధన వ్యయమే కాకుండా సమయం కూడా వృధా అయ్యింది. తర్వాత టిపు మళ్ళీ శ్రీరంగ పట్టణంలో ఉన్న ఫ్రెంచ్ వారి సలహా మేరకు నేరుగా పారిస్‌లోని జాకోబిన్ విప్లవ ప్రభుత్వానికి సైనిక సహాయం కొరకు రాయబారం పంపించాలని నిర్ణయించుకున్నాడు.

కాని ఈ రిపాడ్ ప్రహసనం, మలార్‌టిక్ తెలివి తక్కువ వ్యవహారం బ్రిటిష్ వారికి లాభించాయి. ఈ మొత్తం వ్యవహారంలో టిపుకు ఎటువంటి ఫ్రెంచ్ సైన్య సహకారం అందకపోయినప్పటికీ టిపు ఫ్రెంచ్ వారి సాయంతో ఆంగ్లేయులతో యుద్ధానికి సిద్ధమవుతున్నాడని ఆంగ్ల గవర్నర్ రిచర్డ్ వెల్లస్లీ టిపును నిందిస్తూ ప్రచారం చేసి నాల్గవ మైసూరు యుద్ధం ప్రారంభించాడు.

## శ్రీరంగపట్టణంలో జాకోబిన్ క్లబ్ సిటిజెన్ టిపు

అప్పుడు ఫ్రాన్స్ దేశంలో ఉధృతంగా జరుగుతున్న ఫ్రెంచ్ విప్లవాన్ని సమర్థించాడు. ఫ్రెంచ్ విప్లవ మూల సూత్రాలైన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం (liberty, equality and fraternity) కావాలని అంగీకరిస్తున్నట్టు ప్రకటించాడు.

1798 నాటికి ఫ్రాన్స్ జాకోబిన్స్ అనే ఒక తీవ్రవాద విప్లవ సంస్థ పాలనలో ఉంది. వీరు తమ ప్రత్యర్థులైన రాచరిక సమర్థకులను, తమను వ్యతిరేకించే వారిని నిర్దయగా చంపేసేవారు. సమాజంలో వర్గ భేదాలు ఉండకూడదని ప్రత్యేక గౌరవ బిరుదు, సంబోధనలను రద్దు చేసి ఫ్రెంచ్ వారు ఒకరినొకరు పౌరుడా (citizen) అని సంబోధించాలని ఆజ్ఞలు జారీచేసారు.

మే 14, 1797లో శ్రీరంగపట్టణంలోని ఫ్రెంచ్ వారు ఒక జాకోబిన్ క్లబ్‌ను స్థాపించారు. ఉదయం ఆరు గంటలకే శ్రీరంగపట్టణంలోని ఫ్రెంచ్ సైనిక కమాండర్ డొంపార్డ్, అప్పుడు శ్రీరంగపట్టణంలో తిష్టవేసి టిపు ఆతిధ్యాన్ని అనుభవిస్తున్న మోసగాడు రిపార్డ్ ఫ్రెంచ్ విప్లవ పతాకాన్ని ఎగురవేసారు. శ్రీరంగపట్టణంలోని ఫ్రెంచ్ వారందరూ టిపు భవనానికి ఊరేగింపుగా వెళ్ళి టిపుకు ఫ్రెంచ్ మద్దతును తెలియచేసారు. క్లబ్ సభ్యులందరూ ప్రపంచంలోని రాజులందరినీ, విజేత టిపు సుల్తాన్‌ను తప్ప, నాశనం చేసి నిరంకుశత్వాన్ని రూపుమాపి ప్రజల స్వాతంత్ర్యాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేసారు. టిపును 'సిటిజెన్ టిపు' అని సంబోధించారు. టిపుకు సిటిజెన్ టోపీ పెట్టారు. టిపు తర్వాత క్లబ్‌లో ఒక స్వాతంత్ర్య మొక్క (liberty tree)ని నాటాడు. ఇదంతా ఒక గొప్ప తమాషాగా బ్రిటిష్ పత్రికలు వెక్కిరించాయి. స్వయంగా రాచరిక వ్యవస్థలో, ఇస్లామ్ మతంలో నమ్మకమున్న టిపు సుల్తాన్, మతాన్ని, దేవుడిని, రాచరిక వ్యవస్థను

నిర్మూలించాలనుకునే ఫ్రెంచ్ విప్లవాన్ని ఎలా సమర్థిస్తాడని ప్రశ్నించాయి. టిపును పదేపదే 'సిటిజెన్ టిపు' అని హేళన చేసాయి. క్రూరుడైన తూర్పు దేశపు రాజైన టిపు, అంతకంటె క్రూరమైన జాకోబిన్ల మంద (mob) పాలన కలిస్తే ప్రపంచానికే ప్రమాదమని ప్రకటించాయి. కావున టిపును నిలువరించడానికి నాల్గవ మైసూర్ యుద్ధం తప్పదని బ్రిటిష్ గవర్నర్ రిచర్డ్ వెల్లస్లీ ప్రచారం చేసాడు.

## ఫ్రాన్స్ చేరుకోని టిపు చివరి రాయబారం

రిపాడ్, మలార్‌టిక్ వ్యవహారాలతో ఫ్రెంచ్ వారిపై ఆధారపడడం వృథా ప్రయాస అని టిపు గుర్తించలేదు. శ్రీరంగపట్టణంలో ఫ్రెంచ్ వారి సలహాతో ఫ్రాన్స్‌కు మార్చి 1798లో ఇంకొక రాయబారాన్ని పంపించాడు. వీరివెంట ఫ్రెంచ్ నావికాధికారి డ్యుబిక్, అతని సహాయకుడు మేజర్ ఫిల్లెటె వెళ్ళారు. టిపు డ్యుబిక్‌కు 20,000 పగోడాలు ఇచ్చాడు. మంగుళూరులో ఆంగ్లేయుల ఓడల సంచారం ఎక్కువ వుండడంతో డ్యుబిక్ మలబారు తీరంలో బహదూర్ ఘర్ అనే రేవు నుండి బయలు దేరాడు. ఈ రాయబారం వీలయినంత త్వరగా ఫ్రాన్స్ చేరుకోవాలని టిపు తొందర పెట్టినప్పటికీ డ్యుబిక్ ఇంకా డబ్బు కోసం టిపుకు ఉత్తరాలు వ్రాస్తూ ఫిబ్రవరి 7, 1799లో అంటే ఇంచుమించు పదకొండు నెలల తర్వాత మారిషస్ వరకే వెళ్ళాడు. అప్పటికే ఫిబ్రవరి 3, 1799న మైసూరు రాజ్యంపై రిచర్డ్ వెల్లస్లీ దాడి ప్రారంభించాడు. డ్యుబిక్ మారిషస్‌లోని ఫ్రెంచ్ ప్రభుత్వం నుండి కొంత డబ్బు తీసుకొని క్రొత్త నౌకను కొని 1799 మే, మొదటి వారంలో మారిషస్ నుండి బయలుదేరాడు. అప్పటికే నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధం ముగిసి టిపు మరణించడం జరిగింది.

ఈ నౌక సెషెల్స్ దీవిని చేరిన తర్వాత అక్కడ డ్యుబిక్ ఇంకొక ఆరు వారాలు వృథాగా గడిపాడు. 1798లో ఈజిప్టులోని నైల్ యుద్ధంలో ఆంగ్లేయుల చేతిలో నెపోలియన్ ఓడిపోయాడు. దీనితో ఐరోపా ఆసియా మధ్య సముద్ర జలాల మీద ఆంగ్లేయుల ఆధిపత్యం నెలకొంది. సెషెల్స్‌లో డ్యుబెక్ నౌకను ఆంగ్లేయులు పట్టుకున్నారు. డ్యుబెక్ తప్పించు కొని పారిపోయాడు. నౌకలోని టిపు దౌత్య సిబ్బందిని ఆంగ్లేయులు బందీ చేసారు. టిపు మరణ వార్తను చెప్పారు. మొదట ఈ వార్తను దౌత్య సిబ్బంది నమ్మలేదు. కాని ఈ వార్త నిజమని తెలిసిన తర్వాత ఫ్రాన్స్‌లోని విప్లవ ప్రభుత్వానికి టిపు కానుకగా పంపించిన రెండు కోట్ల రూపాయలను విలువైన ఆభరణాలను ఆంగ్లేయ నౌకాధికారులకు సమర్పించుకుని వారి చెరనుండి విడుదలయ్యారు.

ఫ్రెంచ్‌వారిని గుడ్డిగా నమ్మడమే టిపు పతనానికి కారణమా?

అవుననే చెప్పాలి.

బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ వలెనే ఫ్రెంచ్ తూర్పు ఇండియా కంపెనీకూడా ఒక వ్యాపార సంస్థ. వీరికి భారతదేశంలోని రాజకీయ పరిస్థితులు అనుకూలించడంతో వారి సామ్రాజ్యవాద విస్తరణ ధోరణిని కొనసాగించాయి. ఈ పోటీలో ఇంగ్లాండుదే పై చెయ్యి అయ్యింది. నెమ్మదిగా ఫ్రాన్స్ వర్తక వ్యాపారాలలోనే లాభాలను వెతుక్కొంది. ఫ్రెంచ్ విప్లవం, నెపోలియన్ ఆవిర్భావం, మళ్ళీ ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌ల మధ్య జాతీయ, సామ్రాజ్యవాద పోటీతో ఫ్రాన్స్ అధికారులు కొందరు టిపుకు అతని ఆంగ్లేయుల వ్యతిరేక పోరాటంలో కొన్ని ఆశలు కల్పించారు. ఫ్రాన్స్ రాజకీయాల్లోని అనిశ్చిత పరిస్థితులను, భారతదేశంలోని ఫ్రెంచ్ కంపెనీ అధికారుల అసమర్థతను టిపు గమనించుకో లేదు. పట్టించుకోలేదంటే సమంజసంగా ఉంటుంది.

తమను నమ్ముకొని తమతో సైనిక ఒప్పందాలు చేసుకున్న స్థానిక రాజులతో ఆంగ్లేయులు వ్యవహరించినంత నమ్మకంగా నిబద్ధతతో ఫ్రెంచ్ వారు ఎప్పుడూ టిపుతో వ్యవహరించలేదు. ఫ్రెంచ్ వారు తమ అవసరాలు, అవకాశాన్ని బట్టి టిపుకు సాయం అందించే వారు లేక ప్రక్కకు తప్పుకునే వారు. రెండవ ఆంగ్లో-మైసూరు యుద్ధం చివరిలో ఫ్రెంచ్ వారు టిపుకు సైనిక సహాయాన్ని నిరాకరించారు అనే సంగతి మనం గుర్తుపెట్టుకోవాలి.

భారతదేశంలోని ఫ్రెంచ్ అధికారులలో భిన్న ధోరణులు ఉండేవి. బుస్సీవంటి సైనికాధికారి, ఫ్రెంచ్ వారు టిపుతో కంటె మరాఠాలు, హైదరాబాద్ నిజామ్‌లతో సఖ్యతగా ఉంటే బాగుండేదని భావించేవాడు. ఫ్రెంచ్ విప్లవకాలంలో ఇండియా వచ్చిన పాండిచ్చేరి సివిల్‌కమిషనర్ లేకారియర్, గవర్నర్ కోస్నీ వంటివారు ఆంగ్లేయులతో పోరాడడానికి భారతదేశంలో టిపు అవసరాన్ని గుర్తించి టిపుతో సైనిక సంధికొరకు పారిస్‌కు పత్రాలు పంపించేవారు. కాని పారిస్ ప్రభుత్వం వీటికి ఎప్పుడు సుముఖంగా స్పందించలేదు. డిసౌలాక్ వంటి ఫ్రెంచ్ అధికారులు టిపు దౌత్య బృందం ఫ్రాన్స్ వెళ్ళడానికి ఏర్పాటు కూడా చేసారు. ఫ్రాన్స్ ప్రభుత్వం టిపును ఎన్నడూ గంభీరంగా తీసుకోలేదు. కాని టిపు మాత్రం స్థానిక ఫ్రెంచ్ కంపెనీ అధికారుల కంటె నేరుగా పారిస్ ప్రభుత్వంతో సైనిక ఒప్పందానికి ప్రయత్నాలు చేసి ప్రతిసారి విఫలమయ్యాడు. ఈ ప్రయత్నాల ద్వారా టిపుకు ఒరిగిందేమీ లేకపోగా ఆంగ్లేయులతో శత్రుత్వం మాత్రం పెరిగింది.

ఫ్రాన్స్‌తో సైనిక ఒప్పందం కోసం టిపు పడుతున్న తాపత్రయాన్ని చూసి రిపాడ్ డ్యూబెక్ వంటి ఫ్రెంచ్ కంపెనీ అధికారులు టిపు దగ్గర డబ్బు వసూలు చేసి అతనిని మోసం చేసారు. టిపు ఫ్రెంచ్ అధికారులను తరచూ ధనం, విలువైన బహుమానాలతో సత్కరించేవాడు. రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిపు ఫ్రెంచ్ వారికి 17 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చి ఫ్రెంచ్ వారు తిరిగి ఇస్తామన్నా తీసుకోలేదు. మలబారులోని

సుగంధ ద్రవ్యాల వర్తకం విషయంలో ఫ్రెంచ్‌వారికి అనేక రాయితీలు ఇచ్చేవాడు. ఫ్రెంచ్ కంపెనీ మలబారు వర్తకం మీద పూర్తి గుత్తాధిపత్యం తమకే ఇవ్వాలని టిపును నిరంతరం డిమాండ్ చేసేది. ఒక ఫ్రెంచ్ అధికారి ఏకంగా మలబారులో టిపుకు వ్యతిరేకంగా ఉండే నాయర్లను, ఇతర చిన్న రాజులను టిపుపై తిరుగుబాటు చెయ్యడానికి కూడా ప్రోత్సహించాడు. ఈ విషయాలన్నీ టిపుకు తెలుసు. టిపు ఫ్రెంచ్ వారికి వ్రాసిన ఒక ఉత్తరంలో మీ వలన నాకు లాభంకంటె నష్టం ఎక్కువ జరుగుతుందని కూడా వ్రాసాడు.

కాని టిపుది నిస్సహాయ స్థితి. భారతదేశంలోని ఇతర సంస్థానాధీశులు ఆంగ్లేయులతో చేరి తనపై శత్రుత్వం వహిస్తుంటే ఆంగ్లేయులతో పోరాడడానికి ఫ్రెంచ్ సైన్యం, వారి సాంకేతిక సహాయం తప్పనిసరి అని టిపు భావించాడు.

టిపు ఫ్రెంచ్ వారి సహాయం కోరిన సమయంలో ఫ్రెంచ్ విప్లవం కారణంగా ఫ్రాన్స్ రాజకీయాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొని ఉంది. నెపోలియన్ కొన్ని ఆశలు కల్పించినా, ఈజిప్టులోని నైల్ యుద్ధంలో ఆంగ్లేయుల చేతిలో నెపోలియన్ ఓటమి తర్వాత ఆంగ్లేయులదే పై చేయి అయ్యింది.

నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో ఆంగ్లేయులు యుద్ధ విరమణకు టిపు తన రాజ్యంలోని ఫ్రెంచ్ వారిని తమకు అప్పగించాలని ప్రతిపాదించారు. ఫ్రెంచ్ కమాండర్ చాప్పీ మైసూరు రాజ్య రక్షణ కోసం తాము ఆంగ్లేయులకు లొంగిపోతామని టిపుకు చెప్పాడు. టిపు అందుకు నిరాకరించాడు. ఓటమి అంచున ఉండి కూడా టిపు తన ఆశ్రయంలో ఉన్న ఫ్రెంచ్ వారిని వారి శత్రువులకు అప్పగించడానికి నిరాకరించాడు. అదీ టిపు వ్యక్తిత్వం.

## అధ్యాయం - 8

# టిపు పై బ్రిటిష్ సాహిత్యం, కళలు, వార్తా పత్రికలు - పార్లమెంటు లో చర్చలు

18వ శతాబ్దంలో భారతదేశాన్ని పాలించిన ఏ ఇతర రాజులు, నవాబులు, సంస్థానాధీశుల గురించి వెలువడనంత చరిత్ర రచన, సాహిత్యం, నాటకాలు, వార్తా పత్రికల కథనాలు, కార్టూన్లు, పెయింటింగ్‌లను, బ్రిటిష్ పార్లమెంటులో చర్చలను ఆంగ్లేయులు టిపు సుల్తాన్ గురించి వెలువరించారంటే అతిశయోక్తి కాదు.

18 శతాబ్దంలోని చివరి రెండు దశాబ్దాలలో ఒక్క టిపు సుల్తాన్ తప్ప భారతదేశంలోని ఇతర సంస్థానాధీశులందరూ బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీకి దాసోహం అనే పరిస్థితి వచ్చింది. భారతదేశంలో తమ సామ్రాజ్య విస్తరణకు, ఆధిపత్యానికి టిపు ఒక్కడే అడ్డంకి అనే భావన తూర్పు ఇండియా కంపెనీ వర్గాల్లో నాటుకుపోయింది. మొదటి, రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధాలలో మైసూరు చేతిలో ఆంగ్లేయుల పరాజయం కూడా తూర్పు ఇండియా కంపెనీ అధికారులను కలవరపరిచింది. రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో వేల సంఖ్యలో తూర్పు ఇండియా కంపెనీ సైనికులు టిపుకు బందీలుగా పట్టుబడ్డారు. వీరిలో ఆంగ్లేయులే కాకుండా భారతీయులు, ఇతర దేశాల నుండి వలస వచ్చిన కిరాయి సైనికులు కూడా ఉన్నారు. రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో పట్టుబడిన 1200 మంది యూరోపియన్, 3000 మంది భారతీయ సైనికులను టిపు 1784 మంగుళూరు సంధి తర్వాత విడుదల చేసాడు. విడుదలైన సైనికులలో చాలా మంది బందీలుగా ఉన్నప్పుడు టిపు తమను బాగా చూసుకున్నాడని బ్రిటిష్ చక్రవర్తి, మూడవ జార్జి పుట్టిన రోజైన జూన్ 4న తమకు ఒక్కొక్క నాణెం బహుమతిగా ఇచ్చాడని చెప్పారు. కాని యూరోపియన్ సైనికులలో కొంత మంది ముస్లింలుగా మత మార్పిడి చేసుకొని టిపు సైన్యంలో ఉన్నతమైన పదవులను పొందడం జరిగింది. బ్రిటిష్ పత్రికలు, తూర్పు ఇండియా కంపెనీ అధికారులు తర్వాత ప్రచారం చేసినట్టు టిపు బలవంతంగా మత మార్పిడి చేస్తే అందరినీ చేసేవాడు, కేవలం కొంత మందినే ఎందుకు చేసేవాడు. మత మార్పిడి చేసుకుంటే ఉన్నత పదవుల ఆశతో కొందరు స్వచ్ఛందంగా మత మార్పిడులు చేసుకొని ఉండవచ్చు. ప్రయోజనాల నాశించి మత మార్పిడులు చేసుకోవడం చరిత్రలో తరచూ జరిగింది.

18వ శతాబ్దంలో యూరోపియన్ సైనికులు భారతీయ సంస్థానాధీశుల కొలువులో చేరి మెరుగైన అవకాశాల కోసం భారతీయ జీవనాన్ని అనుసరించేవారు. కొందరు భారతీయ

దుస్తులు ధరించి రోజువారీ జీవితంలో భారతీయుల్లాగానే జీవించేవారు. చాలా మంది భారతీయ స్త్రీలను వివాహం చేసుకునే వారు. పదవి, ఆర్థిక ప్రయోజనాల కోసం ఈ 'కంచె' దాటడం అన్ని చోట్లా ఉండేది. వీరిని ఆంగ్లేయులు నబోబ్స్ (నవాబులు), యూరోపియన్ ముసల్‌మానులుగా పిలిచేవారు.

కాని తూర్పు ఇండియా కంపెనీ అధికారులు మొదటి రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధాల్లో టిపుతో తమ అపజయాన్ని కప్పి పుచ్చుకోవడానికి బ్రిటిష్ సామాన్య ప్రజానీకాన్ని బ్రిటిష్ జాతీయ వాదం పేరుతో రెచ్చ గొట్టారు. ఒక తూర్పు దేశ నియంత చెరలో ఆంగ్ల సైన్యం బందీలుగా ఉండడం తమ తెల్లజాతికి అవమానం అని ప్రచారం చేసారు.

ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే అంతకు ముందు ఆంగ్ల అధికారులు గాని, ఆంగ్ల జనసామాన్యం గాని, టిపును నియంతగా, ముస్లిం మతోన్మాదిగా ఎక్కడా పేర్కొనలేదు. 1783లో మద్రాసు ఆంగ్ల అధికారి మెకార్టినీ, టిపు తన తండ్రి హైదర్ అలీ కంటె సంయమనం కలవాడని, పాశ్చాత్య రాజకీయ విధానాలపై గౌరవం కలవాడని, యుద్ధ ఒప్పందాలను ఉల్లంఘించకుండా వాటికి కట్టుబడి ఉండే వాడని ప్రశంసించాడు.

ఆంగ్ల సైన్యంలో పని చేసిన మేజర్ అలెగ్జాండర్ డిరోమ్ టిపు రాజ్యంలో పల్లెలు, పట్టణాలు ఎంతో ఐశ్వర్యవంతంగా ఉన్నాయని వ్యవసాయం ఎంతో ఉత్సాహంగా కొనసాగేదని వ్రాసాడు. టిపు తన సైన్యంపై ప్రభువు, సర్వాధికారి అయినప్పటికీ ఆ అధికారం అణచివేసే విధంగా కాకుండా ప్రజలకు మేలు చేసే విధంగా ఉండేదని, టిపు తన శత్రువులతో మాత్రమే క్రూరంగా ఉండేవాడని వ్రాసాడు.

కాని రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో అపజయం తర్వాత కార్న్‌వాలిస్ వంటి బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు టిపు పై ఇంకొక యుద్ధం చేయవలసిన అవసరం ఏర్పడింది. కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు స్థానిక రాజులతో యుద్ధాలను వ్యతిరేకిస్తున్నారు. దీనితో టిపుపై యుద్ధానికి కారణాలు వెతికే క్రమంలో కార్న్‌వాలిస్ లాంటి వారికి ఆంగ్ల యుద్ధ ఖైదీల అంశం ఒక సాకుగా లభించింది. టిపును ఒక క్రూర దుర్మార్గ నియంతగా, ఒక ముస్లిం మతోన్మాదిగా, యుద్ధ ఒప్పందాలను ఉల్లంఘించే పాలకుడిగా, నమ్మలేని ఒక మోసగాడిగా చిత్రీకరించారు. వాస్తవానికి మొదటి రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధాల ఒప్పందాలను ఉల్లంఘించింది ఆంగ్లేయులే. కార్న్‌వాలిస్, తర్వాత లార్డ్ వెల్లస్లీ టిపుతో తమ యుద్ధాలను సమర్థించుకుంటూ తూర్పు ఇండియా కంపెనీ డైరక్టర్లకు వ్రాసే ఉత్తరాలలో టిపును పై విధంగా వర్ణించేవారు. వెల్లస్లీ సమయంలో యుద్ధ ఖైదీలు, ఆంగ్ల జాతీయాభిమానం అనే అంశాలు మరుగున పడిపోయి టిపు – ఫ్రెంచ్ స్నేహం నాల్గవ ఆంగ్లో – మైసూరు యుద్ధం టిపు పై దాడికి ఒక సాకుగా ఉపయోగపడింది.

విశేషమేమిటంటే టిపు మరణించిన తర్వాత 19వ శతాబ్దంలో కూడా టిపుపై ఈ దుష్ప్రచారం ఇంకా ఎక్కువగా కొనసాగింది. ఆంగ్ల సాహిత్యం కళలలో టిపు నియంతృత్వాన్ని, క్రూరత్వాన్ని ఎటువంటి ఆధారాలు లేని చిలువల పలువల కథనాలతో, కొన్నిసార్లు హాస్యాస్పదంగా కూడా అనిపించేలా రచించడం జరిగింది. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు భారతదేశంలో తమ అక్రమ సామ్రాజ్య విస్తరణను సమర్థించుకోవడానికి టిపు వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారనిపిస్తుంది. ఈ రచనలలో టిపు వంటి నియంతల నుండి ఆంగ్లేయులు భారత ప్రజలను రక్షించి వారికి బ్రిటిష్ విలువలైన సమానత్వం, స్వాతంత్ర్యాన్ని అందించారు అనే భావం ఉండేది.

దురదృష్టవశాత్తు ఆధునిక స్వతంత్ర భారతదేశంలో కూడా కొన్ని వర్గాలు తమ రాజకీయ స్వార్థం కొరకు, బ్రిటిష్ వారు వారి స్వార్థ ప్రయోజనాల కొరకు టిపు పై జరిపిన దుష్ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి.

**నాటకాలు**

1791లో మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధం కొనసాగుతుండగానే లండన్‌లో టిపు వ్యతిరేక ఉద్యమం ఊపందుకుంది.

సాడ్లర్స్ వెల్ అనే నాటక కంపెనీ 1791లో ఈస్ట్ ఇండియా కేంపెయినింగ్ (East India Campaigning) అనే నాటకాన్ని ప్రదర్శించింది. ఈ నాటకం అంతా టిపు సుల్తాన్‌ను తిడుతూ అపహాస్యం చేస్తూ ఉంది. ఆంగ్ల సైనికుడు ఒక పాటలో టిపును The Black (నల్లజాతివాడా) అని కూడా సంబోధిస్తాడు. తెల్లజాతి సైనికులు టిపును జయిస్తారని శపథం చేస్తాడు. తెల్లజాతి ఔన్నత్యాన్ని తూర్పు దేశాల అనాగరికతను ఎత్తి చూపే ఈ నాటకం ఎంతో విజయవంతమయ్యింది. టిపును తిడుతూ, సవాల్ చేస్తూ పాడిన పాటలు ఎంతో జనరంజకమయ్యాయి.

ఈ నాటకంలో డెనిస్ ఓనీల్ అనే పాత్ర టిపు ను సంబోధిస్తూ ఇలా పాడుతుంది.

నియంతా! ఎప్పటికైనా సాహసం జయిస్తుంది.
అవమాన పడడం కంటె చావును ఎదుర్కోవడం మేలు
మా దేశ శత్రువును ఎదుర్కోలేక పోతే మా జీవితం వ్యర్థం
అవమానాన్ని ఎదుర్కొనే ముందు మేము సంతోషంగా మరణిస్తాం.

ఈ నాటకంలో భారతదేశంలో ఒక సంస్థానాధీశుడైన టిపును మొత్తం ఇంగ్లాండు దేశానికి జాతీయ శత్రువు (national enemy) గా ప్రకటించారు.

ఈ నాటకంలో ఆంగ్లో – మైసూరు యుద్ధ దృశ్యాలు, టిపు అంతఃపుర దృశ్యాలను లండన్ ప్రేక్షకులు కేరింతలు కొడుతూ తిలకించారు. కొన్ని నెలల వరకు ప్రతి షో హౌస్ ఫుల్‌గా నడిచింది. ఆంగ్ల పత్రికలు ఈ నాటకాన్ని పొగుడుతూ రివ్యూలు వ్రాసాయి.

ఈ నాటకం విజయవంతం కావడంతో దీనిని అనుకరిస్తూ ఇంకొన్ని నాటకాలు వచ్చాయి. వాటిలో పై నాటకమంత ప్రజాదరణ పొందిన ఇంకొక నాటకం "టిపు సాబ్స్ టు సన్స్" (Tipu Saheb's two sons). మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధం ఆంగ్లేయుల ఘన విజయం తర్వాత 1792లో ఈ నాటకం ప్రదర్శించబడింది. శ్రీరంగపట్టణ సంధిలో కార్న్‌వాలిస్ టిపు ఇద్దరు పసిపిల్లలను హామీగా తీసుకోవడం ఈ నాటకంలో చూపించబడింది. టిపు ఇద్దరు కుమారులు తమ తండ్రిని వదలి కార్న్‌వాలిస్ రక్షణలోకి వచ్చిన దృశ్యం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ఇక్కడ కార్న్‌వాలిస్ పసిపిల్లలను హామీగా కోరిన ఒక క్రూరుడిగా కాకుండా టిపు నుండి అతని పిల్లలను రక్షించే ఒక రక్షకుడిగా చూపించబడ్డాడు. ఈ నాటకంలో ఒక పాత్ర "నీవు తూర్పు ఇండియా కంపెనీకి చెల్లించవలసిన నష్టపరిహారాన్ని చెల్లించకపోతే నీ కుమారులను ఇంక చూడలేవు" అని టిపును హెచ్చరిస్తుంది. ఆస్టే రాయల్ సెలూన్ అనే నాటక కంపెనీ ప్రదర్శించిన ఈ నాటకం ప్రచారం (advertisement) లో ఆ కంపెనీ వారు టిపు తన పిల్లలను ఎలా వదులుకున్నాడో "రండి, వచ్చి చూడండి" అని ప్రచారం చేసుకున్నారు.

నాల్గవ మైసూరు యుద్ధం ముగిసిన తర్వాత ఇదే కంపెనీ ద స్టార్మింగ్ ఆఫ్ శ్రీరంగపటమ్ (The Storming of Srirangapatnam) అనే నాటకాన్ని ప్రదర్శించింది. ఈ నాటకంలో ప్రచారంలో "మీరు ఏనుగులను, గుర్రాలను ఒంటెలను చూడవచ్చు, టిపు సైన్యాన్ని అతని జనాన్ని చూడవచ్చు, శ్రీరంగపట్టణం తగలబడి పోవడం చూడవచ్చు" అని నాటక కంపెనీ ప్రజల్ని ఊరించింది. ఈ నాటకం, నాటకం కంటె ఎక్కువ సర్కస్‌లా ఉందని కొందరు విమర్శించారు. కాని సామాన్య ఆంగ్ల ప్రజానీకం నిరంకుశ టిపు పతనాన్ని ఉత్సాహంగా వీక్షించారు.

1794లో కార్న్‌వాలిస్ ఇంగ్లాండ్ తిరిగి వచ్చినప్పుడు అతనికి ఘన స్వాగతం లభించింది. తూర్పు ఇండియా కంపెనీ అతనికి సంవత్సరానికి 5000 పౌండ్ల ఆదాయాన్ని ప్రకటించింది. కార్న్‌వాలిస్‌కు ప్రభువర్గ సభ్యుడిగా (peerage) ఉన్నత స్థాయి లభించింది. వారాల తరబడి అతనికి సన్మానాలు, సత్కారాలు జరిగాయి. అతనిని పొగుడుతూ పద్యాలు, పాటలు వ్రాయబడ్డాయి. ఎల్లిస్ కొర్నేలియా నైట్ అనే కవి కార్న్‌వాలిస్ భారతదేశాన్ని ఒక అనాగరికమైన నియంత (టిపు) నుండి రక్షించిన ధీరోధాత్తుడని తన పాటలో కీర్తించాడు.

## వార్తా పత్రికలు - పెయిడ్ న్యూస్

తూర్పు ఇండియా కంపెనీ ఆర్థిక అండదండలతో ఇంగ్లండులోని మరియు భారతదేశంలోని ఆంగ్ల పత్రికలు రెండవ – ఆంగ్లో మైసూరు యుద్ధం తర్వాత టిపును నియంత, మతోన్మాది అని నిందిస్తూ అవాస్తవాలతో కూడిన వార్తా కథనాలను పెద్ద

ఎత్తున ప్రచురించడం ప్రారంభించాయి. దీని ద్వారా ఆకాలంలో కూడా పెయిడ్ న్యూస్ ఉండేదని తెలుస్తుంది. ఈ కథనాలు బ్రిటిష్ జాతీయతను రెచ్చగొట్టేవిగా కూడా ఉండేవి.

రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఆంగ్ల సైనికాధికారి జనరల్ మాథ్యూస్ బెద్నూరు యుద్ధంలో అన్ననేపూర్ అనే గ్రామంలో స్త్రీలపై, ప్రజలపై అతి హేయమైన అత్యాచారాలు జరిపాడు. నాలుగు వందల మంది స్త్రీలు అవమానాల్ని భరించలేక ఆ ఊరి చెరువులో పడి మరణించారు. మైసూరు సైన్యాలు జనరల్ మాథ్యూస్‌ను బందీగా పట్టుకున్నాయి. అతను జైలులో మరణించడం జరిగింది. కాని బ్రిటిష్ పత్రికలు మాథ్యూస్ మరణం గురించి రకరకాల ఉహాగానాలు ప్రారంభించాయి. మాథ్యూస్ ఒక సారి ఎదురు పడినప్పుడు టిపు కోపంతో పగతో ఊగిపోతూ తన ఒరలో నుండి కత్తి తీసి మాథ్యూస్‌ను ముక్కలు ముక్కలుగా నరికాడని మార్నింగ్ పోస్ట్ అండ్ డైలీ అడ్వర్‌టైజర్ అనే పత్రిక, అక్టోబరు 1784 సంచికలో వ్రాసింది. గెజిట్ అండ్ న్యూడైలీ అడ్వర్‌టైజర్ అనే పత్రిక నవంబరు 24, 1784 సంచికలో ఒకడుగు ముందుకు వేసి టిపు మరిగిన సీసాన్ని మాథ్యూస్ గొంతులో పోసి మాథ్యూస్‌ను చంపాడని వ్రాస్తూ, టిపు బ్రిటిష్ సైనికులందరినీ ఇలాగే చంపి ఉంటాడని అనుమానించింది. ఒకే సంఘటన గురించి పత్రికలు విభిన్న కథనాలు వినిపిస్తుంటే వాస్తవం మరుగున పడిపోతుంది. కొన్ని పత్రికలు మాథ్యూస్‌ను అమరుడిగా కూడా గుర్తించాయి.

సెయింట్ జేమ్స్ పత్రిక ఆసియా వాసులు ఐరోపావాసుల యుద్ధ పద్ధతులను అనుసరించేంత నాగరికులు కారని, వారి పద్ధతులు ఇంకా బర్బరత, క్రూరత్వంతో నిండి ఉన్నాయని, అందుకే టిపు బ్రిటిష్ సైనికులను చిత్రహింసలకు గురిచేస్తున్నాడని వ్రాసింది. ఈ పత్రికే ఏప్రిల్ 3, 1790 సంచికలో మూడవ మైసూరు యుద్ధం బ్రిటన్‌కు ఎంతో లాభదాయకమవుతుందని వ్రాసింది. యుద్ధ ఖర్చుల కంటే ఆరు రెట్లు ఆదాయం, భూమి, కంపెనీకి లభించాయని మురిసిపోయింది. ఏప్రిల్ 2, 1785 సంచికలో జనరల్ ఈవినింగ్ అనే పత్రిక టిపు ఆంగ్ల ఖైదీలను ఇస్లాంలోకి బలవంతంగా మార్చాడని, వారికి ముస్లిం స్త్రీలతో వివాహాలు జరిపించాడని వ్రాసింది. మత మార్పిడికి నిరాకరించిన వారిని టిపు నిర్దాక్షణ్యంగా ఉరికంబం ఎక్కించాడని వ్రాసింది.

1789లో కెప్టెన్ ఇన్నిస్ వ్రాసిన A Narrative of the Military Operations of the Coromandel అనే పుస్తకంలో రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం ముగిసిన తర్వాత టిపు 1200 మంది ఆంగ్ల సైనికులను, 3000 మంది సిపాయిలను (తూర్పు ఇండియా కంపెనీ లో భారత సంతతి సైనికులు) విడుదల చేసాడని 150 – 200 మంది ఆంగ్ల సైనికులు టిపు వద్దనే ఉండిపోయారని వ్రాసాడు. వీరు ఇస్లాంలోకి మారి ఉండవచ్చునని వ్రాసాడు. స్వయంగా ఆంగ్లేయుల రచనల ప్రకారమే వీరి సంఖ్య 150 – 200 మధ్య ఉందని తెలుస్తుంది. కావున ఇవి చాలా వరకు స్వచ్ఛందంగా జరిగిన మత మార్పిడులని

తెలుస్తుంది. కాని కలకత్తా నుండి వెలువడే కలకత్తా క్రానికల్ అనే పత్రిక ఈ యూరోపియన్ ముసల్‌మాన్‌ల గురించి వ్రాస్తూ మానవ జాతిలోనే అతి నీచమైన వ్యక్తి టిపు అని పేర్కొంది.

హైదర్, టిపుల మీద ఇంకొక హాస్యాస్పదమైన పత్రికా ప్రచారం ఏమిటంటే వీరిద్దరూ శత్రువుల తలలు నరికి జాడీల్లో ఊరగాయలుగా పెట్టేవారని.

మూడవ ఆంగ్లో - మైసూరు యుద్ధంలో కార్న్‌వాలిస్ విజయం తూర్పు అనాగరికులపై నాగరికులైన పాశ్చాత్యుల విజయం అని ఒరకిల్ అనే పత్రిక వర్ణించింది. ఈ విజయం భారతదేశంలో బ్రిటిష్ రాజ్య వ్యాప్తికి ఎంతో దోహదం చేస్తుందని నిస్సిగ్గుగా వ్రాసింది.

1788లో టిపు ఫ్రాన్స్ దేశానికి రాయబారాన్ని పంపినప్పుడు లండన్‌లోని వైట్‌హాల్ పత్రిక ఏప్రిల్ 17, 1788 సంచికలో టిపు ఫ్రెంచ్ చక్రవర్తికి జరిగిన సంభాషణను ప్రచురించింది. ఫ్రెంచ్ చక్రవర్తి పదహారవ లూయి తన సైన్యానికి ఆంగ్లేయులను భారతదేశం నుండి తరిమి వేయాల్సిందిగా ఆజ్ఞాపించాడని ఆ వార్త సారాంశం. టిపు ఫ్రాన్స్ ఎప్పుడూ వెళ్ళలేదు. ఇది కేవలం ఊహా జనితం మరియు హాస్యాస్పదమైన వార్త అనడంలో ఎటువంటి సందేహం లేదు.

నాల్గవ మైసూరు యుద్ధానికి వెల్లస్లీ సాకుగా చూపిన ఫ్రెంచ్ - టిపు సైనిక సహకారం గురించి ఆంగ్ల పత్రికలు గగ్గోలు - పెట్టాయి.

1797లో టిపు ఫ్రెంచ్ కాలనీ మారిషస్‌కు పంపిన రాయబారం టిపుకు ఎటువంటి సైనిక సహాయాన్ని అందివ్వలేకపోయినా లండన్ క్రానికల్ పత్రిక ఇక నెపోలియన్ భారతదేశంపై దాడిచేసి టిపుతో కలిసి ఆంగ్లేయులను భారతదేశం నుండి తరిమి కొడతాడని ప్రచారం చేసింది. మారిషస్ నుండి టిపుకు 100కు మించని సైనికులు వస్తే 600 మంది ఫ్రెంచ్ సైనికులు టిపు కొలువులో చేరారని లాయిడ్స్ ఈవెనింగ్ పోస్టు పత్రిక తన ఆగష్టు, 1798 సంచికలో వ్రాసింది. నెపోలియన్ ఒక నియంత, టిపు ఒక నియంత, ఇద్దరూ కలిసి బ్రిటిష్ స్వాతంత్ర్య విలువలను నాశనం చెయ్యడానికి పూనుకుంటున్నారు అని వ్రాసింది.

సెప్టెంబరు 22, 1799లో అంటే టిపు మరణించిన నాలుగు నెలల తర్వాత సండే మానిటర్ అనే పత్రిక టిపు మీద విషపూరితమైన ప్రచారం కొనసాగించింది. టిపు నియంతృత్వంతో మైసూరు ప్రజలు విసిగిపోయారని శాంత స్వభావులైన హిందువులు కూడా అతనిపై తిరుగుబాటు చేయడానికి సిద్ధమయ్యారని, తూర్పు ఇండియా కంపెనీ అతన్ని అంతం చేయడం ద్వారా మైసూరు ప్రజలకు ఊరట కలిగించిందని వ్రాసింది.

A Sketch of the War with Tipoo Sultan (1793) అనే పుస్తకంలో లెఫ్టినెంట్ రోడరిక్ మెకంజీ "టిపు క్రూరుడని తన ప్రజలను హింసించే వాడని వ్రాసిన వ్రాతలలో

నిజం లేదు. ఈ ప్రాంత ప్రజలు తమ ప్రభుత్వం మారాలని కోరుకోవడం లేదు" అని వ్రాసాడు. టిపు మతోన్మాది అనే ప్రచారాన్ని కూడా ఈ పుస్తకం ఖండించింది. మైసూరు రాజ్యంలో ఎన్నో అందమైన హిందూ దేవాలయాలు ఉన్నాయి. వాటికి ఎప్పుడూ ఎటువంటి హానీ జరగలేదు. తూర్పు ఇండియా కంపెనీ దాడి జరిగినప్పుడు ప్రజలు శత్రువులకు తమ ఆస్తులు అందకుండా వాటిని నాశనం చేసి పారిపోయేవారని వ్రాసాడు. దీనిని బట్టి బ్రిటిష్ పత్రికలు, ఇతర రచనలు ప్రచారం చేసినట్టు మైసూరు ప్రజలు టిపు పాలన నుండి బ్రిటిష్ వారు తమను విముక్తి చేయాలని కోరుకుంటున్నారనడం శుద్ధ అవాస్తవం.

కాని 1791లోకి మార్నింగ్ క్రానికల్ పత్రిక ప్రకారం బ్రిటిష్ సైన్యాలు మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో శ్రీరంగపట్టణం ప్రవేశించినప్పుడు వారు ఆశించినట్టుగా మైసూరు ప్రజల్లో టిపు పై ఎటువంటి వ్యతిరేకతలేదని, ఎందుకు ఈ ప్రజలు ఈ నియంతకు విశ్వాస పాత్రులుగా ఉన్నారని బ్రిటిష్ సైనికులు ఆశ్చర్యపోయారని వ్రాసింది.

ఈ బ్రిటిష్ పత్రికల కథనాలన్నీ మైసూరు పై తూర్పు ఇండియా కంపెనీ దురాక్రమణలను సమర్థించే క్రమంలో టిపును ఒక నియంతగా, ప్రజా కంటకుడిగా చూపుతూ వ్రాసిన కట్టుకథలని బ్రిటన్‌లోని పత్రికలే అంగీకరించాయి. లిటరరీ ఇంటిలిజెన్సర్ అనే పత్రిక తూర్పు ఇండియా కంపెనీ అందిస్తున్న ధనంతో కొన్ని బ్రిటిష్ పత్రికలు టిపును ఒక నియంతగా చిత్రించి బ్రిటిష్ ప్రజలలో అతనిపై ద్వేష భావం పెంచుతున్నాయని, వాస్తవానికి ధనదాహంతో అక్రమ యుద్ధాలు చేసి భారతీయులను దోచుకు తింటున్న తూర్పు ఇండియా కంపెనీ అధికారులే అసలు నియంతలని 1792లో వ్రాసింది.

## టిపు - మూడు ఇంగ్లీషు నవలలు

టిపును ఓడించి చంపేసినప్పటికీ టిపు బ్రిటిష్ వారిని తర్వాతి కాలంలో కూడా వెంటాడుతూనే ఉన్నాడు. టిపు మరణం తర్వాత 19వ శతాబ్దంలో 'బ్రిటిష్ రాజ్' భారతదేశంలో సుస్థిరంగా నెలకొన్నప్పటికీ బ్రిటిష్ వారు తమ రచనలలో టిపును నిరంకుశుడిగా, మతోన్మాదిగా ముద్రలు వేస్తూనే ఉన్నారు. ఇప్పుడు క్రొత్తగా టిపును కామోన్మాదిగా కూడా చిత్రించడం ప్రారంభించారు. ఈ కోణం నుండి రచించిన మూడు నవలలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.

మొదటిది ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత సర్ వాల్టర్ స్కాట్ వ్రాసిన "ద సర్జన్స్ డాటర్" (The Surgeon's Daughter) అనే నవల. ఈ నవల 1831లో అంటే టిపు మరణించిన 32 సంవత్సరాల తర్వాత వ్రాయబడింది. ఈ నవలలో టిపు ఒక ఆంగ్ల మహిళను చెరపట్టాలని ప్రయత్నిస్తాడు. ఆ మహిళ ప్రేమికుడు హైదర్ అలీని ఆశ్రయిస్తాడు.

హైదర్ అలీ టిపును మందలించడమే కాకుండా ఇటువంటి పాపాలు చేసే వారు కోట ద్వారం వద్ద ఘోరమైన మరణం పొందుతారు అని టిపును శపిస్తాడు. 1799లో టిపు శ్రీరంగపట్టణం కోట ద్వారం వద్ద మరణిస్తాడు. ఈ నవల 1831లో వ్రాయబడింది. ఈ నవలలో టిపును స్త్రీలను, అందులో తెల్లజాతి మహిళలను చెరపట్టే ఒక కాముకుడిగా చిత్రించారు. తర్వాత వాల్టర్ స్కాట్ తాను ఈ నవలలో ఒక భారతీయ రాజు పాత్రను చిత్రించాలని అనుకొన్నానని, అప్పుడు ఇంగ్లాండులో మైసూరు రాజు టిపు సుల్తాన్‌పై అనేక రచనలు రావడంతో ఆ పాత్రకు టిపు సుల్తాన్ పేరు పెట్టానని స్వయంగా అంగీకరించాడు. వాల్టర్ స్కాట్ ఈ ఒప్పుకోలుతో ఈ రచనలోని సంఘటనలు, కథాంశము ఎటువంటి చారిత్రక ప్రామాణికత లేనివని తెలుస్తూనే ఉంది. అంతేకాదు ప్రఖ్యాత ఆంగ్ల నవల రచయిత అయిన వాల్టర్ స్కాట్ వంటి వారు కూడా నిర్లక్ష్యంగా, బ్రిటిష్ జాత్యహంకారంతో తూర్పు దేశ పాలకులను కించపరస్తూ రచనలు చేసారని ఈ నవల ద్వారా తెలుస్తుంది. ఎటువంటి చారిత్రక ఆధారాలు, ప్రమాణాలు లేని ఈ నవలను వలసవాద చరిత్రకారులు టిపును అప్రతిష్ట పాలు చెయ్యడానికి ఉపయోగించుకున్నారు.

రెండవ నవల కెప్టెన్ ఫిలిప్ మెడోస్ టేలర్1840లో వ్రాసిన టిపు సుల్తాన్ : ఎ టేల్ ఆఫ్ మైసూర్ వార్స్ (Tipu Sultan: A Tale of the Mysore Wars) ఈ నవల సర్జన్స్ డాటర్ అంత ఊహాజనిత కాల్పనిక నవల కాదు. టేలర్ కొన్ని చారిత్రక ఘటనలను, వాస్తవ సంఘటనలను, యుద్ధాలను వ్రాసినప్పటికీ ఈ రచన ముఖ్య ఉద్దేశం కూడా టిపును ఒక క్రూరుడైన నియంతగా చిత్రించడమే. టేలర్ టిపు కళ్ళను వర్ణిస్తూ ఆ కళ్ళలోనే క్రూరత్వం, ఒక పైశాచికత్వం, కొంత వెర్రితనం కన్పిస్తాయని వ్రాసాడు. టిపు ఒక్కోసారి కోతి చేష్టలు చేస్తాడని కూడా వ్రాసాడు. హైదరాబాద్ మూడవ నిజామ్ సికిందర్ జాను వర్ణిస్తూ ఆంగ్ల అధికారి బ్రిగ్స్ అతని కళ్ళల్లో ఒక ఉన్మాదం కనిపిస్తుంది అని వ్రాసాడు. ఆంగ్లేయులకు భారతీయ పాలకులు ఉన్మాదుల్లా కనిపించేవారు కాబోలు.

ఈ నవలలో కూడా టిపును ఒక కాముకుడిగా చూపించే ప్రయత్నం జరిగింది. టిపు ఆంగ్ల స్త్రీలను, హిందూ స్త్రీలను చెరపట్టి తన అంతఃపురంలో బందీలుగా ఉంచుతాడని టేలర్ వ్రాసాడు.

ఇక కథ విషయానికి వస్తే టిపు కాశీం అలీ అనే వ్యక్తిని ఎంతో ఆదరించి తనకు నమ్మకస్తుడైన వ్యక్తిగా భావించి అతన్ని తన కొలువులో నియమిస్తాడు. కాని కాశీం అలీ టిపు క్రూరమైన చర్యలను భరించలేక టిపును వదలి బ్రిటిష్ వారితో చేరిపోతాడు. నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిపు అపజయానికి కారణం టిపు ఎంతగానో నమ్మిన మీర్ సాదిక్, పూర్ణయ్య వంటి అధికారులు. వీరు డబ్బుకు, పదవులకు ఆశపడి తూర్పు ఇండియా

కంపెనీతో చేరి టిపుకు నమ్మక ద్రోహం చేసారనే విషయం మనం ఇక్కడ గుర్తు చుకోవాలి. టేలర్ నమ్మక ద్రోహం అంశాన్ని వక్రీకరించి కాశీం అలీ పాత్ర టిపు క్రూరత్వాన్ని భరించలేక ఆంగ్లేయులతో చేరాడని వ్రాసాడు.

మిగతా ఆంగ్ల రచనలలో వలెనే యుద్ధ ఖైదీల పట్ల టిపు క్రూరత్వాన్ని ఆవాస్త వికతలు జోడించి వ్రాసాడు.

అథేనియమ్ (The Atheneaum) అనే ఆంగ్ల పత్రిక ఈ నవలను సమీక్షిస్తూ టిపును ఒక రాక్షసుడిగా చిత్రించడం ఒక అభూత కల్పన వలె ఉన్నదని, ఆంగ్లేయులు అన్యాయంగా టిపును చంపి మైసూరు రాజ్యాన్ని ఆక్రమించుకోవడాన్ని సమర్థించుకోవడానికి టిపుపై అభాండాలు వేయడమే ఈ నవల ఉద్దేశమని వ్రాసింది.

మూడవ నవల జార్జ్ ఆల్‌ఫ్రెడ్ హేంటీ రచించిన 'ది టైగర్ ఆఫ్ మైసూరు', (The Tiger of Mysore) నవల టిపు మరణించిన 76 సంవత్సరాలకు, 1875లో ఈ నవల రచించబడింది. ఈ నవల చిన్న పిల్లల కొరకు వ్రాసిన సాహస కృత్యాల (Adventures) నవల.

టిపు సుల్తాన్ అనే ఒక చారిత్రక పాత్ర, నాల్గవ మైసూరు యుద్ధం అనే ఒక చారిత్రక సంఘటన ఉండడం తప్ప ఈ నవల అంతా కాల్పనికం.

నవలలో డిక్ హాలెండ్ అనే బాలుడు తన తండ్రి జాక్ హాలెండ్ భారతదేశంలో టిపు సుల్తాన్ చెరలో ఉన్నాడని తెలుసుకొని తన తల్లితో ఇంగ్లాండు నుండి బయలుదేరి భారతదేశానికి వస్తాడు. అనేక సాహస కృత్యాలు చేసి టిపు చెరలో ఉన్న తండ్రిని విడిపిస్తాడు, టిపు అంత:పురంలో బందీగా ఉన్న అనీ మాన్స్‌ఫీల్డ్ అనే ఆంగ్ల యువతిని రక్షిస్తాడు. తూర్పు ఇండియా కంపెనీ సైన్యంలో చేరి నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో పాల్గొని టిపు మరణాన్ని చూస్తాడు. ఈ నవలలో కూడా టిపుని ఆంగ్ల స్త్రీలను చెరపట్టే కామాంధుడిగా వర్ణించాడు.

ఈ పుస్తకం ముందుమాటలో రచయిత హేంటీ 76 సంవత్సరాల క్రిందట జరిగిన నాల్గవ ఆంగ్లో – మైసూరు యుద్ధానికి టిపుదే పూర్తి బాధ్యత అనీ, ఈ యుద్ధం వలన భారతదేశ ప్రజలు టిపు వంటి అనాగరిక నిరంకుశ రాజుల పాలన నుండి బ్రిటిష్ వారిచే రక్షించబడి ఉన్నతమైన నాగరికత కలిగిన బ్రిటిష్ వారి పాలనలోకి వచ్చారని వ్రాసాడు. 76 సంవత్సరాల క్రిందట నాల్గవ మైసూరు– యుద్ధాన్ని చేసి టిపును అంతమొందించి అక్రమంగా మైసూరు రాజ్యాన్ని ఆక్రమించిన లార్డ్ రిచర్డ్ వెల్లస్లీ చెప్పిన మాటలనే తు.చ.తప్పకుండా హేంటీ తన నవల ముందు మాటలో వ్రాయడం గమనించదగ్గ విషయం.

## చిత్రకళలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం

ఆంగ్ల ప్రజానీకంలో టిపు పై ద్వేషాన్ని పెంచడానికి నాటకాలు, నవలలు, పత్రికలే కాకుండా తూర్పు ఇండియా కంపెనీ అధికారులు చిత్రకళ వంటి మాధ్యమాన్ని కూడా ఎంచుకున్నారు. ఈ పెయింటింగ్‌లు టిపు పై ద్వేషంతో పాటు భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణ అనే అక్రమానికి బ్రిటిష్ జాతీయవాదాన్ని ముడిపెట్టడం కూడా కనిపిస్తుంది. ఈ పెయింటింగ్‌లలో అంశాలు (Themes) ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. శ్రీరంగపట్టణం కోటపై ఆంగ్ల సైన్యాల విజయం, టిపు కుమారులను కార్న్‌వాలిస్ హామీగా తీసుకోవడం, టిపు మృతదేహాన్ని ఆంగ్ల సైనికులు కనుక్కోవడం వంటి అంశాలనే అనేక మంది చిత్రకారులు మళ్ళీ మళ్ళీ చిత్రించారు.

హెన్రీ సింగిల్‌టన్ పెయింటింగ్ ది సన్స్ ఆఫ్ టిపు సుల్తాన్ లీవింగ్ దేర్ ఫాదర్ (The Sons of Tipu Sultan Leaving Their Father) పూర్తిగా ఊహాజనితం. ఈ పెయింటింగ్‌లో శ్రీరంగపట్టణం సంధి ప్రకారం ఆంగ్లేయుల వద్దకు వెళుతున్న కుమారుల వైపు టిపు చూడకుండా మొహం తిప్పుకుని ఉంటాడు. ఆ పిల్లలు తమ తండ్రి తమ వైపు చూడాలని ఎదురు చూస్తున్న దృశ్యం చిత్రీకరించబడింది. టిపుకు వెళ్ళిపోతున్న కుమారుల గురించి ఎటువంటి బాధలేదని, అతడు క్రూరమైన తండ్రి అని చెప్పడం హెన్రీ సింగిల్‌టన్ ఉద్దేశం. టిపు రెండు సంవత్సరాలలో ఆంగ్లేయులకు 6 కోట్ల ధనాన్ని చెల్లించి తన కుమారులను వెనక్కు తెచ్చుకున్నాడు.

లండన్‌లో నివసించే మేథర్ బ్రౌన్ అనే అమెరికన్ చిత్రకారుడు కూడా టిపు కుమారుల వీడ్కోలును చిత్రించాడు. ఈ చిత్రానికి తూర్పు ఇండియా కంపెనీ బోర్డు సభ్యుడైన హెన్రీ డుండాస్ ధన సహాయాన్ని అందించాడు. ఈ పెయింటింగ్‌లో తూర్పు ఇండియా కంపెనీ సైన్యం శక్తివంతంగా చూపబడింది. ఈ చిత్రం శీర్షిక మార్క్విస్ కార్న్‌వాలిస్ రిసీవింగ్ ద సన్స్ ఆఫ్ టిపు సుల్తాన్ యాజ్ హోస్టేజెస్ (Marquis Cornwallis Receiving The Sons of Tipu Sultan As Hostages) ఇది 1793లో చిత్రించబడింది.

ఈ చిత్రంలో కార్న్‌వాలిస్ పూర్తి సైనిక దుస్తుల్లో బ్రిటిష్ జండా ముందు నిలబడి ఉంటాడు. టిపు కుమారులు కార్న్‌వాలిస్ చేతులను రక్షణ కోసం అర్థిస్తున్నట్టు పట్టుకుని ఉంటారు. మేథర్ బ్రౌన్ ఇదే అంశంతోని జనానా నుండి టిపు కుమారుల వీడ్కోలు (Departure of the Sons of Tipu Sultan from Zenana) అనే పెయింటింగ్ వేసాడు. ఈ పెయింటిగ్స్ కాపీలు (Reprints) బ్రిటిష్ ప్రజలలో చాలా ఆదరణ పొందాయి.

శ్రీరంగపట్టణం పతనం అంశం పై కూడా చాలా పెయింటింగ్‌లు వచ్చాయి. శ్రీరంగపట్టణం పై దాడి, ముట్టడి, పతనం వంటి శీర్షికలతో ఈ పెయింటింగ్‌లు పునరావృతమయ్యాయి.

వీటిలో రాబర్ట్ కెర్ పోర్టర్ అక్టోబర్, 1799 లో అంటే శ్రీరంగపట్టణాన్ని ఆంగ్లేయులు జయించిన అయిదు నెలల తర్వాత చిత్రీకరించిన The Storming of Seringapatnam చాలా ప్రజాదరణ పొందింది. ఇది 120 అడుగుల పొడుగు, 21 అడుగుల ఎత్తు ఉన్న పెద్ద పెయింటింగ్. ఇందులో కంపెనీ సైనికులు శ్రీరంగపట్టణం కోటపై విజయోత్సాహంతో దూసుకుపోవడం, నిస్సహాయంగా చూస్తున్న టిపు సైన్యం చూపబడ్డారు. ఈ పెయింటింగ్ మార్చ్ 29, 1800 నుండి కొన్ని నెలల పాటు లండన్‌లోని లీషియం ప్రదర్శనశాలలో ప్రదర్శింపబడింది. టికెట్ ఒక షిల్లింగ్, దీనితో పాటు ఆంగ్లేయులు మైసూరును ఎలా జయించారు, అనే ఒక చిన్న కరపత్రం కూడా రెండు షిల్లింగ్‌లకు విక్రయించబడింది. ఆంగ్ల ప్రజలు విపరీతంగా ఈ పెయింటింగ్‌ను సందర్శించడమే కాకుండా, ఆ కరపత్రాన్ని కూడా కొనుక్కున్నారు. ఆంగ్ల ప్రజలు దీనిని టిపు అనే తూర్పు దేశ నియంత పై బ్రిటిష్ వారి నైతిక విజయంగా భావించారు. లండన్ తర్వాత ఈ పెయింటింగ్ ఇంగ్లాండులోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రదర్శించబడింది. ఈ పెయింటింగ్‌కు అనేక అనుకరణలు, కాపీలు కూడా వచ్చాయి.

1799లోనే అలెగ్జాండర్ అలెన్ The Siege of Seringapatnam అనే పెయింటింగ్స్ వేశాడు. జోసెఫ్ టర్నర్ ద సీజ్ ఆఫ్ శ్రీరంగపట్టణం The Siege of Seringapatnam థామస్ స్టాత్‌హార్డ్ ది స్టార్మింగ్ ఆఫ్ శ్రీరంగపట్టణం The Storming of Seringapatnam అనే పెయింటింగ్‌ను 1804లో చిత్రీకరించారు.

తర్వాత ఎక్కువగా చిత్రీకరించబడిన అంశం యుద్ధంలో టిపు మరణం. బ్రిటిష్ సైన్యం టిపు మృతదేహాన్ని కనుక్కోవడాన్ని హెన్రీ సింగిల్‌టన్ 1800 సంవత్సరంలో The Last Effort and Fall of Tipu Sultan పెయింటింగ్‌ను చిత్రించాడు. ఈ పెయింటింగ్‌లో టిపు మరణిస్తూ దయనీయంగా ఒరిగిపోతూ ఉంటాడు. మైసూరు సైన్యాలు ఆంగ్ల సైన్యాలను చూసి పిరికిగా వెనక్కు తగ్గుతుంటాయి. రాబర్ట్ కెర్ పోర్టర్ 1800లో ఫైండింగ్ ది బాడీ ఆఫ్ టిపు సుల్తాన్ (Finding the Body of Tipu Sultan) అనే పెయింటింగ్‌ను వేసాడు. ఈ పెయింటింగ్‌లో మరణించిన టిపు తల ఒక బ్రిటిష్ సైనికుడి మోకాలిపై ఒరిగి ఉంటుంది. ఆ సైనికుడు విజయ గర్వంతో ఒక చేయి పైకెత్తి ఉంటాడు. ఈ చిత్రంలో అంతా చీకటి ఉంటుంది. బ్రిటిష్ సైనికుల చేతిలో మాత్రం కాగడాలు వెలుగుతుంటాయి. చీకటి భారతదేశంలో ఇక బ్రిటిష్ వారు వెలుగును ప్రసరింప జేయబోతున్నారని అర్థం.

ఆర్థర్ విలియమ్ డేవిస్ చిత్రం 'Major General Baird and Col Arthur Wellesley Discovering the Body of Tipoo Sultan at Seringapatnam' రాబర్ట్ కెర్ పోర్టర్ చిత్రంలోని దృశ్యాలే పునరావృతమైనాయి. ఇక్కడ తూర్పు ఇండియా కంపెనీ సైనికాధికారులైన బెయిర్డ్, ఆర్థర్ వెల్లస్లీ విజయోత్సాహంతో కనిపించడం విశేషం. డేవిడ్ బెయిర్డ్ మోకాలిపై వంగి టిపు మరణాన్ని నిర్ధారించడానికి ఉన్నట్టు టిపు మృతదేహం

వైపు చూస్తుంటాడు. ఆర్థర్ వెల్లస్లీ పోర్ట్రెర్ పెయింటింగ్‌లో బ్రిటిష్ సైనికునివలె విజయ గర్వంతో ఒక చెయ్యి పైకెత్తి ఉంటాడు. మేజర్ జనరల్ డేవిడ్ బెయిర్డ్ రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో పట్టుబడి టిపు ఖైదులో కొంత కాలం బందీగా ఉన్నాడనే విషయం ఇక్కడ గుర్తుంచుకోవాలి. సీజ్ ఆఫ్ సెరింగ పట్నం ఈ చిత్రంలో మృతి చెందిన టిపు ముఖం స్పష్టత లేకుండా క్రీనీడలో ఉంటుంది. మైసూరు సైనికుల వెనుక భాగం మాత్రమే కనిపిస్తుంది. భయం, ఆందోళనతో నిండిన ఒక భారతీయ సైనికుడి ముఖం కనిపిస్తుంది. పై చిత్రాలన్నీ లండన్, డబ్లిన్, ఎడిన్‌బరో వంటి బ్రిటన్ నగరాల్లోని మ్యూజియంలలో ఇప్పటికీ ప్రదర్శించబడుతున్నాయి. ఒక మృతదేహం గురించి ఇన్ని పెయింటింగ్‌లు వేసారు అంటే బ్రతికి ఉన్నప్పుడు ఆ మృతదేహం వీరిని ఎంత భయపెట్టిందో అర్థమవుతుంది.

## బ్రిటిష్ పార్లమెంటులో టిపు సుల్తాన్

తూర్పు ఇండియా కంపెనీ భారతదేశంలో వ్యాపారానికి పరిమితమవ్వకుండా స్థానిక రాజకీయాల్లో తలదూర్చడాన్ని బ్రిటన్‌లోని కొన్ని వర్గాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కంపెనీ ఉద్యోగులు స్థానిక రాజులను, ప్రజలను మోసగిస్తూ అనైతికంగా ఐశ్వర్యాన్ని పోగేసుకుంటున్నారని, ఇది క్రైస్తవ విలువలకు విరుద్ధమని వీరి అభిప్రాయం. వీరి అభిప్రాయాలకు బలం చేకూరుస్తూ కంపెనీ ఉద్యోగులు అనేకులు భారతదేశంలో అవినీతితో సంపాదించిన ధనంతో స్వదేశంలో భూములు, ఆస్తులు కొనుక్కొని విచ్చలవిడిగా ఐశ్వర్యవంతమైన జీవితాన్ని జీవించడమే కాకుండా డబ్బుతో పార్లమెంటు సభ్యులై పదవులను పొంది సామాజికంగా ఎదిగే ప్రయత్నం చేసేవారు. వీరిలో చాలా మంది భారతదేశం రాకముందు సమాజంలో దిగువస్థాయికి చెందినవారే. వీరి నడమంత్రపు సిరిని అవహేళన చేస్తూ బ్రిటన్‌లోని ప్రభు వర్గాలు వీరిని నబోబ్స్ (నవాబులు) అని పిలిచేవారు. ప్లాసీ యుద్ధంలో భారతదేశంలో ఆంగ్ల సామ్రాజ్యానికి పునాది వేసిన రాబర్ట్ క్లైవ్ స్వదేశానికి వెళ్ళినప్పుడు అక్రమ సంపాదన విషయంలో అనేక అభియోగాలను, న్యాయ విచారణలను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ అవమానాలను భరించలేక చివరకు క్లైవ్ 1774లో తన 49వ ఏట ఆత్మహత్య చేసుకున్నాడు.

తూర్పు ఇండియా కంపెనీ – మైసూరు యుద్ధాల సమయంలో బ్రిటన్‌లో టోరీ పార్టీ అధికారంలో ఉంది. అప్పటి బ్రిటన్ ప్రధానమంత్రి విలియం పిట్ తూర్పు ఇండియా కంపెనీ రాజకీయ కార్యకలాపాలను సమర్థించేవాడు. 1784లో ఇతడు చేసిన ఇండియా యాక్ట్ (India Act) (ఇది పిట్స్ ఇండియా యాక్ట్‌గా ప్రసిద్ధి చెందింది.) తూర్పు ఇండియా కంపెనీ వ్యవహారాలపై బ్రిటిష్ ప్రభుత్వం నియంత్రణ ఏర్పరచింది. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య విస్తరణకు అనుకూలురైన కార్న్‌వాలిస్, రిచర్డ్ వెల్లస్లీ ఇద్దరూ పిట్‌కు సన్నిహితులు. అందుకే టిపుపై దురాక్రమణలను పిట్ సమర్థించాడు.

బ్రిటిష్ పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీ విగ్‌లు పిట్ ధోరణులను విమర్శించారు. రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఆంగ్ల పరాజయాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. విగ్ ఎమ్.పి. చార్లెస్ ఫాక్స్ టిపుపై యుద్ధానికి దిగడం ఆంగ్లేయుల దుందుడుకు చర్యగా చెప్పాడు. ఆ యుద్ధంలో జనరల్ మాథ్యూస్ అకృత్యాలు బ్రిటన్‌కు అవమానంగా అభివర్ణించాడు. భారతదేశాన్ని దోపిడీ చేస్తూ రక్తపాతం సృష్టిస్తున్న తూర్పు ఇండియా కంపెనీకి బుద్ధిచెప్పి తన దేశాన్ని రక్షించుకోగల ధీరోదాత్తుడు టిపు అని బ్రిటిష్ పార్లమెంట్‌లో చెప్పాడు.

ఒకప్పుడు తూర్పు ఇండియా కంపెనీలో పనిచేసి తర్వాత ఎమ్.పి. అయిన జాన్ హిప్పిస్లే మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధం టిపుపై తూర్పు ఇండియా కంపెనీ చేస్తున్న దౌర్జన్యంగా అభివర్ణించాడు. టిపు వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ బ్రిటిష్ పత్రికలు చేస్తున్న దుష్ప్రచారాలను కూడా ఇతను ఖండించాడు.

కాని ఈ విపక్ష పార్లమెంటరీ సభ్యులు చేస్తున్న విమర్శలను నిరాకరిస్తూ పాలక పక్షం మూడో ఆంగ్లో – మైసూరు యుద్ధం మధ్యలో మార్చి, 1791లో బ్రిటన్ పార్లమెంటులో మూడు తీర్మానాలను పాస్ చేయించుకుంది.

1. ట్రావెన్కూరుపై దాడితో టిపునే యుద్ధానికి నాంది పలికాడు. టిపునే ఈ యుద్ధానికి కారణం.
2. గవర్నర్ జనరల్ కార్న్‌వాలిస్ యుద్ధ నిర్ణయం సరైనదే.
3. తూర్పు ఇండియా కంపెనీ హైదరాబాద్ నిజామ్, మరాఠాలతో ఒప్పందాలు చేసుకోవడం సరైనదే.

మూడవ ఆంగ్ల – మైసూరు యుద్ధంలో ఆంగ్లేయుల ఘన విజయం బ్రిటిష్ ప్రజల జాతీయ విజయంగా ప్రచారం కావడంతో తర్వాత పార్లమెంటులో ప్రతిపక్షాలు టిపును సమర్థించి, కంపెనీని విమర్శించే పరిస్థితిని కోల్పోయాయి.

1799 నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధం కూడా టిపుపైన అన్యాయమైన దాడి. అయినా టిపు ఫ్రెంచ్ వారితో చేరి ఆంగ్లేయులను భారతదేశం నుండి వెళ్ళగొట్టాలని ప్రయత్నిస్తున్నాడని రిచర్డ్ వెల్లస్లీ ఫ్రెంచ్ భూతాన్ని చూపించేటప్పటికి విపక్షాలు పార్లమెంటులో ఆ దాడిని కూడా ఖండించలేక పోయాయి.

ఆంగ్లేయులు చెప్పుకున్నట్టే ఒక అనాగరిక తూర్పు దేశంలో ఒక సంస్థానానికి అధిపతి అయిన క్రూర నియంత అయిన టిపు గురించి మొత్తం బ్రిటిష్ పత్రికలు, రచయితలు, చిత్రకారులు ఎడతెరిపి లేకుండా దాడి చెయ్యడం చూస్తే టిపు బ్రిటిష్ సామ్రాజ్యవాద, వలస విధానానికి ఎలా సవాలుగా నిలిచాడో తెలుస్తుంది. టిపు ఓటమి, మరణం భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి, వలసవాదానికి లభించిన ఘన విజయం.

## అధ్యాయం - 9

# టిపు - ఇస్లాంమతోన్మాదా?

హైదర్ అలీ 1761లో ఒడయారుల నుండి మైసూరు రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. అప్పటి నుండి ఒడయారుల రాణి లక్ష్మీ అమ్మణి 1799లో టిపు మరణం వరకు అంటే ఒక 38 సంవత్సరాలు మైసూరు రాజ్యం తిరిగి ఒడయారు వంశానికి దక్కాలని ఎడతెరిపి లేకుండా కృషి చేసింది. ఆమె కృషి ఫలించి 1799లో మైసూరు రాజ్యం, బ్రిటిష్ వారి సామంత రాజ్యంగానైనా, ఒడయారు వంశస్థులకు తిరిగి దక్కింది. 38 సంవత్సరాలలో ఆమె ఎన్నడూ హైదర్ అలీని, టిపు సుల్తాన్‌ను మహమ్మదీయులుగా పరిగణించలేదు. ఒక ఆక్రమణదారులుగానే భావించింది. ఎందుకంటే ఒడయారుల పాలనలో సైన్యంలో ముస్లింలు ముఖ్యస్థానాల్లో ఉండేవారు. మైసూరు రాజ్యంలో దళవాయి అయిన నంజరాజ్ హైదర్‌అలీ ప్రతిభను గుర్తించి, అతని ఎదుగుదలకు ఎంతో చేయూతనిచ్చాడు. హైదర్ అలీ, టిపులతో నిరంతర వైరం కలిగి ఉన్న మరాఠాలు వారిని రాజకీయ శత్రువులుగానే గుర్తించారు తప్ప ముస్లింలుగా ద్వేషించలేదు. మరాఠాలు, హైదరాబాద్ నిజాం, ఆంగ్లేయులు కలిసి టిపును ఓడించారు.

18వ శతాబ్దంలో భారతదేశం లోని చిన్న చిన్న సంస్థానాలలోని సైన్యంలో, పాలనా వ్యవస్థలో హిందూ ముస్లింలు కలగలుపుగా ఉండేవారు. మరాఠా సైన్యంలో ముస్లింలు. నిజామ్ సైన్యంలో హిందువులు ఉండేవారు. కేరళలో ప్రముఖ రాజ్యమైన కాలికట్ రాజులైన హిందూ జామెరిన్‌లు తమ నౌకాదళాన్ని మెర్కరాలనే అరబ్ ముస్లిం తెగల ఆధీనంలో ఉంచారు. ఎందుకంటే ఈ మెర్కరాలు మంచి నావికులు. పోర్చుగీసువారు కాలికట్‌పై దాడి చేసినప్పుడు ఈ మెర్కరాలు తమ ప్రాణాలొడ్డి కాలికట్ రాజ్యాన్ని కాపాడే ప్రయత్నం చేసారు.

దక్షిణ భారతదేశంలోని ఈ మతసామరస్య వాతావరణాన్ని విచ్ఛిన్నం చేసినవారు ఆంగ్లేయులు. వారు ఈ పనిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం చేసారనేది సుస్పష్టం. హైదర్ అలీ, టిపు మీద ముస్లిం ముద్రవేసి, తర్వాత ఆముద్రను మతోన్మాదంగా చిత్రించిన వారు ఆంగ్లేయులు. ఈ ధోరణి రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో ఆంగ్లేయుల పరాజయంతో మొదలయ్యింది. ఆసక్తికరంగా, టిపు మరణం తర్వాత 19వ శతాబ్దంలో ఆంగ్లేయులు టిపును ఇస్లాం మతోన్మాదిగా చిత్రించడం ఉధృతం చేసారు. ఆంగ్ల అధికారి విలియం కిర్క్ పాట్రిక్ 1810లో రచించిన Selected letters of Tipusultan అనే పుస్తకంలో టిపును మతోన్మాదిగా పేర్కొన్నాడు. టిపు మరణం తర్వాత మైసూరు రాజ్యంలో

ఒడయారుల సంస్థానంలో బ్రిటిష్ రెసిడెంట్‌గా ఉన్న మార్క్ విల్క్స్ కూడా తన పుస్తకం History of Mysore లో టిపు బలవంతపు మత మార్పిడులను, దేవాలయ విధ్వంసాలను చేశాడని పేర్కొన్నాడు. ఈ రచనలు టిపు మరణించిన 12 సంవత్సరాల తర్వాత టిపుపై తమ దురాక్రమణలను సమర్థించుకోవడానికి బ్రిటిష్ అధికారులు వ్రాసినవి.

1916లో అప్పటి మైసూరు రాజ్య పురావస్తుశాఖ డైరక్టరుగా పనిచేసిన రాయబహద్దూర్ నరసింహాచార్ మైసూరు రాజ్యంలోని శృంగేరి మఠంలో టిపు మఠం జగద్గురువుకు కన్నడంలో వ్రాసిన 30 ఉత్తరాలను కనుగొన్నారు. ఈ ఉత్తరాలలోని సమాచారాన్ననుసరించి తర్వాత జరిగిన చరిత్ర పరిశోధనలలో టిపు మత విధానాన్ని నిష్పాక్షికంగా పరిశీలించడం ప్రారంభమయ్యింది. బ్రిటిష్ వారు టిపు పై మతోన్మాద ముద్ర వేయడం వెనుక వారి రాజకీయ ప్రయోజనాలున్నాయనే సంగతి స్పష్టమయ్యింది. కాని 21వ శతాబ్దంలో ఓట్ల రాజకీయ అవసరాల దృష్ట్యానే టిపుపై అవాస్తవాల ప్రచారం మళ్ళీ ప్రారంభమయ్యింది.

## టిపు మత సామరస్యానికి హిందూమత అభిమానానికి ప్రతీక శృంగేరి మఠ ఉదంతం

శ్రీ ఆది శంకరచార్యులు ఎనిమిదవశతాబ్దంలో స్థాపించిన మఠాలలో కర్నాటక రాష్ట్రంలోని షిమోగా జిల్లాలోని శ్రీ శృంగేరి మఠం ఒకటి. మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో మరాఠాలు ఆంగ్లేయులతో కలిసి టిపుకు వ్యతిరేకంగా ఈ యుద్ధంలో పాల్గొన్నారు. రఘునాథరావు పట్వర్ధన్ అనే మరాఠా సైనికాధికారి నేతృత్వంలో మరాఠా సైన్యాలు టిపు రాజ్యంలో ఉన్న శృంగేరి మఠంపై 1791లో దాడి చేసాయి. మఠంలో ఉన్న ధనాన్ని, బంగారాన్ని, అక్కడ నెలకొని ఉన్న దేవత శారదదేవి ఆభరణాలను, ఇతర విలువైన సామగ్రిని మరాఠా సైన్యాలు కొల్లగొట్టాయి. అమ్మవారి విగ్రహానికి నష్టం కలిగించాయి. మరాఠా సైనికులు చాలా మంది బ్రాహ్మణులను చంపారు. కొట్టి హింసించారు. మఠాధిపతి జగద్గురు శ్రీ సచ్చిదానంద భారతి వేడు కోళ్ళు, విన్నపాలను కూడా మరాఠా సైన్యాలు ఖాతరు చెయ్యలేదు. ఈ విధ్వంసం తర్వాత జగద్గురువు అక్కడి నుండి వెళ్ళిపోయి కరకాల అనే ప్రాంతంలో తలదాచుకొని టిపు సుల్తానుకు జరిగిన సంగతి వివరిస్తూ సహాయం కొరకు ఉత్తరం వ్రాసారు.

మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో వ్యస్తుడై ఉన్నప్పటికీ టిపు వెంటనే జగద్గురువు ఉత్తరానికి స్పందించాడు. మఠంలో పూజల పునరుద్ధరణకు, అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠకు కావలసినధనాన్ని ఇతర వస్తువులను సమకూర్చ వలసిందిగా ఆ ప్రాంతంలోని తన అధికారులకు ఆదేశాలు జారీ చేసాడు. మఠాధిపతిని 'జగద్గురువు'

అని సంబోధిస్తూ టిపు ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. మరాఠాల దుష్కర్మను నిరసిస్తూ టిపు జగద్గురువుకు వ్రాసిన ఉత్తరంలో ఇలా వ్రాసాడు. ఈ సంస్కృత వాక్యం కన్నడ లిపిలో ఉంది.

'హసద్భిహ్ క్రియాతె కర్మ రుదాద్భిర్ అనుభ్యతె'

మనుష్యులు నవ్వుతూ దుష్కర్మలు చేస్తారు కాని వాటి ఫలితాలను ఏడుస్తూ అనుభవిస్తారు.

అంతేకాదు ఈ కలియుగంలో అటువంటి పవిత్ర స్థలాలకు వ్యతిరేకంగా పాపం చేసినవారు వారి దుష్కర్మలకు ఫలితాలు అనుభవిస్తారు.

గురువులకు ద్రోహం చేసిన వారి వంశాలు నాశనం అవుతాయి అని కూడా తన ఉత్తరంలో టిపు వ్రాసాడు.

1785లోనే టిపు శృంగేరి మఠాన్ని పన్నుల నుంచి మినహాయిస్తూ మఠం ఆధీనంలోని భూములపై, గ్రామాలపై మఠానికే పూర్తి హక్కులనిస్తూ ఆదేశాలు జారీ చేసాడు.

మఠ పునరుద్ధరణ కార్యక్రమం తర్వాత మఠాధిపతి టిపుకు శాలువ, ప్రసాదం పంపించారు. వాటిని అందుకున్న తర్వాత టిపు శారదా దేవికి పట్టు వస్త్రాలను, స్వామికి రెండు శాలువలను పంపించినట్టు ఒక లేఖలో ఉంది. రాజ్య ఐశ్వర్యం కొరకు, మా శత్రువుల నాశనం కొరకు ప్రార్థించాలని టిపు స్వామిని కోరాడు.

శృంగేరి మఠంలో శత చండీయాగం, సహస్ర చండీ యాగం జరిపించడానికి అయిన ఖర్చులను టిపు ఇచ్చినట్లు ఇంకొక లేఖ ద్వారా తెలుస్తుంది. యాగాల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చెయ్యవలసిందిగా టిపు అక్కడి తన అధికారులకు ఆదేశాలు జారీ చేసాడు. బ్రాహ్మణులకు ధనం దానంగా ఇవ్వాలని, యాగం జరిగినన్ని రోజులు ప్రతిరోజు వెయ్యిమంది బ్రాహ్మణులకు భోజనాలు ఏర్పాటు చెయ్యాలని జగద్గురువును కోరాడు. మఠంలోని దేవత శారదాదేవికి ఒక పల్లకిని, జగద్గురువుకు ఒక పల్లకిని పంపించ వలసిందిగా టిపు బెద్నూరులోని తన అధికారికి ఆదేశాలిచ్చాడు. 1799లో టిపు శృంగేరి స్వామివారికి వ్రాసిన ఉత్తరంలో తను ఆయనకు వెండికర్రలు కలిగిన రెండు విసన కర్రలను పంపిస్తున్నానని వ్రాసాడు.

### హిందూ దేవాలయాలకు టిపు విరాళాలు, భూదానాలు

మార్క్ విర్క్స్ టిపు హిందూ దేవాలయాలను కూలగొట్టాడని తప్పుడు ఆరోపణలు చేసాడు. వాస్తవానికి టిపు తన రాజ్యంలోని హిందూ దేవాలయాల అభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకున్నాడు. ఆలయాల నిర్వహణకు, పాలనకు ఒక శాఖను ఏర్పాటు చేసాడు. అప్పటి మైసూరు రాజ్యంలో, ఇప్పటి కర్నాటక రాష్ట్రంలో కూడా మఠాలు అధికం. వాటి ఆస్తుల పరిరక్షణను కూడా ఈ శాఖ అధికారులు నిర్వహించేవారు.

156 హిందూ దేవాలయాలకు టిపు భూమి, ధనం, బంగారం వంటి దానాలను అందజేసాడని మైసూరు గెజెట్‌లో సమాచారం ఉంది. బ్రాహ్మణులకు దానాలిచ్చిన ఆజ్ఞా పత్రాలు, దేవాలయాలకు వెండి, బంగారు ఆభరణాలను, వస్తు సామాగ్రిని కానుకగా ఇచ్చిన శాసనాలు ఎన్నో లభిస్తున్నాయి.

మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధానంతరం తమిళనాడులోని రాయకొట్టా ప్రాంతం, శ్రీరంగపట్టణం సంధి ననుసరించి టిపు నుండి ఆంగ్లేయుల ఆధీనంలోనికి వచ్చింది. అక్కడి రెండు దేవాలయాలకు టిపు జారీ చేసిన దాన పత్రాలను అక్కడి బ్రాహ్మణులు ఆంగ్ల అధికారి మన్రోకు చూపించి ఆంగ్లేయులు కూడా ఆ దానాలను కొనసాగించాలని కోరారు. లేకపోతే ఈ దేవాలయాలలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం కష్టమని చెప్పారు.

కడప జిల్లాలోని పులివెందులలో ఆంజనేయస్వామి దేవాలయంలో ఆగిపోయిన పూజలను పునరుద్ధరించాలని, అదే ఊరిలోని వెంకటా చలపతి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిరాఘాటంగా కొనసాగాలని టిపు ఆజ్ఞలు జారీ చేసాడు.

టిపు బలవంతంగా మత మార్పిడులు చేసాడని ఆంగ్లేయులు ఆరోపిస్తున్న మలబారు (కేరళ)లో టిపు ఏడు దేవాలయాలకు, బ్రాహ్మణులకు భూదానాలిచ్చిన ఆధారాలు లభిస్తున్నాయి.

1. ఎర్నాడు తాలూకాలోని చెంబూరు గ్రామంలోని మన్నూరు దేవాలయానికి 70.42 ఎకరాల మాగాణి భూమి, 3.29 ఎకరాల తోట భూమి.
2. పొన్నాని తాలూకాలోని వైలత్తూరు గ్రామంలో తిరువంచికులమ్ దేవాలయానికి 208.82 ఎకరాల మాగాణి, 3.29 ఎకరాలతోట భూమి.
3. పొన్నాని తాలూకాలోని గురువయ్యూరు గ్రామంలోని గురువయ్యూరు దేవాలయానికి 46.02 ఎకరాల మాగాణి, 458.32 ఎకరాల తోట భూమి.
4. కాలికట్ తాలూకాలోని కస్బా గ్రామంలోని త్రిక్కంటి యూర్ పెట్టకోరు మకనకావు దేవాలయానికి 122.70 ఎకరాల మాగాణి, 73.36 ఎకరాల తోట భూమి.
5 పొన్నాని తాలూకాలోని కడికాడ్ గ్రామంలోని కట్టు మాడతిల్ శ్రీ కుమరన్ నంబూద్రిపాద్‌కు 27.97 ఎకరాల మాగాణి, 6.91 ఎకరాల తోట భూమి.
6. పొన్నాని తాలూకాలోని త్రిక్కండి యూర్ గ్రామంలోని త్రిక్కండియూర్ సమూహం దేవాలయానికి 20.63 ఎకరాల మాగాణి, 41 ఎకరాల తోట భూమి.
7. త్రిచూర్‌లోని నడువిల్ మాధాతిల్ తిరుముంబుకు 40.26 ఎకరల మాగాణి, 22.13 ఎకరాల తోట భూమి, 4.17 ఎకరాల మెట్ట భూమి.

## బ్రాహ్మణులకు టిపు ఇచ్చిన భూదానాలు

టిపు ఏ ఇతర హిందు రాజుల కంటె కూడా బ్రాహ్మణులను, బ్రాహ్మణ పూజారులను గౌరవించాడు. శృంగేరి మఠ అధిపతిని టిపు జగద్గురువు అని సంబోధించేవాడు. టిపు తన వెంట ఎప్పుడూ బ్రాహ్మణ పండితులను, జ్యోతిష్యులను ఉంచుకునే వాడు. వారి సలహాల మేరకు రాజకీయ, పరిపాలన, సైనిక నిర్ణయాలను తీసుకునేవాడు, దానధర్మాలు చేసేవాడు. టిపు మరణించిన రోజు కూడ ఉదయం బ్రాహ్మణులకు దానధర్మాలు చేసాడు. హిందు రాజుల వలెనే దేవాలయాలతో పాటు బ్రాహ్మణులకు భూదానాలు ఇతర దానాలు చేసాడు. అనేక మందికి భృతిని ఏర్పాటు చేసాడు.

ఈ దానధర్మాలకు సంబంధించి 34 సనద్‌లు (ఆజ్ఞా పత్రాలు) లభించాయి. టిపు కడపలోని తన అమీల్‌దార్ కోనప్పకు జారీచేసిన ఒక మరాఠి సనద్‌లో గొల్లపల్లి, తొంగపల్లి గ్రామాల శిస్తు పుష్పగిరి మఠం స్వామికి చెందేలా చూడాలని ఆజ్ఞ జారీ చేసాడు. గంజికోటలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజానిర్వహణ కోసం కడప జిల్లాలోని కొత్తనూతల గ్రామాన్ని రామాచార్ అనే పూజారికి భరణంగా ఇవ్వాలని టిపు ఆదేశాలు జారీ చేసాడు.

1794లో మహారాజ్ హరిపా అనే బ్రాహ్మణునకు మంజరాబాద్ తాలుకాలో కొంత భూమిని ఇనామ్‌గా ఇచ్చాడు. తుంగభద్ర తీరంలోని అనేక మంది బ్రాహ్మణులకు, దేవాలయాలకు టిపు అనేక దానాలిచ్చినట్లు కన్నడ లిపిలో ఉన్న ఒక సంస్కృత శాసనం ఉంది.

తమిళనాడులోని ధర్మపురిలోని నరసింహ జోషి అనే బ్రాహ్మణునకు సంవత్సరానికి పది పగోడాల భృతిని వంశ పారంపర్యంగా టిపు ఏర్పాటు చేసాడు. భూముల భరణాలు తప్ప మిగతా అన్ని భరణాలను బ్రాహ్మణులకు ఇవ్వవలసిందిగా బారామహల్ (తమిళనాడు) లోని తన అమిల్‌దార్ హరదాసియాకు టిపు ఆజ్ఞా పత్రం జారీచేసాడు.

## దేవాలయాలకు టిపు కానుకలు

టిపు రాజధాని శ్రీరంగపట్టణంలో టిపు రాజభవనానికి పశ్చిమంగా కేవలం వంద గజాల దూరంలో శ్రీరంగనాథస్వామి దేవాలయం ఉంది. టిపు నివశించే శ్రీ రంగపట్టణం కోటలో నరసింహ గంగాధరేశ్వర దేవాలయాలు ఉన్నాయి.

శ్రీరంగనాథ స్వామి దేవాలయానికి ఏడు వెండి గిన్నెలను, కర్పూరం వెలిగించే ఒక వెండి హారతి గిన్నెను టిపు సుల్తాన్ పచ్చా (పాదుషా) బహుకరించినట్టు తెలిపే శాసనం ఉన్నది.

కలాలె లోని లక్ష్మీకాంత దేవాలయానికి నాలుగువెండి గిన్నెలు, ఒక వెండి కంచం, ఉమ్మి వేసుకునే ఒక వెండి పాత్రను టిపు బహుకరించినట్టు అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి.

మెల్కొట్‌లోని నారాయణస్వామి దేవాలయానికి కూడా టిపు కొన్ని బంగారు ఆభరణాలు, వెండి పాత్రలను బహుకరించినట్టు ఆధారాలు ఉన్నాయి. 1785లో టిపు ఇదే దేవాలయానికి 12 ఏనుగులు, ఒక నగారా (వాయిద్యం) బహుకరించాడు.

అయిదు రకాల విలువైన రాళ్ళతో పొదిగిన బంగారు గిన్నెను టిపు సుల్తాన్ పాదుషా నంజన్‌గూడలోని శ్రీకంఠేశ్వరదేవాలయానికి బహుకరించినట్టు ఒకశాసనం ద్వారా తెలుస్తుంది.

నంజన్‌గూడలోని నంజుండేశ్వర దేవాలయానికి టిపు పచ్చలు పొదిగిన లింగాన్ని బహుకరించాడని తెలిపే శాసనం ఉంది. అందుకే ఇప్పటికీ ఆ లింగాన్ని పచ్చలింగ, పాదుషాలింగ అని పిలుస్తారు.

## కంచి దేవాలయానికి గోపుర నిర్మాణం

1780లో హైదర్ అలీ కర్నాటక (తమిళనాడు) రాజ్యంపై దాడి చేసినప్పుడు కాంచీపురంలోని దేవాలయానికి గోపుర నిర్మాణానికి పునాది వేసాడు. కాని దానిని పూర్తి చేయలేక పోయాడు. మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధ కాలంలో టిపు కంచి వెళ్ళడం జరిగింది. టిపు ఆ గోపుర నిర్మాణాన్ని పూర్తిచేయడానికి 1000 హణ్ణులు ఇచ్చాడు. అక్కడ జరిగిన రథోత్సవంలో పాల్గొనడమే కాకుండా ఆ సందర్భంగా జరిగిన బాణా సంచాకు అయిన ఖర్చులను ఇచ్చాడు.

## విభిన్న హిందూ వర్గాల మధ్య టిపు మధ్యవర్తిత్వం

మెల్‌కొటె దేవాలయంలో వైష్ణవ సాంప్రదాయానికి చెందిన రెండు విభిన్న వర్గాలైన వడగలై తెంగలైల మధ్య దేవాలయంలో పాడే సుప్రభాతం సేవల విషయంలో వివాదం ఏర్పడింది. టిపు ఈ వివాదంలో మధ్యవర్తిగా వ్యవహరించి ఆజ్ఞా పత్రాలను జారీ చేసాడు. ఈ ఆజ్ఞాపత్రాలు (సనద్) మైసూరులోని పరకల మఠంలో లభించాయి. ఈ పత్రంలో రెండు వర్గాల సుప్రభాత సేవలను కొనసాగించాలని తెంగలై శాఖకు చెందిన ఒక గురువు విగ్రహాన్ని తొలగించడం జరిగిందని, దానిని తిరిగి పాత స్థానంలోనే పునః ప్రతిష్టించాలని ఉన్నది.

దేవాలయాలకు సంబంధించిన ఆచార వ్యవహారాల విషయాలలో వివాదాలు చోటు చేసుకున్నప్పుడు రాజులు జోక్యం చేసుకొని పరిష్కరించడం సర్వ సాధారణం. టిపు సుల్తాను కూడా ఒక రాజుగా తన బాధ్యతను నిర్వహించాడు. ఒక ముస్లింగా హిందూ దేవాలయ వ్యవహారాలలో తనకేమీ సంబంధంలేదని టిపు ఎన్నడూ భావించలేదు. తన వ్యక్తిగత

మత విశ్వాసాలు తన పరిపాలనను ప్రభావితం చెయ్యకుండా టిపు తన రాజ్యాన్ని పాలించాడు.

ఇందుకు ఒక ఉదాహరణ మైసూరు రాజుగా టిపు ఒడయారు రాజుల కొన్ని పద్ధతులను కొనసాగించాడు. ఒడయారు రాజులు రోజూ ఉదయం రంగనాథస్వామి ఆలయాన్ని సందర్శించనిదే ఫలహారం చేసేవారు కాదు. టిపు కూడా రోజూ రంగనాథ స్వామి ఆలయాన్ని దర్శించిన తర్వాతే ఉదయపు ఫలహారం చేసేవాడు. ఒడయారులు దసరా ఉత్సవాలను ఘనంగా పదిరోజుల పాటు నిర్వహించేవారు. టిపు కూడా దసరా ఉత్సవాలను ఘనంగా పదిరోజులు నిర్వహించేవాడు. అన్ని మతాల పండుగలకు ప్రజలందరికీ విరివిగా దాన ధర్మాలు చేసేవాడు.

## సలామ్ మంగళారతి

ప్రస్తుత కర్నాటక రాష్ట్రంలోని కొల్లూరులోని శ్రీ మూకాంబికా దేవాలయంలో ఇప్పటికీ అక్కడి బ్రాహ్మణ పూజారులు ప్రతిరోజు సాయంకాలం 7-30 గంటలకు టిపు గౌరవార్థం అతని పేరు మీద 'సలామ్ మంగళారతిని' ఇస్తారు. టిపు ఈ దేవాలయాన్ని సందర్శించి ప్రక్కనే ఉన్న శంకర నారాయణ దేవాలయానికి ఒక గంటను బహుకరించాడు.

## టిపు వ్యక్తిగత మతాచరణ

టిపు జన్మతహా ఇస్లాంలోని సున్ని శాఖకు చెందిన వాడు. కాని టిపు ఇస్లాంలోని ఇతర శాఖలైన షియా, ప్రజల మధ్య మత సామరస్యాన్ని ప్రేమను బోధించే సూఫీయిజం వైపు ఆకర్షితుడయ్యాడు.

ఆ కాలంలో (ప్రస్తుత కాలంలో కూడా) దక్షిణ భారతదేశంలో హిందూ ముస్లిం అన్ని వర్గాలలో సూఫీ గురువు ప్రభావం ఉండేది. సూఫీ గురువుల సమాధులున్న దర్గాలను ప్రజలు తండోప తండాలుగా దర్శించేవారు. తమిళనాడులోని ఆర్కాట్ లో నెలకొని ఉన్న సూఫీ గురువు టిపు అవులియా దర్గాను దర్శించిన టిపు తల్లి తన కుమారునికి టిపు అని పేరు పెట్టింది.

టిపు తన వ్యక్తిగత జీవితంలో నిబద్ధత కలిగిన ఒక ముస్లింగా జీవించాడు. రోజుకు అయిదుసార్లు నమాజు చేసేవాడు. రంజాన్ నెలలో ఉపవాసముండేవాడు. రోజంతా తన చేతిలో ఒక జపమాల ఉంచుకునేవాడు. ఇస్లాం మత ఆదేశానుసారం రాజ్యంలో మద్యాన్ని, వేశ్యావృత్తిని నిషేధించాడు.

టిపు హిందూ సాధువుల్ని ముస్లిం ఫకీరులను ఎంతో ఆదరించేవాడు. వారితో తరచూ మత సంబంధమైన చర్చల్లో పాల్గొనేవాడు.

హైదర్ అలీ వలెనె టిపుకు మూఢనమ్మకాలు ఉండేవి. ఎప్పుడూ తన వెంట జ్యోతిష్యులను ఉంచుకుని వారు చెప్పిన ప్రకారం కార్యాలను నిర్వహించేవాడు. దురదృష్టాన్ని

నివారించడానికి వారు చెప్పినట్టు క్రతువులు నిర్వహించేవాడు. ప్రతి శనివారం ఏడు నక్షత్రాలకు, ఏడు రకాల ధాన్యాలకు పూజ చేసి ఆవనూనెతో నింపిన ఒక పెనాన్ని, ఒక నీలంటోపి, కోడి, ఒకనల్ల గొర్రె, కొంత డబ్బును బ్రాహ్మణులకు దానం చేసేవాడు.

## టిపు ఇస్లాం మతోన్మాదా?

టిపు హిందూ దేవాలయాలకు, బ్రాహ్మణులకు, హిందూ మఠాలకు భూ దానాలు, విరాళాలు విరివిగా ఇచ్చాడు. దేవాలయాలకు బంగారు ఆభరణాలను, వెండి సామగ్రిని బహుకరించాడు. నంజన్ గూడలోని నంజుండేశ్వర దేవాలయంలో టిపు బహుకరించిన పచ్చలు పొదిగిన లింగానికే ఇప్పటికింకా పూజలు నిర్వహించ బడుతున్నాయి. ఇప్పటికీ ముకాంబికా దేవాలయంలో టిపు పేరు మీద మంగళారతులు ఇవ్వబడుతున్నాయి. టిపు శృంగేరి మఠం స్వామిజీని జగద్గురు అని గౌరవంతో తన ఉత్తరాలలో సంబోధించిన పద్ధతి ఒక 'మతోన్మాది', వేరే మతం గురువును అంత గౌరవ భావంతో సంబోధించడం అసంభవం. టిపు తన రాజ్యంలో అత్యధికులైన హిందూ ప్రజల మతాన్ని ఎంతో గౌరవించి, ఒక మంచి పాలకుడిగా ఆ మత పరిరక్షణకు, అభివృద్ధికి ఎంతో కృషిచేసాడని నిరూపించడానికి ఎన్నో చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. కాని కొందరు బ్రిటిష్ రచయితలు, చరిత్రకారులు ఈ చారిత్రక వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా, టిపు తీసుకున్న కొన్ని రాజకీయ నిర్ణయాలకు మతం రంగు పులిమి భారతదేశంలో తమ సామ్రాజ్య విస్తరణను సమర్థించుకునే ప్రయత్నం చేసారు.

## మలబారు, కూర్గు తిరుగుబాట్లు - మత మార్పిడులు

ఫ్రెంచ్ అధికారి కొసైనీకి వ్రాసిన ఉత్తరంలో "మలబారులోని నాయర్లు మళ్ళీ మళ్ళీ చేస్తున్న తిరుగుబాట్లకు విరుగుడుగా వారిని శిక్షించే ఉద్దేశంతో వారిని ఇస్లాంలోకి మత మార్పిడి చేసానని, వారి ఆరు తిరుగుబాట్లను క్షమించానని ఏడవ తిరుగుబాటును క్షమించలేక పోయానని అందుకే వారిని ఇస్లాం మతంలోకి మార్చి శిక్షించానని" టిపు స్వయంగా అంగీకరించాడు. మలబారులోని సుగంధ ద్రవ్యాల వర్తకంపై ఆధిపత్యానికి ఆంగ్లేయులకు, మైసూరుకు మధ్య పోటీ ఉండేది. ఉత్తర కేరళలోని తెల్లిసిరి ఆంగ్లేయులకు బలమైన స్థావరం. నాయర్ల తిరుగుబాట్లకు ఆంగ్లేయుల సహకారం ఉండడమే కాకుండా, తిరుగుబాటుదార్లకు తెల్లిసిరిలో ఆశ్రయం లభించేది. ఈ తిరుగుబాటు దార్లు మైసూరు రాజ్యానికి దక్షిణాన ఉన్న ట్రావెన్కూరు రాజ్యంలో కూడా ఆశ్రయం పొందేవారు. మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధం ప్రారంభం కావడానికి కారణం టిపు ఈ ట్రావెన్కూర్ రాజుపై దాడి చేయడం. ఇతడు తూర్పు ఇండియా కంపెనీతో సైనిక ఒప్పందం చేసుకున్నాడు.

మైసూరు రాజ్యానికి పశ్చిమాన ఉన్న కూర్గు రాజ్యంలో కూడా టిపుపై తిరుగుబాట్లు జరిగాయి. మలబారులోని నాయర్ల వలె ఇక్కడి ఆధిపత్య కులమైన కొడవలు కూడా

ఆంగ్లేయుల సాయంతో అనేక సార్లు తిరుగుబాటు చేసారు. వీరిలో కొందరిని టిపు ఇస్లాం లోనికి మార్చాడు. ఇక్కడ మత మార్పిడులు జరిగిన సంఖ్యను కూడా ఆంగ్ల చరిత్రకారులు, కొందరు ముస్లిం చరిత్రకారులు గందరగోళంగా పేర్కొన్నారు. ముస్లిం చరిత్రకారులు ఈ సంఖ్యను 80,000లుగా పేర్కొంటే ఆంగ్ల చరిత్రకారులు 20,000–60,000 మధ్యగా సూచించారు. ఈ సంఖ్య టిపు చేసిన మతమార్పిడుల గురించి రచయితలకు సరైన సమాచారం లేకుండానే టిపుపై ఆరోపణలకు పూనుకున్నారని తెలుపుతుంది. ముస్లిం చరిత్రకారులు టిపును ఇస్లాం మత వ్యాప్తికి నిబద్ధుడైన ఒక గొప్ప ముస్లిం రాజుగా చూపే ప్రయత్నం చేసారని తెలుస్తుంది. ఎందుకంటే 1839–40లో కూర్గులో మొదటిసారి జనాభా లెక్కలు జరిపినప్పుడు అక్కడి మొత్తం జనాభా 80,000కు మించలేదు. 1870 జనాభా లెక్కల ప్రకారం అక్కడి ముస్లింల జనాభా కేవలం 6,000 మాత్రమే, అటువంటప్పుడు 1780–90లలో కూర్గులో 60,000–80,000 వరకు ముస్లింలుగా మత మార్పిడికి గురయ్యారని చెప్పడం హాస్యాస్పదం.

టిపు తను జయించిన కూర్గు, మలబార్లలో మత మార్పిడులను తిరుగుబాటుదార్లపై శిక్షగా అమలు పరిచాడు. మైసూరు రాజ్యంలో శిక్షలుగా కూడా మత మార్పిడులు జరగలేదు.

## కెనరా క్రైస్తవులు

మైసూరు రాజ్యానికి పశ్చిమ తీరంలో ఉన్న మంగుళూరు పరిసర ప్రాంతాలలోని క్రైస్తవులపై టిపు అనేక అత్యాచారాలు చేసాడని ఆంగ్లేయులు ఆరోపించారు. వీరిని కెనరా క్రైస్తవులు అని పిలిచేవారు. కన్నడ ఆంగ్లేయల ఉచ్చారణలో కనర, కెనరా అయ్యింది. వీరికి ఎక్కువగా గోవాలోని క్రైస్తవ మత సంస్థలతో సంబంధాలుండేవి. గోవాలోని పోర్చుగీసువారు టిపు శత్రువులైన ఆంగ్లేయులకు, మరాఠాలకు మద్దతుగా ఉండేవారు. ఈ కెనరా క్రైస్తవులు మైసూరు రాజ్య – పౌరులైనప్పటికీ టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు సహాయం చేసేవారు. రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో అన్నన్‌పూర్‌లో అనేక అకృత్యాలు చేసిన ఆంగ్ల సైనికాధికారి జనరల్ మాథ్యూస్‌కు ఈ కెనరా క్రైస్తవులు ఎంతో సాయం చేసారు. వీరి సాయంతోనే జనరల్ మాథ్యూస్ బెద్నూరు, మంగుళూరు కోటలను ఆక్రమించుకోగలిగాడు. వీరు మైసూరు రాజ్యంలో గూఢచారి చర్యలు నిర్వహించేవారు. టిపు సైన్యం నుండి 35 మంది క్రైస్తవ సైనికులు ఆంగ్లేయులతో చేరి టిపుకు ద్రోహం చేసారు. అంతేకాదు ఈ కెనరా క్రైస్తవులు ఆంగ్లేయులకు ఆర్థిక సాయం కూడా చేసేవారు. బెద్నూరులో టిపు సైన్యం చేతిలో ఓడిపోయే ముందు తాను కెనరా క్రైస్తవుల వద్దనుండి 33,000 రూపాయలు అప్పుగా తీసుకున్నానని జనరల్ మాథ్యూస్ తన పై అధికారులకు ఒక ఉత్తరం ద్వారా తెలిపాడు. ఇదే యుద్ధంలో మంగుళూరు కోటనుండి ఆంగ్లేయులను ఖాళీ చేయించడానికి మైసూరు సైన్యాలు కోటను చుట్టు ముట్టినప్పుడు కెనరా క్రైస్తవులు

కోటలోని ఆంగ్ల సైనికాధికారి కాంప్‌బెల్‌కు రహస్యంగా సహాయాన్ని అందించేవారు. కాంప్‌బెల్ ఖాసిమ్ అలీ, మహమ్మద్ అలీ అనే ఇద్దరు మైసూరు సైనికాధికారులతో కలిసి టిపును పదవీ భ్రష్టుడిని చెయ్యడానికి కుట్ర పన్నాడని తర్వాత వెల్లడయ్యింది. విఫలమైన ఈ కుట్రలో క్రైస్తవులు ప్రముఖ పాత్ర నిర్వహించారు.

మంగుళూరులోని క్రైస్తవ మిషనరీ అధ్యక్షుడిగా ఉన్న కెనరా క్రైస్తవుడు ఫాదర్ డాన్ జోక్విమ్ డి మిరాండా మంగుళూరు కోటలోని ఆంగ్లేయులకు రహస్యంగా వెయ్యి బస్తాల బియ్యాన్ని సరఫరా చేసాడు. ఈ సంగతి బహిర్గత మైనప్పటికీ టిపు ఫాదర్ మిరాండాను క్షమించి ఎంతో గౌరవంతో ఆదరించాడు. ఫాదర్ మిరాండాను మైసూరు సైనికులెవ్వరూ వేధించకూడదని టిపు ఆజ్ఞలు జారీచేసాడు. మిరాండా విజ్ఞప్తి మేరకు బందీలుగా ఉన్న 1500 మంది కెనరా క్రైస్తవులను విడుదల చేసాడు.

అయినప్పటికీ ఫాదర్ మిరాండా టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు సాయం చేస్తుండడంతో టిపు అతనిని కొన్ని రోజులు మంగుళూరు కోటలో నిర్బంధించి, విచారణ తర్వాత కొందరు కెనరా క్రైస్తవులతో సహా అతనిని కొచ్చిన్‌కు బహిష్కరించాడు, కొందరిని గోవాకు బహిష్కరించాడు. కొందరిని శ్రీరంగపట్టణం, చిత్ర దుర్గలో బందీలుగా ఉంచాడు. తనను పదవీ భ్రష్టుడిని చెయ్యడానికి జరిగిన కుట్రలో పాల్గొన్నందుకు ఒక క్రైస్తవుడిని ఉరితీయడం జరిగింది. టిపు కెనరా క్రైస్తవులకు ఎక్కువగా బహిష్కరణ శిక్షనే విధించాడు. బహిష్కరణకు గురయిన వారి సంఖ్య కూడా సరిగ్గా తెలియడం లేదు. గోవా వైస్రాయి 20,000 మంది అని పేర్కొంటే ఆంగ్ల రచనలు 60,000 మంది అని పేర్కొన్నాయి.

తర్వాత శ్రీరంగపట్టణంలో ఫ్రెంచ్ రాయబారి పియరీ మొనరో ప్రయత్నాలతో టిపు ఫాదర్ మిరాండాతో పాటు అనేక మంది కెనరా క్రైస్తవులు మంగుళూరు తిరిగి రావడానికి అంగీకరించాడు.

టిపు మలబారు నాయర్లను, కూర్గు కొడవలను, కెనరా క్రైస్తవులను వారి మతాల కారణంగా శిక్షించలేదు. వారు రాజ ద్రోహం చేసారు. అప్పటికీ ఇప్పటికీ రాజద్రోహం పెద్ద నేరమే. రాజద్రోహానికి ఖైదు, మరణ దండనలు శిక్షలుగా ఉండేవి. ఈ కఠిన శిక్షలకు ప్రత్యామ్నాయంగా టిపు మత మార్పిడిని శిక్షగా, అమలు జరిపాడు. ఈ రాజకీయ తిరుగు బాట్లను వక్రీకరించి బ్రిటిష్‌వారు మతం రంగు పులిమారు. 1857 సిపాయి తిరుగు బాటులో తిరుగుబాటుదార్లను రాజద్రోహ నేరానికి శిక్షగా ఉచకోత కోసి శవాలను చెట్లకు వేలాడదీసిన ఆంగ్లేయులు రాజద్రోహ నేరానికి టిపు విధించిన మతమార్పిడి శిక్షను తప్పు పట్టడం హాస్యాస్పదం.

రాజద్రోహ నేరానికి టిపు కెనరా క్రైస్తవులను మాత్రమే శిక్షించాడు. మలబారులోని సిరియన్ క్రైస్తవుల పట్ల టిపు స్నేహపూర్వకంగా వ్యవహరించేవాడు. వ్యాపారంలో నిష్ణాతులైన

ఆర్మేనియన్ క్రైస్తవులను తన రాజ్యంలో వచ్చి స్థిరపడాలని ఆహ్వానించాడు. మైసూరు రాజ్య నిబంధనలకు లోబడి జీవిస్తే మైసూరు రాజ్యం లోనికి రావచ్చని గోవా క్రైస్తవులను కూడా ఆహ్వానించాడు. టిపు సైన్యంలోని అనేక మంది దేశ విదేశీ క్రైస్తవులు తమ మతాన్ని స్వేచ్ఛగా అనుసరించేవారు.

తన వద్ద బందీలుగా ఉన్న క్రైస్తవులు తమ మతాన్ని ఆచరించడానికి వీలుగా ఒక క్రైస్తవ ఫాదర్‌ని పంపించాలని టిపు గోవాలోని క్రైస్తవ మతాధిపతికి, గోవా వైస్రాయికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసాడు.

## మహదవీలు

తనకు వ్యతిరేకంగా తిరుగు బాటు చేసిన మలబారు ముస్లిం మోప్లాలను కూడా టిపు కఠినంగా శిక్షించాడు. తన సైన్యంలోని మహదవీలు తన ఆజ్ఞలను నిరాకరించి నందుకు టిపు దేశ బహిష్కరణ చేసి వారి నాయకులను బందీలను చేసాడు. ఇస్లాంలో ఒక శాఖ ఈ మహాదవీలు. తమ ప్రార్థనలలో పెద్దగా అరిచేవారు. 1794లో రంజాన్ నెలలో పవిత్రమైన 27వ రోజున వీరు తమ ప్రార్థనలతో ఇతరులకు ఇబ్బంది కలిగించేవారు. టిపు వీరిని వేరొక చోటుకు వెళ్ళి ప్రార్థనలు చేసుకోమని ఆజ్ఞాపించాడు. వారు దానికి అంగీకరించక పోవడంతో టిపు వారిని శిక్షించడం జరిగింది. వీరి నాయకుడు మీర్ సాదిక్ టిపుకు అత్యంత సన్నిహితుడు. నాల్గవ మైసూరు యుద్ధంలో మీర్ సాదిక్‌తో సహా మహదవీలు ఆంగ్ల సైన్యంలో చేరి వారికి మద్దతునిచ్చారు.

టిపు కడప, కర్నూలు, సావనూర్, హైదరాబాదు, కర్నాటక నవాబులతో యుద్ధాలు చేసాడు.

టిపు ఏ మత సమూహాలతో వ్యవహరించినా, వారిని శిక్షించినా రాజకీయ పరంగా నిర్ణయాలు తీసుకున్నాడు. వారి వారి మతాలను బట్టికాదు. వ్యక్తిగతంగా ఇస్లాంలో నమ్మకమున్న ఒక నిబద్ధత కలిగిన ముస్లిం అయినప్పటికీ, టిపు తన వ్యక్తిగత విశ్వాసాలను, రాజ్య నిర్వహణను ఒకదానినొకటి ప్రభావితం చెయ్యకుండా దక్షతతో వ్యవహరించాడు. అతనిని ఒక మత నియంతగా, మతోన్మాదిగా చిత్రించడం బ్రిటిష్‌వారి రాజకీయ అవసరం మాత్రమే కాకుండా ఆధునిక భారతదేశంలోని కొన్ని రాజకీయ పార్టీలకు కూడా అవసరం అయ్యింది.

## పాఠ్యపుస్తకాలలో ద్వేషపూరిత ప్రచారం

కలకత్తా విశ్వవిద్యాలయంలో 20వ శతాబ్దం మొదటి దశాబ్దాలలో సంస్కృత విభాగానికి అధిపతిగా ఉన్న డా॥ హరప్రసాద్ శాస్త్రి మెట్రిక్యులేషన్ కోర్సుకు పాఠ్యపుస్తకం వ్రాయడానికి నియమితుడయ్యాడు. టిపు సుల్తాన్ బలవంతపు మత మార్పిడులను ఇష్టపడని 3000 మంది బ్రాహ్మణులు ఆత్మహత్య చేసుకున్నారని డా॥హరప్రసాద్ శాస్త్రి ఆ పాఠ్య

పుస్తకంలో వ్రాసాడు. ఈ పాఠ్యపుస్తకం ఉత్తర భారతదేశంలోని అనేక పాఠశాలలలో పాఠ్య గ్రంథంగా చాలా కాలం కొనసాగింది.

ఈ విషయం చాలా కాలం తర్వాత 1928లో అలహాబాద్ యూనివర్సిటీలో చరిత్ర ఆచార్యుడిగా, తర్వాత రాజ్యసభ సభ్యుడిగా, ఆ తర్వాత ఒరిస్సా గవర్నర్‌గా పనిచేసిన డా॥ బి.ఎన్. పాండే దృష్టికి వచ్చింది. బి.ఎన్.పాండే Aurangzeb and Tipu -Evaluation of their Religion and Politics అనే పుస్తకం రాశారు. అప్పటికే టిపు శృంగేరి జగద్గురువుకు వ్రాసిన లేఖలు 1916లో వెలుగులోకి రావడం జరిగింది. తర్వాత జరిగిన ఎన్నో పరిశోధనలను టిపు దేవాలయాలకు, బ్రాహ్మణులకు ఇచ్చిన దానాలు ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో బి.ఎన్.పాండేకు ఆ పాఠ్యాంశం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. డా॥హర ప్రసాద్ శాస్త్రి తను వ్రాసిన పాఠ్యాంశానికి సంబంధించిన ఆధారాలను తెలపాలని బి.ఎన్.పాండే ఆయనకు ఎన్నో ఉత్తరాలు వ్రాసారు. మొదట్లో డా॥ హరప్రసాద్ శాస్త్రి బి.ఎన్ పాండే లేఖలకు సమాధానం ఇవ్వలేదు. కాని పట్టువదలని పాండే డా॥శాస్త్రి వ్రాసిన పాఠ్యాంశం దేశ ప్రజల మధ్య విద్వేషాలు పెంచేదిగా ఉందని దానికి సరైన ఆధారాలు చూపలేక పోతే దీనిని మేధోపరమైన వంచన (intellectual fraud)గా భావించవలసి వస్తుందని డా॥ హరప్రసాద్ శాస్త్రిని హెచ్చరించడంతో డా॥ శాస్త్రి తనకు ఆ సమాచారం మైసూరు గెజెటీర్ లో లభించిందని ఒక చిన్న ఉత్తరం వ్రాసి ఊరుకున్నారు.

తర్వాత బి.ఎన్ పాండే మైసూరు గెజెటీర్‌లో ఎంతవెదికినా ఈ సమాచారం అందులో లభించలేదు. దీనితో బి.ఎన్. పాండే చరిత్రలో నిష్ణాతులైన ప్రొఫెసర్ శ్రీకాంతయ్యను సంప్రదించారు. ప్రొఫెసర్ శ్రీకాంతయ్య "మూడు వేలమంది బ్రాహ్మణుల ఆత్మహత్య గురించి మైసూరు చరిత్రలో ఎక్కడా లేదు. మైసూరు గెజెటీర్‌లో కూడా లేదు" అని పాండేకు సమాధానం వ్రాసారు. అంతేకాదు శ్రీకాంతయ్య బి.ఎన్.పాండేకు టిపు హిందూ దేవాలయాలకు, బ్రాహ్మణులకు ఇచ్చిన దానాల గురించి, సేవల గురించిన అదనపు సమాచారాన్ని కూడా అందించారు. ఈ సమాచారాన్నంతా అందుకున్న బి.ఎన్. పాండే మళ్ళీ డా॥హరప్రసాద్ శాస్త్రిని వివరణ కోరారు. డా॥ శాస్త్రి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ విషయాన్ని బి.ఎన్. పాండే కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌కు ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన వివరాలను పంపారు. వీటిని పరిశీలించిన విశ్వవిద్యాలయ అధికారులు డా॥ హరప్రసాద్ శాస్త్రి ఉద్దేశ్య పూర్వకంగా అసత్యాలను వ్రాసాడని తెలుసుకొని ఆ పాఠ్యపుస్తకాన్ని పాఠ్య పుస్తకాల జాబితాలో నుండి తొలగించారు. ఈ వ్యవహారమంతా పూర్తి కావడానికి కొన్ని సంవత్సరాలు పట్టింది. అప్పటికే ఈ పాఠాన్ని చదివిన విద్యార్థులలో ప్రజలలో టిపు పట్ల ద్వేష భావం నాటుకు పోయింది. టిపు పై జరిగిన తీవ్రమైన అసత్య ప్రచారాలకు ఈ సంఘటన ఒక మచ్చు తునక మాత్రమే.

## అధ్యాయం- 10

# టిపు పరిపాలన - ఆధునికత వైపు

భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దాన్ని ఆధునిక యుగానికి ప్రారంభంగా చెప్పుకోవచ్చు. స్వభావ సిద్ధంగా టిపుది మధ్య యుగాల రాచరిక వ్యవస్థ అయినప్పటికీ తన పరిపాలనలో కొన్ని ఆధునిక రీతులను ప్రవేశ పెట్టిన ఘనత ఈ కాలంలో టిపుకు చెందుతుంది. భారతదేశంలో ఆంగ్ల విస్తరణను రాజకీయంగా ప్రతిఘటించినప్పటికీ, హైదర్ అలీ, టిపు ఇద్దరూ పాశ్చాత్య వ్యవస్థలను పరిశీలించి, వాటిని తమ పాలనలో అనుసరించే ప్రయత్నం చేసారు. ఉదాహరణకు పాశ్చాత్య దేశాల అభివృద్ధికి వారి వర్తక వ్యాపారాల అభివృద్ధే కారణమని గ్రహించిన టిపు ఆ దిశగా అడుగులు వేసాడు. అందుకే సమకాలీన భారతదేశ రాజులందరి కంటే మైసూరు రాజ్యం టిపు కాలంలో దేశీయ వర్తకమే కాకుండా విదేశీ వర్తకంలో కూడా మునుపెన్నడూ లేనంత అభివృద్ధిని సాధించింది. యుద్ధ వ్యూహాల్లో సైనిక నిర్వహణలో కూడా రాకెట్ ప్రయోగం వంటి క్రొత్త అంశాలను టిపు ప్రవేశపెట్టాడు. తోటల పెంపకానికి (horticulture), పట్టుపరిశ్రమ అభివృద్ధికి (sericulture) కొత్త పద్ధతులను అవలంబించాడు. ఫ్రెంచ్ వారి సాయంతో మైసూరులో వస్తువులను ఉత్పత్తి చేసే చిన్నచిన్న కర్మాగారాలను నెలకొల్పాడు. వర్తక అభివృద్ధి కోసం క్రొత్త నాణాలను ముద్రించాడు. పరిపాలనా వ్యవస్థను ఆధునీకరించడం కోసం క్రొత్త కాలండర్‌ను ఆవిష్కరించాడు.

18వ శతాబ్దంలో ఐరోపాను పాలించిన ప్రజ్ఞా నిరంకుశ రాజులతో (Benevolent Despots) టిపును పోల్చవచ్చు. వారు నిరంకుశులే కాని ప్రజల క్షేమం కోసం కృషి చేసారు. ఆంగ్లేయులు కూడా టిపు పాలనను మెచ్చుకున్నారు. "మైసూరు రాజ్యంలో హైదర్, టిపు పర్యవేక్షణలో సైనిక, పౌర పాలనా వ్యవస్థలన్నీ సక్రమంగా పని చేసాయి. అధికారుల నియామకంలో ప్రతిభ తప్ప కుల, మత, జన్మ ఆధిపత్యాల ప్రసక్తి ఉండేది కాదు. జమీందార్లు, స్వతంత్ర ప్రభువుల ఆధిపత్యం రద్దు చేయబడింది. ప్రతి వ్యక్తికి న్యాయం జరిగే వ్యవస్థలు రూపు దిద్దుకున్నాయి. అట్టడుగు వర్గాలకు చెందిన వారు తమ ప్రతిభతో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం టిపు పాలనలో ఉండేది." అని మన్రో జనవరి 17, 1790న ఇంగ్లాండులోని తన తండ్రికి వ్రాసిన ఉత్తరంలో పేర్కొన్నాడు. సర్ థామస్ మన్రో భారతదేశంలో ఆంగ్ల రాజ్య స్థాపనకు తీవ్రంగా కృషి చేసినవాడు.

## కేంద్ర ప్రభుత్వం

టిపు తన రాజ్యంలో సర్వాధికారి. మంత్రులు, వజీర్లు ఉన్నప్పటికీ ప్రతి విషయంలో టిపుదే చివరి నిర్ణయం. అతనే సర్వ సైన్యాధ్యక్షుడు. విదేశీ వ్యవహారాలన్నీ టిపునే నిర్ణయించేవాడు. టిపు కొన్నిసార్లు ఎవరి మాటా వినకుండా కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఫ్రెంచ్ నౌకాధికారి రిపాడ్ ఉదంతం ఇందుకు ఉదాహరణ.

## కచేరీలు

కేంద్ర పరిపాలన కొరకు టిపు ఏడు ప్రముఖ శాఖలను ఏర్పాటు చేసాడు. వీటిని కచేరీలు అనేవారు. ప్రతి శాఖకు ఒక అధిపతి ఉండేవాడు. అతను తన క్రింద పనిచేసే కొందరు అధికారులను నియమించుకొని ఒక బోర్డును ఏర్పాటు చేసుకొని ఆ శాఖను నిర్వహించేవాడు. ఇలా ఏడు బోర్డులు ఉండేవి. అవి తరచూ సమావేశమయి తమ శాఖకు సంబంధించిన పరిపాలనా నిర్ణయాలను తీసుకునేవి. బోర్డులోని ప్రతి సభ్యుడు తన అభిప్రాయాలను మినిట్స్ పుస్తకంలో వ్రాసి సంతకం చేసేవాడు. ఆ పుస్తకం ఆశాఖ సీలుతో ఉన్న ఒక పెట్టెలో భద్ర పరచబడేది. మెజారిటీ సభ్యుల అభిప్రాయాల కనుగుణంగా నిర్ణయం తీసుకోబడేది. ఆ నిర్ణయాన్ని టిపుకు తెలియచేసేవారు. ఏదైనా అంశాన్ని రహస్యంగా ఉంచవలసిన అవసరం కలిగితే, ఒక సభ్యుడు ఆ అంశాన్ని లిఖిత పూర్వకంగా, వ్యక్తిగతంగా వెళ్ళి టిపుకు అందజేసేవాడు.

ఏదైనా ముఖ్యమైన అంశంపై నిర్ణయం తీసుకోవడానికి టిపు తన ప్రముఖ అధికారులతో రోజంతా చర్చించేవాడు. తిరిగి ఆ అధికారులంతా సమావేశమయి చర్చించి తమ అభిప్రాయాలను టిపుకు తెలియజేసేవారు. తన అభిప్రాయాన్ని, అధికారుల అభిప్రాయాల్ని క్రోడీకరించి టిపు ఆ అంశంలో చివరిగా తన ఆజ్ఞలు జారీ చేసేవాడు.

## ఏడు కచేరీలు

1. మీర్ అసఫ్ కచేరీ (రెవెన్యూ మరియు ఆర్థిక శాఖ)
2. మీర్ మిరాన్ కచేరీ (సైనిక శాఖ)
3. మీర్ మిరాన్ కచేరి (జుమ్రా) (మైసూరు రాజ్యంలోని స్థానికులతో ఏర్పడిన సైనిక శాఖ)
4. మీర్ సుదూర్ కచేరి (సైనిక సామగ్రి మరియు కోటల పర్యవేక్షణ)
5. మాలిక్ ఉత్– తుజ్జార్ కచేరి (వాణిజ్య శాఖ)
6. మీర్ యామ్ కచేరి (నావికా శాఖ)
7. మీర్ ఖజైక్ కచేరి ( ట్రెజరీ మరియు నాణాల ముద్రణ శాఖ)

టిపు రాజ్యంలో తర్వాత అతి ముఖ్య అధికారి రెవెన్యూ ఆర్థిక శాఖ అధికారి అయిన హుజూర్ దివాన్. టిపు మీర్ సాదిక్‌ను ఈ పదవిలో నియమించాడు. తర్వాత ముఖ్య అధికారి సైనిక శాఖ అధికారి అయిన మీర్ మిరాన్. టిపు ఈ పదవిలో పూర్ణయ్యను నియమించాడు. ఆసక్తికరమైన విషయమేమిటంటే బ్రిటిష్ వారితో చేరి టిపుకు ద్రోహం చేయడంలో వీరిద్దరూ ప్రముఖ పాత్ర నిర్వహించారు.

## తపాలా మరియు గూఢచారి శాఖ

పరిపాలనతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా రాజ్య రక్షణలో ప్రముఖ పాత్ర నిర్వహించిన శాఖ తపాల మరియు గూఢచారి శాఖ. దీని అధిపతి దరోగా. ఇతను శ్రీరంగపట్టణంలో ఉండేవాడు. రాజ్యంలోని ఇతర ముఖ్య పట్టణాలలో కూడా ఈ శాఖకు సంబంధించిన దరోగాలు ఉండేవారు. ఆ శాఖకు సంబంధించిన గూఢచారులు రాజ్యమంతా విస్తరించి ఉండేవారు. ఈ శాఖలోనే హరాకార అనే వార్తాహరులుండేవారు. వీరు గంటకు అయిదారుమైళ్ళ వేగంతో ప్రయాణించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక దరోగాలకు, శ్రీరంగపట్టణంలోని దరోగాలకు అందజేసేవారు. శ్రీరంగపట్టణం దరోగా ఆ సమాచారాన్ని టిపుకు అందజేసేవాడు. కాని మైసూరు రాజ్యంలో ఆంగ్లేయులు ప్రారంభించిన గూఢచార చర్యల ముందు టిపు గూఢచార వ్యవస్థ విఫలమయ్యింది.

టిపు పాలనలో లెక్కలు, పత్రాలు, శాసనాలు, ఆజ్ఞలు, ఉత్తర ప్రత్యుత్తరాలు ఫార్సీ, కన్నడ, మరాఠీ భాషల్లో జరిగేవి.

## ప్రాంతీయ పాలన

ప్రాంతీయ పాలనలో మొదటి విభాగం అసిఫ్ తుక్రీ. దీనిని రాష్ట్రంతో పోల్చవచ్చు. టిపు ఈ విభాగాల సంఖ్యను తరచూ పెంచుతూ వచ్చాడు. 1784లో 7 గా ఉన్న అసిఫ్ తుక్రీల సంఖ్య 1794లో 37 కు పెరిగింది.

అసిఫ్ తుక్రీ పౌర వ్యవహారాల అధికారిగా అసిఫ్, సైనిక వ్యవహారాల అధికారిగా ఫౌజ్‌దార్ ఉండేవారు. కొన్ని అసిఫ్ తుక్రీలలో ఇద్దరు అసిఫ్‌లు ఉండేవారు. రంజాన్ పర్వదినాన ఈ అసిఫ్ లందరూ తమ లెక్కల పుస్తకాలతో శ్రీరంగపట్టణం వెళ్ళి తమ అసిఫ్ తుక్రీ జమా ఖర్చులన్నింటినీ సుల్తాన్ పరిశీలనకు సమర్పించుకోవాలి.

ఈ అసిఫ్ తుక్రీలు అమిల్ దార్ తుక్రీలుగా తిరిగి విభజింపబడేవి. వీటిని జిల్లాలతో పోల్చవచ్చు. 1799 నాటికి మైసూరు రాజ్యంలో 1024 అమిల్ దార్ తుక్రీలు ఉండేవి. అమిల్ తుక్రీ అధిపతి అమిల్ లేక అమిత్ దార్, ఇతను పౌర సైనిక బాధ్యతలను కలిపి నిర్వహించేవాడు. వ్యవసాయం, రైతు సంక్షేమం, సైన్యానికి సరఫరాలు, వంటి బాధ్యతలు ఇతను నిర్వహించేవాడు.

ఒక అమిల్ దార్ తుక్రీలో ఇరవై నుండి ముప్పై గ్రామాల వరకూ ఉండేవి. గ్రామాలలో పటేల్, షాంబోగ్‌లు (లేక షాన్‌బాగ్) పరిపాలనాధికారులు. పటేల్ గ్రామ సంక్షేమం చూసుకుంటూ, గ్రామ పంచాయితీల సాయంతో న్యాయ సంరక్షణ వ్యవహారాలను కూడా నిర్వహించేవాడు. షాంబోగ్‌లు లెక్కలు చూసేవారు. ఇతర ప్రాంతాల్లోని కరణాలతో వీరిని పోల్చవచ్చు.

## న్యాయ పాలన

న్యాయ వ్యవస్థలో ఇస్లాం హిందూ పద్ధతులు అనుసరించబడేవి. అసిఫ్ తుక్రీలలో అసిఫ్, అమిత్ తుక్రీలలో అమిల్ దార్, గ్రామాలలో పటేల్ న్యాయ పాలనకు బాధ్యులు. పట్టణాల్లో, గ్రామాల్లో ముస్లిం కాజీలు, హిందూ పండితులు కూడా న్యాయ పాలనలో భాగం పంచుకునే వారు. ఈ ప్రాంతాల్లోని న్యాయస్థానాలలో తమకు న్యాయం జరగలేదని భావించే ప్రజలు శ్రీరంగపట్టణంలోని ఉన్నత న్యాయస్థానానికి అప్పీలు చేసుకోవచ్చు. ఆ ఉన్నత న్యాయస్థానం సుల్తానే.

## నేరము - శిక్ష

నేరస్తులకు శిక్షలు కఠినంగా ఉండేవి. దేశ ద్రోహ, హత్యా నేరాలకు మరణ దండన విధించేవారు. సాధారణంగా ఎక్కువగా అమలు పరచబడే క్రూరమైన శిక్ష ఏనుగు కాలికి నేరస్థుడి కాళ్ళు చేతులు కట్టేసి ఏనుగుతో ఈడ్పించడం. దొంగలకు, అప్పు తీర్చలేని వారికి, దేశ ద్రోహులకు చెవులు, ముక్కు, కాళ్ళు, చేతులు నరికి వేసే శిక్ష కూడా ఉండేది. నేరస్తులకు కొరడా దెబ్బల శిక్ష కూడా ఉండేది. తర్వాత కాలంలో టిపు ఈ శిక్షను నిషేధించాడు.

## వ్యవసాయం- రెవెన్యూ పాలన

పూర్తిగా నిషేధించక పోయినా టిపు భూమిని జాగీర్‌దార్లు, జమీందార్లు, పాలెగాళ్ళకు ఇవ్వడాన్ని తగ్గించాడు. ప్రభుత్వం లోని ప్రముఖమైన పదవుల్లో ఉన్నవారికే జాగీర్లు ఇచ్చేవాడు. సైనికాధికారులకు జాగీరులిచ్చే పద్ధతిని నిలిపివేసి, వారికి ప్రభుత్వమే నేరుగా జీతాలిచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాడు.

భూమిని సాగు చేసి పన్నును సక్రమంగా కట్టేంతవరకూ కౌలుదారులు వారి వారసులు భూమిని అనుభవించవచ్చు. లేకపోతే కౌలు వేరే వారికి ఇచ్చేవారు. మెట్ట భూముల రైతులు పంటలో మూడింట ఒక వంతు, మాగాణి భూముల రైతులు పంటలో సగ భాగం పన్నుగా చెల్లించాలి.

ఒడయారుల పాలనలో షావుకారులు (వడ్డీ వ్యాపారులు) రైతుల నుండి పన్నులు వసూలు చేసి శ్రీరంగపట్టణం పంపేవారు. ఈ మధ్యవర్తిత్వానికి గాను వారికి కొంత

కమిషన్ లభించేది. కాని వారు రైతుల నుండి అధికంగా పన్నులు వసూలు చేసేవారు. టిపు ఈ పద్ధతిని నిషేధించి ప్రభుత్వ అధికారులే నేరుగా రైతుల వద్ద నుండి పన్నులు వసూలుచేసే పద్ధతిని ప్రవేశపెట్టాడు.

## పేద రైతులకు రక్షణ

వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు ప్రభుత్వం పేద రైతులకు కొంత ధనం అప్పుగా ఇచ్చేది. వీటిని తకావి రుణాలు అనేవారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రైతు బంధు పథకం దీన్ని పోలింది. గ్రామ పెద్ద అయిన పటేల్ తన స్వంత పొలంలో పనుల కోసం రైతులను నియమించుకుంటే వారికి పూర్తి కూలీ చెల్లించాలి. దానికి విరుద్ధంగా జరిగిందని ప్రభుత్వానికి సమాచారం అందితే ఆ పటేల్ భూమిలోని పంటనంతా ప్రభుత్వం స్వాధీనం చేసుకునేది. భూస్వామి కౌలుదారుని అణచివేయకుండా చూసే బాధ్యత ఆ ప్రాంత అమీలుది. ఏ కారణం చేతనైనా రైతులు పన్నులు చెల్లించ లేకపోతే వారిని బాధించకుండా ఆ విషయాన్ని టిపుకు తెలియజెయ్యాలి. టిపు పరిస్థితులను బట్టి పన్ను మాఫీ చేసేవాడు.

## వ్యవసాయ భూముల విస్తరణ

టిపు మైసూరు రాజ్యంలో ఎక్కువ భూములలో వ్యవసాయాన్ని విస్తరింప జేసాడు. వ్యవసాయ విస్తరణకు రైతులకు అనేక రాయితీలు కల్పించాడు. బంజరు భూమి సాగు చెయ్యడానికి ముందుకొచ్చే వారు మొదటి సంవత్సరం పన్ను చెల్లించవలసిన అవసరం లేదు. రెండవ సంవత్సరం నాలుగోవంతు పన్ను చెల్లించాలి. మూడవ సంవత్సరం నుండి ప్రభుత్వం విధించే పూర్తి పన్ను చెల్లించాలి.

కొండ ప్రాంతాల్లో నీటి వసతిలేని భూములకు ఇటువంటి పన్ను రాయితీలు ఇవ్వబడేవి. తర్వాత మైసూరును పాలించిన తూర్పు ఇండియా కంపెనీ ప్రభుత్వాలు కూడా ఎక్కువ భూమిని సాగులోనికి తీసుకురావడానికి ఇటువంటి పన్ను రాయితీలు ఇవ్వడం విశేషం.

టిపు మైసూరు రాజ్యంలో చెరకు, బార్లీ, గోధుమ, ధాన్యం పంటలను ఎక్కువ ప్రోత్సహించాడు. అప్పటి వరకు మైసూరు ప్రాంతంలో విరివిగా పండే గంజాయి పంటను టిపు పూర్తిగా నిషేధించాడు.

## తోటల అభివృద్ధికి ఆద్యుడు

హైదర్ అలీ, టిపు సుల్తాన్ పూల, పండ్ల తోటల పెంపకానికి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చారు. శ్రీరంగపట్టణం, బెంగుళూరులోని లాల్‌బాగ్ తోటలు ఇందుకు నిదర్శనం. బెంగుళూరులోని లాల్‌బాగ్ 40 ఎకరాల స్థలంలో విస్తరించింది. తోటల

పెంపకాన్ని వ్యాపార అంశంగా కూడా టిపు గుర్తించాడు. గంధపు చెట్లు, పోకచెట్లు, తమలపాకు తోటలు, కొబ్బరి తోటలను విరివిగా పెంచే ఏర్పాట్లు చేసాడు. పోకచెట్ల తోటలకు మొదటి అయిదు సంవత్సరాలు సగం పన్నులు మాత్రమే చెల్లించే రాయితీ కల్పించాడు. కొబ్బరి తోటలకు కూడా అటువంటి రాయితీలే ఇచ్చాడు.

ఈ తోటల పెంపకం, టిపు వ్యవసాయం, వ్యాపారంలో భాగంగానే కాకుండా చాలా వ్యక్తిగత ఆసక్తితో నిర్వహించాడనిపిస్తుంది. విదేశాలకు రాయబారులను పంపించినప్పుడు ఆ దేశాల నుండి అక్కడ లభించే పూల మొక్కలను, విత్తనాలను తెప్పించుకునేవాడు. దక్షిణ ఆఫ్రికాలోని కేప్ ఆఫ్ గుడ్ హోప్ నుండి పైన్, ఓక్ చెట్లను తెప్పించి లాల్‌బాగ్‌లో నాటించాడు. తోటలలో మల్బరి, నీలి, మామిడి, యాపిల్, బత్తాయి, జామ చెట్లను కూడా విరివిగా పెంచేవారు.

వ్యవసాయానికి తోటల పెంపకానికి నీటి వనరుల అభివృద్ధి అవసరాన్ని గుర్తించిన టిపు వాటి అభివృద్ధికి కృషి చేసాడు. శ్రీరంగపట్టణానికి కొద్ది దూరంలో ఒక డామ్ నిర్మించాడు. హోయసాలుల కాలంలో నిర్మించిన ఒక చెరువును బాగు చేయించాడు. చెరువుల నిర్మాణం చేపట్టడానికి తన అధికారులను ప్రోత్సహించాడు. చెరువులు నిర్మించిన వారికి జాగీరులిచ్చాడు. చెరువుల, కాలువల నిర్మాణం, వాటి నిరంతర నిర్వహణ కొరకు శాశ్వత సిబ్బందిని నియమించడమే కాకుండా శాశ్వత నిధుల ఏర్పాటును కూడా టిపు ప్రభుత్వం మంజూరు చేసింది.

మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో పాల్గొన్న కల్నల్ ఎడ్వర్డ్ మూర్ ఇలా వ్రాస్తాడు. "మైసూరు రాజ్యంలో ప్రయాణిస్తుంటే పచ్చని పంట పొలాలు, కష్టించి పని చేసే ప్రజలు, క్రొత్తగా ఏర్పడిన పట్టణాలు, అభివృద్ధి చెందిన వర్తక వ్యాపారాలు కనిపిస్తాయి. ఇవన్నీ ప్రజల సంతోషాన్ని ప్రతిబింబించి, ఇక్కడి ప్రభుత్వం ప్రజానుకూల ప్రభుత్వం అని మనకు తెలియజేస్తాయి. ఇది టిపు రాజ్యంలో మనకు కనిపించే దృశ్యం."

1792లో మైసూరు రాజ్య ఆదాయం 68,89,873 పగోడాలు, 1792లో టిపు సగం రాజ్యాన్ని, ఆదాయాన్ని కోల్పోయిన తర్వాత టిపు ఆదాయం 35 లక్షల పగోడాల నుండి 40 లక్షల పగోడాలకు తగ్గిపోయింది. అయినా టిపు 1794లో ఆంగ్లేయులకు చెల్లించవలసిన యుద్ధ నష్టపరిహారాన్ని చెల్లించాడు. 1799లో ఆంగ్లేయులు శ్రీరంగపట్టణ ఖజానాను స్వాధీనపరుచుకున్నప్పుడు ఖజానా బంగారంతో, పగోడాలతో నిండుగా ఉండడం చూసి ఆశ్చర్యపోయారు.

## వర్తక వాణిజ్యాలు

తన సమకాలీన భారతదేశం లోని సంస్థానాధీశులలో ఎవ్వరూ చెయ్యనంత అభివృద్ధిని టిపు వర్తక వాణిజ్యాలలో చేసాడు. యూరోపియన్ల అభివృద్ధికి వారి వర్తక

వ్యాపారాలే కారణం అని టిపు గ్రహించాడు. అదే పంథాలో మైసూరు రాజ్యంలో వర్తక వ్యాపారాల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టాడు. వస్తు ఉత్పత్తికి పరిశ్రమలు స్థాపించాడు. దేశ విదేశాల్లో విక్రయ కేంద్రాలను స్థాపించాడు. వాటి నిర్వహణకు మైసూరు నుండి అధికారులను, ఉద్యోగులను నియమించాడు. భారతదేశంలో గుజరాత్‌లోని కచ్‌లో టిపు మైసూరు రాజ్య వ్యాపార కేంద్రాన్ని స్థాపించాడు. కచ్ కు మైసూరు కు మధ్య వ్యాపారం నిరంతరం కొనసాగింది.

## మస్కత్ కేంద్రంగా విదేశీ వ్యాపారం

1785లో టిపు ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఉన్న మస్కత్ లో వ్యాపార విక్రయ కేంద్రాన్ని స్థాపించాడు. ఇది చాలా ముఖ్యమైన మైసూరు వ్యాపార కేంద్రంగా విలసిల్లింది. ఇతర మధ్య ప్రాచ్య దేశాలు, ఇరాక్, వంటి దేశాలతో మైసూరు చేసే వర్తక వ్యాపారాలు, లావాదేవీలు మస్కత్ కేంద్రంగా జరిగేవి. బియ్యం, ఏనుగు దంతం, బట్టలు ఎగుమతి అయ్యేవి. మలబారు నుండి ఎగుమతి అయ్యే కలపతోనే పై దేశాలలో పడవలు, ఓడలు తయారు అయ్యేవి. ఆ దేశాల నుండి కుంకుమ పువ్వు, పట్టు పురుగులు, గుర్రాలు, ఎండు ద్రాక్ష, రాతి ఉప్పు, ముత్యాలు, గంధకం, రాగి, ఖర్జూరాలు మైసూరుకు దిగుమతి అయ్యేవి. భారతదేశం లోని ఇతర ప్రాంతాల సరకులు కూడా మైసూరు రేవుల నుండి ఈ దేశాలకు ఎగుమతి అయ్యేవి. మధ్య ప్రాచ్య, పర్షియన్ గల్ఫ్ ప్రాంత రాజులతో సంబంధాలు నెలకొల్పడానికి టిపు మస్కత్‌లో మైసూరు తరుపున ఒక ప్రతినిధిని నియమించాడు. ఈ దేశాలలో మైసూరు నుండి దిగుమతి అయ్యే కలప, బియ్యానికి చాలా గిరాకీ ఉండేది. దీనితో మస్కత్ ఇమామ్ (మస్కత్ పాలకుడు) మైసూరు ప్రతినిధికి ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేవాడు. ఇమామ్ తన రాజ్యంలోకి దిగుమతి అయ్యే యూరోపియన్ సరకులపై 5 శాతం ఇతర భారతీయ వస్తువులపై 8 శాతం అరబ్బు పర్షియన్ వస్తువులపై ఆరున్నర శాతం దిగుమతి సుంకం విధిస్తే, మైసూరు వస్తువులపై కేవలం 4 శాతం దిగుమతి సుంకం మాత్రమే విధించేవాడు. అదే విధంగా మైసూరు రేవులలో దిగుమతి అయ్యే మస్కత్ సరకులపై కూడా టిపు దిగుమతి సుంకంలో రాయితీలు ఇచ్చే వాడు.

మస్కత్‌లోని వర్తక కేంద్ర నిర్వహణ భారతదేశంలోని ఫ్రెంచ్, ఇంగ్లీషు వారి వర్తక కేంద్రాల నిర్వహణ పద్ధతిలో ఉండేది. వర్తక కేంద్రానికి అధిపతి దరోగా, అతని క్రింద ముతాసద్దీలు (వ్రాయసకాండ్రు) గుమాస్తాలు ఉండేవారు. కొందరు సైనికులు కూడా ఉండేవారు. సాధారణంగా కొనుగోళ్ళు అమ్మకాలు దరోగా నేరుగా చేసేవాడు. ఒక్కోసారి బ్రోకర్ల ద్వారా జరిగేవి. మస్కత్‌లో టిపు తరపున మావో అనే వ్యక్తి బ్రోకర్‌గా వ్యవహరించే వాడు. ఇరాక్‌లోని బాస్రా పట్టణంలో అబ్దుల్లా అనే యూదు టిపు తరపున బ్రోకర్‌గా పని చేసేవాడు. మస్కత్‌కు మైసూరుకు మధ్య జరిగిన వర్తక వ్యాపారాల విలువ

స్పష్టంగా తెలియక పోయినప్పటికీ, మస్కత్‌లోని ఒక బ్రోకరు బొంబాయి లోని ఆంగ్లేయ గవర్నరుకు వ్రాసిన ఒక లేఖలో మైసూరు సరుకులతో నిండిన అయిదారు నౌకలు ప్రతి సంవత్సరం మస్కత్ రేవు చేరుకుంటాయని వ్రాసాడు. ఇవే కాకుండా మలబారు తీరం నుండి పర్షియన్ గల్ఫ్‌కు అనేక చిన్న నౌకలు, పడవలు నిరంతరం సరుకులతో తిరుగుతూ ఉండేవి. టిపు మలబారులో పండే యాలకుల పంటలో అధిక భాగాన్ని అరబ్ దేశాలకే అమ్మేవాడు.

కేవలం వ్యాపార సంబంధాల కొరకు టిపు పొరుగు దేశానికి రాయబారులను పంపించాడు. సముద్రపు దొంగల భయంతో చైనా వర్తకులు మలబారు తీరానికి తమ సరుకు పంపడానికి వెనుకాడుతుంటే, టిపు ఆ నౌకల రక్షణకు మైసూరు నావికా సైన్యాన్ని పంపించాడు. వర్తక వ్యాపారాలపై నిష్ణాతులైన ఆర్మేనియన్లను మైసూరు రాజ్యంలో స్థిరపడడానికి టిపు ఎంతో ప్రోత్సహించాడు. మైసూరు రాజ్యంలో సరుకుల అమ్మకానికి కొనుగోలుకు వారికి పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చాడు. వారి దిగుమతులపై సుంకాన్ని తొలగించాడు. కాని టిపు సుల్తాన్ ఇతర యూరోపియన్ వ్యాపారులను ప్రోత్సహించలేదు. టిపు పాలనలో మలబారులోని ఆంగ్ల వర్తక స్థావరమైన తెల్లిసెరి, ఫ్రెంచ్ వర్తక స్థావరమైన మాహె తమ వ్యాపారాల్లో నష్టపోయాయి. ఫ్రెంచ్ వారితో మంచి స్నేహ సంబంధాలు ఉన్నప్పటికీ టిపు మైసూరు రాజ్యంలో వారి వర్తక వ్యాపారాలకు ప్రోత్సాహాన్నివ్వలేదు. మలబారులోని సుగంధ ద్రవ్యాల వర్తకంపై తమకు గుత్తాధిపత్యం ఇవ్వాలని ఫ్రెంచ్ వారు టిపును అడిగినప్పుడు టిపు నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. ఇక ఆంగ్లేయుల వర్తకాన్నే కాదు వారి సరుకులను కూడా తన రాజ్యంలో పూర్తిగా నిషేధించాడు.

## టిపు ఒక మంచి వ్యాపారవేత్త

టిపు తన పరిపాలనలోని ప్రతి శాఖను వ్యక్తిగతంగా పర్యవేక్షించేవాడు. వాణిజ్య శాఖ ఆర్థికపరంగా ఎంతో ప్రాముఖ్యమైనది. ఈ శాఖ పని తీరుకు సంబంధించి టిపు ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవాడనే విషయం, టిపు తరచూ వ్యాపార కేంద్రాలను నిర్వహించే దరోగాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా తెలుస్తుంది. వారికి వర్తకానికి సంబంధించి అనేక సూచనలు, సలహాలు ఇస్తుండేవాడు. ఆజ్ఞలు జారీ చేస్తుండేవాడు. మస్కత్‌లోని దరోగాకు వ్రాసిన ఒక ఉత్తరంలో, అతను కొన్న ముత్యాల ఖరీదు ఎక్కువగా ఉందని, ఇంకా తక్కువ ధరకు బహ్రెయిన్‌లో కొనవచ్చని టిపు దరోగాకు సూచించాడు. గంధం అమ్మకం విషయంలో అనేక సలహాలిచ్చాడు. మొదటి రకం 500 తులాలను 120 పగోడాలకు, రెండవ రకం 100 పగోడాలకు, మూడవ రకం 90 పగోడాలకు, నాల్గవ రకం 80 పగోడాలకు అమ్మాలని సలహా ఇచ్చాడు. గల్ఫ్‌లోని ఖష్మ్ ద్వీపంలో లభించే

పట్టు పురుగులను, వాటి సేద్యం గురించి తెలిసిన నిపుణులను శ్రీరంగపట్టణానికి పంపించాలని మస్కత్‌లోని దరోగాను ఆదేశించాడు. అదే విధంగా కుంకుమ పువ్వు విత్తనాలను, గంధకాన్ని, పర్షియా నుండి, ఖర్జూర విత్తనాలను మస్కట్ నుండి పంపవలసిందిగా దరోగాకు వ్రాసాడు. మలబారు సముద్ర తీరంలో ముత్యాలను వెతికి పట్టుకునే గజ ఈతగాళ్ళను బహ్రెయిన్ నుండి పంపించవలసిందిగా కోరాడు. ముత్యాల వర్తకం కోసం టిపు అర్ముజ్, జెడ్డాలలో వర్తక కేంద్రాలు స్థాపించాడు.

## వర్తకంపై ప్రభుత్వ గుత్తాధిపత్యం

కొంతమేరకు ప్రైవేటు వ్యాపారాన్ని అంగీకరించినప్పటికీ టిపు వర్తక వ్యాపారాల మీద రాజ్యాధిపత్యాన్ని ప్రోత్సహించాడు. బంగారం, పొగాకు, గంధపు చెక్క, విలువైన లోహాలు, ఏనుగులు, కొబ్బరి కాయలు, నల్ల మిరియాలు, కలప వంటి సరుకుల వ్యాపారంపై పూర్తిగా ప్రభుత్వ గుత్తాధిపత్యం ఉండేది. ప్రభుత్వమే ముఖ్య వ్యాపారి. టిపు రాజ్యం లోని ప్రతి తాలూకాలో ప్రభుత్వ దుకాణాలను తెరిపించాడు. ఇతర సాధారణ సరుకులతో పాటు వీటిలో బంగారం, వెండి, పట్టు వంటి విలువైన వాటిని కూడా అమ్మేవారు.

టిపు స్థానిక బ్యాంకర్లను తొలగించి ప్రభుత్వమే బ్యాంకర్లుగా పని చేసేలా చూసాడు. తన ప్రజలలో వర్తకం పట్ల ఆసక్తి కలిగించడానికి టిపు ప్రభుత్వం తరపున ఒక వ్యాపార సంస్థను ఏర్పాటు చేసాడు. దీనిలో షేర్లు కొనవచ్చు. 5 నుండి 500 రూపాయలతో షేర్లు కొన్న వారికి సంవత్సరం చివరిలో లాభాల్లో 50 శాతం ఇవ్వబడేది. 500 నుండి 5000 రూపాయలతో షేర్లు కొన్నవారికి లాభాల్లో 25 శాతం ఇవ్వబడేది. పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి వారికి లాభాల్లో ఎక్కువ శాతం ఇవ్వబడేది. పెట్టుబడిదార్లు మధ్యలో విరమించుకోవాలన్నా వారి పెట్టుబడితో పాటు లాభంలో భాగం కూడా ఇవ్వబడేది.

టిపు పాలనలో తలసరి ఆదాయం భారతదేశంలోని ఏ సంస్థానంలోని తలసరి ఆదాయాని కంటే అధికంగా ఉండేదని, బ్రిటన్ తలసరి ఆదాయం కంటె కూడా ఎక్కువ అని స్వయంగా ఆంగ్లేయులే అంగీకరించారు.

టిపు మైసూరు రాజ్యంలో 30 వర్తక కేంద్రాలను, భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాలలో మొత్తం 17 వర్తక కేంద్రాలను ఏర్పాటు చేసి మైసూరు రాజ్య వాణిజ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను అత్యంత ఉన్నత స్థాయికి తీసుకు వెళ్ళాడు. కాని టిపు మరణం తర్వాత 1800 సంవత్సరం నాటికల్లా దేశ విదేశాల్లోని ఈ వ్యాపార కేంద్రాలన్నీ మూతపడ్డాయి. విదేశాల్లో ఈ వర్తక కేంద్రాలను నిర్వహించే మైసూరు రాజ్య ఉద్యోగులందరూ భారత దేశానికి తిరిగి వచ్చేసారు.

## పరిశ్రమలు

తన రాజ్యంలో పరిశ్రమల అభివృద్ధికి నిపుణులను పంపించాలని టిపు ఫ్రాన్స్, ఆట్టోమన్ దేశాల రాజులకు విన్నపాలు పంపించేవాడు. అంతే కాదు, భారతదేశంలోని యూరోపియన్లను ముఖ్యంగా ఆంగ్ల సైన్యం నుండి పారిపోయిన వారిని, ఆంగ్ల యుద్ధ ఖైదీలను, తన రాజ్యంలో పరిశ్రమలు నడపడానికి వారి సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకునే వాడు. శ్రీరంగపట్టణం, బెంగుళూరు, చితల్‌దుర్గ, బెద్నూరుల లోని టిపు స్థాపించిన పరిశ్రమలలో యూరోపియన్లు భారతీయులు కలిసి పని చేసేవారు. ఇక్కడ కత్తులు, తుపాకులు, గాజు సామానులు, తుపాకి పౌడర్, కాగితం, గడియారాలు ఇతర వస్తువులను తయారు చేసేవారు. బెద్నూరులో ఎక్కువగా ఆయుధాలు తయారయేవి. ఇక్కడ సంవత్సరానికి 20,000 చిన్న, పెద్ద తుపాకులు తయారయ్యేవి. మైసూరులో ఉత్పత్తి అయ్యే తుపాకి పౌడర్ బ్రిటిష్ వారు ఉత్పత్తి చేసే తుపాకి పౌడర్ కంటె శ్రేష్టంగా ఉండేది. చిన్న పట్టణాల్లో గాజు సామాన్లు తయారయ్యేవి. ఇక్కడ తయారయ్యే సంగీత వాయిద్యాలలో ఉపయోగించే తీగలు కూడా భారతదేశమంతా ప్రసిద్ధి చెందాయి. శ్రీరంగ పట్టణంలో పెద్ద పేపరు మిల్లు ఉండేది. చైనా వారి సహకారంతో దేవనహళ్ళి తాలూకాలో ఉత్పత్తి అయ్యే పంచదార ఎంతో ఉన్నత ప్రమాణాలతో రుచికరంగా ఉండేది. కాని దీని ఉత్పత్తి విధానాన్ని రహస్యంగా ఉంచేవారు.

## టిపు మైసూరులో పట్టు పరిశ్రమకు ఆద్యుడు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బెంగుళూరు, మైసూరు సిల్కు వస్త్రాల పరిశ్రమను స్థాపించిన వాడు టిపు. దీని కోసం టిపు బెంగాల్, మస్కత్‌ల నుండి పట్టు పురుగులను తెప్పించడమే కాకుండా మైసూరు రాజ్యంలో మల్బరి తోటలను పెంచి పట్టు పురుగుల పెంపకాన్ని అభివృద్ధి చేసాడు. ప్రస్తుత భారతదేశంలోనే అత్యధికంగా 45 శాతం సిల్కు ఉత్పత్తి చేసే రాష్ట్రం కర్నాటక కావడానికి కారణం టిపు తన పాలనలో పట్టు పరిశ్రమను అభివృద్ధి చెయ్యడమే. భారతదేశంలో అభివృద్ధికి సంకేతాలుగా భావించే తోటల పెంపకం (horticulture), మల్బరి పట్టు పరిశ్రమ (sericulture) లను టిపు 18వ శతాబ్దంలోనే అభివృద్ధి చేసాడు.

## రహదారుల నిర్మాణం

తన రాజ్యంలో వివిధ పట్టణాలను కలుపుతూ టిపు రహదారుల నిర్మాణం చేసాడు. ఇవి ప్రజల సౌకర్యానికే కాకుండా వర్తక వ్యాపారాల అభివృద్ధికి కూడా దోహద పడ్డాయి. శ్రీరంగపట్టణం నుండి ధర్మపురి, మైసూరు పట్టణాలకు, ధర్మపురి తాలూకాలో వివిధ

ప్రాంతాలను కలుపుతూ రహదారులు నిర్మించాడు. కృష్ణగిరి బుడి కోట్టైలను కలుపుతూ కూడా రహదారి నిర్మించాడు.

అంతవరకూ కాల్వల ద్వారా రవాణా జరుగుతున్న మలబారులో టిపు మొదటిసారి రహదారుల నిర్మాణాన్ని చేపట్టాడు. మలబారులోని వివిధ పట్టణాలను కలుపుతూ, అభేద్యమైన అడవి ప్రాంతమైన వైనాడ్‌లో కూడా టిపు రహదారులు నిర్మించాడు. బ్రిటిష్ రచయిత బుకానన్ టిపు మొదటిసారి మలబారులో చక్రాలను పరిచయం చేసాడని వ్రాసాడు.

## సైన్యం

టిపు ఆసియాలోనే ఉత్తమమైన సైన్యాన్ని కలిగి ఉన్నాడని కాంప్ బెల్ చెప్పాడు. టిపు సైన్యం క్రమశిక్షణలో, జీతభత్యాల చెల్లింపుల విషయంలో భారతదేశంలోని ఇతర సంస్థానాధీశుల కంటె అత్యుత్తమమైనదని ఒక ఫ్రెంచ్ అధికారి చెప్పాడు.

మైసూరు సైన్యానికి టిపు సర్వ సైన్యాధ్యక్షుడు. కాని సైన్య పాలనను చూసుకోవడానికి రెండు ప్రత్యేక శాఖలుండేవి. ఒకటి మీర్ మిరాన్. ఇది సైన్యంలోని అన్ని విభాగాల పాలనను నిర్వహించేది. రెండవది మీర్ మిరాన్ (జుమ్రా) ఇది మైసూరు రాజ్యం నుండి మాత్రమే నియమితులైన సైనికుల వ్యవహారాలను చూసే శాఖ.

టిపు సైన్యంలో అశ్విక దళం (cavalry), పదాతి దళం (infantry) ప్రముఖ శాఖలుగా ఉండేవి. టిపు అదనంగా ఫిరంగి దళాన్ని, రాకెట్లను కూడా తన సైన్యంలో ప్రముఖంగా నిర్వహించాడు.

## అశ్విక దళం

ఆర్థర్ వెల్లస్లీ టిపు అశ్విక దళాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా ప్రశంసించాడు. అశ్విక దళంలో నేరుగా ప్రభుత్వ ఆధీనంలో శాశ్వతంగా ఉండే దళం ఒకటి, యుద్ధ సమయాల్లో ప్రైవేటు అశ్వికులు సరఫరా చేసే తాత్కాలిక అశ్విక దళం ఒకటి ఉండేది.

ప్రభుత్వ ఆధీనంలోని అశ్విక దళంలోని సైనికుల జీతభత్యాలు, ఆయుధ సామగ్రి ఖర్చును ప్రభుత్వమే భరించేది. తాత్కాలిక అశ్విక దళంలో కొందరు ప్రైవేట్ కమాండర్లు టిపు వద్ద నుండి జీతం తీసుకుని తమ స్వంత దళాన్ని ఏర్పరుచుకొని యుద్ధ సమయంలో సైన్యాలతో కలిసి పోరాడేవారు. మైసూరు ప్రభుత్వ అశ్విక దళం కంటె వీరే ఎక్కువ చాకచక్యంతో శత్రువుని ఎదుర్కొనే వారు. ప్రభుత్వ దళం కంటె వీరి సంఖ్యే ఎక్కువగా ఉండేది.

ప్రభుత్వ అశ్విక దళం చిన్న తుపాకులు, కత్తులతో యుద్ధంలో పాల్గొనే వారు. వీరికి యూనిఫారం లేదు. టిపు గుర్రాల నోటి నుంచి ముక్కులో నుంచి కళ్ళాలు వేసే పద్ధతిని నిషేధించాడు.

## పదాతి దళం

పదాతి దళాన్ని టిపు పూర్తిగా యురోపియన్ పద్ధతుల్లో ఏర్పరిచాడు. వీరికి యూనిఫారం ఉండేది. యూరోపియన్ సైనికుల వలె చిన్న తుపాకులు, చివర కత్తి బిగించిన పెద్ద తుపాకులు (బాయెనెట్లు) ఇవ్వబడేవి. టిపు వద్ద విదేశీ ఆయుధాలు ఉన్నప్పటికీ, మైసూరు కర్మాగారాలలో తయారు చేయబడిన ఆయుధాలనే యుద్ధాలలో ఎక్కువగా వాడేవారు.

టిపు తన సైన్యంలో కఠినమైన క్రమశిక్షణను అమలు పరిచేవాడు. టిపు యుద్ధం చేసేటప్పుడు అతని విజృంభణను వీరవిహారాన్ని చూసి తీరవలసిందేనని ఆంగ్లేయులే మెచ్చుకున్నారు. యుద్ధ సమయంలో టిపు తన సైన్యాలతోనే ఉండేవాడు. శాంతి సమయాలలో కూడా సైన్యాలను పర్యవేక్షిస్తూ వారితో సమయం గడిపేవాడు.

## భిన్న జాతుల, మతాల సైన్యం

మైసూరు రాజ్యం నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా టిపు సైనికులను తన సైన్యంలో చేర్చుకునే వాడు. మైసూరు సైనికులను జుమ్రా అని ఇతర ప్రాంతాల సైనికులను గైర్ జుమ్రా అని పిలిచేవారు. మైసూరు సైనికులు ఎర్ర అంచు పచ్చ తలపాగాలు ధరిస్తే ఇతర ప్రాంతాల సైనికులు కేవలం పచ్చ తలపాగాలను ధరించేవారు. టిపు బ్రాహ్మణులకు, వర్తకులకు, ముస్లింలలో దర్యావేషు (గురువుల వంటి వారు) లకు సైనిక సేవల నుండి మినహాయింపు ఇచ్చాడు. హిందువులలో రాజపుత్ర, మరాఠా కులాల నుండి సైనికులను తీసుకునేవాడు. ముస్లింలలో షేక్, సయ్యద్, మొగల్, పఠాన్ జాతులకు చెందిన వారు ఎక్కువగా టిపు సైన్యంలో నియమించబడే వారు.

యుద్ధ ఖైదీల అంగీకారంతో వారిని సైన్యంలో చేర్చుకునే పద్ధతిని హైదర్ అలీ ప్రారంభించాడు. టిపు ఆ పద్ధతిని కొనసాగించాడు. హైదర్ అలీ వారిని 'చేలా' అని పిలిచేవాడు. టిపు వారికి అసద్ ఇలాహి, అహమది అని క్రొత్త పేర్లు పెట్టాడు.

## ఫ్రెంచ్ సైనికులు

టిపు ఫ్రెంచ్ వారి సైనిక సహకారంతో ఆంగ్లేయులపై దాడి చేస్తాడని వెల్లస్లీ టిపుపై ఆరోపణలు చేసినా టిపు సైన్యంలో ఫ్రెంచ్ సైనికుల సంఖ్య చాలా తక్కువ. వారి సంఖ్య ఎప్పుడూ స్థిరంగా ఉండేది కాదు. టిపు తన సైన్యంలో వారి సంఖ్య ఎక్కువగా ఉండడానికి ఇష్టపడే వాడు కాదు. 1799లో టిపు సైన్యంలో నలుగురు ఫ్రెంచ్ సైనిక అధికారులు, 45 మంది నాన్ కమిషన్ ఆఫీసర్లు, వారి ఆధీనంలోని కొందరు ఇతర యూరోపియన్ సైనికులు మాత్రమే ఉండేవారు. నిజామ్ సైన్యంలో రేమండ్ అనే సైనిక అధికారి పర్యవేక్షణలో 14000 మంది ఆంగ్ల సైనికులు ఉండేవారు. నిజామ్ వారికి

పూర్తి స్వేచ్ఛ నిచ్చి ఆ సైనిక కార్యకలాపాలలో జోక్యం చేసుకునే వాడు కాదు. అదేవిధంగా మరాఠా సైన్యంలోనూ పెరోన్ ఆధ్వర్యంలో ఆంగ్ల సైన్యానికి చెందిన 8000 మంది అశ్విక దళం, 2000 మంది కాల్బలం ఉండేవారు. వీరికి కూడా పూర్తి స్వేచ్ఛ ఉండేది. కాని టిపు తన సైన్యంలోని ఫ్రెంచ్ వారిని తన సేవకులుగా భావించేవాడు. వారు తన సైన్యం కంటే అధికంగా ఉండకుండా జాగ్రత్త వహించే వాడు. టిపు ఓటమికి ఈ అంశం కూడా ఒక కారణమని చాలా మంది భావిస్తారు. టిపు వారిని సాంకేతిక పరంగా మాత్రమే ఎక్కువ వాడుకునే వాడు.

## ఫిరంగి దళం - రాకెట్లు

పాండిచ్చేరి ఫ్రెంచ్ గవర్నర్ కొస్బి, టిపు ఫిరంగి దళం 40,000 ఎడ్ల బండ్లలో ఒక ప్రదేశం నుండి ఇంకొక ప్రదేశానికి కదలి వెళ్తూ ఉండేదని వ్రాసాడు. వీటిలో రాకెట్ లాంచర్స్ కూడా ఉండేవి.

యుద్ధంలో సరికొత్త రాకెట్ సాంకేతికతను ప్రవేశపెట్టిన ఘనత భారతదేశంలో హైదర్ అలీకి, టిపుకు చెందుతుంది. ఒకేసారి 500 రాకెట్లను ప్రయోగించే సాంకేతికతను టిపు రూపొందించాడు. ఇవి చాలా ఎత్తుకు ఎగిరి దూరంగా ఉన్న శత్రు సైన్యాల మీద పడి వాటిని కకావికలం చేసేవి.

హైదర్ కాలంలో 1200గా ఉన్న రాకెట్ ప్రయోగంలో నిష్ణాతులైన సైన్యాన్ని టిపు 5000 కు పెంచాడు. ప్రముఖ శాస్త్రవేత్త భారతదేశ పూర్వ రాష్ట్రపతి డా.ఎపి జె అబ్దుల్ కలామ్ నవంబర్ 30, 1990 బెంగుళూరులో జరిగిన టిపు సుల్తాన్ షహీద్ మెమోరియల్ లెక్చర్‌లో టిపును మొదటి యుద్ధ రాకెట్‌ను కనుగొన్న సాంకేతిక నిపుణునిగా పేర్కొన్నారు. లండన్‌లోని బ్రిటిష్ ఆర్టిలరీ మ్యూజియంలో టిపు కనుగొన్న రెండు రాకెట్లు ప్రదర్శింప బడుతున్నాయి.

బ్రిటిష్ శాస్త్రవేత్త విలియం కాంగ్రెవ్ టిపు రాకెట్లను అధ్యయనం చేసి ఆ టెక్నాలజితో క్రొత్త రాకెట్లను తయారు చేసాడు. ఇవి మొదటి ప్రపంచ యుద్ధంలో ఉపయోగించబడ్డాయి.

జూలై 2018లో కర్నాటక లోని బెద్నూరు కోటలోని ఒక పాడు పడిన బావిలో టిపు కాలానికి చెందిన 1000 రాకెట్లు లభించాయి. వీటిలో పొటాషియం నైట్రేట్, బొగ్గు పొడి, మెగ్నీషియం నింపబడి ఉంది.

## కోటల నిర్వహణ

మైసూరు రాజ్యంలోని పశ్చిమ కనుమలలో అనేక కోటలను టిపు నిర్మించాడు. ప్రతి కోటకు ఒక దుర్గాధిపతి ఉండేవాడు. వీరిని ఖిలేదార్ అనేవారు. కోటల నిర్వహణకు

మీర్ సుదూర్ శాఖ ఉండేది. ఈ కోటలు మైసూరు రాజ్యానికి రక్షణగా ఉండేవి. ఈ కోటల నిర్వహణలో టిపు ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవాడు. దుర్గాధిపతులుగా నమ్మకస్తులైన వారిని నియమించేవాడు. బ్రిటిష్ వారు ఈ కోటలను స్వాధీన పరుచుకున్న తర్వాతనే టిపుపై విజయాన్ని సాధించగలిగారు.

## నౌకా దళం

మొదటి సారి మైసూరు రాజ్యం లో నౌకా దళం వైపు దృష్టి సారించిన పాలకుడు హైదర్ అలీ. టిపు తన తండ్రి పద్ధతిని కొనసాగిస్తూ 20 యుద్ధ నౌకలను నిర్మించాడు. ఇవి ఫిరంగులు, రాకెట్ల ప్రయోగానికి కూడా ఉపయోగపడేవి. నౌకాదళ వ్యవహారాల కొరకు మీర్ యామ్ శాఖ ఉండేది. 1789 నాటికి టిపు నౌకల అడుగు భాగాన్ని రాగి పూతను వేసే నూతన పద్ధతిని ప్రారంభించాడు. దీని ద్వారా నౌకలు అధిక సమయం వరకు పాడవకుండా ఉపయోగపడేవి.

కాని టిపు యుద్ధ నౌకల కంటే వ్యాపార నౌకలపైనే ఎక్కువ ఆసక్తి చూపాడు. బ్రిటిష్ యుద్ధ నౌకా దళం ముందు మైసూరు నౌకా దళం నిలువలేక పోయింది.

## పరిపాలనలో ప్రతిభకే పట్టం

స్వయంగా ఆంగ్లేయాధికారి మన్రో చెప్పినట్టు టిపు పాలనలో కుల మతాలకు అతీతంగా ప్రతిభ ప్రాతిపదికగా అధికారుల నియామకాలు జరిగాయి. టిపు సైన్యంలో పరిపాలనలో హిందూ ముస్లింలు కలిపి ఉండేవారు. పూర్ణయ్య, హైదర్ అలీ టిపు పాలనలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. మంగుళూరు సంధి చర్చల కొరకు టిపు తన ప్రతినిధులుగా అప్పాజీరా, శ్రీనివాసరావులను నియమించాడు. కూర్గులో తన ప్రతినిధులుగా మొదటి సుబ్బరాసయ తర్వాత అతని కుమారుడు నాగప్పలను నియమించాడు. మొగలు దర్బారులో టిపు ప్రతినిధులుగా మూల్‌చంద్ సుజన్ రాయ్ ఉండేవారు. టిపు తరఫున మలబారు నాయర్లతో మాదన్న అనే అధికారి చర్చలు జరిపాడు. క్లిష్టమైన చర్చలకు ప్రాతినిధ్యం వహించడానికి టిపు ఎక్కువగా హిందువులనే నియమించేవాడు, వారిని ఎంతగానో విశ్వసించేవాడు.

## అధ్యాయం - 11

# మలబారు కూర్గు తిరుగుబాట్లు

టిపు పాలనలో జరిగిన మలబారు కూర్గు తిరుగుబాట్లు టిపు రాజకీయ జీవితంలో పెద్ద వైఫల్యాలు, ఈ తిరుగుబాటుదార్లు, ఆంగ్లేయులు పరస్పర సహకరించుకుంటూ మూడవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో టిపు ఓటమికి కారణమయ్యారు.

### మలబారు తిరుగుబాట్లు

ప్రస్తుత కేరళ రాష్ట్రంలోని ఉత్తర – పశ్చిమ ప్రాంతాన్ని మలబారు అని పిలుస్తారు. ఈ ప్రాంతం మైసూరు రాజ్యానికి పశ్చిమ వైపు ఉంటుంది. రేవు పట్టణాలు సుగంధ ద్రవ్యాలు, కలప వ్యాపారంతో ఈ ప్రాంతం చాలా ఐశ్వర్యవంతమైంది. ఈ ప్రాంతమంతా తరచూ తమలో తాము కలహించుకునే చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయి ఉండేది. ఈ రాజ్యాల రాజులు తమ శత్రువులను ఓడించడానికి తరచూ ఇతర రాజులను ఆహ్వానించేవారు. 1757లో పాల్ఘాట్ రాజు తన మీద దాడి చేసిన కాలికట్ రాజు జామొరిన్‌ను ఎదుర్కోవడానికి హైదర్ అలీ సహాయాన్ని కోరాడు. అప్పటి నుండి మలబారులో మైసూరు రాజ్యం జోక్యం ప్రారంభమయ్యింది. (హైదర్ అలీ మలబారు ఆక్రమణ వివరాలు రెండవ అధ్యాయంలో ఉన్నాయి.) కాని 1757 నుండి 1792లో మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో టిపు ఓడిపోయి మలబారు ప్రాంతం ఆంగ్లేయుల ఆధీనం లోనికి వచ్చేవరకు ఒక ముప్పై అయిదు సంవత్సరాలపాటు మైసూరుకు వ్యతిరేకంగా మలబారులో ఎడతెరిపి లేకుండా యుద్ధాలు, తిరుగుబాట్లు జరిగాయి.

1757లో హైదర్ చేతిలో ఓడిపోయిన జామొరిన్ హైదర్ కు 12 లక్షల యుద్ధ నష్టపరిహారం చెల్లించడానికి ఒప్పుకున్నాడు. కాని దానిని చెల్లించకపోవడంతో హైదర్ అలీ 1766లో తిరిగి కాలికట్‌పై దాడిచేసి జామొరిన్ ను ఓడించి, కాలికట్‌ను ఆక్రమించుకున్నాడు. ఓడిపోయిన జామొరిన్ అవమాన భారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనితో మలబారు ప్రజలకు మైసూరు పై వ్యతిరేకత పెరిగింది. అక్కడి భూస్వామ్య రాచరిక వర్గమైన నాయర్ల నాయకత్వంలో తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. మొదటి ఆంగ్లో మైసూరు యుద్ధం (1767–69)లో కూడా మలబారు లో నాయర్లు తిరుగుబాట్లు చేసారు. కాని మైసూరు అధికారి మాదన్న వారితో చర్చలు జరిపి వారిని శాంతింప జేసాడు.

కాని రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధం (1780–84)లో ఆంగ్లేయుల ప్రోద్బలంతో ఈ తిరుగుబాట్లు తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ యుద్ధంలో కర్నాటక (తమిళనాడు)

ప్రాంతంలో విజయ పరంపర సాగిస్తున్న మైసూరు సైన్యాలను అడ్డుకోవడానికి ఆంగ్లేయులు మలబారులో మైసూరు ఆధిపత్యంలో ఉన్న అనేక ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. హైదర్ అలీ పంపించిన మైసూరు సైన్యాలు ఆంగ్లేయుల చేతిలో చిత్తుగా ఓడిపోయాయి. మైసూరు సైన్యాధిపతి అవమానంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మలబారు మైసూరు నుండి చేజారిపోయే పరిస్థితి ఏర్పడింది. దీనితో నవంబరు 1782లో హైదర్ టిపును మలబారుకు పంపించాడు. టిపు అక్కడి పరిస్థితులను చక్కదిద్దే లోపే 1782 డిసెంబరులో హైదర్ అలీ మరణించాడు. తర్వాత రెండు సంవత్సరాల వరకూ యుద్ధం కొనసాగింది. 1784లో ఆంగ్లేయుల ఓటమితో మంగుళూరు సంధి ననుసరించి ఆంగ్లేయులు ఆక్రమించుకున్న మలబారు ప్రాంతాలన్నీ తిరిగి మైసూరు ఆధీనంలోనికి వచ్చాయి.

## మలబారులో టిపు పాలనా సంస్కరణలు- తిరుగుబాట్లు

చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయి, భూస్వామ్య వర్గాలైన నంబూద్రి బాహ్మణులు, నాయర్ల ఆధీనంలో ఉన్న మలబారులో రెవెన్యూ పాలనా వ్యవస్థ ఇతర పాలనా వ్యవస్థలు కూడా అస్తవ్యస్తంగా ఉండేవి. వీటిని సంస్కరించే ఉద్దేశంతో టిపు అర్షద్‌బేగ్, ఇబ్రహీం అనే అధికారులను మలబారులో తన గవర్నర్లుగా 1785లో నియమించాడు.

కాని టిపు నిర్దేశించిన సంస్కరణలు అమలు చేయడంలో వీరు అవినీతికి, తద్వారా దుష్ట పాలనకు పాల్పడడంతో ఈసారి సామాన్య కౌలురైతులైన ముస్లిం మోప్లాల నుండీ తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. 1785-86 మధ్య మంజేరి ప్రాంతానికి చెందిన మోప్లా నాయకుడు కురిక్కాల్ నాయకత్వంలో కౌలు రైతులు పెద్ద ఎత్తున తిరుగుబాట్లు చేసారు. ఈ తిరుగుబాట్లను ఎదుర్కోలేని అర్షద్ బేగ్ టిపు సాయం కొరకు అర్థించాడు.

ఏప్రిల్ 1788లో టిపు పెద్ద సైన్యంతో మలబారు వచ్చి తిరుగుబాట్లను అణచి వేసాడు. అర్షద్ బేగ్, ఇబ్రహీంలను తొలగించి పరిపాలనను తన చేతిలోనికి తీసుకుని పాలనా సంస్కరణలను అమలు పరిచాడు. కాలికట్ ప్రక్కనే ఫరూకాబాద్ పేరుతో క్రొత్త పట్టణ్ణాన్ని నిర్మించి దానిని మలబారుకు రాజధానిని చేసాడు. ప్రస్తుతం ఆ పట్టణం ఫెరోక్‌గా పిలవబడుతోంది.

మోప్లా జాతికి చెందిన కన్ననూరు (కన్నూరు) రాణి బీబీ కుమార్తెతో తన కుమారుడు అబ్దుల్ ఖాలిక్ వివాహం జరిపించి టిపు మోప్లాలను శాంతింప జేసాడు. రెవెన్యూ సంస్కరణల ద్వారా, వర్తక వ్యాపారాల అభివృద్ధి ద్వారా మలబారుకు చెందిన సామాన్య ప్రజానీకాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేసాడు.

## రెవెన్యూ సంస్కరణలు

మలబారులో ప్రాచీన కాలం నుండీ సమగ్రమైన పన్ను విధానం ఉండేది కాదు. భూమి ఎక్కువగా నంబూద్రి బ్రాహ్మణుల చేతిలో, వారు పూజారులుగా ఉండే దేవాలయాల

ఆధీనంలో ఉండేది. సైనిక విధులు నిర్వహించే నాయర్ల చేతిలో కూడా అధికంగా భూమి ఉండేది. ఇక్కడి భూస్వామ్య వర్గాన్ని జెన్మీలు అనేవారు. భూమి శిస్తు విధానం ఆచారాల వ్యవహారాల పరిధిలో ఉండేది. పండుగలు, ఇతర సందర్భాలలో ఈ జెన్మీలకు ధనం, కానుకలు చెల్లించాలి. సాగు భూమి ఎన్నడూ సర్వే చేయబడలేదు. హైదర్ అలీ సమయంలోనే ఈ పరిస్థితులను మార్చే ప్రయత్నం జరిగింది. హైదర్ అలీ, శ్రీనివాసరావు అనే అధికారిని భూమి సర్వే ఇతర రెవెన్యూ సంస్కరణల కోసం మలబారులో నియమించాడు కాని, శ్రీనివాసరావు ఆ పనిని సజావుగా చేయలేక పోయాడు.

కాని టిపు తన తండ్రి వదిలిన పనిని కొనసాగించాడు. టిపు మలబారులో భూ సర్వే నిర్వహించి జెన్మీల మీద పన్ను విధించాడు. హైదర్ అలీ దేవాలయ భూములను పన్నుల నుండి మినహాయించినప్పటికీ టిపు దేవాలయ భూముల మీద కూడా పన్నులు విధించాడు. ఎందుకంటే ఈ దేవాలయ భూముల ఆదాయాన్ని పరోక్షంగా నంబూద్రి బ్రాహ్మణులే అనుభవించే వారు. మలబారు రైతులకు కూడా మైసూరు రైతులవలె అనేక రాయితీలు కల్పించాడు. వారు జెన్మీలకు కాకుండా నేరుగా ప్రభుత్వానికి పన్ను చెల్లించే ఏర్పాటు చేసాడు.

టిపు అమలు చేసిన రెవెన్యూ సంస్కరణల వలన మలబారు ప్రాంతంలో కొన్ని వేల సంవత్సరాల నుండి భూమిపై ఆధిపత్యం కలిగి ఉన్న నంబూద్రి, నాయరు కులాల వారు ఎంతగానో నష్టపోయారు. అందుకే టిపు పై తిరుగుబాట్లలో నాయర్లు చాలా ప్రముఖ పాత్ర నిర్వహించారు. వీరు తిరుగుబాట్లు చేసే క్రమంలో టిపు నుండి తప్పించుకోవడానికి ట్రావెన్కూర్ రాజు ఆశ్రయంలోకి, ఆంగ్లేయుల స్థావరమైన తెల్లిసెరికి పారిపోయే వారు. అలా పారిపోయిన తిరుగుబాటుదార్ల భూములను టిపు స్వాధీనం చేసుకుని వాటిని సామాన్య రైతులకు ఇచ్చి వారి వద్ద నుండి న్యాయబద్ధమైన పన్ను వసూలు చేసేవాడు. ఇది తిరుగుబాటుదార్లకు మరింత ఆగ్రహం కలిగించేది.

## టిపు పాలనలో మలబారు లో రహదారుల నిర్మాణం - వాణిజ్య విస్తరణ

ఆంగ్లేయులు– టిపు మలబారు పై ఆధిపత్యానికి పోటీ పడడానికి అక్కడి సుగంధ ద్రవ్యాల, కలప వ్యాపారమే ముఖ్య కారణం. టిపు మలబారులో ఈ వర్తక లాభాలను పూర్తిగా పొందే ప్రయత్నం చేసాడు. అప్పటి వరకు మలబారులో రవాణా ఎక్కువగా నీటి మార్గాల ద్వారా జరిగేది. త్వరితగతిని సరకు రవాణా కొరకు టిపు మలబారు లో విస్తృతంగా రహదారులను నిర్మించాడు. ఒక ఆంగ్ల అధికారి పేర్కొన్నట్లు టిపు మలబారు లో చక్రాలను ప్రవేశ పెట్టాడు. పర్వత ప్రాంతమైన వైనాడులో కూడా టిపు కలప రవాణా కొరకు రోడ్లు నిర్మించాడు. కేవలం సరుకు రవాణా కొరకే కాకుండా మైసూరు నుండి సైన్యం, ఫిరంగుల రవాణా కొరకు కూడా ఈ రోడ్లు ఉపయోగ పడ్డాయి. వైనాడులోని ఒక ప్రాంతంలో టిపు

తన ఫిరంగుల కొరకు గోదాములు నిర్మించాడు. ఆ ఊరు ఇప్పటికీ సుల్తాన్ బతేరి (Sultan Battery)గా పిలువబడుతోంది. సుల్తాన్ బతేరి నుండి కాలికట్, మల్లపురం నుండి తామరసెరి, ఫెరోక్ నుండి కోయంబత్తూరు, చాలియం నుండి చెట్టువాయి వరకు రోడ్లు నిర్మించాడు. ఇప్పటికీ వీటిని టిపు సుల్తాన్ రోడ్లనే పిలుస్తారు.

మలబారు లో లభించే సుగంధ ద్రవ్యాలు, కలప ఎగుమతుల వలననే టిపు విదేశాలలో ఎక్కువగా వర్తక వ్యాపారాలు నిర్వహించ గలిగాడు. ఇందుకు గాను కాలికట్‌లో ఒక వ్యాపార కేంద్రాన్ని కూడా స్థాపించాడు. అంతకు ముందెన్నడూ లేనంతగా టిపు పాలనలో మలబారులో వర్తక వ్యాపారాలు అభివృద్ధి చెందాయని స్వయంగా ఆంగ్లేయులే అంగీకరించారు.

టిపు మలబారులో ప్రవేశపెట్టిన పాలనా సంస్కరణలు రెవెన్యూ విధానాలు అప్పటి వరకూ నంబూద్రి బ్రాహ్మణులు, నాయర్లకు మలబారు సమాజంపై ఉన్న ఆధిపత్యాన్ని సడలించాయి. అంత వరకు వారి అణచివేతలో ఉన్న సామాన్య పేద ప్రజలకు భూమి లభించింది. వారు నేరుగా ప్రభుత్వానికి పన్ను చెల్లించే పద్ధతితో వారిపై పై భూస్వామ్య వర్గాల పెత్తనం తగ్గింది.

## మలబారు లో టిపు సాంఘిక సంస్కరణలు

టిపు ఆర్థికంగానే కాకుండా సామాజికంగా కూడా నాయర్లలో ఉన్న కొన్ని ఆచార వ్యవహారాలలో జోక్యం కలిగించుకుని వారి ఆధిపత్యానికి అడ్డువేసే ప్రయత్నం చేసాడు. మలబారులోని నాయరు మహిళలలో బహు భర్తృత్వం (polyandry) ఆచారం ఉండేది. వారు నాయర్, నంబూద్రి బ్రాహ్మణ పురుషులను ఒకేసారి భర్తలుగ స్వీకరించవచ్చు. టిపు ఈ ఆచారాల్ని నిలిపి వేయవలసిందిగా ఆజ్ఞలు జారీ చేసాడు. అంతేకాదు, మలబారులోని నిమ్న కులాల మహిళలు తమ ఛాతీపై ఆచ్ఛాదన లేకుండా తిరగాలనే ఆచారాన్ని అగ్రవర్ణాల వారు వారిపై బలవంతంగా విధించారు. నిమ్నజాతుల మహిళలు ఈ ఆచారాన్ని ఉల్లంఘించి తమ ఛాతీని కప్పుకుంటే వారిని వారి కుటుంబాన్ని శిక్షించే వారు. ఈ ఆచారాన్ని కూడా టిపు నిషేధించాడు. తమ తరతరాల ఆచార వ్యవహారాలలో టిపు జోక్యం కలిగించుకోవడం మలబారులో అగ్రవర్ణాలైన నంబూద్రి బ్రాహ్మణులకు, నాయర్ వర్ణాలకు ఆగ్రహం తెప్పించింది. అందుకే వీరు టిపు పై తిరుగుబాట్లను ఎక్కువగా కొనసాగించారు.

## పజాసి రాజాగా ప్రసిద్ధి చెందిన కేరళవర్మ తిరుగుబాటు

టిపు ఏప్రిల్ 1788 నుండి మలబారులో మకాం వేసి, అవినీతి అధికారులైన అర్షద్‌బేగ్, ఇబ్రహీం లను తొలగించి అక్కడి పరిపాలనను చక్కదిద్ది ఆగష్టు 1788 న

బయలుదేరి శ్రీరంగపట్టణం చేరుకున్నాడు. కాని టిపు వెనుదిరిగిన వెంటనే మలబారులో తిరిగి తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. ఈసారి కొట్టాయం రాజవంశానికి చెందిన కేరళవర్మ పజాసి రాజా నాయకత్వంలో ఈ తిరుగుబాటు మొదలయ్యింది. మైసూరు ఆధీనంలో ఉన్న కొట్టాయం సంస్థానాన్ని తిరిగి పొందాలనేది కేరళవర్మ ఆశయం. కేరళవర్మ నాయర్లను, మోప్లాలను తన సైన్యంలో చేర్చుకొని టిపుపై పెద్ద ఎత్తున తిరుగుబాటు చేసాడు.

దీనిని తిరుగుబాటు అనడం కంటె యుద్ధ మనడం సమంజసం. ఇతనికి ఆంగ్లేయుల పూర్తి సహకారం లభించింది. కేరళవర్మ కాలికట్‌ను, చుట్టు పక్కల ప్రాంతాలను ఆక్రమించుకున్నాడు. మలబారు ఇంకొకసారి మైసూరు ఆధిపత్యం నుండి చేజారిపోయే పరిస్థితి ఏర్పడింది.

డిసెంబరు, 1788లో టిపు మైసూరు సైనికాధికారి ఖమ్రోద్దీన్, ఫ్రెంచ్ సైనికాధికారి లాలె నాయకత్వంలో 6000 మంది సైన్యాన్ని కేరళవర్మ తిరుగుబాటును అణచివేయడానికి పంపించాడు. కాని కేరళవర్మ ధాటికి వారు నిలువలేక పోయారు. జనవరి, 1789లో టిపు స్వయంగా పెద్ద సైన్యంతో వచ్చి కేరళవర్మ తిరుగుబాటును నిర్దాక్షణ్యంగా అణచివేసాడు. అనేక మంది తిరుగుబాటు దార్లను చంపి వేల మందిని బందీలుగ శ్రీరంగపట్టణం తరలించి, నిర్బంధించడం జరిగింది. బందీలుగా ఉన్నవారిని అనేక మందిని ఇస్లాం లోనికి మార్చడం జరిగింది. మత మార్పిడి చేసుకున్న వారిని మైసూరు సైన్యంలో చేర్చుకున్నారు. వీరిని ప్రత్యేకంగా అసద్ ఇలాహి సైన్యంగా గుర్తించేవారు.

తనతో స్నేహం నటిస్తూ తిరుగుబాటు దార్లకు సహకరించినందుకు చిరకాల్ రాజును చిత్రహింసలకు గురిచేసి చంపించాడని టిపు పై ఆరోపణలు ఉన్నాయి.

కేరళవర్మ తిరుగుబాటును అణచివేయడానికి టిపు చాలా క్రూరంగా ప్రవర్తించాడని ఆంగ్లేయ చరిత్రకారులు తర్వాత గగ్గోలు పెట్టారు. టిపు ఫ్రెంచ్ అధికారి కోస్బీకి వ్రాసిన లేఖలో మలబారులో ఆరు తిరుగుబాట్లను తను ఆరుసార్లు క్షమించానని కాని, ఏడవ తిరుగుబాటును ఇక సహించలేక నిర్దాక్షణ్యంగా అణచి వేసానని, చాలా మందికి మరణ శిక్షకు బదులుగా మతమార్పిడి శిక్షను విధించానని అంగీకరించాడు.

## మూడవ ఆంగ్లో- మైసూరు- యుద్ధం- మలబారు

కేరళవర్మ తిరుగుబాటు అణచివేత తర్వాత టిపుకు మూడవ- ఆంగ్లో- మైసూరు యుద్ధాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. కార్న్‌వాలిస్ మలబారు లోని సంస్థానాధీశులందరితో టిపుకు వ్యతిరేకంగా ఒప్పందాలు చేసుకున్నాడు. టిపును ఓడించిన తర్వాత వారందరూ స్వతంత్రులవుతారని ఆశ పెట్టాడు. కేరళవర్మ తిరిగి కొట్టాయం సంస్థానానికి రాజు అవుతాడని కార్న్‌వాలిస్ అతనిని నమ్మించాడు. దీనితో మలబారులోని సంస్థానాధీశులలో

అనేకులు మూడవ ఆంగ్ల – మైసూరు యుద్ధంలో టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు సహకరించారు. శ్రీరంగపట్టణం సంధి ప్రకారం ఆంగ్లేయులు టిపు నుండి మొత్తం మలబారును స్వాధీనం చేసుకున్నారు. కాని మలబారు రాజులకు స్వతంత్రం ఇవ్వకుండా వారిని తమ సామంతులుగా ప్రకటించారు. ఆంగ్లేయులను ఎదిరించలేని అశక్తతతో చాలా మంది అందుకు తలవంచారు.

కాని కేరళవర్మ పజాసి రాజా ఆంగ్లేయుల మోసాన్ని సహించలేక ఆంగ్లేయులపై తిరుగుబాటు ప్రారంభించాడు. 1792 నుండి 1805 వరకూ గెరిల్లా సాయుధ పోరాటం చేసాడు. 1805లో ఆంగ్లేయులు ఇతనిని వైనాడు అడవులలో పట్టుకుని చంపేసారు. మొదట టిపుతో, తర్వాత ఆంగ్లేయుల తో స్వాతంత్ర్యం కొరకు పోరాడి మరణించిన యోధునిగా కేరళ ప్రజలు ఇప్పటికీ కేరళవర్మ పజాసి రాజాను గుర్తిస్తారు. అతని వీరత్వం, పోరాటం గురించి అనేక కథలు, గాథలు, పాటలు కేరళలో ప్రసిద్ధి చెందాయి. ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు పోరాటంతో పజాసి రాజా తిరుగుబాటును పోల్చవచ్చు. సీతారామరాజు వలెనే పజాసి రాజా మలబారు ప్రాంతంలోని వైనాడులో ఆదివాసీల హక్కుల కోసం బ్రిటిష్ వారితో పోరాడాడు.

శ్రీరంగపట్టణ సంధితో మలబారును కోల్పోయిన టిపు ఒక ప్రాంతాన్నే కాకుండా అక్కడి వర్తక వ్యాపారాలను కోల్పోయి ఆర్థికంగా చాలా నష్టపోయాడు. మలబారు తిరుగుబాటుదారుల సాయంతోనే కార్న్‌వాలిస్ టిపును జయించగలిగాడు. కాని టిపు ఆధిపత్యం నుండి విముక్తి కోసం ఆంగ్లేయులకు సహకరించిన మలబారు తిరుగుబాటుదార్లు తిరిగి ఆంగ్లేయులకు సామంతులు కావడమే చారిత్రక విశేషం.

## కూర్గు తిరుగుబాట్లు

ప్రస్తుత కర్నాటక రాష్ట్రం దక్షిణ ప్రాంతంలో, కేరళలోని మలబారు ప్రాంతం సరిహద్దులో ఉన్న ప్రాంతం కూర్గు. ఇది పశ్చిమ కనుమలలో కాఫీ తోటలతో దట్టమైన అడవులతో పర్వత శ్రేణులతో అలరారే అందమైన ప్రాంతం. ఈ కనుమలలోనే కావేరి నది జన్మస్థానం ఉంది. ఆ ప్రాంతాన్ని తల కావేరి అని పిలుస్తారు. ఈ ప్రాంతం ప్రాచీన కాలం నుండి కొడవ, కొడుగుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ నివసించే స్థానిక కొడవ జాతి ప్రజల నుండి ఈ పేరు వచ్చింది. ఈ కొడగునే ఆంగ్లేయులు కూర్గుగ మార్చారు. 1681 నుండి ఈ ప్రాంతానికి మడికెరె (ఆంగ్లేయుల మెర్కెర) రాజధాని. ఈ నగరం మైసూరు పట్టణానికి 130 కిలో మీటర్ల దూరంలో ఉంది.

ఈ ప్రాంతాన్ని 17వ శతాబ్దం నుండి హలేరి వంశానికి చెందిన రాజులు స్వతంత్రంగా పాలించారు. ప్రక్కనే ఉన్న సారవంతమైన కూర్గు ప్రాంతాలను తమ

ఆధీనంలోనికి తీసుకోవడానికి మైసూరును పాలించిన ఒడయారులు చాలా ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. మైసూరు రాజు చిక్కదేవరాయ ఒడయారు 1724లో కూర్గు మీద దాడి చేసి ఘోర పరాజయాన్ని పొంది 15000 మంది సైన్యాన్ని పోగొట్టుకున్నాడు. కొడవలు తమ స్వతంత్రాన్ని కాపాడుకోవడానికి వీరోచితంగా పోరాడే వారు. కొండలతో, అడవులతో నిండి ఉన్న తమ చిన్న రాజ్యాన్ని కాపాడుకోవడానికి కొడవలు గెరిల్లా యుద్ధాన్ని అనుసరించే వారు. హైదర్ అలీ, టిపు కూడా స్వాతంత్రేచ్ఛ కలిగిన ఈ చిన్న రాజ్యాన్ని తమ ఆధీనంలో ఉంచుకోవడంలో విఫలమయ్యారు. 1834లో ఆంగ్లేయులు కూర్గు తిరుగుబాటు దార్లను జయించి కూర్గును తమ ఆధీనంలోనికి తీసుకునేవరకూ హలేరి వంశానికి చెందిన కూర్గు రాజులు కూర్గును స్వతంత్రంగా పాలించడానికి పోరాడుతూనే ఉండేవారు.

## కూర్గులో హైదర్ అలీ జోక్యం

మలబారులో వలెనె మొదట కూర్గీయుల ఆహ్వానం మేరకే కూర్గు రాజకీయాలలో మైసూరు జోక్యం జరిగింది. 1773లో కూర్గును పాలిస్తున్న హలేరి వంశంలో వారసత్వ సమస్య తలెత్తింది. హలేరి వంశానికి చెందిన లింగరాజు తన అన్నకొడుకు అప్పాజి రాజాకు దేవప్ప రాజా అనే బంధువుతో వారసత్వ సమస్య వచ్చినప్పుడు అప్పాజి రాజాకు సహాయం చేయవలసిందిగా హైదర్ అలీని ఆహ్వానించాడు. హైదర్ అలీ మైసూరు సైన్యాలను కూర్గుకు పంపించి అప్పాజి రాజా ప్రత్యర్థిని ఓడించి, అప్పాజి రాజాను కూర్గు సింహాసనంపై కూర్చోబెట్టాడు. అందుకు ప్రతిఫలంగా 24,000 ఫణాలను పొందడమే కాకుండా కూర్గులోని కొన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. అంతవరకు స్వతంత్ర రాజ్యంగా ఉన్న కూర్గు మైసూరు సామంత రాజ్యం అయ్యింది. 1776లో అప్పాజి రాజా మరణించడంతో అతని చిన్నాన్న లింగరాజు కూర్గు పాలకుడయ్యాడు. 1780లో లింగరాజు మరణించాడు. అతనికి వీర రాజేంద్ర, లింగరాజ, అప్పాజి అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. హైదర్ అలీ వారిలో ఒకరిని రాజుగా ప్రకటించవలసి ఉంది. కాని హైదర్ అలీ లింగరాజు ముగ్గురు కుమారులను కూర్గు రాజధాని మడికెరె కోటలో నిర్బంధించి తనకు తాను వారి సంరక్షకుడిగా ప్రకటించుకున్నాడు. మైసూరు నుండి సుబ్బరాసయ అనే అధికారిని కూర్గు పాలనకు నియమించాడు.

హైదర్ అలీ ఈ చర్యలను, కూర్గు రాజ్యాన్ని తనే స్వయంగా పాలించే కుట్రగా భావించిన కూర్గు ప్రజలు, రాజ కుమారులను విడుదల చేసి వారికి రాజ్యం అప్పగించాలని పెద్ద ఎత్తున తిరుగుబాటు ప్రారంభించారు. రాజ కుమారులు మడికెరెలో ఉంటే తిరుగుబాటు దార్లు వారిని విడిపిస్తారనే భయంతో హైదర్ అలీ వారిని గోరూరు కోటకు మార్చవలసిందిగా సుబ్బరాసయను ఆజ్ఞాపించాడు.

హైదర్ ఈ చర్య కూర్గీయులలో ఇంకా ఆగ్రహాన్ని కలిగించింది. 1782లో వారు మళ్ళీ తిరుగుబాటు ప్రారంభించారు. కాని రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో నిమగ్నుడై ఉన్న హైదర్ కూర్గు తిరుగుబాట్ల పై దృష్టి సారించలేక పోయాడు.

## టిపు కూర్గు తిరుగుబాట్లు

డిసెంబరు 1782లో హైదర్ మరణించిన తర్వాత కూడా టిపు రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధాన్ని కొనసాగించడంతో టిపు కూడా కూర్గు తిరుగుబాట్లను అణిచివేయలేక పోయాడు. అంతేకాకుండా తన తండ్రి చేసిన తప్పునే పునరావృతం చేస్తూ కూర్గు రాజ కుమారులను గోరూరు నుండి పెరియ పట్టణం అనే క్రొత్త ప్రదేశానికి మార్చాడు. తన సైనికాధికారి హైదర్ అలీ బేగ్‌ను, తన సామంతుడైన కింకేరి రాజును పెద్ద సైన్యంతో కూర్గు తిరుగుబాటును అణిచివేయడానికి పంపించాడు. కాని కూర్గీయులు ఈ మైసూరు సైన్యాన్ని చిత్తుగా ఓడించారు.

1784లో రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధం ముగిసి ఆంగ్లేయులతో మంగుళూరు సంధి జరిగిన తర్వాత 1785లో టిపు స్వయంగా పెద్ద సైన్యంతో కూర్గు పై దాడి చేసాడు. టిపు సైన్యాలతో వీరోచితంగా పోరాడినా కూర్గీయులు ఓడిపోయారు. టిపు మడికెరెను తిరిగి ఆక్రమించాడు. జైనుల్ అబిది మహదవిని మైసూరు తరపున కూర్గులో ఫౌజ్‌దార్‌గా నియమించి మైసూరు తిరిగి వచ్చాడు.

టిపు వెనుదిరగగానే కూర్గులో మళ్ళీ తిరుగుబాట్లు చెలరేగాయి. ఈ సారి మున్మతె నాయర్, రంగా నాయర్ నాయకత్వంలో కూర్గీయులు మైసూరు సైన్యాలను ఓడించి మడికెర్ పై దాడికి సిద్ధమయ్యారు. టిపు కూర్గు పాలన కోసం నియమించిన ఫౌజ్‌దార్ ఈ తిరుగుబాటును నియంత్రించడంలో పూర్తిగా విఫలమై టిపును సహాయం కోరాడు టిపు వేరొక సైనికాధికారి జైనుల్ అబిదన్ షుస్త్రారి ఆధ్వర్యంలో మైసూరు సైన్యాలను కూర్గుకు పంపించాడు. కాని వీరు కూడా కూర్గు తిరుగుబాటు సైన్యాల ధాటిని తట్టుకోలేక పోయారు. దీనితో 1788లో తిరిగి టిపు స్వయంగా పెద్ద సైన్యంతో కూర్గు పై దాడి చేసి తిరుగుబాటును అణిచివేసాడు. కొడవలు టిపును ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాని ఓడిపోయారు.

కూర్గీయుల తిరుగుబాటును అణిచి వేసేటప్పుడు టిపు అనేక హింసాత్మక చర్యలకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి. వేలాది మంది కొడవ తిరుగుబాటు దార్లను బందీలుగ పట్టుకొని శ్రీరంగపట్టణం కారాగారాల్లో బంధించాడు. వారిలో చాలా మందిని ఇస్లాంలోకి మత మార్పిడి గావించాడు. ఆంగ్ల చరిత్రకారులు ఈ సంఖ్యను 40,000 నుండి 50,000 లుగా చెప్పారు. టిపు సంస్థానంలో ఉండి టిపు మరణం తర్వాత టిపు చరిత్ర వ్రాసిన కిర్మానీ ఈ సంఖ్యను 80,000 కు పెంచేసాడు. టిపును గొప్ప ఇస్లాం మత అభిమానిగా

చూపించే ప్రయత్నంలో కిర్మానీ ఈ సంఖ్యను 80,000కు పెంచేశాడని కొందరి అభిప్రాయం. ఈ లెక్కలన్నీ అవాస్తవాలని ఇంకొందరి అభిప్రాయం, 2011 జనాభా లెక్కల ప్రకారం కూర్గు జనాభా 5,54,519. వారిలో కొడవ ముస్లింల జనాభా 6 శాతం మాత్రమే, ఇంచుమించు రెండు శతాబ్దాల క్రితం కూర్గులో వేల మంది ఇస్లాం లోనికి మత మార్పిడి చేసుకుంటే ఇప్పటికి కూర్గులో ముస్లింల జనాభా 6 శాతం కంటె అధికంగా ఉండాలి. అంతే కాదు కూర్గుకు ప్రక్కనే ఉన్న మలబారులోని మోప్లా ముస్లింలు అనేకులు కూర్గుకు వలస వచ్చి స్థిరపడ్డారు. టిపు దాడుల సమయంలో మత మార్పిడులు జరిగాయనేది వాస్తవం. ఎందుకంటే కూర్గులో కొడవ మాప్పిలా (కొడవ ముస్లిం) అనే ఒక సమూహం ఉంది. వీరి ఇంటిపేర్లు, ఆచార వ్యవహారాలు ఇప్పటికీ హిందు కొడవలనే పోలి ఉంటాయి. వీరు టిపు సమయంలో ముస్లింలుగ మతం మారారని తెలుస్తూనే ఉంది. కాని 40– 80 వేల మందికి మత మార్పిడులు జరిగాయనేది అవాస్తవం. టిపు మత మార్పిడికి అంగీకరించని వారిని చంపి వేయడమో లేక శ్రీరంగపట్టణంలో బందీలుగా చేయడమో జరిగింది.

పై చర్యలే కాకుండా టిపు ఇంకొక చర్య కూడా కూర్గీయుల తీవ్ర ఆగ్రహానికి గురయ్యింది. టిపు కొడవలను వారి భూముల్లోంచి బలవంతంగా ఖాళీ చేయించి ఆ భూములను, తమ భూములు వదలి అడవుల్లో దాక్కొన్న తిరుగుబాటుదార్ల భూములను మైసూరు నుండి రప్పించిన మైసూరియన్లకు కట్టబెట్టాడు. వారికి పన్ను రాయితీలిచ్చి కూర్గులో మైసూరియన్లు స్థిర నివాసం ఏర్పరుచుకునే ఏర్పాట్లు చేసాడు. హైదర్ కాలంలో నియమించబడిన సుబ్బరాసయ బంధువు నాగప్పను కూర్గు పాలనాధికారిగా నియమించాడు. టిపు ఈ ధోరణులు కూర్గీయుల తిరుగుబాట్లను ఉధృతం చేసాయి తప్ప అదుపు చేయలేదు.

## దొడ్డ వీర రాజేంద్ర

డిసెంబరు, 1788లో పెరియ పట్టణంలో బందీలుగ ఉన్న కూర్గు రాజ కుమారులలో ఒకరయిన దొడ్డ వీర రాజేంద్ర తన కుటుంబంతో సహా కారాగారం నుండి తప్పించుకొని కూర్గు చేరుకున్నాడు. కూర్గీయులు వెంటనే అతనిని తమ రాజుగ ప్రకటించుకొని నూతనోత్సాహంతో టిపు పై యుద్ధం ప్రకటించారు.

దొడ్డ వీర రాజేంద్ర సిద్ధేశ్వరాన్ని కేంద్రంగా చేసుకొని మైసూరు పై దాడులు ప్రారంభించాడు. మైసూరు నుండి వచ్చి కూర్గులో స్థిరపడిన మైసూరియన్లను కూర్గు నుండి వెళ్ళగొట్టాడు. టిపు బాధితులైన కెనరా క్రైస్తవులను కూర్గుకు ఆహ్వానించాడు. ఆంగ్లేయ సేనాని అబెర్ క్రోంబితో ఒప్పందాలు చేసుకున్నాడు. వీరిద్దరూ మొదటిసారి

కలుసుకొని ఒప్పందం చేసుకున్న ప్రదేశంలో వీర రాజేంద్ర పేట అనే ఊరును నిర్మించాడు. ప్రస్తుతం అది కూర్గ ప్రాంతంలోని విరాజ్ పేటగా పిలువబడుతోంది.

ఈ సంఘటనలను తెలుసుకున్న టిపు గులాం అలీ ఖాన్ నాయకత్వంలో మైసూరు సైన్యాలను వీర రాజేంద్రను ఎదుర్కోవడానికి పంపించాడు. కూర్గీయులు మైసూరు సైన్యాలను కూర్గలోని ప్రతి అంగుళంలో ఎదిరించారు. అయినప్పటికీ మైసూరుకే విజయం లభించే సమయంలో మలబారు లో తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. టిపు గులాం అలీని మలబారు వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించాడు. కూర్గ నుండి మలబారు వెళ్లే మార్గంలో కూడా గులాం అలీ ఖాన్ కూర్గీయుల దాడిని ఎదుర్కోవలసి వచ్చింది. గులాం అలీ సహాయం కొరకు టిపు అదనపు సైన్యాలను పంపించవలసి వచ్చింది. ఈ సైన్యాలు గులాం అలీని చేరకుండ వీర రాజేంద్ర వీటిని హెగ్గెల ఘాట్ వద్దే ఎదుర్కొని ఓడించాడు. మైసూరు సైన్యాలు ధాన్యం, ఆహార పదార్థాలు వంటి యుద్ధ సరఫరాలను కోల్పోవడమే కాకుండా ఎందరో సైనికులను కూడా కోల్పోయారు.

ఈ అపజయంతో క్రుద్ధుడైన టిపు తన బావమరిది బుర్హానుద్దీన్ నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని కూర్గ పైకి పంపించాడు. బుర్హానుద్దీన్ సైన్యం మడికెరె వైపు వెళ్తుండగానే దారిలోనే వీర రాజేంద్ర మైసూరు సైన్యాలను ఎదుర్కొని ఓడించాడు. దీనితో బుర్హానుద్దీన్ వెనుతిరగవలసి వచ్చింది. బుర్హానుద్దీన్ శ్రీరంగపట్టణం చేరుకుని టిపు కు పరిస్థితిని వివరించి ఇంకా పెద్ద సైన్యంతో సెప్టెంబరు, 1789లో కూర్గ పై పెద్ద ఎత్తున దాడి చేసాడు. కాని వీర రాజేంద్ర ఈసారి కూడా మైసూరు సైన్యాలను ఓడించాడు. కూర్గ లోని ప్రముఖమైన నాల్గు కోటలలోని మూడు కోటలు, కుషాల నగరం, బెప్పినాడు కోట, భాగ మండల కోట వీర రాజేంద్ర ఆధీనంలోనికి వచ్చాయి. ఒక మడికెరె కోట మాత్రమే మైసూరు ఆధీనంలో ఉంది.

1790లో మూడవ ఆంగ్లో - మైసూరు యుద్ధం ప్రారంభం కావడంతో టిపు అటు వైపు దృష్టి సారించవలసి వచ్చింది. దీనితో కూర్గ తిరుగుబాటు అంశాల్ని టిపు వాయిదా వేయవలసి వచ్చింది.

మూడవ ఆంగ్లో- మైసూరు యుద్ధంలో టిపు ఓటమికి కూర్గీయులు ఆంగ్లేయులకు పూర్తి సహాయాన్ని అందించారు. శ్రీరంగపట్టణం సంధితో కూర్గ, ఆంగ్లేయుల ఆధిపత్యం లోనికి వచ్చింది. వీర రాజేంద్ర ఆంగ్లేయుల సామంతుడిగా కూర్గ సింహసనాన్ని అధిష్ఠించి 1809 వరకు కూర్గను పాలించాడు. తర్వాత అతని తమ్ముడు లింగరాజు పాలించాడు. లింగరాజు కుమారుడైన చిన్న వీర రాజు పాలిస్తున్నప్పుడు 1834లో ఆంగ్లేయులు అతనిని తొలగించి కూర్గను తూర్పు ఇండియా కంపెనీ సామ్రాజ్యంలో భాగంగా చేసుకున్నారు.

ఈ చర్యకు వ్యతిరేకంగా కూర్గీయులు పెద్ద ఎత్తున తిరుగుబాట్లు చేసినప్పటికీ ఆంగ్లేయులు వాటిని అతి క్రూరంగా అణిచి వేసారు.

మలబారు, కూర్గు తిరుగుబాటుదార్లు మైసూరు ఆధిపత్యం నుండి విడుదల పొందడానికి టిపుకు వ్యతిరేకంగా అంగ్లేయులకు సహకరించి టిపు పతనానికి కారణమయ్యారు. కాని 1805లో మలబారు, 1834లో కూర్గు తూర్పు ఇండియా కంపెనీ సామ్రాజ్యంలో భాగాలయిపోయాయి. టిపుకు వ్యతిరేకంగా పోరాడడానికి వీరికి ఆంగ్లేయులు సహాయం చేసారు. కాని వీరు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు చేసినప్పుడు మలబారులో పజాసి రాజాకు గాని, కూర్గు లో చిన్న వీర రాజాకు గాని భారతీయ సంస్థానాధీశుల నుంచి ఎటువంటి సహాయం అందక పోవడం విశేషం.

## మలబారు, కూర్గులో టిపు వైఫల్యాలకు కారణాలు

మలబారు, కూర్గు తిరుగుబాట్లు టిపు రాజకీయ జీవితంలో గొప్ప వైఫల్యాలు. ఈ రెండు ప్రాంతాలలో మొదట స్థానిక రాజకీయ అనైక్యత వలన హైదర్ అలీ జోక్యం వీలయింది. కాని తర్వాత హైదర్ అలీ, టిపులు ఈ ప్రాంతాలను ఆక్రమించి తమ రాజకీయ విస్తరణలో భాగంగా చూసారు. అంతే కాకుండా మలబారు సుగంధ ద్రవ్యాల వర్తకంలో, ఆ మలబారుకు వెళ్ళే మార్గంగా కూర్గు చాలా ప్రాముఖ్యత వహించడంతో హైదర్, టిపు ఈ రెండు ప్రాంతాలను తమ ఆధీనంలో ఉంచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించారు.

కాని మలబారీయులు, కూర్గీయులు దీనిని మైసూరు దురాక్రమణగా భావించారు. వీరు ఈ దురాక్రమణను అంగీకరించలేదు. ఈ రెండు ప్రాంతాలు పశ్చిమ కనుమలలో, దట్టమైన అడవులతో నిండివున్నాయి. దీనితో ఇక్కడ గెరిల్లా యుద్ధ పద్ధతులను అవలంబించి ఇక్కడి తిరుగుబాటు దార్లు మైసూరు సైన్యాలను ధీటుగా ఎదుర్కొనేవారు. వీరికి ఆంగ్లేయుల సహకారం ఎప్పుడూ ఉండేది. వీరికి ఈ ఆంగ్లేయుల సమర్థన టిపును మరింత ఆగ్రహానికి గురిచేసేది. అందుకే టిపు ఈ తిరుగుబాట్లను క్రూరంగా అణిచివేసే ప్రయత్నం చేసి, అత్యాచారాల, మత మార్పిడుల ఆరోపణలను ఎదుర్కొన్నాడు. అంతే కాకుండా రెండు ప్రాంతాలలో టిపు ఒకే సమయంలో తిరుగుబాట్లను ఎదుర్కోవలసి వచ్చేది. ఏది ఏమైనా టిపు రాజకీయంగా బలహీనపడి ఆంగ్లేయుల చేతిలో ఓటమి పొందడంలో మలబారు, కూర్గు తిరుగుబాట్ల పాత్ర నిరాకరించలేనిది.

## అధ్యాయం-12

# టిపు - మరాఠాలు -హైదరాబాద్ నిజామ్

మైసూరు - మరాఠా - హైదరాబాద్ రాజ్యాల సరిహద్దులు పరస్పరం కలిసి ఉండేవి. 18వ శతాబ్దంలోనే స్వతంత్రంగా అధికారాన్ని హస్తగతం చేసుకున్న మరాఠా పేష్వాలు (1713), నిజాం ఉల్ – ముల్క్ (1724), హైదర్ అలీ (1761) రాజ్య విస్తరణకు తరచూ పరస్పర కలహాలతో మునిగిపోయారు. పేష్వాలు, నిజాముల కంటే చాలా ఆలస్యంగా రంగం మీదకు వచ్చిన హైదర్ అలీ, తర్వాత టిపు సుల్తాన్ వారిద్దరికీ గట్టి పోటీగా నిల్చారు. కాని ఈ మూడు రాజ్యాల పరస్పర కలహాలు, రాజ్య విస్తరణ కాంక్షలో చివరకు లాభపడింది ఆంగ్లేయులు మాత్రమే. ఈ మూడు రాజ్యాలలో ఆంగ్లేయులు చతురతతో నడిపిన రాజకీయం భారతదేశ చరిత్రలో ఒక విషాద ఘట్టం. ఈ మూడు రాజ్యాల అధినేతలు కలిసి కట్టుగా ఆంగ్లేయులను ఎదిరించినా లేక మరాఠాలు, నిజామ్ టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులతో జతకట్టక పోయి ఉండినా భారతదేశ చరిత్ర భిన్నంగా ఉండేదేమో ననే చర్చ ఇప్పటికీ జరుగుతూనే ఉంది.

### మరాఠా పేష్వాలు - హైదర్ అలీ

శివాజి మనుమడైన ఛత్రపతి సాహు 1713లో తన పేష్వా ( ప్రధాన మంత్రి) అయిన బాలాజీ విశ్వనాథ్‌కు మరాఠా రాజ్య అధికారాన్ని ధారా దత్తం చేసి ఛత్రపతి అధికారాన్ని నామ మాత్రం చేసాడు. సాహు తీసుకున్న ఈ నిర్ణయం తప్పుకాదని నిరూపిస్తూ పేష్వాలు మరాఠా సామ్రాజ్యాన్ని నిర్మించారు. రెండవ, మూడవ పేష్వాలైన బాజీరావు (1720–40), బాలాజీ బాజీ రావు (1740–61) సమయంలో మరాఠా సామ్రాజ్యం ఆఫ్ఘనిస్థాన్ నుండి తంజావూరు వరకు, రాజస్థాన్ నుండి బెంగాల్ వరకు విస్తరించింది.

మరాఠా రాజ్యాన్ని దక్షిణం వైపు విస్తరింప చేయడానికి బాలాజీ బాజీరావు 1753, 54, 57లలో మైసూరును పాలిస్తున్న ఒడయారుల పై మూడుసార్లు దండయాత్ర చేసి వారిని ఓడించాడు. మైసూరు మరాఠా రాజ్యాల సరిహద్దుల్లో ఉన్న 13 తాలూకాలను, 36 లక్షల యుద్ధ పరిహారాన్ని మరాఠాలకు ఇచ్చి వారికి సామంతులుగా ఉండడానికి ఒడయార్లు మరాఠాలతో సంధి కుదుర్చుకున్నారు.

అప్పుడు మైసూరు రాజ్యంలో దిండిగల్ ఫౌజ్‌దార్‌గ ఉన్న హైదర్ అలీ ఈ సంధిని నిరసించాడు. 1758లో మరాఠాలు కప్పం కోసం మైసూరుపై ఇంకొకసారి దాడి చేసారు. ఈసారి హైదర్ అలీ ఆధ్వర్యంలో మైసూరు సైన్యాలు మరాఠాలను ఓడించాయి. మరాఠాలపై ఈ విజయం హైదర్ అలీకి గుర్తింపు తీసుకు రావడమే కాకుండా భవిష్యత్తులో అతను

మైసూరు పాలకుడు కావడానికి దోహదం చేసింది. మరాఠాలు కూడా హైదర్ అలీ ఎదుగుదలలోని ప్రమాదాన్ని గుర్తించి మైసూరులోని ఒక మరాఠా సైనికాధికారి ఖండేరావును ప్రోత్సహించి 1760లో హైదర్ అలీ పై హత్యా ప్రయత్నం చేయించారు. ఈ కుట్రలో ఒడయారుల రాణి లక్ష్మీ అమ్మణి కూడా భాగస్తురాలు. 1761లో హైదర్ అలీ మైసూర్ నవాబు అయిన తర్వాత మైసూరు, మరాఠాల మధ్య వివాదాలు అధిక మయ్యాయి. 1761లో మరాఠాలు మూడవ పానిపట్టు యుద్ధంలో ఆఫ్ఘన్ రాజు అహమద్ షా అబ్దాలి చేతిలో ఘోర పరాజయం పొందారు. హైదర్ అలీ మరాఠాల ఆధిపత్యాన్ని అంగీకరించడానికి, వారికి కప్పం చెల్లించడానికి నిరాకరించాడు.

కాని 1761లోనే పేష్వా పదవి చేపట్టిన మాధవరావు మూడవ పానిపట్టు యుద్ధంలో మరాఠాలు కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి పునరుద్ధరించాడు. ఉత్తర భారతదేశంలో మరాఠాలు కోల్పోయిన రాజ్యాలన్నింటినీ తిరిగి జయించాడు. 1758లో హైదర్ అలీ ఆక్రమంచిన ప్రాంతాలన్నిటినీ తిరిగి మరాఠాలకు ఇచ్చి వేయాలనీ, కప్పం బకాయిలను చెల్లించాలని హైదర్ పై ఒత్తిడి తెచ్చాడు. అందుకు హైదర్ అలీ నిరాకరించడంతో 1764 – 72 మధ్య పేష్వా మైసూరుపై మూడుసార్లు దాడి చేసాడు. ఈ యుద్ధాల్లో హైదర్ అలీ ఘోరంగా ఓడిపోయాడు. హైదర్ అలీ 1758లో ఆక్రమించిన కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న ప్రాంతాలను తిరిగి మరాఠాలకు అప్పగించవలసి వచ్చింది. 36 లక్షలు కప్పం బకాయిలను మరాఠాలకు చెల్లించడమే కాకుండా ప్రతి సంవత్సరం 14 లక్షల కప్పం చెల్లించడానికి అంగీకరించాడు.

కాని 1772లో పేష్వా మాధవరావు 27 సంవత్సరాల వయసులో మరణించడంతో మరాఠాలలో పేష్వా వారసత్వం కొరకు అంతఃకలహాలు ప్రారంభమయ్యాయి. ఈ అంతఃకలహాలు రెండు సంవత్సరాలు కొనసాగి 1774లో రెండవ మాధవ రావు పేష్వా అయ్యాడు. కాని ఇతను తన ఆర్థికమంత్రి నానా ఫడ్నవీస్ చేతిలో కీలుబొమ్మగా మారాడు. జేమ్స్ గ్రాంట్‌డఫ్ అనే ఆంగ్ల చరిత్రకారుడు నానా ఫడ్నవీస్‌ను 'మరాఠా మాకియవిల్లీ'గ అభివర్ణించాడు. ఇతని కాలంలోనే మరాఠాలకు ఆంగ్లేయులకు మధ్య మొదటి ఆంగ్లో – మరాఠా యుద్ధం (1775 – 1782) ప్రారంభమైంది.

మరాఠాల వారసత్వ యుద్ధాన్ని మొదటి ఆంగ్లో – మరాఠా యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని హైదర్ అలీ మరాఠాల పై దాడి చేసి కృష్ణా, తుంగభద్ర నదుల పరివాహక ప్రాంతం లోని ప్రాంతాలన్నింటినీ తిరిగి ఆక్రమించాడు. ఈ విజయాలలో టిపు ప్రముఖ పాత్ర నిర్వహించాడు. హైదర్ మరాఠాలకు కప్పం చెల్లించడానికి కూడా నిరాకరించాడు. మొదటి ఆంగ్లో – మరాఠా యుద్ధంలో వ్యస్తుడై ఉన్న నానా ఫడ్నవీస్ హైదర్‌ను నిలువరించలేక పోయాడు. అంతే కాదు 1780లో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా హైదర్‌తో

ఒప్పందం చేసుకున్నాడు. హైదర్ ఆక్రమించిన ప్రాంతాలు హైదర్‌కే చెందుతాయని, ఆంగ్లేయుల దాడి సందర్భంలో పరస్పరం సహకరించు కోవాలని హైదర్ మరాఠాలకు కప్పం చెల్లించవలసిన అవసరం లేదని ఈ సంధి సారాంశం. 1782లో మొదటి ఆంగ్లో – మరాఠా యుద్ధంలో మరాఠాలు ఆంగ్లేయులపై విజయం సాధించారు. దీనితో నానా ఫడ్నవీస్ 1780 లో హైదర్ అలీ చేసుకున్న సంధిని ఉల్లంఘిస్తూ మైసూరు మరాఠాలకు కప్పం చెల్లించాలని, కృష్ణా – తుంగభద్ర నదుల మధ్య ప్రాంతాలను హైదర్ మరాఠాలకు తిరిగి ఇవ్వాలని హైదర్ పై ఒత్తిడి చేసాడు. డిసెంబర్ 1782లో హైదర్ అలీ మరణించాడు.

అప్పుడు రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో వ్యస్తుడై ఉన్న టిపు నానాను కొంత సమయం కోరాడు. రెండవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో ఆంగ్లేయులపై టిపు విజయం సాధించడంతో నానా టిపు ఆధిపత్యాన్ని నిలువరించడానికి నిర్ణయించుకుని టిపుపై తన డిమాండ్లకు సంబంధించి ఒత్తిడి పెంచాడు. కాని టిపు మరాఠాలతో యుద్ధానికి సిద్ధంగా లేడు. అప్పటికే టిపు భారతదేశంలో ఆంగ్లేయుల ప్రమాదాన్ని అర్థం చేసుకున్నాడు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఇతర భారతీయ సంస్థానాధీశులను తనతో కలపుకు పోవాలనే ఆలోచనలో ఉన్నాడు. కాని టిపు తన తండ్రి యుద్ధంలో సాధించుకున్న ప్రాంతాలను మరాఠాలకు ఇవ్వడానికి సిద్ధంగా లేడు. కాని కప్పాన్ని బకాయిలతో సహా మరాఠాలకు చెల్లించడానికి అంగీకరించాడు. నానాను అందుకు కొంత సమయాన్ని కోరాడు. ఈ అంశాలకు సంబంధించి సామరస్య పూర్వక చర్చల కొరకు తన రాయబారులను నానా ఫడ్నవీస్ వద్దకు పూనా పంపించాడు.

కాని నానా ఫడ్నవీస్, నిజామ్, టిపు ఎదుగుదలను అడ్డుకోవడానికే నిర్ణయించుకున్నారు. అప్పటికే మైసూరుతో సరిహద్దు తగాదాలు ఉన్న హైదరాబాద్ నిజామ్‌ను టిపుకు వ్యతిరేకంగా తనకు సహకరించమని ఆహ్వానించాడు. విశేషమేమంటే 1724లో నిజామ్ రాజ్య స్థాపన నుండి మరాఠాలకు – నిజామ్‌లకు ఎడతెరిపిలేని యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. సరిహద్దు తగాదాలు ఉన్నాయి. 1776లో హైదర్ అలీ నిజామ్‌కు చెందిన కడప, కర్నూలు ప్రాంతాలను ఆక్రమించాడు. నిజామ్‌కు తిరిగి వాటిని పొందాలనే ఆశ ఉండేది. దీనితో నిజామ్ నానా ఆహ్వానాన్ని అంగీకరించాడు. రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో టిపు చేతిలో పరాజయం పొందిన ఆంగ్లేయులను కూడా నానా ఫడ్నవీస్ తమతో కలవాలని ఆహ్వానించాడు కాని, ఆంగ్లేయులు అందుకు నిరాకరించారు.

1784, 85లలో నానా ఫడ్నవీస్, హైదరాబాదు నిజామ్ అలీఖాన్ మరాఠా హైదరాబాద్ సరిహద్దులలోని ఉద్గీర్ అనే ప్రదేశంలో సమావేశమై టిపు పై దండయాత్రకు వ్యూహాలు రచించారు. ఇంకో వైపు నానా టిపు రాయబారులతో చర్చలు కొనసాగిస్తూనే ఉన్నాడు. టిపును ఓడించి హైదర్ అలీ ఆక్రమించిన తమ తమ ప్రాంతాలను తిరిగి

తీసుకోవడమే కాకుండా మైసూరు రాజ్యాన్ని తమ సరిహద్దుల కనుగుణంగా పంచుకోవాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. యుద్ధం ప్రముఖంగా మరాఠాలకు మైసూరుకు మధ్యే జరుగుతుంది. నిజామ్ తన వంతుగా ఏభై వేల అశ్విక పదాతి దళాలను సమకూర్చడానికి అంగీకరించాడు.

**మరాఠా - మైసూరు యుద్ధాలు (1785-87)**

యుద్ధ నివారణకు టిపు చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. మరాఠాలు, నిజామ్ తనకు వ్యతిరేకంగా యుద్ధానికి సన్నద్ధమవుతున్నారని తెలుసుకున్న టిపు వారి కంటే ముందు తనే యుద్ధాన్ని ప్రారంభించాడు. రెండు సంవత్సరాల పాటు మరాఠా - హైదరాబాద్ సంకీర్ణ సైన్యాలకు మైసూరు సైన్యాలకు మధ్య ఆరు యుద్ధాలు జరిగాయి.

**1. నార్‌గుండు యుద్ధం :** నార్‌గుండు సంస్థానం మైసూరుకు ఉత్తరంగా మరాఠా సరిహద్దుల్లో ఉంది. ఒకప్పుడు ఈ సంస్థానం మరాఠాల ఆధీనంలో ఉండేది. మైసూరు ఆక్రమణ తర్వాత అక్కడి సంస్థానాధీశుడు వెంకటరావు భవే, అతని మంత్రి కాలోపంత్ పెధె మైసూరుకు వ్యతిరేకంగా మరాఠాలతో మంతనాలు జరుపుతూ ఉండేవారు. వీరేకాదు కిట్టూరు, మదన పల్లె పాలకులు, సావనూరు నవాబు కూడా టిపుకు వ్యతిరేకంగా మరాఠాలతో సంప్రదింపులు జరుపుతూ ఉండేవారు. మైసూరుకు వీరు చెల్లించవలసిన కప్పం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు.

నార్‌గుండు పాలకుండ వెంకటరావు బవేకు పూనాలోని మరాఠా పాలకులతో బంధుత్వం కూడా ఉండేది. మరాఠాల అండదండలు చూసుకుని భవే టిపును బాహాటంగా వ్యతిరేకించేవాడు. కాని టిపు ఈ వ్యతిరేకతను అంతగా పట్టించుకోలేదు. కాని మరాఠాలు–నిజామ్ కలిసి తనపై దాడికి సన్నాహాలు చేస్తున్నారని తెలుసుకున్న తర్వాత తనకు చెల్లించవలసిన కప్పం బకాయిలు చెల్లించవలసినదిగా టిపు భవేను అడిగాడు. అందుకు భవే నిరాకరించడంతో మరాఠాలకు హెచ్చరికగా టిపు జనవరి 1785లో నార్‌గుండు పై దాడి చేసి మరాఠాలతో యుద్ధాన్ని తనే ప్రారంభించాడు. భవే చెల్లించవలసిన కప్పం కొంత తగ్గించాలని నానా టిపును కోరాడు. అందుకు టిపు నిరాకరించాడు. ఏడు నెలల సుదీర్ఘ పోరాటం తర్వాత మైసూరు సైన్యాలు జూలై 1785లో నార్‌గుండు కోటను ఆక్రమించాయి. భవే ఆశించినట్టు అతనికి మరాఠా సైనిక సహాయం సమయానికి అందలేదు.

**2. బాదామి యుద్ధం :** నార్‌గుండు ఆక్రమణకు జవాబుగా మరాఠాలు బాదామి కోటపై 1786లో దాడి చేసారు. అక్కడి ఖిలేదార్ (దుర్గాధిపతి) హైదర్ బక్ష్ మరాఠా సైన్యాలను ధీటుగా ఎదుర్కొన్నా, మరాఠా సైన్యాలు 20,000లకు మించి ఉండడం,

మైసూరు నుండి అదనపు సైన్యాలు రాకపోవడంతో ఓడిపోయాడు. బాదామి కోటను మరాఠాలు స్వాధీనం చేసుకున్నారు.

**3. టిపు ఆదోని ఆక్రమణ:** మరాఠాలు తమ యుద్ధాన్ని మైసూరు మరాఠా సరిహద్దులకే పరిమితం చేసారు. కోల్పోయిన బాదామి కోటను తిరిగి స్వాధీనపరచు కోవడానికి టిపు బాదామి పై దాడి చేస్తాడని వారు ఎదురు చూసారు. కాని వారు ఊహించని విధంగా టిపు స్వయంగా నిజామ్ రాజ్యంలోని ఆదోని కోటపై దాడి చేసాడు. ఆ కోట నిజామ్ అలీఖాన్ అన్న కుమారుడు మహాబత్ జంగ్ ఆధీనంలో ఉంది. ఊహించని ఈ దాడిని ఇతడు ఎదుర్కోలేక పోయాడు. మరాఠాలతో కలిసి పోరాడుతున్న నిజాం సైన్యాలు వెంటనే మహబత్ జంగ్ సహాయానికి రాలేకపోయాయి. నిజామ్, మైసూరు రాజ్య సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రముఖమైన కోటను టిపు సునాయాసంగా ఆక్రమించాడు.

**4. గజేంద్ర గడ యుద్ధం :** టిపు ఆదోని ఆక్రమణకు జవాబుగ మరాఠాలు తమ సరిహద్దుల్లో ఉన్న గజేంద్ర గడ కోటను ఆక్రమించారు. ఇది పశ్చిమ కనుమల్లో ఉన్న అతి వ్యూహాత్మకమైన కోట.

**5. సావనూరు ఆక్రమణ :** సావనూరు మైసూరు ఉత్తర పశ్చిమంగా ఉన్న స్వతంత్ర రాజ్యం. కాని 1776లో హైదర్ అలీ ఇక్కడి నవాబు అబ్దుల్ హకీమ్ ఖాన్‌ను ఓడించి తన సామంతుడిగా చేసుకున్నాడు. అంతేకాదు పఠాన్ వంశానికి చెందిన అబ్దుల్ హకీమ్ కుమార్తెను తన కుమారుడు కరీమ్ సాహిబ్‌కు, అలాగే అబ్దుల్ హకీమ్ కుమారుడు అబ్దుల్ కరీమ్‌ను తన కుమార్తెకు ఇచ్చి వివాహం చేసాడు. పఠాన్ వంశానికి చెందిన అబ్దుల్ హకీమ్‌కు తమకంటే తక్కువ వంశానికి చెందిన హైదర్ అలీతో వివాహ సంబంధాలు ఇష్టంలేదు. కాని ఓడిపోయిన నవాబుగా హైదర్ అలీకి తలవంచక తప్పలేదు. దీనితో మరాఠాలతో సఖ్యత పెంచుకున్నాడు. మరాఠాలు నవాబును మైసూరుకు కప్పం చెల్లించ వద్దని ప్రోత్సహించారు. 1786 వేసవిలో మరాఠాలు నవాబు సహాయంతో సావనూరు కోటను ఆక్రమించారు. టిపు ఆదోని నుండి నేరుగా సెప్టెంబర్ 1786లో సావనూరు పై దాడి చేసాడు. మరాఠాలకు టిపుకు ఒకనెల పాటు జరిగిన హోరాహోరీ యుద్ధం తర్వాత అక్టోబర్ 1,1786న టిపు మరాఠాల నుండి సావనూరు కోటను తిరిగి ఆక్రమించుకున్నాడు.

**6. బహదూర్ బెండ యుద్ధం:** మైసూరు రాజ్యం లోని బహదూర్ బెండ కోటను మరాఠాలు ఆక్రమించారు. సావనూర్‌ను ఆక్రమించిన ఎనిమిది రోజుల లోనే టిపు తుంగభద్ర నది వద్ద ఉన్న ఈ బలమైన కోటను మరాఠాల నుండి తిరిగి ఆక్రమించాడు. అప్పటికి రెండు సంవత్సరాల నుండి జరుగుతున్న యుద్ధాన్ని ముగించడానికి ఇరు పక్షాలు సిద్ధపడ్డాయి. ఆరు యుద్ధాలలో నాలుగు యుద్ధాలు గెలిచి విజేతగా నిలిచిన టిపు కూడా

యుద్ధ విరమణకు తొందరపడ్డాడు. ఎందుకంటే కార్న్‌వాలిస్ మైసూరు పై యుద్ధ సన్నాహాలు చేస్తున్నాడనే వార్తలు టిపుకు అందుతున్నాయి. యుద్ధం మధ్యలో కూడా టిపు నానా సాహెబ్ వద్దకు, నిజామ్ వద్దకు రాయబారాలు పంపి యుద్ధ విరమణకు ప్రయత్నాలు చేసాడు. కాని ఆంగ్లేయుల నుండి సహాయాన్ని ఆశించిన మరాఠాలు, నిజామ్ టిపు సంధి ప్రతిపాదనలకు అంగీకరించకుండా యుద్ధాన్ని కొనసాగించారు. కాని ఆంగ్లేయుల సాయం అందక పోవడంతో వరుస పరాజయాలతో మరాఠాలు, నిజామ్ యుద్ధ విరమణకు అంగీకరించారు.

**గజేంద్రగడ సంధి, నవంబర్ 1787 :** ఈ యుద్ధంలో టిపు విజేత అయినా సంధి ఒప్పందాలతో మరాఠాలు విజేతలయ్యారు. మరాఠాల కోరిక మేరకు టిపు తను జయించిన కిట్టూరు, నార్‌గుండులను తిరిగి ఆ సంస్థానాధీశులకు ఇచ్చేసాడు. నిజామ్ నుండి జయించిన ఆదోని, రాయ్‌చూర్ కోటలను తిరిగి నిజామ్‌కు ఇచ్చేసాడు. కాని మరాఠాలు మైసూరు నుండి జయించిన బాదామి, గజేంద్ర గడ, ధార్వార్ కోటలను తిరిగి అడగలేదు. మరాఠాలకు 46 లక్షల కప్పం రెండు విడతలలో చెల్లించడానికి, ప్రతి సంవత్సరం వారికి 12 లక్షల కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. మరాఠా సైనికాధికారులైన హరిపంత్ భవే, గంగాధర్ రాస్తే, ఇందోర్ మరాఠా సంస్థానాధీశుడైన తుక్కోజీ హూల్కార్‌కు ఏనుగులు బహుకరించాడు. తుక్కోజీకి అదనంగా 14 లక్షల నగదు, రెండు లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు బహుకరించాడు. ఈ మొత్తం ఒప్పందంలో టిపుకు అనుకూలమైన అంశం కృష్ణా – తుంగభద్ర నదుల మధ్య హైదర్ అలీ ఆక్రమించిన ప్రాంతాలను టిపు ఆధీనంలోనే ఉండడానికి మరాఠాలు అంగీకరించడం. ఒప్పందం చేసుకోవడంలో టిపు, మరాఠాల నిజామ్ స్నేహాన్ని కోరుతున్నట్లు స్పష్టమవుతుంది. వారు ఆంగ్లేయులతో జత కట్టరనే ఆశ టిపు ఓడిపోయిన మరాఠా – నిజామ్‌లకు లాభం కలిగించిన ఈ సంధిని అంగీకరించాడు. ఈ సంధిలో ఉన్న ఒక నిబంధన ప్రకారం ఆంగ్లేయుల దాడి సందర్భంలో మైసూరు – మరాఠాలు – నిజామ్ పరస్పర సహకారం చేసుకోవాలి. కాని నానా సాహెబ్, నిజామ్ గజేంద్రగడ సంధి నిబంధనలను ఉల్లంఘించి మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో ఆంగ్లేయులతో కూటమిగా ఏర్పడి టిపు ఓటమికి కారణమయ్యారు. తద్వారా టిపు పతనానికి కారణమయ్యారు.

నాల్గవ ఆంగ్లో మైసూరు యుద్ధంలో నిజామ్ ఆంగ్లేయులతో సహకరించి, నానా ఫడ్నవీస్ తటస్థంగా ఉండి టిపు ఓటమికి, మరణానికి కారణమయ్యారు. కాని టిపు మరణ వార్త విని నానా ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలు చూస్తే ఆలస్యంగానైనా అతను వాస్తవాన్ని తెలుసుకున్నాడనిపిస్తుంది. "టిపు మరణించారు. బ్రిటిష్ వారి శక్తి పెరిగింది. తూర్పు ఇండియా అంతా ఇప్పటికే వారి ఆధీనంలో ఉంది. పూనా వారి తర్వాత గురి, ముందు

ముందు వచ్చేవి చెడ్డదినాలు తలరాతను తప్పించలేము"  ఫడ్నవీస్ ఊహించినట్టుగానే టిపు మరణించిన (1799) పందొమ్మిది సంవత్సరాలకు మూడవ ఆంగ్లో మరాఠా యుద్ధం (1817 – 1818) లో మరాఠాలు ఆంగ్లేయుల చేతిలో కోరేగావ్ యుద్ధంలో ఓడిపోయి రాజ్యాన్ని పోగొట్టుకున్నారు. పేష్వా, ఆంగ్లేయుల పింఛను దారుడిగా ఉత్తర ప్రదేశ్‌లోని బితూరుకు పంపబడ్డాడు.

**టిపు హైదరాబాద్ నిజామ్ :**

హైదర్ అలీ (1761–1782), టిపు సుల్తాన్ (1782 – 1799) ఇద్దరి పరిపాలన కాలంలో హైదరాబాద్‌లో ఆసఫ్ జాహి వంశంలో రెండవ నిజామైన నిజామ్ అలీఖాన్ ఆసఫ్‌జా (1762 –1803) పాలించాడు. హైదర్, టిపుల ఎదుగుదలను చూసాడు, టిపు పతనంలో భాగస్తుడయ్యాడు. హైదరాబాదు నిజామ్‌లు, మరాఠాలు ముందు నుంచి బద్ధశత్రువులు. కాని తన పశ్చిమ సరిహద్దులోని మైసూరు రాజ్యంలో హైదర్ అలీ విజృంభణ నిజామ్ ను కలవర పరిచింది. ఆంగ్లేయులు, మరాఠాలు, మైసూరు ఈ మూడు శక్తుల నుండి హైదరాబాద్‌ను కాపాడుకోవడానికి, కొన్నిసార్లు లాభపడడానికి నిజామ్ ఈ ముగ్గురితో ఒప్పందాలు చేసుకోవడం, తరచూ వాటిని ఉల్లంఘించడం చేస్తూ ఉండేవాడు. మొదటి ఆంగ్లో మైసూరు యుద్ధంలో నిజామ్ ఆంగ్లేయులతో చేరకుండా హైదర్ అలీ 17 ఏళ్ళ టిపును ఆగష్టు 1767లో హైదరాబాద్‌కు దౌత్యానికి పంపించాడు. బాలుడైన టిపు తన కానుకలు, తెలివితేటలతో నిజామ్‌తో మైసూరుకు అనుకూలంగా ఒక ఒప్పందం చేసుకున్నాడు. కాని ఫిబ్రవరి 1768లో అంటే ఆరు నెలలకే నిజామ్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ 1768లో ఆంగ్లేయులతో ఒప్పందం చేసుకుని హైదర్‌కు వ్యతిరేకంగా వారికి సైన్య సహకారం అందించాడు. నిజామ్ ఆంగ్ల స్నేహాన్ని వ్యతిరేకించిన హైదర్ 1776 నిజామ్ రాజ్యంపై దాడి చేసి కడప, కర్నూలును ఆక్రమించాడు. ఆంగ్లేయులు తనపై దాడి చేస్తారన్న భయంతో నిజామ్ 1780లో హైదర్ అలీ, మరాఠాలతో త్రైపాక్షిక సంధి చేసుకున్నాడు. వెంటనే తిరిగి ఆంగ్లేయులతో సంధి చేసుకున్నాడు.

రెండవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో టిపు ఘన విజయంతో భయపడిన నిజామ్ మరాఠాలతో 1785 టిపుకు వ్యతిరేకంగా ఒప్పందం చేసుకుని మైసూరు మరాఠా యుద్ధంలో మరాఠాలకు సైన్య సహకారాన్ని అందించాడు.

నిజామ్ మూడవ ఆంగ్లో – మైసూరు యుద్ధంలో కార్న్‌వాలిస్‌కు పూర్తి సహకారం అందించి టిపు ఓటమి తర్వాత శ్రీరంగపట్టణం సంధి ఒప్పందంలో భాగంగా అంతకు ముందు పోగొట్టుకున్న కడప, కర్నూలునే కాకుండా అదనంగా మైసూరుకు చెందిన కంభం, గంజికోటలను కూడా పొందాడు. ఒక్క రెండో ఆంగ్లో మైసూరు యుద్ధంలో తప్ప నిజామ్ మిగిలిన ఆంగ్లో – మైసూరు యుద్ధాల్లో టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులకు సహాయం చేసాడు.

హైదరాబాద్ నిజామ్‌కు హైదర్ అలీ, టిపు తమ ఆసఫ్‌జా వంశం కంటె తక్కువ వంశం వారని చిన్న చూపు ఉండేది హైదర్ అలీ తన కుమారులకు, నిజామ్ కుటుంబంతో వివాహ సంబంధాన్ని ప్రస్తావించినప్పుడు నిజామ్ నిరాకరించాడు. అంతేకాదు టిపు తనను – మైసూరు పాలకునిగా గుర్తించాలని మొగలు చక్రవర్తిని కోరినప్పుడు హైదరాబాద్ నిజామ్ మొగలు దర్బారులో తనకున్న పలుకుబడిన ఉపయోగించి టిపుకు ఆ గుర్తింపు దక్కకుండా చేసాడు. టిపు టర్కీలోని ఖలీఫా వద్దనుండి తన గుర్తింపు పత్రాన్ని తెచ్చుకున్నాడు.

1795లో ఖార్దా యుద్ధంలో నానా ఫడ్నవీస్ నిజామ్‌ను ఓడించి అతని వద్దనుండి దౌలతాబాద్, ఔరంగాబాద్, షోలాపూర్‌లను స్వాధీనం చేసుకున్నాడు. వీటితోపాటు నిజామ్ మరాఠాలకు మూడ కోట్లు యుద్ధ నష్టపరిహారం చెల్లించాడు.

నిజామ్ మరాఠా, మైసూరు రాజ్యాల నుండి తన రక్షణకు ఆంగ్లేయులను ఎక్కువగా నమ్మాడు. 1795 ఖర్దా యుద్ధ ఓటమితో నిజామ్ ఆంగ్లేయులతో 1798లో సైన్య సహకార ఒప్పందం చేసుకున్నాడు. భారతీయ సంస్థానాధీశులను తమ చేతిలో కీలుబొమ్మలుగా సామంతులుగా చేసుకోవడానికి ఆంగ్లేయులకు అవకాశమిచ్చే ఈ ఒప్పందాన్ని అంగీకరించిన మొదటి భారతీయ సంస్థానాధీశుడు హైదరాబాద్ నిజామ్. ఈ ఒప్పందాన్ని ఆంగ్లేయులతో చేసుకోవడానికి నిరాకరించి టిపు తన ప్రాణాన్ని కోల్పోయాడు. ఈ ఒప్పందంతో ఇంచుమించు బ్రిటన్ దేశమంత వైశాల్యం కలిగిన హైదరాబాద్ సంస్థానం ఒక వ్యాపార సంస్థ అయిన తూర్పు ఇండియా కంపెనీకి సామంత రాజ్యం అయ్యింది. తన రాజ్యంలోని ఆంగ్ల సైన్యం ఖర్చుల నిమిత్తం నిజామ్ ప్రస్తుతము ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, కోస్తా ఆంధ్రా ప్రాంతాలను బ్రిటిష్ వారికి ధారాదత్తం చేసాడు. మరాఠా, మైసూరు రాజ్యాలను ఆక్రమించుకున్నట్లు ఆంగ్లేయులు హైదరాబాదు సంస్థానాన్ని పూర్తిగా ఎన్నడూ ఆక్రమించలేదు. ఆంగ్లేయులు భారతదేశాన్ని 1947లో వదిలి వెళ్ళేవరకు హైదరాబాద్ సంస్థానం ఆంగ్లేయుల సామంత రాజ్యంగానే ఉంది.

## అధ్యాయం-13

# టిపు విదేశీ రాయబారాలు

1784 లో రెండవ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో ఆంగ్లేయులపై విజయం సాధించినప్పటికీ భవిష్యత్తులో భారతదేశంలో ఆంగ్లేయుల ప్రమాదాన్ని టిపు తక్కువగా అంచనా వేయలేదు. భారతదేశంలోని ఇతర రాజులైన మరాఠాలు, నిజాం వంటి వారు ఆంగ్లేయుల రాజ్య విస్తరణ పథకాలను గ్రహించక తనకు వ్యతిరేకంగా ఆంగ్లేయులతో సహకరించడంతో టిపు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా విదేశీ సహకారాన్ని ఆశించవలసి వచ్చింది. అప్పుడు బ్రిటిష్ వారు, ఇప్పుడు కొన్ని రాజకీయ శక్తులు ఆరోపిస్తున్నట్లు టిపు విదేశీయులను భారతదేశం పై దాడికి ఆహ్వానించలేదు. ఆంగ్లేయుల నుండి తన రాజ్యాన్ని రక్షించు కోవడానికి విదేశీ సహాయాన్ని కోరాడు. టిపు విదేశాలకు పంపిన రాయబారాలను విశ్లేషిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది.

1787, 1798లో ఫ్రాన్స్‌కు రెండుసార్లు, 1786, 1798లో టర్కీకి రెండుసార్లు, 1797లో మారిషస్‌కు, 1798లో పర్షియా (ప్రస్తుత ఇరాన్) కు టిపు విదేశాలకు మొత్తం ఆరు రాయబారాలను పంపించాడు. సమకాలీన భారతీయ రాజులెవ్వరూ విదేశాలకు ఇన్ని రాయబారాలు పంపించలేదు. 1798లో రిచర్డ్ వెల్లస్లీ నాల్గవ ఆంగ్లో మైసూర్ యుద్ధానికి సన్నాహాలు చేస్తున్నాడని తెలుసుకున్న టిపు ఆ సంవత్సరంలోనే ఫ్రాన్స్, టర్కీ, పర్షియాలకు సైనిక సహాయం కొరకు మూడు రాయబారాలను పంపించడాన్ని గమనించాలి.

టిపు ఫ్రాన్స్, మారిషస్ కు పంపించిన రాయబారుల వివరాలు 7వ అధ్యాయంలో చూడవచ్చు. టిపు టర్కీ, పర్షియాకు పంపించిన రాయబారుల వివరాలు తెలుసుకుందాము.

### టర్కీకి మొదటి రాయబారం, 1786

ఒట్టోమన్ చక్రవర్తిగా పిలువబడే టర్కీ పాలకుడు ఆసియా ఐరోపాల్లో విస్తరించి ఉన్న విస్తృతమైన సామ్రాజ్యానికి అధిపతి. అంతేకాదు ప్రపంచం లోని ఇస్లాం రాజ్యాలన్నిటికీ ఖలీఫా అనగా ఇస్లాం మతాధిపతి. టర్కీ రాజధాని కాన్ స్టాంటినోపుల్ ప్రస్తుతం ఇస్తాంబుల్‌గా పిలువ బడుతున్నది. ఆంగ్ల చరిత్రకారులు టిపు టర్కీ రాయబారాన్ని ఎంబసీ టు కాన్ స్టాంటినోపుల్ గా వర్ణించారు.

ముఖ్యంగా మూడు ఉద్దేశాలతో టిపు టర్కీకి రాయబారాన్ని పంపించాడు. 1. భారతదేశంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా టిపు చేస్తున్న పోరాటానికి మద్దతుగా టర్కీ సైనిక సహాయం 2. టర్కీతో పరస్పర వర్తక వ్యాపారాల అభివృద్ధి 3. ఖలీఫా నుండి

మైసూర్ నవాబుగా తన అధికార గుర్తింపు పత్రాన్ని పొందడం (18వ శతాబ్దంలో భారతీయ సంస్థానాధీశులు మొగలు చక్రవర్తి నుండి విధిగా గుర్తింపు పత్రాన్ని పొందాలి. హైదర్ అలీ, టిపు ఆ గుర్తింపు పత్రాన్ని పొందకుండా హైదరాబాద్ నిజామ్ మొగలు దర్బారులో తన పలుకుబడిని ఉపయోగించి అడ్డుపడ్డాడు. దీనితో టిపు మొగలు చక్రవర్తి కంటే ఉన్నతుడైన ఖలీఫా నుండి గుర్తింపు పత్రం పొందాడు.)

టర్కీకి మొదటి రాయబారం గులాం అలీ ఖాన్ నాయకత్వంలో మార్చ్ 9, 1786న కేరళ లోని తాద్రి రేవు పట్టణం నుండి బయలు దేరింది. ఫక్రుల్ మరాకీ, ఫత్, ఇషాహి ముయాజి, నబీ బక్షి అనే నాలుగు ఓడలలో 900 మంది సిబ్బందితో ప్రయాణం ప్రారంభమయ్యింది. వీరిలో అధికారులు, సైనికులు, అనువాదకులు, వంటవాళ్లు, పని వాళ్లు ఉన్నారు. సందర్శించే దేశాధిపతులకు బహుమతులతో పాటు ఓడలు రేవు పట్టణాల్లో ఆగినప్పుడు వ్యాపారం కొరకు సుగంధ ద్రవ్యాలు, గంధపు చెక్క, ఆభరణాలు, వస్త్రాలు, బియ్యం ఓడలలో నింపారు. దేశాధిపతులకు, రేవు పట్టణాల అధిపతులకు టిపు లేఖలు పంపించాడు.

మొదట ఈ రాయబారం టర్కీ నుండి ఫ్రాన్స్‌కు, అక్కడ నుండి ఇంగ్లాండ్‌కు వెళ్లాలని నిర్ణయించ బడింది. కానీ పరిస్థితులు అనుకూలించక పోవడంతో టర్కీ నుండి వెనుదిరిగింది. మూడు దేశాల రాజులకు బహూకరించడానికి మూడు ఏనుగులు, ప్రయాణం మధ్యలో ఖర్చుల కోసం అమ్ముకోవడానికి ఒక ఏనుగు మొత్తం నాలుగు ఏనుగులను ఓడలకు ఎక్కించారు.

ఏప్రిల్ 8, 1786న ఓడలు మస్కట్ రేవు చేరుకున్నాయి. మస్కట్ గవర్నర్ మైసూర్ రాయబారులను సాదరంగా ఆహ్వానించాడు. ఒమన్ ఇమామ్ (రాజు) భారత దేశంలో ఆంగ్లేయుల గురించి వారిని అడిగి తెలుసుకున్నాడు. మైసూరియన్లు అక్కడ కొంత వ్యాపారం చేసుకున్నారు.

రెండు నెలల తర్వాత జూన్ 25, 1786న ఓడలు మస్కట్ వదలి బుషైర్ చేరుకున్నాయి. మధ్యలో కొన్ని రేవులలో ఆగి వ్యాపారం చేసుకున్నారు. బుషైర్ గవర్నర్ మంగుళూర్ రేవులో తమ వర్తక కేంద్రం ఏర్పాటు చేసుకోవడానికి గల అవకాశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నాడు. బదులుగా టిపు బుషైర్లో వర్తక కేంద్రాన్ని ప్రారంభించడానికి అనుమతినిచ్చాడు. తర్వాత ఓడలు బస్రా రేవు పట్టణానికి బయలుదేరాయి. బస్రాను సమీపిస్తుండగా ఆగస్టు 18, 1786న నబీ బక్షి ఓడ అగ్ని ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమయ్యింది. 50 మంది సిబ్బంది మరణించగా కొందరు ప్రాణాలతో తప్పించుకున్నారు. మిగిలిన ఓడలు బస్రా అధికారుల సాయంతో ఆగస్టు 22న, బస్రా క్షేమంగా చేరుకున్నాయి. బస్రా ఇరాక్‌లోని ప్రసిద్ధ రేవు పట్టణం. రేవు నుండి రాయబారులు బస్రా అధికారులకు టిపు లేఖను పంపించారు. అక్టోబర్ 25, 1786న బాగ్దాద్ వెళ్లడానికి బస్రా అధికారులు వారికి అనుమతినిచ్చారు. కానీ వారికి

పడవలను, ఇతర ప్రయాణ రక్షణలను సమకూర్చడంలో ఆలస్యం కావడంతో రాయబారులు డిసెంబర్ 7, 1786న బస్రా నుండి బాగ్దాద్ బయలు దేరారు. బస్రాలో వారు కొంత వ్యాపారం చేసినప్పటికీ బస్రా రేవు ఖ్యాతికి తగినట్టు వారికి ఆశించినంత లాభాలు కలగలేదు.

అప్పుడు ఇరాక్, టర్కీ సుల్తాన్ ఆక్రమణలో ఉండడంతో ఇరాక్‌లో తిరుగుబాట్లు, అంతర్యుద్ధాలు జరుగుతున్నాయి. అటువంటి అనిశ్చిత పరిస్థితులలో రాయబారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. తిరుగుబాటుదార్లు, సముద్రపు దొంగలు తరచూ ఓడలపై దాడి చేసేవారు. చివరకు కాన్ స్టాంటినోపుల్ నుండి టర్కీ సుల్తాన్ మైసూరు ఓడలకు రక్షణ కల్పించాలని ఆదేశించడంతో టర్కీ సైన్యాల రక్షణ మధ్య మైసూరు రాయబారులు ఏప్రిల్ 25, 1787 లో బాగ్దాద్ చేరుకోగలిగారు. బాగ్దాద్‌లో ఉన్నప్పుడు వారు ముస్లిం పుణ్య క్షేత్రాలైన నజాఫ్, కర్బలాలను దర్శించారు. మే 29,1787న వారు కాన్ స్టాంటినోపుల్ కు బయలు దేరారు. సెప్టెంబర్ 25,1787న వారు తమ గమ్యమైన కాన్ స్టాంటినోపుల్ చేరుకున్నారు. అక్కడ వారికి సాదర ఆహ్వానం లభించింది. నగర భవంతిలో వారికి బస ఏర్పాటయ్యింది, అక్టోబర్ 1, కాన్ స్టాంటినోపుల్ గ్రాండ్ వజీర్ (మేయర్ వంటి అధికారి) వారి గౌరవార్థం ఘనంగా విందు ఏర్పాటు చేశాడు. మైసూర్ రాయబారులు ఆయనను 70000 వెనీషియన్ బంగారు నాణాలు, బంగారు ఆభరణాలు, ఖరీదైన వస్త్రాలతో సత్కరించారు. తర్వాత టర్కీ, మైసూరు సైనికులు కలసి కవాతు నిర్వహించారు. ఈ వేడుకలలో టర్కీ సుల్తాన్ మొదటి అబ్దుల్ హమీద్ మారువేషంలో రహస్యంగా పాల్గొన్నాడు.

నవంబర్ 5, టర్కీ సుల్తాన్ జంతువుల ఊలు (fur) తో చేసిన దుస్తులను మైసూరు రాయబారులకు స్వయంగా బహుకరించాడు. కానీ అప్పుడు కాన్ స్టాంటినోపుల్‌లో ప్లేగు వ్యాధి ప్రబలడంతో మైసూర్ ఓడల్లోని అనేక మంది సిబ్బంది మరణించారు. కాన్ స్టాంటినోపుల్ చేరేటప్పటికే మైసూరు నుండి బయలు దేరిన 900 మంది సిబ్బందిలో 400 మంది మాత్రమే మిగిలారు. వారిలో 330 మంది ప్లేగు వ్యాధితో మరణించడంతో కేవలం 70 మంది మాత్రమే మిగిలారు. రాయబారుల్లో ఒకరైన గులాం అలీ కూడా అనారోగ్యానికి గురి కావడంతో టర్కీ అధికారులు మైసూరియన్లను స్కూతారి అనే సముద్ర తీర ప్రాంతానికి తరలించారు.

టర్కీ నుండి మైసూరు దౌత్య బృందం ఫ్రాన్స్ వెళ్లవలసి ఉంది. వారు కాన్ స్టాంటినోపుల్ లోని ఫ్రెంచ్ రాయబారిని అందుకు ఏర్పాట్లు చెయ్యమని కోరారు. కానీ జూలై, 1787 లో ఒక మైసూరు దౌత్య బృందం పాండిచ్చేరి నుండి బయలు దేరి ఫ్రాన్స్ చేరుకుని అక్కడ 5 నెలల నుండి మకాం వేసి ఉంది. టర్కీ లోని ఫ్రెంచ్ రాయబారి వారికి ఆ విషయాన్ని తెలియచేసాడు. టిపు కూడా వారిని వెనక్కి వచ్చేయ వలసిందిగా ఆదేశాలు పంపించాడు.

మార్చి 4, 1789లో మైసూరు దౌత్య బృందం టర్కీ సుల్తాన్ నుండి వీడ్కోలు తీసుకున్నారు. మార్చి నెలాఖరులో వారు సముద్ర మార్గం ద్వారా ఈజిప్ట్‌లోని అలెక్సాండ్రియా చేరుకున్నారు. అలెక్సాండ్రియా నుండి నైలు నదిలో ప్రయాణించి వారు జెడ్డా చేరుకున్నారు. టిపు ఆదేశానుసారం ముస్లింల పవిత్ర క్షేత్రాలైన మక్కా మదీనా సందర్శించారు. మదీనా నుండి తిరిగి జెడ్డా చేరుకుని అక్కడ నుండి బయలుదేరి డిసెంబర్ 29,1789న కేరళలోని కాలికట్ చేరుకున్నారు.

## శ్రమ నిష్ఫలం

టర్కీకి టిపు పంపిన దౌత్య బృందం తిరిగి వచ్చేటప్పటికి మొత్తం మూడు సంవత్సరాల తొమ్మిది నెలలు పట్టింది. కొన్ని కోట్ల సొమ్ము వృథా అయ్యింది. దౌత్య బృందం దారిలో ఎన్నో ఇబ్బందులను ఎదర్కొన్నారు. వెళ్ళిన నాలుగు ఓడలలో మూడు సముద్రంలో జల సమాధి అయ్యాయి. వెళ్ళిన 900 మంది సిబ్బందిలో కనీసం 100 మంది కూడా సజీవులుగా తిరిగి రాలేదు. ఇంత వ్యయ ప్రయాసల తర్వాత కూడా టర్కీ నుండి ఆశించిన సైనిక సహాయం,ఆంగ్లేయుల వ్యతిరేక పోరాటంలో మద్దతు టిపుకు లభించలేదు. మైసూర్ నవాబుగా టిపుకు గుర్తింపు పత్రం,కుత్బాను టిపు పేరుతో చదివించుకోవడానికి, టిపు తన స్వంత నాణాలను ముద్రించుకోడానికి అనుమతి పత్రాలు, బహుమతిగా వజ్ర వైడూర్యాలు పొదిగిన కత్తి టిపుకు టర్కీ సుల్తాన్ నుండి లభించాయి.

## టర్కీ నిస్సహాయత

మైసూర్ రాయబారులు టర్కీ చేరుకున్న సమయానికి టర్కీ స్వయంగా సమస్యల్లో ఉంది. రష్యా మహారాణి కేథరిన్, ఆస్ట్రియా చక్రవర్తి రెండవ జోసెఫ్ టర్కీకి చెందిన ఐరోపా ప్రాంతాలను ఆక్రమించుకోడానికి ఒప్పందం చేసుకుని టర్కీ పై కలసి దాడి చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. టర్కీ ఫ్రాన్స్ సహాయాన్ని కోరినప్పటికి స్వయంగా అంతర్గత సమస్యల్లో ఉన్న ఫ్రాన్స్ టర్కీకి సాయం చేసే పరిస్థితిలో లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో టర్కీ ఇంగ్లాండ్ సహాయాన్ని తీసుకోవలసి వచ్చింది. 1788 లో టర్కీ, ఇంగ్లాండ్, హాలెండ్, ప్రష్యా(ప్రస్తుత జర్మనీ) కలిసి రష్యా కు వ్యతిరేకంగా ఒక సమాఖ్యగా ఏర్పడ్డాయి. అప్పటి బ్రిటిష్ ప్రధాని విలియం పిట్ టర్కీకి సాయం చెయ్యడానికి సుముఖంగా ఉన్నాడు. ఈ పరిస్థితిలో టర్కీ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా భారతదేశంలో టిపుకు సైనిక సహాయాన్ని గాని మద్దతునిగాని ఎలా ఇవ్వగలదు?

## గమ్యం చేరని రాయబారాలు

రిచర్డ్ వెల్లస్లీ నాల్గవ ఆంగ్లో మైసూర్ యుద్ధానికి పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నాడని తెలుసుకున్న టిపు 1798 లో సైనిక సహాయం కొరకు మళ్ళీ ఫ్రాన్స్, టర్కీ, పర్షియాలకు రాయబారాలు పంపించాడు. ఫ్రాన్స్,టర్కీ రాయబారాలు తమ తమ గమ్యాలు చేరక

ముందే మే 4, 1799 న నాల్గవ మైసూర్ యుద్ధంలో టిపు ఓడిపోవడం, మరణించడం జరిగి పోయాయి.

## టర్కీకి రెండవ రాయబారం

ఈ దౌత్య బృందం బస్రా చేరుకునేటప్పటికే అక్కడి ఆంగ్లేయులు బస్రా గవర్నర్ ను ప్రభావితం చేసి వీరు ముందుకు కాన్ స్టాంటినోపుల్ వెళ్లకుండా ఆపగలిగారు. బస్రాలోనే వారికి టిపు మరణ వార్త తెలిసింది. అయినా తాము టర్కీ సుల్తాన్‌ను కలిసి టిపు కుమారులకు సహాయం చెయ్యమని కోరతామని తమను కాన్ స్టాంటినోపుల్ వెళ్లనివ్వమని వారు బస్రా గవర్నర్‌ను ఎంత బ్రతిమాలినా అతను అంగీకరించలేదు. బస్రా లోని ఆంగ్ల రాయబారి మానేస్టే మైసూరు దౌత్య బృందాన్ని బలవంతంగా ఇంగ్లీష్ వారి ఓడలలో బొంబాయి పంపించాడు. టిపు మరణించిన ఎనిమిది నెలలకు నవంబర్ 28, 1799న వీరు బొంబాయి చేరుకున్నారు.

1798లో ఫ్రాన్స్ కు రెండవసారి వెళ్లిన దౌత్య బృందం దారి మధ్యలోనే బ్రిటిష్ నావికులకు చిక్కి, వారి ద్వారా టిపు మరణ వార్త తెలుసుకుని తమ వద్ద ఉన్న 2 కోట్ల సొమ్మును వారికి చెల్లించి ఇండియా తిరిగి చేరుకున్నారు.

## పర్షియాకు రాయబారం

మార్చ్, 1798లో మైసూర్ దౌత్య బృందం పర్షియా రాజధాని టెహరాన్ బయలు దేరింది. పర్షియా షా(రాజు) కు బహుమతిగా నాలుగు ఏనుగులు, వివిధ రకాల పక్షులు, ఆభరణాలు, దుస్తులు, గంధపు చెక్కలు, దంతపు వస్తువులు, సుగంధ ద్రవ్యాలు తీసుకెళ్లారు. వీరు మస్కట్, బుషైర్, షీరాజ్‌ల మీదుగా ప్రయాణం చేసి డిసెంబర్, 1798లో టెహరాన్ చేరుకున్నారు. పర్షియా షా వీరిని సాదరంగా ఆహ్వానించి భారతదేశ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నాడు. మొగలు సామ్రాజ్యం బలహీన పడడంతో 'కాఫీర్' లైన ఆంగ్లేయులు భారతదేశాన్ని ఆక్రమించుకుంటున్నారని, తమ రాజు టిపు ఆంగ్లేయులను ధైర్యంగా ఎదుర్కొంటున్నాడని కాఫీర్లపై ఈ పోరాటంలో పర్షియా సహాయం కొరకు వచ్చామని వివరించారు. షా వారిని బహుమతులతో సత్కరించి, భారతదేశ పరిస్థితిని స్వయంగా తెలుసుకోవడానికి వారివెంట తన ప్రతినిధులిద్దరిని పంపించాడు. మైసూర్ దౌత్య బృందం ఏప్రిల్,1799న టెహ్రాన్ నుండి షిరాజ్ చేరుకొని అక్కడ నాలుగు నెలలు ఉండి బందర్ అబ్బాస్ మీదుగా మస్కట్ చేరుకుని అక్కడినుండి మంగుళూర్ చేరుకున్నారు. అప్పటికే టిపు మరణించాడు, శ్రీరంగపట్టణం ఆంగ్లేయుల ఆధీనంలోకి వచ్చింది.

టిపు పర్షియాకు రాయబారాన్ని పంపించాడని తెలుసుకున్న ఆంగ్లేయులు పర్షియా షాను టిపుకు వ్యతిరేకంగా ప్రభావితం చెయ్యడానికి మీర్జా మహది అలీ ఖాన్ అనే

వ్యక్తిని షా వద్దకు పంపించారు. టిపు మరణ వార్త తెలుసుకున్న షా మీర్జాను కలుసుకోవడానికి నిరాకరించాడు.

## ఆఫ్ఘన్ జమాన్ షా

ఆఫ్ఘనిస్తాన్‌కు టిపు దౌత్య బృందాన్ని పంపక పోయినా ఉత్తరాల ద్వారా ఆఫ్ఘన్ రాజు జమాన్ షాను సాయం కోరాడు. 1798 చివరలో జమాన్ షా ఇండియా పై దాడి చేసి లాహెూర్ వరకు వచ్చాడు. టిపు జమాన్ షా తన సహాయానికి వస్తాడని ఆశించాడు. ఆంగ్లేయులు కూడా భయపడ్డారు. కానీ జనవరి, 1799లో జమాన్ షా వెనుతిరిగి పోయాడు. ఫిబ్రవరి, 1799లో వెల్లస్లీ నాల్గవ ఆంగ్లో - మైసూర్ యుద్ధం ప్రారంభించాడు. జమాన్ షాను టిపు భారతదేశంపై దండయాత్రకు ఆహ్వానించడాన్ని వెల్లస్లీ ప్రచారం చేశాడు.

## విదేశీ రాయబారాలు-ఘోర వైఫల్యాలు

టిపు విదేశాలకు పంపిన దౌత్య రాయబారాలేవీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. సమయం వృథా కావడమే కాకుండా విపరీతమైన ధన నష్టం, ప్రాణ నష్టం కూడా జరిగింది. విదేశీయులను టిపు భారతదేశం పై దండయాత్రకు ఆహ్వానించాడని ఆంగ్లేయులు టిపు పై నిందలు వెయ్యడానికి అవకాశం కలిగించాయి. వీటిని సాకుగా చూపి రిచర్డ్ వెల్లస్లీ టిపు పై యుద్ధం ప్రకటించి తన రాజకీయ చతురత చూపాడు. కానీ టిపు ఆ రాయబారాల కొరకు ఖర్చు చేసిన ధనాన్ని తన సైన్యం అభివృద్ధికి ఆధునీకరణకు ఖర్చు చేసి వుంటే యుద్ధ ఫలితాలు వేరుగా ఉండేవేమో.

## అధ్యాయం-14

# టిపు సుల్తాన్

18వ శతాబ్దంలో భారతదేశాన్ని పాలించిన రాజులలో టిపు సుల్తాన్ ఒక విలక్షణమైన వ్యక్తి. టిపు తనకొచ్చిన కలలను ప్రత్యేకంగా ఒక పుస్తకంలో వ్రాసుకున్నాడు. తర్వాత ఈ పుస్తకం 'ఖ్వాబ్ నామా'గా ప్రసిద్ధి చెందింది. ఈ పుస్తకం ఎవరి కంటా పడకుండా టిపు జాగ్రత్తలు తీసుకున్నాడు. టిపు మరణం తర్వాత శ్రీరంగపట్టణం రాజభవనాన్ని స్వాధీనం చేసుకున్న బ్రిటిష్ వారికి ఈ పుస్తకం టిపు శయనాగారంలో లభించింది. తన జీవితంలో ఎక్కువ భాగం యుద్ధ భూమిలోనే గడిపి, ' మైసూర్ పులి'గా పేరుతెచ్చుకున్న టిపు అంతరంగాన్ని, రాజకీయ దార్శనికతను, భయాలను, ప్రణాళికలను, ఓటమికి, మృత్యువుకు దగ్గరగా వెళుతున్నప్పుడు అందుకు అతని సంసిద్ధతను, అతని వ్యక్తిత్వంలోని అనేక కోణాలను టిపు కలలు మనకు పరిచయం చేస్తాయి. ప్రముఖ కన్నడ, ఆంగ్ల రచయిత గిరీష్ కర్నాడ్ ఈ పుస్తకాన్ని ఆధారం చేసుకొని 1997 లో The Dreams of Tipu Sultan నాటకం వ్రాసారు.

నాల్గవ ఆంగ్లో– మైసూరు యుద్ధంలో ఓడిపోతానని తెలిసి కూడా టిపు ఆంగ్లేయులు ప్రతిపాదించిన అవమానకరమైన సంధి షరతులను అంగీకరించలేదు. మరణానికి సిద్ధపడ్డాడు కానీ ఆంగ్లేయులకు బందీగా పట్టుపడడానికి ఇష్ట పడలేదు. ఈ అంశాలు టిపు వ్యక్తిత్వం గురించి కొంత అంచనా వేయడానికి ఉపయోగ పడతాయి. ఈ పరిస్థితిలో హైదర్ అలీ అయితే అప్పటికి ఆంగ్లేయుల సంధి షరతులను అంగీకరించి, సమయం చూసి తిరిగి ఆంగ్లేయులను ఎదురుదెబ్బ తీసేవాడు. తండ్రి నీడలో 32 ఏళ్ళు పెరిగి తండ్రిని ఎంతో గౌరవించి ప్రేమించిన టిపు, హైదర్ అలీ వ్యక్తిత్వాల్లో చాలా తేడా ఉంది. హైదర్ అలీ 20 ఏళ్ల పాటు సరిహద్దు రాజ్యాల పై దాడులు దురాక్రమణలు చేసి మైసూర్ రాజ్యాన్ని విస్తరింప చేశాడు. టిపు ఆ రాజ్యానికి క్రొత్త ప్రాంతాలను చేర్చలేక పోయాడు. కానీ 17 ఏళ్లలోనే ఆ రాజ్యాన్నే రక్షించుకునే ప్రయత్నంలో రాజ్యాన్ని, ప్రాణాన్ని పోగొట్టుకున్నాడు. టిపు యుద్ధ ప్రియుడు కాదు. మూడవ నాల్గవ ఆంగ్లో – మైసూర్ యుద్ధాలకు ముందు యుద్ధ నివారణకు కార్న్‌వాలిస్, రిచర్డ్ వెల్లస్లీలతో సంప్రదింపులకు సిద్ధపడ్డాడు. మరాఠాలు, నిజాంతో కూడా మనం కలిసి ఆంగ్లేయులతో పోరాడుదామని ప్రతిపాదనలు చేసేవాడు. కానీ యుద్ధ నివారణకు వారు ప్రతిపాదించే అవమానకరమైన షరతులను అంగీకరించలేక యుద్ధానికే సిద్ధమయ్యేవాడు. హైదర్ అలీ వలె టిపు ఎదురు దాడి యుద్ధాలు చేయలేదు. తండ్రి ఇచ్చిన రాజ్యాన్ని రక్షించుకునే ఆత్మ రక్షణ యుద్ధాలే చేశాడు.

టిపు చూడడానికి గంభీరంగా ఉండేవాడు. టిపు గోధుమ వర్ణంలో ఉండేవాడు. అతని చేతులు కాళ్ళు చిన్నగా నాజూకుగా ఉండేవి. పొడుగ్గా వంపు తిరిగిన ముక్కు,పెద్ద నిండైన కళ్ళు, పొట్టిగా లావుగా ఉండే మెడ, చాలా ఆరోగ్యంగా ఉండేవాడు. గడ్డం పెంచేవాడు కాదు. కానీ కనుబొమలను, కంటి రెప్పలను, మీసాలను కత్తిరించేవాడు కాదు.

టిపు చాలా సాధారణ దుస్తులు ధరించేవాడు. అప్పుడు రాజ దర్బారుల్లో ధరించే పొడవైన దుస్తులను టిపు తన దర్బారులో నిషేధించాడు. ప్రయాణాల్లో టిపు బంగారు జరీతో చేసిన కోటు ధరించేవాడు, దానిపై పట్టు దారంతో ఎంబ్రాయిడరీ చేయబడిన ఎర్ర రంగు పులి బొమ్మ ఉండేది. టిపు ఆహారం మితంగా తీసుకునే వాడు. రోజులో కేవలం రెండు సార్లు మాత్రమే భుజించేవాడు. భోజనాన్ని తప్పనిసరిగా తన అధికారులు, కుమారులతో కలిసి చేసేవాడు.

టిపు రోజులో 16 గంటలు పని చేసేవాడు. పాలనకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించే వాడు. వినోదాలకు అతనికి సమయం ఉండేది కాదు. ఎప్పుడైనా నృత్యాన్ని తిలకించేవాడు. తన దర్బారులోనివారు చెప్పే కథలను ఆసక్తిగా వినేవాడు. కానీ అసభ్యకరమైన హాస్యోక్తులను ఇష్టపడేవాడు కాదని ఫ్రెంచ్ అధికారి మన్నెరోన్ వ్రాశాడు.

## ప్రేమగల తండ్రి-దయగల క్షమించే ప్రభువు

టిపు 1774లో తన 24వ ఏట తండ్రి ఇష్ట ప్రకారం ఒకరిని, తన ఇష్ట ప్రకారం మరొకరిని ఒకేసారి ఇద్దరు మహిళలను వివాహం చేసుకున్నాడని తెలుస్తోంది. అప్పుడు బహు భార్యత్వం సహజమే. టిపు ఇతర వివాహాలకు సంబంధించి స్థానిక ఆధారాలు టిపుకు ముగ్గురు భార్యలు అని, బ్రిటిష్ ఆధారాలు నలుగురని చెబుతున్నాయి. స్పష్టమైన వివరాలు లభ్యం కావడం లేదు కానీ, టిపుకు 16 మంది కుమారులని, వారి పేర్లతో సహా సమాచారం లభ్యమౌతుంది. టిపు మరణించే నాటికి 12 మంది ఉన్నారు. టిపు కుమార్తెల గురించిన సమాచారం కూడా ఎక్కువగా లభించడం లేదు. కానీ మంగుళూర్‌లో 644 లో నిర్మించిన ఒక ప్రాచీన మసీద్ ను పునరుద్ధరించి టిపు ఆ మసీదుకు తన కుమార్తె జీనత్ బక్ష్ పేరు పెట్టాడు. ఇప్పటికీ మంగుళూర్లో మస్జిద్-ఏ-జీనత్ బక్ష్ పేరుతో ఈ మసీదు పర్యాటకులని ఆకర్షిస్తుంది. ఒక తండ్రి మసీదుకు తన కుమార్తె పేరు పెట్టడం చరిత్రలో అరుదైన విషయమే.

తాను భోజనం చేసేటప్పుడు కొందరు అధికారులతో పాటు తన కుమారులలో కొందరైనా తనతో కలిసి భోజనం చేయాలని టిపు ఒక నియమంగా పెట్టుకున్నాడు. ఈ నియమం టిపును ఒక ప్రేమ గల తండ్రిగా మన ముందు ఉంచుతుంది. ఒక రాజుగా

వ్యస్థతో కూడిన అతని జీవితంలో తన సంతానంతో సమయం గడిపే అవకాశాలు టిపుకు ఉండవు. తప్పనిసరిగా ఉండే భోజన సమయంలోనైనా టిపు తన కుమారులతో కొంత సమయం గడిపే అవకాశాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. 8వ శతాబ్దంలో ఏ రాజూ ఆలోచించని విధంగా టిపు తన కుమారుడిని విదేశాలు పంపి చదివించాలని ప్రణాళిక వేసుకున్నాడు. కానీ పరిస్థితులు అందుకు అనుకూలించలేదు. మూడవ ఆంగ్లో– మైసూర్ యుద్ధంలో అపజయం తర్వాత పసివాళ్ళైన తన కుమారులు ఎనిమిదేళ్ళ అబ్దుల్ ఖాలిఖ్‌ను, అయిదేళ్ళ ముయిజుద్దీన్ను, కార్న్‌వాలిస్ వద్దకు హామీగా పంపించవలసిన పరిస్థితిలో టిపు ఎంతో వేదన పడ్డాడు. శ్రీరంగపట్టణం సంధి ఒప్పందంలో లేకపోయినా కూర్గ్‌ను ఆంగ్లేయులకు ఇవ్వాలని, లేకపోతే టిపు కుమారులను విడుదల చేయనని కార్న్‌వాలిస్ కొత్త షరతు విధించడంతో టిపు తన కుమారుల కొరకు కూర్గ్‌ను ఆంగ్లేయులకు ధారాదత్తం చేశాడు. కేవలం రెండు సంవత్సరాలలో 6 కోట్ల ధనాన్ని సమకూర్చుకొని దాన్ని బ్రిటిష్ వారికి చెల్లించి తన కుమారులను వెనక్కి తెచ్చు కున్నాడు. మైసూర్ పులి ఒక ప్రేమగల తండ్రి కూడా.

టిపు తన అధికారులను కూడా తన కుటుంబ సభ్యుల వలె భావించాడను కోవడానికి ఇది ఒక నిదర్శనం. అధికారులు కూడా తన కుమారులతోపాటు తనతో కలిసి భోజనం చేయాలని టిపు ఏర్పరిచిన ఒక నియమం. టిపు తరచూ ఉత్తరాల ద్వారా దూర ప్రాంతాల్లో ఉండే తన అధికారుల యోగ క్షేమాల గురించి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం గురించి వాకబు చేసేవాడు. వారికేమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేవాడు. టిపు తన అధికారులను, చుట్టూ ఉన్నవారిని ఎంతగా ప్రేమించి నమ్మేవాడంటే పూర్ణయ్య, మీర్ సాదిక్, బద్రుద్దీన్ జమాన్ ఖాన్, ఖమ్రోద్దీన్ ఖాన్ వంటి అధికారులు బ్రిటిష్ వారితో కలిసి తనకు ద్రోహం చేస్తుంటే చాలా కాలం తెలుసుకో లేకపోయాడు. తెలిసిన తర్వాత కూడా వారు క్షమాపణలు అడిగిన వెంటనే వారిని క్షమించి తిరిగి పదవుల్లో నియమించాడు.

హాసన్ జిల్లాలోని బాలమ్ అనే ప్రాంతం పాలేగార్ కృష్ణప్ప నాయక్ రెండవ ఆంగ్లో మైసూర్ యుద్ధంలో టిపుకు వ్యతిరేకంగా ఆంగ్లేయులతో చేరాడు కానీ, టిపు అతనికి బాలమ్ రాజ్యాన్ని తిరిగి అతనికి ఇచ్చేశాడు. మూడవ ఆంగ్లో– మైసూర్ యుద్ధంలో మళ్ళీ కృష్ణప్ప నాయక్ టిపు పై తిరుగుబాటు చేసి మరాఠాల తో చేతులు కలిపి కూర్గ్ తిరుగు బాటుదార్లకు సాయం చేశాడు. అయినా టిపు అతనికి మరణ శిక్ష విధించకుండా బాలమ్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించి కృష్ణప్ప నాయక్‌ను క్షమించి వదిలేశాడు.

మరణ శిక్షకు అర్హులైన మలబార్, కూర్గ్ తిరుగుబాటుదార్లను ఎన్నోసార్లు క్షమించి, చివరకు మత మార్పిడి శిక్ష విధించి వదిలేశాడు. బ్రిటిష్ వారికి అన్ని విధాలా సహకరించి తనకు ద్రోహం చేసిన కెనరా క్రైస్తవులకు దేశ బహిష్కరణ శిక్ష మాత్రమే విధించాడు. బ్రిటిష్ రాజు మూడవ జార్జ్ పుట్టిన రోజైన జూన్ 4న, బ్రిటిష్ యుద్ధ ఖైదీలకు టిపు

ఒక్కో నాణెం బహుకరించేవాడని, భోజనం, దుస్తుల విషయంలో తమకు లోటు ఉండేదికాదని బ్రిటిష్ యుద్ధ ఖైదీలే చెప్పారు. తన వద్ద ఉన్న బ్రిటిష్ ఖైదీలు తమ క్రైస్తవ మతాన్ని ఆచరించడానికి వీలుగా ఒక క్రైస్తవ ఫాదరిని పంపించాలని టిపు గోవా ప్రభుత్వానికి లేఖ వ్రాశాడు.

తన రాజ్యంలో ఉన్న వారికి ఏదైనా ఆపద కలిగితే టిపు బాధతో స్పందించే తీరుకు శృంగేరి మఠంపై మారాఠాల దాడి ఉదంతం ఒక నిదర్శనం. మఠాధిపతికి వ్రాసిన ఉత్తరాలలో జరిగిన సంఘటన గురించి ఎంతో బాధను ఆవేదనను వ్యక్తం చేస్తాడు. జరిగిన నష్టాన్ని భర్తీ చెయ్యడానికి అన్ని చర్యలు తీసుకున్నాడు.

తన స్నేహితులు, ఆశ్రితులతో టిపు ఎంతో నిబద్ధతతో, విశ్వసనీయతతో వ్యవహరించేవాడు. ఫ్రెంచ్ వారిని మైసూర్ రాజ్యం నుండి తొలగిస్తే ఆంగ్లేయులతో యుద్ధాన్ని నివారించ వచ్చని తెలిసినా టిపు అందుకు నిరాకరించాడు. నాల్గవ ఆంగ్లో-మైసూర్ యుద్ధం చివరి ఘట్టంలో టిపును రక్షించడానికి అతని సైన్యంలో ఉన్న ఫ్రెంచ్ వారు తామే స్వయంగా ఆంగ్లేయులకు లొంగిపోతామన్నా టిపు అందుకు అంగీకరించలేదు. తన ఆశ్రయంలో ఉన్న ఫ్రెంచ్ వారిని వారి శత్రువులైన ఆంగ్లేయులకు అప్పచెప్పడం ధర్మం కాదని టిపు భావించాడు.

కానీ టిపు బ్రిటిష్ యుద్ధ ఖైదీలతో, కొందరు బ్రిటిష్ సైనిక అధికారులతో కఠినంగా, క్రూరంగా వ్యవహరించిన కొన్ని సందర్భాలున్నాయి. మూడవ ఆంగ్లో-మైసూర్ యుద్ధంలో ఓడిపోతున్న సమయంలో టిపు ఒస్సూర్ కోటలోని బ్రిటిష్ యుద్ధ ఖైదీలను హత్య చేసిన సంఘటన ఇందులో ఒకటి. శ్రీరంగపట్టణంలో ఏర్పాటు చేసిన భూగర్భ ఖైదు కేవలం ఆంగ్ల ఖైదీలను క్రూరంగా శిక్షించడానికి టిపు చేసిన ఏర్పాటు. ఇప్పటికీ దీనిని బైలీ బందిఖానా అని పిలుస్తారు. పొల్లిలూర్ యుద్ధంలో బందీగా పట్టుబడిన కల్నల్ బైలీ ఇక్కడ నిర్బంధించబడి ఇక్కడే మరణించాడు. అన్నన్ పూర్‌లో ప్రజలపై ఎన్నో అత్యాచారాలు చేసిన మేజర్ మాథ్యూస్ కూడా నిర్బంధంలోనే మరణించాడు. వీరిద్దరిని టిపు హత్య చేయించాడని బ్రిటిష్ వారి కథనం.

**టిపు పఠనాసక్తి - సాహిత్య, కళాభిమానం**

నిరక్షరాస్యుడైన హైదర్ అలీ టిపుకు ఉద్దండ పండితులతో చదువు చెప్పించాడు. ఆ విద్యా ప్రభావం జీవితాంతం టిపుతో ఉంది. దానికి నిదర్శనం టిపు గ్రంథాలయం. టిపు యుద్ధాల్లో, పాలన వ్యవహారాల్లో ఎంత వ్యస్థుడై ఉన్నా పుస్తకాలు చదివేవాడు. కవులు, పండితులు, ఫకీర్లు, సాధువుల సహచర్యంలో ఉంటూ వారితో అనేక విషయాలు చర్చించడానికి ఆసక్తి చూపేవాడు. చరిత్ర, మతం, జీవిత చరిత్రలు టిపు అభిమాన విషయాలు. సూఫీజం పై ఎక్కువ మక్కువ కనబరిచేవాడు. టిపు బహుభాషా కోవిదుడు.

మరాఠీ, ఉర్దు, కన్నడ, హిందుస్తానీ, పర్షియన్ భాషలలో ప్రావీణ్యం ఉండేది కానీ, పార్శి భాషపై ఎక్కువ మక్కువ చూపేవాడు. ఎందుకంటే సూఫీ సాహిత్యం ఎక్కువగా పార్శిలోనే ఉంటుంది. శృంగేరి మఠాధిపతికి కన్నడంలో ఉత్తరాలు వ్రాసాడు.

టిపు అరబిక్, పర్షియన్, తుర్కి, హిందీ, ఉర్దు, సంస్కృతం వంటి వివిధ భాషల్లో చరిత్ర, మతం, తత్వ శాస్త్రం, వైద్య శాస్త్రం, వ్యాకరణం, గణితం, కవిత్వం, జ్యోతిష్ శాస్త్రం, సైన్యానికి సంబంధించిన సాంకేతిక శాస్త్రం(military technology) విషయాలకు చెందిన పుస్తకాలను సేకరించి తన గ్రంథాలయంలో భద్రపరిచాడు. టిపు సూఫీజమ్‌తో పాటు జ్యోతిష్యశాస్త్రం పై ఆసక్తి కనపరిచేవాడు. టిపు స్వయంగా జ్యోతిష్యం పై జబర్ జాద్ అనే గ్రంథం వ్రాశాడు. టిపు ఆధ్వర్యంలో వివిధ విషయాలపై గ్రంథ రచన, అనువాదాలు కూడా జరిగాయి.

టిపు మరణం తర్వాత ఆంగ్లేయులు శ్రీరంగపట్టణం నుండి దోచుకెళ్లిన కళా కృతులు, నాణాలు, ఆభరణాలు, ఇతర సామగ్రి ఇప్పటికీ ఇంకా విదేశాల్లో మిలియన్ పౌండ్ల ధరలు పలుకుతున్నాయి. అవన్నీ టిపు కళాత్మక హృదయానికి ప్రతీకలు. టిపు కళాభిమానం అతను ఎంతో అభిమానించి, అభివృద్ధి చేసిన కాలిగ్రఫి (అక్షరాలను అందంగా వ్రాసే పద్ధతి) ద్వారా తెలుస్తుంది. ఈ కళా రూపం పై టిపు వ్రాసిన 'రిసాలాదార్ ఖట్టి – ఎ –తర్జ్ – ఎ ముహమ్మది' అనే గ్రంధం ఇప్పటికీ లభిస్తుంది. ఈ కళ టిపు ముద్రించిన నాణాలపై ఎంతో అందంగా వాడబడింది. టిపు తన గ్రంథాలయంలోని పుస్తకాలను కూడా ఈ కళతో నింపేశాడు. పుస్తకం అట్ట మధ్య భాగంలో అల్లా, మహమ్మద్ ప్రవక్త, ప్రవక్త కుమార్తె ఫాతిమా, ఆమె కుమారులు హాసన్, హుస్సైన్ పేర్లు, పుస్తకం నాలుగు మూలలలో మొదటి నలుగురు ఖలీఫాల పేర్లు, అట్ట పై భాగంలో సర్కారీ–ఇ–ఖుదాదార్ (దేవుని ప్రభుత్వం) అని క్రింది భాగంలో అల్లా కాఫీ (దేవుడు చాలు) అని కాలిగ్రఫి లో లిఖించబడి పుస్తకానికి ఎంతో అందాన్ని తెచ్చాయి. టిపు కళా దృష్టికి అతని సింహాసనం కూడా ఒక మచ్చు తునక. చెక్క సింహాసనం మొత్తం బంగారు పూతతో పులి ఆకారం పీఠంపై ఉండేది. పైన ఛత్రం సన్నని బంగారు రేకుకు ముత్యాల హారాల వరుసలతో అలంకరింప బడింది. సింహాసనం పైభాగంలో పక్షి బంగారు తల ఉంది. సింహాసనం మెట్లు వెండివి.

శ్రీరంగపట్టణంలో హైదర్ అలీ నిర్మించిన దర్యా దౌలత్ భవనం లోపల, వెలుపల గోడలపై ఉన్న పెయింటింగులు టిపు చిత్ర కళాభిమానానికి ప్రత్యక్ష సాక్షిగా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. శ్రీరంగపట్టణంలో ఒక మసీదును, తండ్రి సమాధిని టిపు ఎంతో కళాత్మకంగా నిర్మించాడు. 1781లో బెంగళూర్‌లో హైదర్ ప్రారంభించిన మహలును

టిపు పూర్తి చేశాడు. ఈ కట్టడాలన్నీ ఇండో–సార్సెనిక్ వాస్తు రీతుల్లో నిర్మించారు. కానీ టిపు మంగుళూర్లో తన కుమార్తె జీనత్ బక్ష్ పేరుతో పునర్నిర్మించిన మసీదును హిందూ ద్రావిడ వాస్తు రీతిలో నిర్మించడం విశేషం.

టిపు సంగీత, నృత్యాలను ఇష్టపడేవాడు. తీరిక సమయాల్లో నృత్య కార్యక్రమాన్ని తిలకించేవాడు. టిపు కోరికపై హసన్ అలీ 'ఇజ్జత్' అనే రచయిత మైసూర్ సంగీత సంప్రదాయాలపై ముఫరేఉల్ ఖులుబ్ అనే గ్రంథాన్ని రచించాడు.

## నూతనత్వానికి ఆహ్వానం

టిపు జీవితాన్ని పాలనను గమనిస్తే, నూతన ఆలోచనలను విధానాలను ఆవిష్కరించడంలో ముందుండే వాడనిపిస్తుంది. భారత దేశంలో మొదటి సారి పాశ్చాత్య పాలనా పద్ధతులను ప్రవేశ పెట్టిన ఘనత టిపుకు దక్కుతుంది. రాజకీయంగా ఆంగ్లేయులను వ్యతిరేకించిన టిపు వారి విజ్ఞానాన్ని వ్యతిరేకించ లేదు. తన యుద్ధ నైపుణ్యాన్ని, ఆర్థిక వ్యవస్థలను మెరుగు పర్చుకోవడానికి టిపు పాశ్చాత్య పద్ధతులను అనుసరించాడు. అందుకు బ్రిటిష్ యుద్ధ ఖైదీల నుంచీ, ఫ్రెంచ్ వారి నుంచీ సహాయాన్ని తీసుకునేవాడు.

టిపు జీవిత కాలంలో ప్రపంచ చరిత్రలో రెండు అతి ముఖ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒకటి 1776 అమెరికా విప్లవం, రెండవది 1789 ఫ్రెంచ్ విప్లవం. మంచి చదవరి, చరిత్ర పట్ల ఆసక్తి కలిగిన టిపు ఈ రెండు చారిత్రక సంఘటనలు ప్రపంచ రాజకీయాల్లో తెచ్చిన పెను మార్పులను అర్థం చేసుకున్నాడనుకోవచ్చు. రాచరికాన్ని నిరాకరించిన ఫ్రెంచ్ వారిని టిపు నిరాకరించలేదు, శ్రీరంగపట్టణంలో లిబర్టీ చెట్టు నాటాడు. తనను తాను 'సిటిజెన్ టిపు' గా మార్చుకున్నాడు. ఇదంతా కేవలం ఫ్రెంచ్ వారిని సంతోష పరచడానికి చేశాడని అనుకోలేము. ఎందుకంటే తను నమ్మని దానిని ఎవరి సంతోషం కోసమో ఆచరించడం టిపు ప్రవృత్తి కాదు.

విదేశాలకు రాయబారులను పంపించినప్పుడు కేవలం సైనిక సహాయం కొరకే కాకుండా సాంకేతిక నిపుణులను, ఆ దేశపు మొక్కల, పువ్వుల విత్తనాలను పంపించమని విజ్ఞప్తి చేసేవాడు. సైన్యంలో రాకెట్ ప్రయోగాలు, పౌర పాలనలో బ్యాంకింగ్ వ్యవస్థ, పన్నుల వ్యవస్థ, విదేశీ వ్యాపారం, విదేశీ నిపుణులతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలు, క్రొత్త నాణాలు, క్రొత్త తూనికలు, కొలతలు, క్రొత్త కేలండర్, మద్యం, మత్తు పదార్థాలు, వేశ్యా వృత్తి నిషేధం వంటి అంశాలన్నీ టిపు ను సమకాలీన భారతీయ సంస్థానాధీశులలో భిన్నంగా నిలబెడతాయి. "టిపు బలమైన పరిపాలన వ్యవస్థ, టిపు సైన్యం లోని క్రమశిక్షణ అతన్ని సమకాలీన బారతీయ సంస్థానాధీశుల కంటే ఉన్నతుడిగా శక్తిమంతుడిగా ఉంచాయి." అనే కల్నల్ మెకంజీ మాటలు కూడా అందుకు నిదర్శనం.

## మైసూర్ పులిది అహంకారమా ఆత్మాభిమానమా

టిపుకు 'మైసూర్ పులి' అని ఆంగ్లేయులే బిరుదిచ్చారు. ఒకసారి వేటకు వెళ్లినప్పుడు టిపు పై పులి దాడి చేసిందని చేతిలోని పిస్తోలు పని చేయకపోయినా చిన్న కత్తితో టిపు ఒంటరిగా పులిని చంపాడని ఒక కథ ప్రచారంలో ఉంది. ఆ కథ వాస్తవమైనా కాకపోయినా టిపుకు మాత్రం పులి అభిమాన విషయం. టిపు పులిని తనకు, తన రాజ్యానికి, తన పాలనకు, ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా చేసుకున్నాడు. టిపు సింహాసనం పులి తలపై ఏర్పాటు చేయబడింది. టిపు సింహాసనం ఎనిమిది మూలలు ఎనిమిది పులి తలలు ఉండేవి. ప్రస్తుతం లండన్ లోని విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియంలో ఆంగ్ల సైనికుడిని చీల్చి చెండాడుతున్న పులి బొమ్మ ప్రపంచ ప్రసిద్ధమైనది. ఇది, శబ్దాలు అమర్చిన ఒక యంత్రం లాంటి బొమ్మ. టిపు జెండాల మీద పులి చారలు చిత్రించే వారు. టిపు ఆయుధాల పైన, పిస్తోళ్ళ పైన, పులి బొమ్మలుండేవి. టిపు మరణం తర్వాత శ్రీరంగపట్టణంలో అతని రాజ భవనాన్ని స్వాధీనం చేసుకున్న ఆంగ్లేయులకు అక్కడ లభించిన ఆయుధాలు, పరదాలు, ఇతర గృహోపకరణాల మీద పులి బొమ్మలు, పులి చారలు చిత్రీకరించి ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. టిపు పెంచుకునే పులి పిల్లలను ఆంగ్లేయులు కాల్చి చంపేశారు.

ఆంగ్లేయులకు లొంగి పోవడానికి నిరాకరిస్తూ టిపు చేసిన ఒక వ్యాఖ్య "గొర్రె లాగ వంద సంవత్సరాలు బ్రతకడం కంటే పులిలా ఒక రోజు బ్రతకడం మేలు". టిపుకు ఉన్న ఈ పులి 'అబ్సెషన్' అతని వ్యక్తిత్వానికి 'సింబాలిక్' గా నిలిచిపోయింది.

టిపుకు అతిశయం, ఎవరి మాట వినని అహంకారం ఉండేవని సమకాలీన రచనల ద్వారా తెలుస్తుంది. ఎవరి సలహాలు వినకుండా మొండిగా తన నిర్ణయాలనే అమలు జరిపి నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. ఫ్రెంచ్ నావికుడు రిపాడ్ నమ్మదగిన వ్యక్తి కాదని అధికారులు, సలహాదారులు ఎంత హెచ్చరించినా టిపు వినకుండా రిపాడ్ సలహాపై మారిషస్‌కు నిరర్ధకమైన ఒక రాయబారాన్ని పంపించాడు.

అప్పుడు భారతదేశంలో నిరాఘాటంగా వ్యాప్తి చెందుతున్న బ్రిటిష్ శక్తిని అంచనా వేయలేక టిపు మొండిగా అహంకారంతో వారిని ఎదుర్కొని టిపు పతనం చెందాడనే కొందరి వాదనలో వాస్తవం లేదు. ఈ దేశంలో త్వరితగతిన వ్యాప్తి చెందుతున్న ఆంగ్ల శక్తిని టిపు సరిగ్గానే అంచనా వేశాడు. దాని ప్రమాదాన్ని గుర్తించాడు. ఆ శక్తిని ఎట్టి పరిస్థితుల్లోనూ అరికట్టడానికే నిశ్చయించుకున్నాడు. ఎవ్వరూ తోడురాకపోయినా ఆ శక్తి తో తలపడి యుద్ధ భూమిలో వీర మరణం పొందాడు. టిపు ఈ ధోరణిని కొందరు అహంకారం, మూర్ఖత్వం అనుకోవచ్చు, కొందరు ఆత్మాభిమానం అనుకోవచ్చు. కానీ టిపులోని ఈ లక్షణాలే, ఇతర భారతీయ సంస్థానాధీశుల వలే బ్రిటిష్ వారికి దాసోహం అనని 'మైసూర్ పులి' గా టిపును చరిత్రలో నిత్య నూతనంగా నిలబెడుతున్నాయి.

# అనుబంధం

**టిపు తర్వాత...**

టిపు మరణం తర్వాత మైసూర్ రాజ్యంలోని శ్రీరంగపట్టణం, ఇతర చిన్న కోటలు మాత్రమే వారి ఆధీనంలోకి వచ్చాయి. చితల్ దుర్గ్, సిర వంటి కొన్ని కోటలు ఇంకా మైసూరియన్ల ఆధీనంలోనే ఉన్నాయి. టిపు మరణం తర్వాత ఆ కోటల అధికారులెవ్వరూ ఆంగ్లేయులను ఎదిరించే ఆలోచనలో లేరు. అయినప్పటకీ కల్నల్ హ్యారిస్ టిపు పాలనలో కోటల పర్యవేక్షణ మంత్రి (మీర్ సుదూర్)గా ఉన్న గులాం అలీ ఖాన్‌కు జాగీర్, ధనం ఆశ చూపి మైసూర్ రాజ్యంలోని కోటలన్నీ యుద్ధం చేయకుండా ఆంగ్లేయులకు లొంగిపోయేలా చెయ్యమని కోరాడు. గులాం అలీ ఖాన్ ఖిలేదారులందరు తమ కోటలను ఆంగ్లేయులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశాడు. గుత్తి, హులాల్ కోటల అధిపతులు అందుకు నిరాకరించడంతో సైనిక చర్య ద్వారా ఆ రెండు కోటలను ఆంగ్లేయులు ఆక్రమించారు.

జయించిన మైసూరు రాజ్యాన్ని ఏమి చెయ్యాలనేది ఆంగ్లేయులకు సమస్యగా తయారయ్యింది. భిన్నమైన వాదనలు వినిపించాయి. ఆంగ్లేయులకు సామంతులుగా ఉండే విధంగా మైసూరు రాజ్యాన్ని తిరిగి టిపు వారసులకే ఇవ్వాలనే వాదన వాటిలో ఒకటి. టిపు రెండవ కుమారుడైన అబ్దుల్ ఖాలిక్ టిపు మరణించిన రెండవ రోజునే ఆంగ్లేయులకు లొంగిపోయాడు. ఇంకొక కుమారుడు ఫత్ హైదర్ టిపుకు విశ్వాసపాత్రులైన కొందరు అధికారులతో మొదట ఆంగ్లేయులపై సైనిక చర్యకు దిగుదామని నిర్ణయించుకున్నాడు. కానీ ఆంగ్లేయులు తెలివిగా మైసూరు సింహాసనం నీదే అని అతన్ని బుజ్జగించడంతో అతను సైనిక చర్య ఆలోచన విరమించు కున్నాడు. టిపు వారసులకు తిరిగి మైసూరు రాజ్యాన్ని ఇవ్వడానికి రిచర్డ్ వెల్లస్లీ తీవ్రంగా వ్యతిరేకించాడు. టిపు వారసులు బ్రిటిష్ ప్రయోజనాలకు ప్రమాదకరమని అతడు అనుమానించాడు. వెల్లస్లీ అనుమానం 1806 వెల్లూర్ తిరుగుబాటుతో కొంత నిజమయ్యింది. వెల్లస్లీ టిపు కుమారులకు 2,24,000 పగోడాల వార్షిక పింఛను మంజూరు చేసి, వారిని శ్రీరంగపట్టణం నుండి పంపించి వేసి వెల్లూర్ కోటలో వారు వారి కుటుంబాలతో రాచమర్యాదలతో నివశించడానికి ఏర్పాట్లు చేశాడు. ఇది ఒక విధంగా మర్యాద పూర్వకమైన నిర్బంధమే.

లండన్‌లో తూర్పు ఇండియా కంపెనీ వెల్లస్లీ మైసూరు రాజ్యానంతటిని భారతదేశం లోని బ్రిటిష్ రాజ్ లో భాగం చేయాలని కోరారు. కానీ టిపు ను ఓడించడంలో ఆంగ్లేయులకు సహకరించిన హైదరాబాద్ నిజాం, మరాఠాలకు మైసూరు రాజ్యంలో భాగం ఇవ్వకపోతే వారు ఆంగ్లేయులతో యుద్ధానికి దిగే ప్రమాదాన్ని గుర్తించిన వెల్లస్లీ

లండన్ అధికారుల కోరికను అంగీకరించ లేదు. నాల్గవ ఆంగ్లో–మైసూర్ యుద్ధంలో మరాఠాలు తటస్థంగా ఉండి పరోక్షంగా సాయం చేశారు. నిజామ్ మైసూర్ రాజ్యంలో పెద్ద భాగాన్ని ఆశించి టిపు ఓటమికి ఆంగ్లేయులతో సహకరించాడు. నిజామ్ ఆశిస్తున్నట్టు మైసూరు రాజ్యంలో అధిక భాగాన్ని ఇచ్చి నిజామ్‌ను శక్తిమంతుడిని చెయ్యడం కూడా వెల్లస్లీకి ఇష్టం లేదు.

వెల్లస్లీ తన రాజకీయ చతురతనంతా ఉపయోగించి ఒక ప్రణాళికను సిద్ధం చేశాడు. హిందూ జనాభా అధికంగా కలిగిన మైసూర్ రాజ్య మధ్యభాగాన్ని పాత ఒడయారు వంశానికి కట్టబెట్టాడు. ఆ వంశానికి చెందిన ఏడేళ్ళ పసివాడిని మూడవ కృష్ణ రాజా ఒడయారుగా సింహాసనంపై కూర్చోబెట్టాడు. ఆ పసివానికి సంరక్షకుడిగా, రాజ ప్రతినిధిగా పూర్ణయ్య నియమించబడ్డాడు. ఒడయారు పేరుకు మాత్రమే రాజు, అధికారమంతా బ్రిటిష్ రెసిడెంట్ చేతిలో ఉంటుంది. మొదటి రెసిడెంట్ మార్క్ విల్క్స్. ఇతను తర్వాత 'ద హిస్టరీ ఆఫ్ మైసూర్' పుస్తకాన్ని వ్రాశాడు. ఈ క్రొత్త మైసూర్ రాజ్యానికి శ్రీరంగపట్టణం కాకుండా మైసూరు పట్టణం రాజధాని అయ్యింది.

శ్రీరంగపట్టణం, దక్షిణ ప్రాంతమైన కనరా, తమిళనాడులోని కోయంబత్తూర్, ధర్మపురి, కేరళ లోని వైనాడును నేరుగా బ్రిటిష్ రాజ్‌లో కలిపి వేయడం జరిగింది. ఈ ప్రాంతాలలో ముస్లిం జనాభా అధికం. టిపు పాలనలో ఒకే రాజ్యంగా కలిసి ఉన్న హిందూ ముస్లింలను ప్రాంతాల వారీగా విడగొట్టి, విభజించి పాలించే బ్రిటిష్ రాజనీతిని టిపు రాజ్య విభజనలో వెల్లస్లీ పక్కాగా అమలు పరిచాడు. ముందు ముందు బ్రిటిష్ రాజ్ రక్షణ కోసం మైసూరులోని ఈ రెండు వర్గాలను విభజించడం అవసరమని వెల్లస్లీ బాహాటంగానే ప్రకటించాడు.

వెల్లస్లీ హైదరాబాద్ నిజామ్‌కు చితల్ దుర్గ్‌లోని కొంత భాగాన్ని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని గుత్తి, గుర్రంకొండ ఇచ్చాడు. మరాఠాలకు సుంద, హర్పనహళ్లి ప్రాంతాలను ఇచ్చినా పేష్వా తీసుకోవడానికి నిరాకరించడంతో ఈ రెండు ప్రాంతాలను 'ఆంగ్లేయులు', నిజామ్ తిరిగి పంచుకున్నారు. తాను బ్రిటిష్ వారితో చేసుకున్న సైన్య సహకార సంధి షరతుల ప్రకారం తన రాజ్యంలోని బ్రిటిష్ సైన్యం ఖర్చుల నిమిత్తం 1800 సంవత్సరంలో నిజామ్ ఈ ప్రాంతాలనన్నింటిని తిరిగి ఆంగ్లేయులకే ఇచ్చివేయడం జరిగింది. దీనితో ఒడయారులకిచ్చిన మధ్య మైసూరు ప్రాంతం మినహా టిపు రాజ్యం మొత్తం ఆంగ్లేయుల ఆధీనంలోనికి వచ్చింది. దక్షిణ భారతదేశంలో ఆంగ్లేయుల అధికారం సుస్థిరమైంది.

## 1806 వెల్లూర్ సిపాయి తిరుగుబాటు

భారత దేశంలో బ్రిటిష్ అధికారాన్ని ఒక కుదుపు కుదిపిన 1857 సిపాయి తిరుగుబాటుకు 51 సంవత్సరాలకు ముందు వెల్లూర్‌లో 1806లో ఒక సిపాయి తిరుగుబాటు జరిగింది. ఇది 1857 తిరుగుబాటుకు నాందిగా చరిత్రకారులు భావిస్తారు. టిపు కుమారుల ఆధ్వర్యంలో ఈ తిరుగుబాటు జరగడం విశేషం.

టిపు మరణం తర్వాత, టిపు భార్యా పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు ప్రస్తుత తమిళనాడులోని వెల్లూర్ కోటకు తరలించబడ్డారు. ఇక్కడ ఆంగ్ల సైనిక పటాలం పర్యవేక్షణలో రాచ మర్యాదలతోనే జీవించేవారు.

వెల్లూర్‌లో మద్రాస్ సైనిక పటాలానికి కమాండర్‌గా ఉన్న సర్ జాన్ క్రాడ్డక్ భారతీయ సిపాయిల దుస్తులు వేషధారణలో క్రొత్త ఆదేశాలను జారీ చేశాడు. వారు తమ నుదుటిపై మత సంబంధమైన చిహ్నాలను ధరించకూడదు. మీసాలను పొడుగ్గా పెంచకూడదు, చిన్నగా కత్తిరించుకోవాలి. గడ్డాలను పూర్తిగా తీసివెయ్యాలి. అంతవరకూ భారతీయ సిపాయిలు ధరిస్తున్న తలపాగాలు నిషేధించ బడ్డాయి. వాటి స్థానంలో గుండ్రంగా ఉండే బ్రిటిష్ టోపీలు ధరించాలని క్రాడ్డక్ ఆదేశించాడు. ఈ చర్యల ద్వారా తమను క్రైస్తవ మతంలోకి మార్చే ప్రయత్నం జరుగుతున్నదని హిందూ, ముస్లిం భారతీయ సిపాయిలు అనుమానించి నిరసనలు తెలిపారు. నిరసనలు తెలిపిన వారిని మద్రాస్‌లోని సెయింట్ జార్జ్ కోటకు తీసుకు వెళ్ళి వందల కొద్దీకొరడా దెబ్బలతో శిక్షించేవారు.

జులై 9, 1806 న టిపు కుమార్తె వివాహం జరిగింది. ఆ వేడుకలో భారతీయ సిపాయిలందరూ పాల్గొన్నారు. 10వ తారీఖు అర్ధరాత్రికి భారతీయ సిపాయిలు ఆంగ్లేయులపై దాడిచేసి 69 రెజిమెంట్‌కు చెందిన 14 మంది ఆంగ్ల సైనికాధికారులను, 115 మంది ఆంగ్ల సైనికులను చంపేశారు. తెల్లవారేసరికి వెల్లూర్ కోట వారి స్వాధీనంలోకి వచ్చింది. కోటపై మైసూర్ జెండా ఎగురవేసి టిపు కుమారుడు ఫత్ హైదర్‌ను నవాబ్‌గా ప్రకటించారు.

ఆ దాడిలో తప్పించుకున్న మేజర్ కూల్స్ ఆ రాత్రి వాయు వేగంతో ఆర్కాట్ చేరుకొని అక్కడి బ్రిటిష్ అధికారులకు తిరుగుబాటు సమాచారాన్ని అందించాడు. ఆర్కాట్ నుండి ఆంగ్ల సైన్యాలు సర్ రోలో గిల్లెస్పీ ఆధ్వర్యంలో వెల్లూర్ చేరుకొని జులై 11, ఉదయం కొన్ని గంటల వ్యవధిలోనే తిరుగుబాటును అణిచి వేశాయి. 800 మంది తిరుగుబాటు దార్లను కాల్చి చంపడం, ఉరి తీయడం జరిగింది. అనేక మందిని గాయాలతో నిర్బంధించడం జరిగింది.

తూర్పు ఇండియా కంపెనీ క్రొత్త పద్ధతులను ప్రవేశ పెట్టిన క్రాడ్డక్, ఇంకొందరు అధికారులను ఇంగ్లాండ్ పంపించివేసి, ఆ క్రొత్త పద్ధతులను రద్దు చేశారు. అప్పటి వరకూ భారతీయ సిపాయిలకు విధిస్తున్న కొరడా దెబ్బల శిక్షను రద్దు చేశారు.

ఈ తిరుగుబాటులో టిపు కుమారుల, కుటుంబ సభ్యుల పాత్రను అనుమానించిన తూర్పు ఇండియా కంపెనీ అధికారులు వారిని మైసూరుకు దగ్గరగా దక్షిణ భారతదేశంలో ఉంచడం ఎప్పటికైనా ప్రమాదంగా భావించి, వారందరినీ బ్రిటిష్ రాజ్‌కు రాజధాని అయిన సుదూర కలకత్తాకు తరలించారు.

**కలకత్తా లో టిపు వారసులు**

వెల్లూర్ నుండి కలకత్తాకు తరలించిన టిపు కుటుంబానికి ఆంగ్లేయులు అక్కడ భవనాలను ఇతర ఆస్తులను ఏర్పాటు చేశారు. టిపు కుమారులకు, కుమార్తెలకు వారి పేర్ల ముందు రాచరికానికి సంకేతంగా షహజాద లేక ప్రిన్స్ (రాజకుమారుడు), షహజాదీ లేక ప్రిన్సెస్ (రాజకుమారి) అనే సంబోధించేవారు.

కలకత్తాలో టిపు పేరుతో రెండు మసీదులు నిర్మించబడ్డాయి. వాటిలో ఒకటైన టిపు సుల్తాన్ షాహీ మసీదును టిపు 14వ కుమారుడైన హిజ్ హైనెస్ షహజాద సర్ సయ్యద్ వాల్ షరీఫ్ గులాం మహమ్మద్ సుల్తాన్ సాహిబ్ డిజైన్ చేసి నిర్మించడం విశేషం. ఇతను 1795 లో జన్మించాడు. టిపు మరణించే సమయానికి నాలుగేళ్ల వయసు. 1872లో 76 ఏళ్ల వయసులో మరణించాడు. గొప్ప ఆర్కిటెక్ట్ గా రాణించాడు. ఆంగ్లేయులు ఇతనిని సర్ బిరుదుతో సన్మానించారు. బ్రిటిష్ ప్రభుత్వ అత్యున్నత గౌరవ చిహ్నమైన నైట్ హుడ్‌తో సత్కరించారు. టిపు నాల్గవ కుమారుడైన ప్రిన్స్ యాసీన్ కుమార్తె ప్రిన్సెస్ షారుక్ బేగమ్ కుమారుడు, టిపు మునిమనుడైన నవాబ్ సయ్యద్ మహమ్మద్ బహాదుర్ 1894 లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి 1913లో కరాచీలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్ష పదవినలంకరించాడు.

1870లో కలకత్తా లోని టిపు కుటుంబీకుల ఆస్తులన్నీ ముస్లిం వక్ఫ్ బోర్డ్ పరిధిలోనికి తేబడ్డాయి. కాలక్రమేణ ఆ ఆస్తులన్నీ వక్ఫ్ బోర్డ్‌లోని అధికారుల అవినీతి వలన ఆక్రమణలకు, అక్రమ అమ్మకాలకు గురికాబడ్డాయి. చివరకు టిపు కుటుంబానికి చెందిన సమాధుల ప్రదేశం కూడా ఆక్రమణకు గురి అయ్యింది. టిపు వారసులకు ఆ ఆస్తులనుండి ఆదాయం పొందే హక్కు ఉన్నప్పటికి వక్ఫ్ బోర్డ్‌లోని కొందరు అధికారులు టిపు వారసులకు వారి కనీస అవసరాలకు కూడా డబ్బు చెల్లించడానికి నిరాకరిస్తున్నారు. ప్రస్తుతం ఏడవతరానికి చెందిన టిపు వారసులు జీవనోపాధికి రిక్షా లాక్కుంటూ, టీ దుకాణాలు నడుపుకుంటూ, చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కలకత్తాలో దయనీయంగా జీవిస్తున్నారు.

టిపు వారసుల్లో ఒకరైన మన్సూర్ అలీఖాన్ తెహ్రిక్–ఏ–ఖుదాదాద్ అనే సంస్థను స్థాపించి టిపు వారసత్వాన్ని (legacy) కాపాడే ప్రయత్నం చేస్తున్నాడు. బ్రిటిష్ రాజ్ కాలంలో బ్రిటిష్ వారికి ఎంతో సహకరించి వారికి తలొగ్గి వారి సామంతులుగా ఉన్న జైపూర్, గ్వాలియర్ వంటి సంస్థానాధీశులకు, వారి వారసులకు స్వతంత్ర భారత దేశంలో ఎంతో గౌరవం లభించింది. వారు పార్లమెంట్ సభ్యులుగా, ప్రభుత్వంలో మంత్రులుగా, ముఖ్య మంత్రులుగా ఉన్నారు. కానీ బ్రిటిష్ వారిని ఎదిరించి అసువులు బాసిన టిపు వారసులకు ఎటువంటి గౌరవం దక్కలేదని మన్సూర్ అలీ ఖాన్ ఆవేదన చెందుతున్నాడు. పైగా ఈ మధ్యకాలంలో కొన్ని రాజకీయ పార్టీలు మెజారిటీ ప్రజల వోట్ల కోసం టిపు పై జరుపుతున్న దుష్ప్రచారాన్ని కూడా మన్సూర్ అలీ ఖాన్ నిరశిస్తున్నాడు. తమ సంస్థ ఈ దుష్ప్రచారాన్ని అడ్డుకుంటూ, టిపు రాజకీయ, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతుందని మన్సూర్ అలీ ఖాన్ 2017లో ఒక టి.వి. ఇంటర్వ్యూలో చెప్పాడు. అప్పుడప్పుడు కలకత్తా నుండి వచ్చే టిపు వారసులకు ఇప్పటికీ కర్నాటకలో ఘన స్వాగతం లభిస్తుంది.

## Bibliography

1. Bowring, Lewin B. (1893), *Haidar Ali and Tipu Sultan, and The Struggle With The Musalman Powers of The South,* Rulers of India series (1974 ed.), Idarah-I Adabiyat-I Delli

2. Briggs, Henry George, *The Nizam, his history and relations with the British government,* London B. Quaritch, 1861

3. Brittlebank Kate, *Tiger: The Life of Tipu Sultan,* Juggernaut, 2016

4. T. K.Gangadharan, *Evolution of Kerala History and Culture,* Calicut University

5. Hasan Mohibbul, *History of Tipu Sultan,* Aakar Books, 2005

6. Karnad Girish, *The Dreams Of Tipu Sultan,* Oxford University Press, 2004

7. K. V. Krishna Iyer, *The Zamorins of Calicut: From the Earliest Times Down to A.D. 1806,* Calicut, Norman Printing Bureau, 1938.

8. B.L. Rice, *Mysore and Coorg - From the Inscription,* Archibald Constable & Company, 1909.

9. Balakrishna Sandeep, *Tipu Sultan the Tyrant of Mysore,* Rare Publications,2014

10. Sorocoe, Michael, *Tyrant! Tipu Sultan and the Reconception of British Imperial Identity,* 1780-1800, University of Maryland, 2013

11. Spear Percival, *A History of India,* Penguin, 2000

12. Wilks Mark, *Historical sketches of the south of India,* Cambridge University Press, 2013

రచయిత్రి **డా.యార్లగడ్డ నిర్మల** హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో చరిత్ర విభాగంలో రీడర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు.



యం.ఎఫ్. హుస్సేన్ చిత్రం

మరణించిన 220 సంవత్సరాల తర్వాత కూడా ఇప్పటికీ వార్తల్లో ఉంటున్న వ్యక్తి టిపు సుల్తాన్. టిపు ప్రథమ స్వాతంత్ర సమరయోధుడా, ఇస్లాం మతోన్మాదా? హీరోనా, విలనా? తరచూ రేగే ఈ చర్చలకు, వివాదాలకు అంతుండటం లేదు. అసలు భారతదేశ చరిత్రలో టిపు ఎవరు?
18వ శతాబ్దంలో ఎందరో రాజులు పాలించారు కానీ టిపునే ఎందుకు వివాదాలకు కేంద్రమవుతున్నాడు? ఈ చర్చలకు నేపథ్యం ఏమిటి? అసలు టిపును చారిత్రకంగా అర్థం చేసుకునేదెలాగో చర్చించే రచన ఇది!